

ప్రతి ఒక్క మోడల్
ఉత్కృష్టమైన
సాంకేతికతకు ప్రతిబింబం
అందాల దృశ్యాలకు ఆలవాలం
ఇండియన్ టెక్నాలజీస్ &
ఇంజనీర్స్ (ఎలక్ట్రానిక్స్) ప్రైవేట్ లిమిటెడ్
10-11-19/5/6, 1వ అంతస్థు,
హైదరాబాద్ - 500 036.
ఫోన్లు: 42778, 552663.
గ్రామ్స్: INTEEN
టెలెక్స్: 0425 - 6979 VVRR IN
ITE
బ్లాక్ & వైట్
మరియు
కలర్
టీవీలు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఎడిటోరియల్ అడ్వయిజర్.: శివలెంక రాధాకృష్ణ | ఎడిటర్: వీరాజీ | ముద్రాపకుడు, ప్రచురణకర్త : శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ 22/29-9-1989 | శకసం. 1911 భాద్రపద మాసం. 31వ తేదీ

"ఒకసారి మాట్లాడేముందు రెండుసార్లు..."

తీగ లాగితే డొంకంతా కదలాలి కాని ఎన్ని తీగెలు లాగినా బోఫోర్స్ 'కుంభకోణం' డొంక మాత్రం కదలటం లేదు! అరవై నాలుగు కోట్ల రూపాయల 'ముడుపులు' అందుకున్న వారు మాత్రం ఆ డొంక వెనుక దాగి వున్నారు! ఒక రకంగా యీ 'వ్యవహారమే' ప్రతిపక్షాలను లోక్‌సభ నుంచి రాజీనామా చేసి నిష్క్రమింప జేసింది అన్నా తప్పు లేదు! మాజీ సైన్యాధిపతి జనరల్ సుందర్‌జీ-ముడుపుల భోక్తలను "ముద్దుగా ప్రధానమంత్రి దాచేస్తున్నా"రన్న ఆరోపణలతో-[ఒక్క ఏడాది కాలం మౌనంగా వున్న తరువాత]- పెదవి విప్పడంతో మరోసారి తేనెతుట్ట కదిలినట్లయింది! ప్రతిపక్షాలు ముఖ్యంగా "ఫ్రంట్ నాయకుడు శ్రీ ఎన్.టి.ఆర్. బోఫోర్సు తుపాకులు నాసిరకం- తుప్పు పట్టినవి-అవి సైన్యాలకు యివ్వడం అన్యాయం" అంటూ ఎలుగెత్తి చాటుతూ మాజీ సైన్యాధిపతి ఒక యింటర్వ్యూలో అన్న "మాటలు"గా వాటిని తన తుపాకీలో దట్టించే ప్రయత్నం చేయడంతో సుందర్జీ మరో యింటర్వ్యూ యిచ్చి-అంతకుముందు ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీకి యిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌నే యీసారి ప్రతిపక్ష నాయకులకు అందించారు! బోఫోర్స్ శతఘ్నుల నాణ్యతకీ వాటి కొనుగోలు వ్యవహారంలో ఒప్పందం చేసుకునే ముందు-కొందరు 'ముడుపు'లు అందుకోడానికి వున్న వ్యత్యాసం తెలియని "అమాయక బ్రహ్మ"లుగా ప్రతిపక్షాలున్నాయని ఒక మాజీ సైన్యాధిపతి అనడంతో మనదేశం రాజకీయ రంగంలో కూడా మనం అనుకున్నంత పరిణతి చెందలేదా? అన్న అనుమానం కలుగుతోంది! "మరో ముప్ఫయి సంవత్సరాల దాకా బోఫోర్స్ శతఘ్నులు యుద్ధరంగంలో అరివీర భయంకరంగా వుంటాయంటూ రెండో యింటర్వ్యూలో "సుందర్జీ" విడమర్చి చెప్పే విధంగా చేసి-పరిస్థితుల్ని తమ "కాకి గోలతో" తారుమారు చేసిన ప్రతిపక్ష నాయకులు యిప్పుడు "నాలిక కరుచు"కొని-"ముడుపులందుకున్న వారిని బయట పెట్టమని శిక్షించమని ఆందోళన చేయడం మంచిది!- నాటి వ్యవహారాలలో తమ తమ హోదాలలో వున్న అరుణ్‌సింగ్, యస్.కె.భట్నాగర్‌లు కూడా పెదవి విప్పి-మళ్లీ మరికొన్ని రహస్యాలు చెప్పే దాకా [చెప్పరని గ్యారంటీ ఏమిటి? మాజీ సైన్యాధికారి చెప్పగాలేంది వీరికి సంకోచం దేనికి?] బోఫోర్స్ వ్యవహారం హెడ్‌లైన్స్ కెక్కదు. ఈలోగా సదరు మహనీయులందరికీ వారు ప్రతిపక్ష కక్షిదారులైనా కాంగ్రెస్ 'చెంచా'లైనా- యెవ్వరైనా సరే అఖండ భారత ప్రజానీకం మనవి చేసేది ఏమిటంటే "అయ్యలారా! మీ రాజకీయ క్షుద్ర నీచరంగంలోకి సైనికులను లాగకండి! వారి ప్రస్తావన ఎప్పుడూ ఎరిగీ మరిచీ కూడా తీసుకు రాకండి!"-ఈ సంయమనమే యీ నిగ్రహమే మీ దేశభక్తికి గీటురాయి!" అని మాత్రమే!-

"గ్రాండ్ స్లామ్స్"కి "గ్రాండ్ స్టార్" గుడ్ బై!

బిల్లీ జీన్ కింగ్, మార్గరెట్ కోర్ట్‌లు రాజ్యం యేలుతున్న బంగారు టెనిస్ కాలంలో *18* సం.ల క్రితం ఒక పదహారేళ్ల అందమైన అమ్మాయి చూపరుల కనులు జిగేల్ మనేలాగా, అమెరికా ఓపెన్ టెన్నిస్ పోటీలలో "సెమీ ఫైనల్సు"కు "ఝూమ్మ"ని చేరుకుంది! అదే అమ్మాయి యిప్పుడు తన *34*వ యేట, పరిపూర్ణ క్రీడాకారిణిగా, పరిణతినందిన ప్రౌఢగా అమెరికా వోపెన్ టెన్నిస్ పోటీలలో క్వార్టర్ ఫైనల్సుతో- "గ్రాండ్ స్లామ్" టెన్నిస్‌కి అతి హుందాగా- అమిత సోయగంతో- "గుడ్ బై" కొట్టేసింది! ఈ టెన్నిస్ తార పేరు టెన్నిస్ ప్రియులందరికీ తెలుసు! ఎవ్వరూ మరిచిపోరు కూడా! నెం. *4* సీడెడ్ క్రిస్ ఎవర్ట్ *(34)* మీద అమెరికా వోపెన్ టెన్నిస్ క్వార్టర్ ఫైనల్స్‌లో నెం. *5* సీడెడ్ జీనా గారిసన్ *(7-6,) (6-2)* లతో గెలుపు సాధించి- వొక ఐతిహాసిక ఘట్టంలో భాగస్వామి అయింది! ఈ జీనా గారిసన్ ఒకనాడు తన *15*వ ఏట- "క్రిస్" ఆటకు ముగ్ధురాలై- పరిగెత్తుకుపోయి ఆమె దగ్గర ఆటోగ్రాఫ్ అందుకుని ఉబ్బితబ్బిబ్బైపోయింది! ఇవాళ అదే "జీనా" క్రిస్ ఎవర్ట్ చేత భుజం తట్టించుకుని "వోహ్" నేనొక మహోజ్వల టెనిస్ క్రీడా ప్రపూర్ణను ఆమె చివరి పోరాటంలో వోడించానా?" అంటూ ఉక్కిరిబిక్కిరైపోయి కూలబడి కంటతడి పెట్టుకుంది. "క్రిస్సీ" "క్వీన్"ని చివరి 'గ్రాండ్ స్లామ్' పోటీల పరంపరలో వోడించిన "దుష్టపాత్ర"గా మిగిలిపోతానేమో నంటూ వాపోతున్న గారిసన్‌ని- క్రిస్ ఆలింగనం చేసుకుంది!

తాపీగా, హుందాగా, యెప్పటిలాగే- ప్రాణం పోసుకుని కదులాడే ఒక పాలరాతి బొమ్మలాగ- అందంగా తన "కిట్" తీసుకుని- తన కోసం నిలబడి హర్షధ్వానాలు చేస్తున్న అమెరికన్ టెనిస్ వోపెన్ పోటీల ప్రేక్షక ప్రపంచానికి రెండు చేతులు పైకెత్తి వూపుతూ సున్నితమైన మనోహరమైన వీడ్కోలు చెపుతూ తాపీగా అంగలు వేస్తూ "టెన్నిస్ కోర్టు" నుండి- టెన్నిస్ చరిత్రలోని బంగారు అధ్యాయాల్లోకి అంతర్ధానమైపోయిన 'తార' క్రిస్ ఎవర్ట్- అమెరికన్ "వోపెన్స్"లో "సెంచరీ" చేసింది!- ఆరుసార్లు అక్కడే ఛాంపియన్ అయింది!

1975-86 మధ్య ఆమెది "స్వర్ణ యుగం" నెం.*1* లేదా నెం. *2* గానో వుంటూ- "గ్రాండ్ స్లామ్స్"కి ఫేవరిట్‌గా వుంటూండేదామె! మొత్తం *18* "గ్రాండ్ స్లామ్ టైటిల్సు" ఆమె "కీర్తి కిరీటం"లో మణిఖచితంగా వెలుగుతున్నాయి. *1300* "మ్యాచ్"లు *157* సింగిల్స్ టైటిల్సు టెనిస్ రికార్డు బుక్స్‌లో ఆమె పేర మెరుస్తుంటాయి! అన్నింటికన్నా టెన్నిస్‌కు ఆమె అందించిన "బేస్ లైన్" ఆట వొడుపు- రెండు చేతులా కొట్టే బ్యాక్ హాండ్ స్ట్రోక్ మహిమ- ముందుతరాల ఆటగత్తెలకి ఆటగాండ్రకి కూడా ఒక "స్కూలు"గా మిగిలిపోతాయి! క్రిస్ ఎవర్ట్ అందంగా హుందాగా వెలిగి వెళ్లిపోయిన టెన్నిస్ మహోజ్వల తార! ఆమెకు నివాళులందిస్తున్న అశేష టెనిస్ ప్రియులతో గొంతు కలుపుతున్నాము! "షి యీజే లెజెండ్ నా".-

నెస్టమ్® బేబీ సిరియల్ – రైస్

మీ పాపాయి యొక్క ఆదర్శప్రాయమైన తొలి ఘన ఆహారం

వాడి చూడండి!

నెస్టమ్ బేబీ సిరియల్‌ని పాలలో కలిపినప్పుడు అది అన్నానికి గల తేలిగ్గా జీర్ణమయ్యే గుణం, పరిపూర్ణ పోషకాహారపు మంచితనం అందజేస్తుంది. 4 నెలలు వయసు వచ్చాకా పాపాయి ఆహారంలో మీరు ఘన పదార్ధాలు ప్రవేశ పెట్టేటప్పుడు, నెస్టమ్‌తో ప్రారంభించండి. బియ్యంతో తయారు చేయబడిన నెస్టమ్, తేలిగ్గా జీర్ణయం అయ్యేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. అంతేకాదు, నెస్టమ్, ఇనుము, విటమిన్‌లతో మరింత బల వర్ధకం చేయబడింది.



నెస్టమ్‌ని తయారు చేయడం ఎంతో సులువు దీనిని ముందుగా కాచిన వెచ్చటి పాలల్లో కలపండి అంతే, పాపాయికి తినిపించేందుకు ఆహారం తయారు!

నెస్టమ్ పాలు లేకుండా అందుబాటులో ఉన్న ఒకే ఒక సిరియల్. మీరు మీ పాపాయి ఆహారంలో వివిధ రుచులు తెచ్చేందుకు ముందుగా ఉడికించి యింట్లోనే తయారు చేసిన మెత్తటి గుజ్జుగా చేసిన కూర ముక్కలు, పప్పు, పండ్లు నెస్టమ్‌లో కలపండి.

కేవలం రూ 9/-* కే డబ్బాలో 200 గ్రా. సంచీ

* స్థానిక పన్నులతో సహా



ఉచితం !
నెస్టమ్ రెసిపి బుక్ లెట్
ఈ చిరునామాకు వ్రాయండి
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం. 6016
న్యూ ఢిల్లీ 110 008

Nestlé

ప్రస్తుతం ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే దొరుకుతోంది.

R K SWAMY FSL 5327 TEL

సీరియల్

వజ్రసంకల్పం

సాతవాహన

(గత సంచిక తరువాయి)

తను వేసిన మాస్టర్ ప్లాన్ మరుసటి రోజే అమల్లో పెట్టింది పింకీ.

కళ్ళు మిరుమిట్లు గొలిపేలా అలంకరించుకుని ప్రభుతో కలిసి ఓ ఫారిన్ కార్లో సాయంత్రం ఆరింటికి బయల్దేరిందామె. ప్రభు ఫుల్ సూట్లో ఎవరో పెద్ద బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా కనిపిస్తున్నాడు.

ఓ స్నేహితుడ్ని అడిగి ఆ ఫారిన్ కారు సంపాయించాడతను. డబ్బు ఖర్చు పెట్టడం తప్ప మరేమీ తెలియని కోటీశ్వరుల కొడుకుల్తో స్నేహం చెయ్యడం ఓ ప్రత్యేకమైన పాలసీగా పెట్టుకున్నాడు ప్రభు. ఆ పాలసీ నిర్ణయించి పెట్టింది మాత్రం పింకీ.

> భువన భవనం కాలిపోతుంటే,
> మానవ భవితవ్యం మాయమౌతుంటే,
> అసిధారగా మారుతుంది అశ్వకెరటం!
> సంభవిస్తుంది వజ్రసంకల్పం!!

అలా స్నేహం సంపాయించడం కూడా ఓ ప్రత్యేకమైన పద్ధతిలోనే జరుగుతుంది. దానికి అనువైన ప్రదేశాలు ఖరీదైన హోటళ్ళు.

ముందుగా నిర్ణయించుకున్న ప్లాన్ ప్రకారం తాము స్నేహం చెయ్యవలసిన యువకుడెవరో ఒకర్ని ఎన్నుకోవడం జరుగుతుంది. ఆ ఎన్నుకోవడం కూడా పింకీయే చేస్తుంది. ఆమె మాట ప్రభుకి వేదవాక్కు.

అలా ఎన్నుకున్న యువకుడి అలవాట్లేమిటో జాగ్రత్తగా పరిశీలిస్తాడు ప్రభు. నూటికి తొంభై తొమ్మిది శాతం ఆ యువకుడు ఏదో ఒక పెద్ద హోటల్‌కు తరచుగా వెళ్తుంటాడు.

ఒక శుభముహూర్తాన పింకీ అప్సరసలా అలంకరించుకుని ఆ హోటల్ కాక్‌టైల్ లాంజ్‌లో ఆ యువకుడికి ఎదురౌతుంది.

చిన్న డాష్- లేదా, చిన్న చిరునవ్వు- ఆయువకుడి కళ్ళు పింకీ మీద పడతాయి.

అంతే!

ఆ యువకుడు వూపిరి పీల్చుకోవడం మర్చిపోతాడు.

ఆడపిల్లలందరికీ తాము అందగత్తెలమనే అహంభావం ఎంతో కొంత వుంటుంది. కానీ, తమ అందాన్ని ఒక శాస్త్రంలాగా అధ్యయనం చేసి సరైన అలంకరణ చేసుకోగలగడం ఒక ఆర్ట్ అయితే ఆ ఆర్ట్ ఏ కొద్దిమంది అమ్మాయిలకో అలవడుతుంది. అలాంటి ఆర్ట్‌లో

విడిప్రతివెల రు. 4-00

ఆంధ్రసచిత్రవారపత్రిక


సంపుటము 82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచికలు 5, 6

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్‌లు : 75667, 61247, 61248

పదండి లోపలికి!



ముఖచిత్రం:

"హలో! అనిల్! బస్తీమే సవాల్" అంటున్న శ్రీదేవి.

(జగ్‌మోహన్)

పై వారం

"మర్మాంగాలను కూడా తయారు చేస్తున్నారు"

ప్రత్యేక వ్యాసం

పింకీది అందెవేసిన చెయ్యి. అతి తక్కువ మేకప్‌తో తనని తాను కళ్ళు మిరుమిట్లు గొలిపేలా అలంకరించుకోగలదామె.

గొప్ప మేకప్ రహస్యమేమిటంటే మేకప్ స్ఫురింపచేయకపోవడమే!

తక్కువ మేకప్ చేసుకునే అమ్మాయి లెప్పుడూ ఎక్కువ అందంగా కనబడతారు. అందం ఆయుధమైతే ఆ ఆయుధానికి పదును పెట్టేది మేకప్.

తను అందంగా వుంటుందని- చాలా అందంగా వుంటుందని- పింకీకి చాలా బాగా తెలుసు. తనని చూస్తే ఎలాంటి యువకుడైనా కళ్ళు తేలవేస్తాడని కూడా తెలుసు. తన ఆయుధాన్ని ఏ మేరకు వుపయోగించాలో అంతకన్నా బాగా తెలుసు.

ఆ యువకుడి కళ్ళు తన మీద పడగానే తన ఆయుధం ఝళిపిస్తుంది.

ఆ యువకుడు మహదానందంగా ఓడిపోతాడు.

అందమైన అమ్మాయి సౌందర్యానికి దాసోహమనని ధీరుడెవడు!

అతన్ని డాష్ కొట్టినందుకు నొచ్చుకుంటున్నట్టు కళ్ళు రెపరెపలాడిస్తూ అమాయకురాలిలా చూస్తుంది పింకీ.

ఆ చూపుకే ఆ యువకుడి గుండెకు రెక్కలు మొలుచుకొచ్చేస్తాయి.

"ఓహ్! అయాంసారీ!" అంటుందామె.

ఆ మాట ఎంత అమాయకంగా ఎంత తియ్యగా చెప్పాలో పింకీకి తెలుసు.

లతామంగేష్కర్ పలికినా అంత మధురంగా వినిపించదు.

దాంతో ఆ యువకుడి గుండెకు మొలుచుకొచ్చిన రెక్కలు టపటపా కొట్టుకోవడం మొదలెడతాయి. అతని గుండె నెమ్మదిగా ఆకాశంలోకి ఎగుర్తుంది. అర్థక్షణంలో సకల భువనాలూ ఓ రౌండు కొట్టి తిరిగి వస్తుంది.

అతను అతి కష్టం మీద తేరుకుని వులిక్కిపడతాడు.

ఎదురుగా ఆమె కనిపించదు.

అతను తేరుకునే లోపలే అక్కడ్నించి జారుకుంటుంది.

అతని కళ్ళు ఆతృతగా ఆమె కోసం అన్వేషిస్తాయి.

అమెరికాలో స్మితా పాటిల్ చిత్రాల ప్రత్యేక ప్రదర్శన



స్మితా పాటిల్ నటించిన కొన్ని చిత్రాలతో కూడుకొనివున్న ఒక ప్రత్యేక చలన చిత్ర ప్రదర్శన ఈ వారం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రారంభమవుతున్నది. భారతీయ మహా నటీ మణులలో ఒకరైన స్మితా పాటిల్‌కి నివాళిగా న్యూయార్కులోని ఆసియా సొసైటీ ఈ ప్రత్యేక ప్రదర్శనను నిర్వహిస్తున్నది.

మిర్చ్ మసాలా, భావ్నీ భావ్నీ (కేతన్ మెహతా), భూమిక, మంథన్ (శ్యామ్ బెనగల్), అర్ధసత్య (గోవింద నిహ్లానీ), ఆకలేర్ సంధనె (మృణాల్‌సేన్), ఉంబర్థా (జబ్బార్ పటేల్), చక్ర (రబీంద్ర ధర్మరాజ్), చిదంబరం (జి. అరవిందన్) మొదలైన చిత్రాలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తున్నారు.

స్మిత సోదరి అయిన మాన్యా పాటిల్ జేత్మలానీ, ఇంకా చలన చిత్రోత్సవాల డైరెక్టొరేట్, ఎయిర్ ఇండియా, తాజ్ హోటళ్ల గ్రూపు, న్యూయార్కులోని భారత కాన్సులేట్ జనరల్, విద్య, సాంస్కృతిక విషయాల భారత- అమెరికన్ ఉప సంఘం కృషి వల్ల ఈ స్మితా పాటిల్ చలన చిత్రాల ప్రదర్శన ఏర్పాటు సాధ్యమైంది.

స్మితా పాటిల్ తన 31వ ఏట 1986 డిసెంబరు 14న మృతి చెందారు. 1975లో శ్యామ్ బెనెగల్ చిత్రం 'చరణ్‌దాస్ చోర్'తో సినీ రంగ ప్రవేశం చేసిన స్మితా పాటిల్ ఆ తర్వాత 70కి పైగా చిత్రాలలో నటించి భారతదేశపు మహా నటీమణులలో ఒకరుగా చలన చిత్రాభిమానుల హృదయాలను చూరగొన్నారు.

స్మితా పాటిల్ చలన చిత్రాల ప్రత్యేక ప్రదర్శనతో పాటుగా ఆసియా సొసైటీ అమెరికాలో అక్టోబరు 7 నుంచి 'అంతర్జాతీయ ఆసియా చలన చిత్రోత్సవాన్ని' కూడా నిర్వహించనున్నది. సత్యజిత్‌రే, మృణాల్‌సేన్, సయీద్ మీర్జా, గోవింద్ నిహ్లానీ, బసూ ఛటర్జీలాంటివారు టెలివిజన్ కోసం రూపొందించిన చిత్రాల ద్వారా భారతీయ చలన చిత్రాలలో నాణ్యతను ప్రోత్సహిస్తున్న దూరదర్శన్ కృషికి ఈ చలన చిత్రోత్సవం నివాళు లర్పిస్తుంది.

వజ్రసంకల్పం

ఇంతవరకూ సాగిన కథ –14: విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో బావి త్రవ్వుతుండగా అపురూపమైన వజ్రం దొరుకుతుంది. అతని దాయాది అయిన వజ్రపాణి – విశ్వధరవర్మ కొడుకు రాజేంద్రవర్మను, అతని కుటుంబాన్ని దారుణంగా చంపి ఆ వజ్రాన్ని కాజేస్తాడు. విశ్వధరవర్మ చిన్న కొడుకు నరేంద్రవర్మపై ఉరిశిక్ష మోపబడుతుంది. నరేంద్రవర్మ భార్య మగబిడ్డను ప్రసవిస్తుంది. ఒక గూడెంలోని చిన్నోడు-మరో గూడెంలోని చిన్నమ్మ ప్రేమించుకుంటారు. వారి ప్రేమను అంగీకరించని గూడెం పెద్దలు వారిద్దరినీ అమ్మవారికి బలివ్వపోతుండగా వజ్రకాయుడు రక్షించి వజ్రపాణి వజ్రాలగనులు ఎక్కడ వున్నాయో వారిని ఆరా తీస్తాడు. మల్లి తన తొలి రాత్రి వజ్రపాణి హవేలీలో బందీ అవుతుంది.

ఓ కార్నర్ టేబుల్ దగ్గర ప్రభుతో చనువుగా మాట్లాడుతూ కనిపిస్తుందామె.

కాస్త చొరవున్న వాడైతే ఆ యువకుడు, "ఎక్స్‌క్యూజ్‌మీ," అనే ఓ చిన్న టస్సా కొట్టి అదే టేబుల్ దగ్గర బైరాయిస్తాడు.

మరింత చొరవ గలవాడైతే ఆమెతో ఏదో ఒక వంకతో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తాడు. అన్ని దమ్ములు లేకపోతే ప్రభుతో హస్కేసుకుంటాడు.

అతను తమ టేబుల్ దగ్గర కూర్చోవడం తనకే మాత్రం ఇష్టం లేనట్టు ప్రవర్తిస్తుంది పింకీ..

దాంతో ఆ యువకుడు తల్లడిల్లిపోతాడు.

ఆమెతో పరిచయం చేసుకోవడానికి ప్రభుతో పరిచయం పెంచుకుంటాడు.

అలా ప్రారంభమౌతుంది.

కొంత సేపటికి పింకీ కూడా వాళ్ళ మాటల్లో భాగం పంచుకుంటుంది. కానీ, అతి తక్కువగా మాట్లాడుతుంది. ఆమె చేత మాట్లాడించడానికి ఆ యువకుడు చాలా వాగుతాడు. అతన్ని బాగా వాగవిచ్చి తనకేదో పనున్నట్టు వాళ్ళకో గుడ్‌బై కొట్టి హోటల్ నుంచి వెళ్ళిపోతుంది తను.

వాళ్ళిద్దరూ అక్కడ మిగిలిపోతారు.

ప్రభుకి మస్కాకొట్టి పింకీ వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తాడా యువకుడు.

తనతో స్నేహం చేస్తే పింకీతో పరిచయం పెంచుకోవచ్చుననే అభిప్రాయం అతన్లో కలిగిస్తాడు ప్రభు.

అలా అలా సాగిపోతుందా కథ!

పింకీ మాత్రం ఆ యువకుడ్ని చాలా దూరంలో వుంచుతుంది.

దూరపు కొండలు నునుపుకాబట్టి ఆమె పట్ల అతని ఆకర్షణ అలాగే వుండిపోతుంది.

ఆ విధంగా స్నేహితులైన యువకులు చాలా రకాలుగా వుపయోగపడతారు- అడిగినప్పుడు తమ కార్లు వాడుకోనివ్వడం దగ్గర్నుంచీ హై సొసైటీలో పరిచయాలు కలిగించేవరకూ!

అలాంటి స్నేహితుడే ఒకతని దగ్గర్నుంచి ఈ ఫారిన్ కారు ఎరువు తెచ్చుకున్నాడు ప్రభు!

ఎదుటివార్ని బురిడీ కొట్టించడంలో ఫారిన్ కార్లు గొప్పగా వుపయోగపడతాయనేది పింకీ సిద్ధాంతం.

తమ కారు వెనకే మరో కారు బయల్దేరడం ఆ ఇద్దరూ గమనించలేదు.

* * * * * * * * *

"జూడా!"

"ఊ?"

"ఆ కిలాడీరాణి ఎక్కడికి బయల్దేరిందంటావ్?"

"అది కనుక్కోవడానికే మనం ఆ కారు ఫాలో అవుతున్నాం!"

"జూడా!"

"మళ్ళీ ఏమిటి?"

"కారు కాస్త మెల్లగా తోలరాదూ, నీస్పీడుకి భయమేస్తోంది!"

"డేవిడ్! కాసేపు నోరు మూస్తావా? స్పీడు తగ్గిస్తే ఆ కారు దాటిపోతుంది!" కసిరాడా వ్యక్తి.

* * * * * * * *

సిటీలో కెల్లా పెద్దదైన జవహారీ షాపుల్లో ఒకదాని ముందు కారు పార్కు చేసి ఠీవిగా దిగాడు ప్రభు. పింకీ అవతలి పక్కడోరు తెరుచుకుని దిగిందో లేదో అక్కడున్న కొంత మంది యువకుల కళ్ళు అప్పుడే ఆమె వైపు తిరిగాయి. మరుక్షణం ఆ కళ్ళు తళతళ లాడాయి. మనోహరమైన చిరునవ్వుతో చకచకా అడుగులు వేస్తూ ప్రభు దగ్గరకెళ్ళి చెయ్యందించింది పింకీ. ఓ మహా సామ్రాజ్యాన్ని గెలిచిన రాజకుమారుడిలా ప్రభు ఆమె చెయ్యందుకుని మరింత ఠీవిగా ముందుకు నడి

చాడు. అంతవరకూ పింకీనే వీక్షిస్తున్న కళ్ళు ప్రభుని ఈర్ష్యగా చూశాయి.


టకటకా మెట్లెక్కి వాళ్ళు తనవైపు రాగానే దర్వాన్ మహావినయంగా వాళ్ళకు వంగి సలాంకొట్టి గ్లాస్ డోర్ తెరిచి పట్టు కున్నాడు. దర్వాన్ మొహంలో ఆ వినయ విధేయతలు ఫారిన్‌కారు చూసే కలిగాయి. ఆ దర్వాన్ తన వృత్తిలో పండిపోయిన మనిషి. ఇలాంటి జంటలు ఆ షాపుకొచ్చిన ప్పుడు తనకు ధారాళంగా టిప్పు ముట్టజెప్పే అవకాశాలు పుష్కలంగా వుంటాయని అతనికి బాగా తెలుసు.

పింకీ చెయ్యి పట్టుకుని నిర్లక్ష్యంగా ముందుకు నడిచాడు ప్రభు. ఆమె తన పక్క నున్నంత సేపూ లోకంలో ఎవర్నీ ఖాతరు చేసేట్టు లేదతని ధోరణి.


షాపులో అడుగుపెడుతూనే ఖరీదైన యూనిఫాంలో వున్న గుమాస్తా ఒకతను వాళ్ళ వైపు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"వెల్‌కమ్ సర్! మే ఐ హెల్ప్ యూ!" అన్నాడతను.

"అఫ్ కోర్స్ యూ మే !" దర్పంగా అంటూ పింకీవైపు చూపించాడు ప్రభు. "దీసీస్ మై ఫియాన్సీ! ఎల్లుండే మా పెళ్ళి. ఖరీదైన వెడ్డింగ్‌రింగ్ కానుకగా ఇవ్వాలనుకుం టున్నాను. మీ దగ్గరున్నవి చూపిస్తారా?"



శత్రుఘన్ స్వంత పార్టీ



రాజకీయ రంగంలోని నటీనటులు స్ఫూర్తి యిచ్చారో.... ఏమో... శత్రుఘ్న సిన్హా కూడా ఆ కోవలోనే చేరిపోతున్నాడు. పైగా కాంగ్రెస్ లోనో, నేషనల్ ఫ్రంటు లోనో చేరిపోయి సేవ చేయటం కాదు.... స్వంతంగా క్రొత్తపార్టీ ఒకటి పెట్టాలని యోచిస్తున్నాడట.

తన స్వంత రాష్ట్రమైన బీహార్ పరిస్థితి తన మనసును కలిచివేసి రాజకీయాల్లోకి దిగమని పురికొల్పిందట. క్రొత్తల్లో అందరూ అలాగే అంటారనుకోండి!

స్వంత పార్టీ అంటూ పెడితే అర్హమైన వారిని అభ్యర్థులుగా తీసుకోనని మేథావులనే ఎన్నుకుంటానని బల్లగుద్ది మరీ చెప్తున్నాడు శత్రుఘన్. మరి మేధావులతో అసలు రాజకీయాల్లో ఎలా నెగ్గుకొస్తాడో? లెటజ్ వెయిట్ అండ్ సీ!

వజ్రసంకల్పం

"సర్టెన్లీ సర్! ప్లీజ్ కమిన్!" వాళ్ళిద్దర్నీ వెంటబెట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడతను. "మా వుంగరాల సెక్షన్ ఇదే సర్! మీక్కావల్సిన రింగ్ సెలెక్ట్ చేసుకోవచ్చు!"

"ఆల్ రైట్! చూపించండి!"

ముఖమల్ గుడ్డతో కవర్ చేయబడిన చిన్న చిన్న పెట్టెలు తెరిచి రకరకాల వుంగరాలు వాళ్ళ ముందుంచాడు క్లర్క్.

ఆ వుంగరాలు చూస్తూనే పింకీ మొహం చిటపటలాడింది.

"డార్లింగ్! అన్నీ నాసిరకం వుంగరాలు. ఇంత చిన్నషాపుకి నువ్వు నన్ను పిల్చుకొస్తావని అనుకోలేదు."

ఆ మాట వినగానే షాపు గుమస్తా మొహం వెలవెలబోయింది.

"అయాం సారీ సర్! ఎక్స్‌ట్రీంలీ సారీ! ఈ వుంగరాలు మీకు పొరపాటుగా చూపించాను. ఖరీదైనవి చూపిస్తాను," చకచకా ఆ పెట్టెలు వాళ్ళ ముందునుంచి తీసేస్తూ అన్నాడతను.

"ఇవి చూడండి సర్! చాలా ఖరీదైన రవ్వల వుంగరాలు," మరికొన్ని పెట్టెలు వాళ్ళ ముందుంచుతూ అన్నాడు.

పింకీ ఈసారి ఓ వుంగరం చేతిలోకి తీసుకుంది.

"ఎలా వుంది డార్లింగ్?" అడిగాడు ప్రభు.

"నాట్ టూ బ్యాడ్!" నిరాసక్తిగా ఆ వుంగరం కిందపెట్టేస్తూ చప్పగా చూసిందామె.

ప్రభు గుమస్తావైపు తిరిగాడు.

"ఈ వుంగరాల ఖరీదెంత వుంటుంది?" అడిగాడు.

"పదిహేను వేల నుంచి పాతిక వేల దాకా వుంటుంది సర్!" వినయంగా జవాబిచ్చాడు గుమాస్తా. "మేడం చూసిన ఈ వుంగరం అన్నింటికంటే ఖరీదైంది. పాతిక వేలు!" చెప్పాడు.

ఈ సారి ప్రభు మొహం చిటపటలాడింది.

"పాతికవేలు! యూమీన్ ట్వెంటీఫైవ్ థౌజండ్! వాట్ ఎ షేమ్! ఎల్లుండి మా జీవితాల్లో అతిముఖ్యమైన రోజు మిస్టర్! ఇంత తేలికపాటి వస్తువులు చూపిస్తావనుకోలేదు." అతను పింకీ వైపు తిరిగాడు. "కమాన్ డార్లింగ్! నువ్వన్నట్టుగా ఇది నిజంగా చాలా చిన్న షాపు. మరో షాపు కెళ్దాం! " గిరుక్కున వెనక్కి తిరిగాడు.

గుమాస్తా మొహం మాడిపోయింది.

"ప్లీజ్ సర్! వన్ మినిట్!" కంగారుగా పిలిచాడు.

అమ్మిన ప్రతి వస్తువుపైనా వచ్చే లాభాల మీద ఆ వస్తువు అమ్మిన గుమాస్తాకు టూ పర్సెంట్ కమీషన్ ఇస్తాడా షాపు యజమాని. ఓ ఎస్టీమ్డ్ కస్టమర్‌ని పట్టుకునే అవకాశం వేళ్ళ సందుల్లోంచి జారిపోతున్న అనుభూతి కలిగిందా గుమస్తాకి. ఈ కస్టమర్‌ని ఇప్పుడు పోగొట్టుకుంటే వుత్తరోత్తరా ఈ జంటకు అమ్మే వస్తువుల మీద జేబు నిండా కమిషన్ సంపాయించుకునే ఛాన్సు పోతుంది. అదతనికి సుతరామూ ఇష్టం లేదు.

గుమాస్తా తనని పిలవగానే ప్రభు ఆగి వెనక్కి తిరిగాడు.

"మీ కెంత ఖరీదులో వుంగరం కావాలో చెబితే అలాంటి వుంగరాలు చూపించడానికి ప్రయత్నిస్తాను," మరింత వినయంగా చెప్పాడతను.

ప్రభు భుజాలెగరేశాడు.

"కనీసం యాభై వేలు! ఉన్నాయా అలాంటి వుంగరాలు?" సింపుల్‌గా అడిగాడు.

గుమాస్తా అతన్ని కళ్ళప్పగించి చూశాడు.

"ఉన్నాయా లేవా?" కాస్త విసుగు ప్రదర్శిస్తూ అన్నాడు ప్రభు.

గుమాస్తా నెమ్మదిగా తలాడించాడు.

"ఉన్నాయి సర్! కానీ, అవి ఈ కౌంటర్‌లో లేవు."

"మరెక్కడున్నాయ్?"

"మా ఓనర్ కస్టడీలో వుంటాయి."

"ఐసీ! అమ్మే వస్తువులు షో కేసులో పెట్టకుండా లోపలదాచుకునేం చేస్తాడు మీ ఓనర్?" కొంచెం పరిహాసంగా అడిగాడు ప్రభు.

గుమాస్తా కృత్రిమంగా నవ్వేడు.

"అవి ఆయన దగ్గరే వుంటాయి సర్! మీరు దయచేసి కొద్ది క్షణాలు ఆయన గదిలో కూర్చుంటే చూపిస్తారు."

"ఓకే! మీరీసారి మమ్మల్ని సంతృప్తి పరిస్తే ఉత్తరోత్తరా మేము మీ షాపుకి చాలా బిజినెస్ ఇస్తాం! ఏం డార్లింగ్?" పింకీ వైపు చూస్తూ అన్నాడు.

పింకీ మెరుస్తున్న కళ్ళతో నవ్వింది.

"యస్ డార్లింగ్!"


ప్రభు మళ్ళీ గుమాస్తావైపు తిరిగాడు.

"పదండి!"

"ప్లీజ్ కమ్ సర్!" వాళ్ళిద్దర్నీ యజమాని గదిలోకి పిల్చుకెళ్ళాడతను.

(ఇంకా వుంది)

మీ పాపాయికి ఇవ్వండి కూరగాయలలోని మంచి పుష్టి



ముందుగానే వండిన

ఫారెక్స్® -వెజ్



6 నెలల నుంచి

క్రొత్త ఫారెక్స్-వెజ్ విటమిన్లు సమృద్ధిగా గల కాయగూరలు- క్యారట్లు, టమాటాలలోని మరియు పెసరపప్పులోని సహజమైన పోషణ గుణములతో కూడినది.

ముందుగానే వండినది, కనుక మీ పాపాయి యొక్క సున్నితమైన జీర్ణశక్తికి అనుకూలమైనది.

ఫారెక్స్-పెరుగుదల కోసం రుచికరమైన విధానం.



ఫారెక్స్ పోషకాహారాల శ్రేణిలో ఇప్పుడు కలవు: 1. పాలతో కూడిన ఫారెక్స్-సిరియల్ 2. ఫారెక్స్-వెజ్ 3. ఫారెక్స్-ఎగ్

GX/31/244 TEL

తాజాకాలమ్ విరాజ్

హైదరాబాద్‌లో రాష్ట్రపతి ఆర్.వి!

భారత రాష్ట్రపతి పదవి మీద అకస్మాత్తుగా రాజకీయ పక్షాలకి- అన్ని రకాల రాజకీయ పక్షాలకి గౌరవం, నమ్మకం ఎక్కువై పోయాయి- పాపం! ఆర్. వెంకట్రామన్‌గారు 'గోల్కొండ'సాలార్‌జంగ్‌మ్యూజియం లాంటి సరదా దృశ్యాలు చూసి ఆనందంగా గడుపుదామని హైద్రాబాద్‌కి వస్తే- ఆయన పని- గుట్టలు గుట్టలుగా వినతిపత్రాల స్వీకరణ మహోత్సవంగా మారి పోయింది! కేంద్రమంత్రి మండలి సలహా మేరకు నడుచుకోవలసిన కార్యాలలో సైతం "కేంద్రాన్ని మీరే నడపాలి" అంటూ రాజకీయ వాదులు ఆయనని పీడించుకుతిన్నారు. కాంగ్రెసు పక్షానికి పోయిన ఎన్నికలలో వోట్లు యివ్వనన్న ఆంధ్ర ప్రజానీకం- అత్యవసరంగా అతి ఉదారంగా ఈసారి అమిత వేగంగా సంతకాలు వేలిముద్రలు గుట్టలు గుట్టలుగా ప్రసాదించారు! వీటిని మోసుకుపోయి రాష్ట్రపతికి అప్పజెప్పి- ఎన్.టి. ఆర్. గవర్నమెంటుని బర్తరఫ్ చేయమని ప్రజలు కోరుతున్నారంటూ డా. మర్రి చెన్నారెడ్డిగారు గట్టిగా వాదించారు. శ్రీ రెడ్డి- లోగడ ముఖ్యమంత్రిగానే కాదు గవర్నర్‌గా కూడా పనిచేశారు. రాష్ట్రపతి యిట్లా సంతకాల "కోటి" చూసి- ఆంఫట్‌మంటూ రాష్ట్రప్రభుత్వాలను రద్దు చేయించలేరని తెలిసే అనవసరంగా తమ పొలిటికల్ స్టంట్‌లో ఆ "బ్రాహ్మణ్ని" (యిక్కడ కుల ప్రసక్తి లేదు గాక లేదు బాబోయ్! యిది తెలుగునుడికారం) యిరికించారు. అది అలా వుండగా- ప్రతిపక్షాలకు చెందిన శ్రీ ఎన్.టి.ఆర్. అనుయాయులు; సానుభూతి పరులు మిత్రపక్షాలు వగైరాలంతా 230 మంది. ఎం.ఎల్.ఏ.లు (పాపం! ఎం.పీ.లు ఎన్.టి.ఆర్. పథకానికి బలై పోయారు) రాష్ట్రపతిని కలుసుకుందామని విఫలయత్నం చేశారు.

"మీ పలుకుబడిని వుపయోగించి నాన్ కాంగ్రెసు గవర్నమెంట్‌లను కేంద్రం పడ కొట్టకుండా చూడమని " వీలైనంత వివరంగా వినతిపత్రం పంపి అభ్యర్థించారు.

టి.డి.పి., జనతాదళ్, బి.జె.పి., సి.పి. ఎమ్., ఎం.సి.పి.ఐ. పార్టీల ప్రతినిధులంతా యిలా "బేలగా" తమను కేంద్రప్రభుత్వ దమన నీతి నుంచి కాపాడమని అమాంతం ఆయన మీద "దండల" యాత్ర ప్రారంభించాలనుకుంటే- రాష్ట్రపతి యింటర్‌వ్యూ వారికి లభించలేదు. ఆయన "బ్రతుకు దేవుడా" అనుకుంటూ విమానం ఎక్కేస్తే- ఆ వినతిపత్రాన్ని పోస్టులోపడేశారు. అయితే "పిల్లి చేత గచ్చ పిక్కలు తీయిస్తున్నట్లు" అన్ని రాజకీయ పక్షాలు వాడుకోవడానికి "పత్రికలు"న్నాయిగా. ఈ పత్రికలు వివరంగా యీ విజ్ఞప్తి పత్రాన్ని అఖిలభారత పాఠకులముందూ వుంచాయి!

వేరేవని లేకుండా పోయింది కేంద్రంలోని వారికి రాష్ట్రంలోని వారికి! ఈ మాదిరి "పొలిటికల్ గేమ్స్" లోగడ లేవు. మరీ విడ్డూరంగా వుంది వీరి సంగతి.

"సంతకాల"నే కాగితాల గుట్టలతోను, వినతి పత్రాలనే విచిత్ర పత్రాలతోను ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు పడటం లేవటం జరిగితే రాజ్యాంగ మెందుకు? ప్రజాస్వామ్యంలో వోటర్లెందుకు?- ఎన్నికలు పొంచి వున్నాయి- ఎవరి మట్టుకు వారు పబ్బం గడుపుకుంటున్నారు. ఒక ప్రక్క ఏ క్షణాన్నైనా తనని బర్తరఫ్ చేస్తారంటూ ప్రచారం చేయిస్తున్న ముఖ్యమంత్రి మరొక ప్రక్క- అల్లుడుగారిని తిరిగి మంత్రి వర్గం

జాతీయ వర్తక సమాఖ్యల పిలుపుపై సెప్టెంబర్ 13న విజయవాడ వ్యాపారస్తులు కూడా తమ సంస్థలను "బంద్" చేసి నగర వీధుల్లో ఊరేగింపు జరిపినప్పటి చిత్రం!



శరవేగంతో వస్తున్నాడు మన్నెంశారద 'సూపర్‌హీరో'

లోకిఆహ్వానించడంకోసంఐదుగురుమంత్రుల్ని అతి జాగ్రత్తగా కుల వర్గ ప్రాతిపదికల మీద లెక్కలు గట్టి వేసుకున్నారు. రాష్ట్రంలో నక్సలైట్‌ల గొడవలు వాటి దారిన అవి వుండగా- లొంగిపోతున్న నక్సలైట్‌ల ఖర్చు ప్రజలమీద అదనంగా వడ్డది. తమి ళనాడు పోలీసు ఖర్చులు మరో వెచ్చు. యిది చాలక "టాస్క్‌ఫోర్స్" కు మరికొంత ఖర్చు!

మరొక ప్రక్క పౌరహక్కుల సంఘంతో చర్చలు- ముఖ్యమంత్రి అమిత చాకచక్యంగా (కనీసం వారి దృష్టిలో) యిదంతా నడు వుతూ ఝుమ్మని విశ్వామిత్ర షూటింగ్ లాగించేస్తూ వుంటే- విలేఖర్లు పోయి ఏమి స్వామి "మ్యూటినీ" అన్నారు. దీని అర్థం తెలిసి యీ మాట "హొగ్గారా?" తెలియక "హొగ్గారా?" అంటే- ఆయన గొంతులో వెలక్కాయ వడ్డది. ఐనా సర్దు బాటు చేయడం కూడా గొప్పగా వుంది. దేశభక్తి తీవ్రతలో అలా అన్నారుట! కేంద్ర, రాష్ట్రాలు రెండు శత్రుదేశాల్లాగ ప్రవర్తించే యీ 'పిదప' కాలాన్ని త్వరగా ముగించేయాలీ అంటే- ఎన్నికలేవో త్వరగా ప్రకటించి ఈ పెద్దలందర్నీ- "ముకుళిత హస్తుల్ని" చేసి బ్యాలట్ బాక్సుల దగ్గరికి తోసెయ్యడం మంచిది! బోఫోర్సు పార్సు అనవసరంగా ముదిరిసైనికుల జోలికి వెళ్లడం ఎవ్వరికీ శ్రేయస్కరం కాదు!

దేశం సస్యశ్యామలం- ప్రజలు యెన్ని వుపద్రవాలు వచ్చినా క్షేమం-'ప్రజాస్వామ్యం' లో ఆ ప్రజలు యీ నాయకుల జాత కాలు రాసే రోజు వచ్చింది! ఎవ్వరి మాటలు ఎవ్వరి చేతలు-'వారినే తిరిగి వెక్కిరించే సమయమిది- అందరికి బహ వరాక్ చెప్పాల్సిన పత్రికల్లో అరుణ్‌శౌరీ లాంటి వారు కూడా సుందర్‌జీ తర ఫున వకాల్తా పుచ్చేసి- కొన్త సంయమనం చూపాలి. రాష్ట్రపతి- కేంద్రమంత్రి వర్గం మధ్యగల సంబంధ బాంధవ్యాలమీద ప్రతి పక్ష నాయకులకి ప్రజలకి కూడా కొంత అవగాహన యిచ్చే వ్యాసాలు రాస్తే వారు మంచిది. సుందర్‌జీకి టిక్కెట్ యిస్తా మంటూ పార్టీలు ముందుకుదూకే ముందే యీ మాజీ సైన్యాధిపతిని రాజకీయాల బరిలోకి దించకుండా వుండటం అందరికీ మేలు. సుందర్‌జీని హాయిగా కాలం గడవని వ్వడం మంచిది.

(11-9-89)

దీర్ఘాయుష్మాన్భవ!

నారాయణమూర్తిగారొచ్చి పెళ్ళి సంబంధం గురించి చెప్పింటే తలుపుచాటుగా విన్న ప్రభావతి మనసు తొందరపడటం మొదలుపెట్టింది. అప్పుడప్పుడు పెళ్ళి ఊహవచ్చినా, ఈవేళ, ఈ సంబంధం గురించి విన్నాక, నిముషాల మీద యిది ఖాయమైపోతే బాగుండును అనిపిస్తోందామెకి.

ప్రభావతి పదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు తల్లి పోయింది. ఆనాడు తల్లి శవం మీద పడి ఏడుస్తున్న తండ్రిని చూసిన ఆ పసిహృదయం తండ్రి మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడని ఊహించలే కపోయింది. కానీ చుట్టాలూ పక్కాలూ అంతా తలొకమాటా, సలహో యిచ్చారు. ఫలితంగా ఏడాది తిరిగేసరికి తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అతనలా పెళ్ళి చేసుకోడాన్ని ఎవ్వరూ ఆక్షేపించలేదు. ఎందుకంటే అది లోకసహజమే కనుక. కాని ప్రభావతి మాత్రం చిన్నబుచ్చుకుంది.

భ్రమరాంబ వచ్చిన నాటి నుంచి ప్రభావతి స్వేచ్ఛ పూర్తిగా హరింపబడింది. నోరు విప్పి చెప్పకుండానే ఇంటెడు చాకిరీ చేయించి ప్రభావతిని మరీ స్కూలుకి పంపేది భ్రమరాంబ. సాయంత్రం కాస్త ఆటు యిటూ వెళ్ళాలన్నా "మరి వంటెవరు చేస్తారు?" అనే ఆలోచన ప్రభావతికే వచ్చేటట్టు తర్ఫీదు ఇచ్చింది. కన్నతండ్రి ఎప్పుడైనా కనిపెట్టినా "పిల్లకి పనిపాటలొస్తాయి అదిమంచిదేకదా" అని ఒకసారి.

"పాపం భ్రమర మాత్రం ఒక్కర్తీ ఎంత కని చేస్తుంది? అదే వాళ్ళమ్మకైతే చెయ్యరా" అని మరొక సారి.

"కన్నతల్లి కంటే ఎక్కువగా చూస్తోంది సవతి తల్లయినా అంతకంటే ఏంకావాలి" అని వేరొకసారి సరిపెట్టుకున్నాడు.

ప్రభావతి పదవక్లాసు పాసవగానే చదువుకు స్వస్తి చెప్పించింది భ్రమరాంబ. పెళ్ళి చెయ్యాల్సిన పిల్లకి యింకా చదువెందుకు అంది-ప్రభావతి పూర్తిగా వంట యింటి పక్షి అయిపోయింది. ఆ పిల్లకి ఏదైనా చెప్పడానికి బెరుకు, భయం-తను వంట చెయ్యను అని చెప్పడానికి ఏదో తెలియని పిరికితనం. ఎప్పుడూ ఇల్లు ఊడ్చడం, అంట్లుసర్దడం, వంట చేయడం, అన్నాలు పెట్టడం, కంచాలు తీయడం-ఇదేపని.

పదిహేనేళ్ళు నిండేసరికి ఆమె వంటలో ప్రావీణ్యత సంపాదించింది. కాని ఆ లేత మనసుకి వంట చేయడమంటే ఒకరకమైన చిరాకు, అసహ్యం బయలుదేరింది. వీలైతే ఆ వంట గిన్నెలన్నీ వీధిలోకి విసిరేసి, పప్పులు, బియ్యాలూ విరజిమ్మేసి, కూరగాయలు గోతిలో పాతేసి, గ్యాసు పూర్తిగా విప్పి చెలిగించేసి ఎక్కడైనా పారిపోవాలని వుంటుంది.

కానీ భయం-, బెరుకు-, అందుకే నోరు మూసుకుని పని చేస్తూనే వుంటుంది. పోనీ కదా అని భ్రమరాంబ ఒక్కపూట కూడా కలియబడి చెయ్యదు. ఎప్పుడైనా చెయ్యాల్సి వస్తుందని భయమేస్తే వెంటనే మంచమెక్కేసి మూల్గడం మొదలు పెడుతుంది.

అందుకే ప్రభావతికి కనిపించే ఒకే ఒక విముక్తి మార్గం పెళ్ళి. తనకి త్వరగా పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోతే ఈ నరకం తప్పుతుంది.-అందుకే నారాయణమూర్తిగారు సంబంధం చెప్తే, వెంటనే ఖాయమయితే బాగుండుననుకుంది.

*** ** *** ***

నారాయణమూర్తిగారొచ్చి పూర్తి వివరాలు చెప్పడంతో రఘు ఈసంబంధానికి మరింత శ్రద్ధ చూపించాడు. అన్నయ్య రామారావు పొడిపొడిగా మాట్లాడి వదిలేశాక, రఘు తనే స్వయంగా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు.

"మూర్తిగారూ! పిల్లకి పనిపాటలొచ్చా?" అన్నాడు.

"నిక్షేపంలావచ్చు. ఒక్కమాట చెప్పనా! ఆ పిల్లకి సవతి తల్లి. ఇంట్లో పనంతా ఈ పిల్లే-"

"నాకు కావలసిందదే. నాకు పెద్ద చదువులు వుండాలనీ, వుద్యోగాలు చెయ్యాలనీ లేదు. నా భార్య చక్కగా యిల్లు సర్దుకోవాలి. సుష్టుగా వంట చెయ్యాలి-, నాకు అన్నీ చేసి పెట్టాలి" అన్నాడు.

నారాయణమూర్తిగారు ఆనందంగా తల ఊపి-

"సరిగ్గా నీకెలాంటి పిల్ల కావాలనుకుంటున్నావో అలాంటి పిల్ల ప్రభావతి. కొంచమే చదువుకుంది. పొద్దునే లేచింది మొదలు పనిపాటలతో బొంగరంలా తిరుగుతుంది."

"సరే. మీ మాటే నమ్మకం. ఖాయం చేయించండి" అన్నాడు రఘు.

అతని మనసు ఆనందంతో పరవశించింది. ఇన్నాళ్ళకి తనకంటూ ఒక ఇల్లూ వాకిలి-,భార్యా యింటి భోజనం-, ఆ ఆనందంలోంచి ఆలోచన గతంలోకి ఒక్కసారి దూకింది.

రఘు పదిహేనేళ్ళ పిల్లాడుగా వున్నప్పుడు అతనికి తల్లి పోయింది. అప్పటికే అన్నయ్యకి పెళ్ళయి పదిన భవాని కాపురానికొచ్చింది. చిన్నప్పుడే తండ్రిపోవడం వల్ల, రఘు భారం రామారావు భవానుల మీద పడింది. నిజానికి డబ్బుకోసం చూసుకోవల్సిన అవసరం లేకపోయినా, మరిదికి పట్టెడన్నం పెట్టి ప్రేమగా చూడటానికి భవానీ విలవిల్లాడిపోయింది. ఆమెకా కుర్రాడ్ని చూస్తే తగని మంట. తన దురదృష్టం కొద్దీ ఆ పిల్లాడు తన మెడకి చుట్టుకున్నాడని బాధపడేది. రామారావు ఏదో లోకం కోసం తమ్ముడ్ని చూసినా భార్యమాటే అతనికి వేదవాక్కు. అతను ఏనాడూ తమ్ముడ్ని అభిమానంగా చూడలేదు. అతని అవసరాలు గమనించలేదు. కలిసి వున్న ఆస్తిలో అవకాశం వున్నంత ఖర్చు పెట్టుకోవచ్చనీ, లెక్కావత్రం అవసరం వుండదని మాత్రమే తమ్ముడ్ని తన పంచన వుండనిచ్చాడు.

భవాని రఘుని తిండి పెట్టక హింసించింది. ఏదో ఆమెకి తోచింది చేసి, చిన్న గిన్నెల్లో పదార్థాలు సర్ది అతనికి వేరే పెట్టేది. అవి రఘుకి చాలినా, చాలకపోయినా బాగున్నా బాగోకపోయినా పాడయిపోయినా పట్టించుకునేదికాదు. రఘు పెదవి విప్పితే 'గయ్'మని విరుచుకుపడేది.

"వెధవ సంతకి చేసి పెట్టలేక చచ్చిపోతున్నాను" అంటూ రాగాలు తీసేది. రామారావు వెంటనే కల్పించుకుని "పెద్దవాళ్ళని గౌరవించటం నేర్చుకో ఒక్క పూట కాస్త తిండి తగ్గితే చచ్చిపోతావా?" అంటూ కేకలేసేవాడు. రఘు దిక్కు చచ్చిపోయి, వారం రోజుల అన్నం సహించక కుమిలిపోయేవాడు. రఘు పెరుగుతున్న కొద్దీ తన స్థితి బాగా అర్థం చేసుకున్నాడు. బాగా చదువుకున్నాడు మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. లాయరు సహాయంతో తన వాటా ఆస్తి తన వైపు తిప్పుకున్నాడు-ఊరికే లోకం దృష్టిలో తనకి అన్నా, వదినా వున్నా తనువంటరి వాడినని తెలుసుకున్నాడు.

అందుకే పెళ్ళి విషయం అన్నయ్య శ్రద్ధ వహించకపోయినా తనే మాట్లాడుకున్నాడు-

రఘు చిన్న వయసులో దెబ్బతిన్నాడు. అందుకని అతనికి రుచిగల భోజనమంటే పిచ్చి-, అతనుదేనికీ ఇవ్వనంత ప్రాముఖ్యం భోజనానికిస్తాడు. అతనిలో తిండి కోరికలు, రుచులు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి.

ఎప్పుడో తల్లి చేసిన వంటకాలు గుర్తుకొచ్చి అతనికి నోరూరుతుంది. అవి బజార్లో దొరి కేవి కూడా కాదు.

అందుకే అతను ప్రభావతిని ఎంపిక చేసు కున్నాడు. చదువు తక్కువైనా, ఎక్కువ కట్నం అడగలేదు. పెళ్ళి చూపులు నిశ్చయం- పెళ్ళి, చకచకా జరిగిపోయాయి.

*** *** *** *** *** ***

మొదటిరోజు ప్రభావతి వంటరుచి చూసి రఘు చకితుడయ్యాడు. ఆరిందాలా అరటికాయ ఆవపెట్టి కూర, దోసకాయ పప్పు- అవియలు- కొబ్బరికాయ పచ్చడి అద్భుతంగా చేసింది.

"అబ్బ! ఇంత అమృతంలా ఎలా చేయ గలిగావు ప్రభా!" అంటూ భర్త మెచ్చుకుం టుంటే ప్రభావతి రెండు మూడు రోజులు పరవశించి పోయింది.

అయితే రోజులు గడుస్తున్నకొద్దీ ప్రభా వతి జీవితంలో మార్పు కొత్తదనం లే కుండా పోయింది. రఘుకి రోజు రోజుకీ తిండిధ్యాస పెరిగిపో సాగింది. అతను జీవితంలో తిండి కిచ్చినంత ప్రాముఖ్యం మరిదేనికీ యివ్వడనే అనుమానం ఆమెకి కలిగింది. నెల్లాళ్ళు గడి చినా అతనెప్పుడూ తన వంట బాగుందని



దేవతావస్త్రాలతో...

తైవాన్‌లో వచ్చే డిసెంబరులో జరగనున్న ఎన్నికలలో, 30 సంవత్సరాల "హ్యు హ్యాయాహొ" అనే మోడల్ పోటీ చేస్తోంది.

ఈమె తన 'నగ్నత్వాన్ని' ఎన్నికల ప్రచార సాధనంగా ఎంచుకొంది. అసభ్య ప్రవర్తనక్రింద ఆమెను చాలాసార్లు జైలులో పెట్టటం, జరిమానా విధించడం జరిగింది. మొత్తం పన్నెండు సీట్లు వున్న తైవాన్ శాసన సభకు ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తోంది.

"సమాజం నగ్నత్వాన్ని అసహ్యించుకుంటుంది కానీ ఈ రాజకీయ కార్యకర్తలు నాకన్నా అసహ్యకరమయిన మనుషులు" అని అంటుంది. "నేను బట్టలు వేసుకోకపోతే మాత్రమేం?" సూటు, బూటు వేసుకుని జనంమీద నుండి నడుచుకుపోయే వాడికన్నా నేనే నయం" అని అంటున్న యీమె ఈసారి చెత్తకుండీల దగ్గర కలుషితమయిన నదివద్ద నగ్న ప్రదర్శన లిచ్చి, తైవాకు ప్రధాన సమస్యగా వున్న కాలుష్యాన్నిగూర్చి ప్రచారం చేయదలచుకున్నట్లు చెప్పింది. "నా శరీరమే నా ఆయుధం. నేను నగ్నత్వాన్ని ఒక మంచి కార్యాన్ని సాధించడానికి వాడుకుంటున్నాను. దానిలో తప్పేముంది?" అంటున్నది హ్యు.

...ుచులు చెప్తూ, లొట్టలేస్తూ భోజనం చెయ్యడమే చూసిందిగానీ- తనతో మరే విధమైన అనురాగ సంభాషణ చేసిన పాపాన పోలేదు. అతను-

"నువ్వెంత బాగుంటావు ప్రభా!" అనెప్పుడూ అనలేదు.

"నీకీ చీర చాలా బాగా నప్పిందిసుమా" అని కూడా ఎప్పుడూ అనలేదు- ఏదో భోజనం చేశాక, యాంత్రికంగా సాగిస్తున్న సంసార జీవితమే తప్ప, కొత్త కాపురంలో వుండే మధురిమలు తామను భవించటం లేదని ప్రభావతి గ్రహించింది. ఆమెలో అసంతృప్తి సన్నని మంటలా గుండెల్లో రగిలింది.

* * * * * * * *

ఆ రోజు రఘు యింటికి ఆలస్యంగా వచ్చాడు, అతనొచ్చేసరికి తొమ్మిదైంది. ప్రభావతి చీకటిపడకుండానే వంటచేసి, స్నానం చేసి నీటుగా తయారై కూర్చుంది. ఎదురు చూసి ఎదురుచూసి నిద్రలోకి జారుకుంది. రఘు తలుపుతడితే వులిక్కిపడి లేచి తలుపు తీసింది. రఘు లోపలికొస్తూ "ఈరోజు ఆఫీసులోపనుండి లేటయింది. అటే ఓ ఫ్రెండ్‌తో మార్కెట్‌కెళ్ళాను. అక్కడచూడు! ఆ కాకరకాయలు వచ్చాయి. తెచ్చాను. వెంటనే కూరచెయ్" అన్నాడు.

"ఇప్పుడా" అంది ఆశ్చర్యంగా.

"ఏం? ఇప్పుడే" అన్నాడు రఘుస్నానానికి వెళ్తూ.

"ఇంత పొద్దుపోయి యిప్పుడు వంటేమిటి? అయినా వంటెప్పుడో అయిపోయింది" అంది విసుగ్గా.

"మరేం ఫర్వాలేదు, చెయ్యి. నాక్కు తినాలనివుంది. తెచ్చాను. ఎప్పుడోగాని దొరకవు"-

"రేపు వండుకుందాం"

"వద్దు. ఇప్పుడే చెయ్"

"ఒకకూర చేశాను" ఏడుపుగొంతుతో అంది.

"రెండుకూరలూ తింటాను. చూడూ! ఇంతసేపు వాదించేకంటే పని మొదలు పెడితే సగంపని అయ్యేది" అంటూ బాత్‌రూములో కెళ్ళిపోయాడు.

ప్రభావతి మూతి ముడుచుకుని కూరచేసింది. రఘు మామూలుగానే ఆప్యాయంగా తిన్నాడుగానీ ప్రభావతి మూడ్ పట్టించుకోలేదు. ఆమెని లాలించలేదు. కాస్త కోపం ప్రదర్శించిన ఆమెకి భర్త తిరస్కారమే మిగిలింది. సుష్టుగా భోంచేసి, గుర్రుపెట్టి నిద్రపోయాడు. ఆమె అవమానంతో దుఃఖపడిపోయింది. నెల్లాళ్ళ వివాహ జీవితంలో రెండు సినిమాలకెళ్ళారు. దానికీ ముందు ఎంతో ప్రిపేరయి, వంట పూర్తిచేసి, మళ్ళీ రాత్రి వచ్చాక వడియాలనీ అప్పడాలనీ అవీ యివీ అంటూ అడిగినవన్నీ చేస్తే అతను సంతృప్తి పడ్డాడు.

ఒకసారి ధైర్యంచేసి "ఈవేళ సాయంత్రం హోటల్లో భోంచేద్దాం" అంది. ఆ ఊహని అతను మొగ్గలోనే తుంచేశాడు.

"ఛాఛా! హోటల్లోనా! నాకు పరమ అసహ్యం. హాయిగా యింట్లో వండుకుని తినక-, హోటలెందుకు డబ్బు దండగకీ-, ఆరోగ్యం చెడటానికీ" అని మామూలుగా వంట చేయించాడు. ఆ క్షణంలో ప్రభావతి పెనం మీంచి పొయ్యిలో పడినట్లు అనుభూతి పొందింది.

* * * * * * * *

రోజు రోజుకీ ప్రభావతి బతుకు దుర్భరంగా ఫీలవడం మొదలు పెట్టింది. ఏదైనా ఊహలోనే వుంటుంది. మనసు వుల్లాసంగా వుత్సాహంగా వుంటే చేసే ప్రతిపనీ సులువుగా వుంటుంది. కానీ మనసు మొరాయించి, అసంతృప్తి చోటు చేసుకున్నప్పుడు గోరంతలు కొండంతలుగా కనిపిస్తాయి. చిరాకు పరుస్తాయి. ప్రభావతి యిలాంటి మానసిక దురవస్థకి గురైంది. ఆమెలో ఎన్నాళ్ళగానో మరుగుపడిపోయిన స్వేచ్ఛతాలూకు వూహ క్షణ క్షణం ఊడలు దిగుతున్న మర్రి వృక్షంలా పెరిగి పోసాగింది. ఎలాగైనా తనీ బాని సత్వం నుండి బయటపడాలి. ఏం? తన కంటూ ఒక యిష్టంలేదూ? తనకి మాత్రం విశ్రాంతి అవసరంలేదూ? ఎప్పుడూ ఎదుటివాళ్ళు చెప్పినట్లు చెయ్యడమేగానీ తనిష్టమంటూ ఎప్పుడూ వుండదా?- ఇలాంటి ఆలోచనలతో మనసు కుతకుతలాడిపోవడం మొదలు పెట్టింది. సవతితల్లి చచ్చేట్టు పని చేయించినప్పుడామెకి సుదూరంలో పెళ్ళి- మొగుడు- సంసారం అనే అంశాలు ఆశలుగా కనిపించేవి. అప్పుడామెంతో పిరికిగా భయంగా వుండేది. ఇప్పుడెందుకో అవన్నీ మాయమై పోయాయి. ఆమెకి భవిష్యత్తు నిప్పంటుకుని తగలబడిపోతున్న పూలతోటలా వుంది- ఏదో ఆరాటం- ఏదో ఆవేశం, బయటపడాలనే తాపత్రయం, తలుపులు బంధించిన గదిలో ఇరుక్కుపోయిన పిల్లిలా ఆమె కర్కశంగా ఆలోచిస్తోంది.

చూసినవాళ్ళకి, విన్నవాళ్ళకీ చాలా స్వల్ప విషయాలుగా కనిపించేవి కొందరికి చాలా సీరియస్‌గా కనిపించి రగిలిపోతారు. అందుకే సమస్యకి వెనుక వ్యక్తి స్వభావం, వారి పెరకువ. వారి ఆర్థిక, సాంఘిక పరిస్థితులు- వారి ఆరోగ్య అనారోగ్యాలూ అన్నీ ముడిపడి వుంటాయి. దీనివల్ల కొందరు ఎదుర్కొనే సమస్యలు మరి కొందరికి చాలా దండుగమారి సమస్యల్లా కనిపిస్తాయి. ప్రభావతి గత జీవితానుభవం, భావి జీవితాన్ని కూడా నాశనం చేయబోతోంది...

రఘు రోజు రాత్రి ఏడుగంటలకి, ఎనిమిది గంటలకొచ్చి తనక్కావలసిన పెసరట్లు చెయ్యమని, పకోడీలు చెయ్యమని, పనసపొట్టు కూర చెయ్యమని వేధించటం మొదలుపెట్టాడు. అతనిలో ఇన్నాళ్ళూ నిద్రాణంగా వున్న తిండి మీద కోరికలు కాలనాగులై బుసలుకొట్టడం మొదలుపెట్టాయి.

'తనిష్టం. తనకి కావలసినవి తను అడిగి చేయించుకుంటాడు తప్పా?' కనీసం తిండిలోనైనా తృప్తి లేకపోతే యిక జీవితం ఎందుకు? అయినా తనెందుకు సర్దుకుపోవాలి? ఇన్నాళ్ళూ తన కోసం ఎవరూ దేనికీ సర్దుకుపోలేదు.- అందుకే పెళ్ళి చేసుకున్నాడు.- రఘు ఆలోచనలకి అదుపూ, ఆజ్ఞ లేకుండా సాగేవి. అంతేగానీ సాటి మనిషి కష్ట సుఖాలుగానీ, ఆమె మానసిక స్థితిగానీ,

భర్తగా తన బాధ్యతగానీ అతనికి స్ఫురించలేదు.

*** ** *** ** *** ** ***

ఆ రోజు ప్రభావతి పూర్తిగా మొండి కేసింది.

"నేను చెయ్యను" అని ధైర్యంగా చెప్పింది.

"ఎందుకు చెయ్యవు? చేసి తీరాలి" అని అతను నిలవేశాడు.

"నాకీ వేళ వంట్లో బాగుండలేదు" అంది.

"బాగుండకపోతే కొంచెమే చెయ్యి. వంట చెయ్యకపోతే నా భోజనం ఎలా?" అన్నాడు.

"ఏమో?" అంది.

"ఏమో అంటే కాదు. ఒక గంట కూడా పట్టదు. చేసిపెట్టు నే వెళ్ళిపోయాక పడుకో- నేను సాయంత్రం దాకా రాను" అన్నాడు.

"నేను చెయ్యలేను. అని చెప్తుంటే"-

"అదే ఎందుకు అంటున్నా"-

"ఏం? నేనెప్పుడూ అలా చెప్తున్నానా."

"ఎప్పుడూ చెప్పడానికి వీల్లేదు. ఏం? ఆడదానివి వంట చేయడానికి ఏడ్చి చస్తావేం? వంట తప్పిస్తే నీకింకో పనేముంది? ఆడ దంటే వంట చెయ్యడానికే వుందని నీకు తెలీదా?" అంటూ ఎగిరాడు. ప్రభావతికి ఒళ్ళు మండిపోయింది.

"ఆడది వంట చెయ్యడానికే లేదు. అలా మీరనుకుంటే అది మీ ఖర్మ. మీకు వంటమ నిషే కావాలనుకుంటే పెళ్ళెందుకు చేసుకున్నారు? ఒక్క చక్కని వంటవాణ్ని పెట్టుకోక పోయారా" అంటూ తారస్థాయినందుకుంది ప్రభావతి.

రఘు ఆవేశంతో ఊగిపోయాడు. ఆడ దానికింత అహంకారం కూడదన్నాడు. తాడో పేడో తేల్చేస్తానన్నాడు. 'నా ఖర్మ' అనేదాకా వచ్చావా అంటూ ఎగిరాడు. 'చదువు తక్కువగా వుంటే బుద్ధిమంతురాలవనుకున్నాను' అంటూ నిందించాడు. ఇంకా ఎన్నెన్నో మాటలు అన్నాడు.

ప్రభావతి మనసు పూర్తిగా విరిగిపోయింది. మనుషుల మధ్య బంధాలు పెంచేవైనా, తెంచేవైనా మాటలే-మాటలు వలనే ఒకరియందొకరు అనురాగాన్నీ, అసహ్యాన్ని ఏర్పరచుకుంటారు. మాటమీద మాట పెరిగితే, పంతాలు, అహంకారాలు రగిలితే మహా సామ్రాజ్యాలే కూలిపోతాయి. ఇక మామూలు సంసారాలనగా ఎంత?

*** ** *** ** *** ** ***

వెక్కి వెక్కి ఏడుస్తున్న ప్రభావతి తల మీద నెమ్మదిగా నిమిరి "ఏమిటమ్మా ప్రభావతీ! ఇది...నువ్వు కొంచెం ఓర్పుగా వుండాలమ్మా" అన్నారు నారాయణమూర్తిగారు.

"అవునండీ బాబయ్యగారూ! నా జీవితం యిలా అయిపోతుందని నేనూ అనుకోలేదు. మీకు తెలుసో తెలీదో, పుట్టింట్లో వున్నంత కాలం వంట యిల్లు మెడకి కట్టారు. నోరు మూసుకుని చేశాను. అప్పుడు నాకు ఆశ-పెళ్ళి. కానీ ఇప్పుడు చూడండి! అదేమి దరిద్రమో ఎప్పుడూ తిండీ తిండీ, ఎంత చేసినా పెట్టినా తృప్తి లేదు. ఆ కోరికలకి అంతులేదు. ఒక వేళాపాళాలేదు.-ఎదుట వున్నది కూడా మనిషేనన్న ధ్యాసలేదు. పైగా ఆడదానికి వంట చేయడమే పనిట. చేయననేహక్కు లేదట. మీరే చెప్పండి! ఒక వంట మనిషినే వుండదల్చుకుంటే ఇంత కష్టపడి పెళ్ళి చేసుకోవడ మెందుకు?-ఎక్కడైనా వంట లక్కగా కుదిరితే ఇంత జీతమిస్తారు. వాళ్ళ పనివాళ్ళకి చేశాక నాకు కావలసినంత మానసిక

స్వేచ్ఛ. ఇలా జీవితాంతం బానిసత్వం వుండదుగా-, మనసు చంపుకుని, గొడ్డు చాకిరీ చేస్తూ సేవలు చేస్తుంటే ఆడది కేవలం వంట చేయడానికే అనడం తప్పు కాదూ? బాబయ్యగారూ! మీరే చెప్పండి.- నాకెప్పుడూ వంట్లో బాగుండకపోకూడదట. ఎప్పుడూ బద్ధకంగా వంట చెయ్యడం విసుగ్గా అనిపించకూడదట. నేను మనిషినికానా?" ఏడుస్తూ, ఆవేశంగా చెప్పింది ప్రభావతి. నారాయణమూర్తిగారు ఆశ్చర్యంగా, చూస్తూండిపోయారు. ఇలాంటి సమస్య ఒకటి వుంటుందని, అదీ ఒక సమస్య అని ఆయనకిప్పుడే తోచింది.

*** ** *** **

"మీరే చెప్పండి. చిన్నప్పటి నుంచి అమ్మపోయి తిండీ తిప్పలూ లేక నానా అవస్థలూ పడ్డాను. ఇన్నాళ్ళకి నాదంటూ యిల్లు ఏర్పడింది. అదీ యిదీ కావాలని అడిగితే నానామాటలూ అంటుందా? నేను ముందేచెప్పాను. చెప్పానా లేదా? నాకు పెద్ద చదువులు చదువుకున్న అమ్మాయి అవసరంలేదు. ఇల్లు వాకిలీ సర్దుకోవాలి. నాకు కావలసినవి చేసి పెట్టాలి-అని" అంటూ రఘు నిక్కచ్చిగా అడుగుతుంటే, నారాయణమూర్తిగారేం మాట్లాడలేకపోయారు. అతను చెప్పింది అతని దృష్టిలో నిజమే కదా!

*** ** *** ** ***

ఇప్పుడేం చెయ్యాలి? నారాయణమూర్తిగారు తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టారు. వంద అబద్ధాలాడి పెళ్ళి చేసేరోజులు కావివి. జరిగిన పెళ్ళిని నిలబెట్టడానికి ఎన్నో వాస్తవాల్ని నిరూపించాల్సిన రోజులివి- ప్రభావతిని ఆదరించి ధైర్యం చెప్పి, లాలించి మార్గం చూపే తల్లి లేదు.- అంతా పెంకిపిల్ల కాపరం వదులుకుంది అంటారు ఆమెని.- ఆమె పెంకి పిల్ల కాదు.

మూర్ఖుడు పెళ్ళాన్ని ఎలా చూసుకోవాలో తెలీదు అంటారు రఘుని- అతను మూర్ఖుడుకాడు-వారి బాల్యాలలో వారిమీద పడిన రాక్షస ముద్రలు అలాంటివి. ఊహలతో వుద్రేకాలతో తెగేవరకు లాగే ఈ యిద్దర్నీ ఆదుకోవాలి. ఈ కాపురం నిలబెట్టాల్సిన నైతిక బాధ్యత నాకుంది అనుకున్నారు నారాయణమూర్తిగారు.

*** ** *** ** ***

నారాయణమూర్తిగారి భార్య సుశీలమ్మగారు విషయమంతా విని విలవిల్లాడిపోయింది.

"ఏమండీ నేనొకటి చెప్తాను వినండి. వారిద్దరినీ మనింటికి ఓ పదిరోజులుండేలా రమ్మని ఆహ్వానించండి. వారిద్దరూ నా దృష్టిలో పసిపిల్లలు. మన పిల్లలలాంటివారే. వారిద్దరికీ తెల్సిచేసినా తెలియక చేసినా ఇద్దరు స్త్రీలే ద్రోహం చేశారు. నేను ఒక స్త్రీగా వారి మనసులు కలపటానికి ప్రయత్నం చేస్తాను." అన్నారామె దృఢంగా.

రెండురోజులు పుట్టింట్లో వుండేసరికి ప్రభావతికి నరక ప్రాయంగా వుంది. సవతి తల్లి బాహాటంగానే సాధించడం మొదలుపెట్టింది.

"ఏమోనమ్మ! ఎక్కడా కనీ వినీ ఎరుగం! వంటచెయ్యడం విసుగంటే ఆడదానికెలా గడుస్తుందిట. మేమంతా చేసుకోవడం లేదూ; మరి రోజూ వంటే చేస్తున్నాం. ఏమోనమ్మ.. వంట చెయ్యమన్నాడని పుట్టింటికి వెళ్ళిపోదామని ఎప్పుడూ వూహే రాలేదు-, సాగితే సరి. ఏవైనా చేస్తారు...హూ. ఏమైనా అంటే సవతి తల్లి అని నన్నాడిపోసుకుంటారు. ఇప్పటికే వచ్చిన చెడ్డపేరు చాలు. పనిపాటలు నేర్పకుండా సోమరిలా పెంచింది అని అంటున్నారు. ఏమోనమ్మా! తల్లి లేని పిల్లని అపురూపంగా చూశానే గానీ, ఇలా నాకే ఎదురొస్తుందనుకోలేదు...." ఇలా సాగుతూనే వుంది భ్రమరాంబ ధోరణి.

ప్రభావతికి కడుపు మండిపోయింది. అసహాయత దుఃఖంగా మారి కన్నీరు వరదలైంది. సరిగ్గా అప్పుడే నారాయణ మూర్తిగారొచ్చి పిల్చారు. వెంటనే తండ్రికి చెప్పి చిన్న సంచీ తీసుకుని ఆయనతో బయలుదేరింది.

* * *

రఘు విసుగ్గా కూర్చున్నాడు. రెండు రోజులుగా హోటలు భోజనం జిహ్వ చచ్చిపోయింది. పెళ్ళి అయిన రెండు నెలలైనా కాకుండానే ఇలా జరిగిందేమిటా అని బాధగా వున్న సమయంలో వదిన భవానీ పరుగెట్టుకొచ్చింది.


"ఏమిటోయ్ ఇది. మనింటావంటా లేదు-, కొంత సర్దుకుపోవాలి. ఎప్పుడూ ఒకలాగే సాగుతుందా నేనైతే, అయ్యో మన పిల్లాడని రాత్రనక, పగలనక నీకోసం ప్రత్యేకం చేసి పెట్టేదాన్ని అయినా ఆ పిల్ల కంత పొగరేమిటి మరీనూ" అంటూ సానుభూతి వాక్యాలు, సాధింపులు, సొంతడబ్బాలు, పుల్ల లెక్కించడాలు- అన్నీ చేసి వెళ్ళింది.

సరిగ్గా అప్పుడే నారాయణమూర్తిగారు వచ్చి రఘుని ఆప్యాయంగా పలకరించి "మా యింటికి రావోయి. నాలుగు రోజులుండి వద్దువుగానీ అంటూ బలవంతం చేశారు. రఘు బయలుదేరాడు-

చిత్రం ఇద్దరూ అక్కడొకర్ని ఒకరు చూసి ఆశ్చర్యపడ్డారేగానీ అసహ్యంచుకోలేదు.

* * *

రఘుకి, ప్రభావతికి చచ్చిపోయిన తమ తల్లులిద్దరూ సుశీలమ్మగారి రూపంలో వచ్చి నట్లనిపించింది. ఆదరణకరువైన ఆ ఇరు హృదయాలు ఆప్యాయతను చవిచూశాయి. సమయం చూసి "నాయనా రఘూ! ఇది జీవితం. ప్రతిదానికీ తొందరపడితే కుదరదు. మీ యిద్దరూ విడిపోతే మిమ్మల్ని హేళన చేసి వినోదించే వారే ఎక్కువ. మీరు సర్దుకుపోలేని దారుణమైన పరిస్థితులుంటే ఏమైనా కలిసే వుండమని నేనూ చెప్పను. కానీ ఒక్కటి. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తులు





స్త్రీలలో ధూమపానం....

ధూమపానం చేసేవారిలో స్త్రీల సంఖ్య ఎక్కువైపోతున్నదట. ఈ ధూమపానం ద్వారా స్త్రీలు అనేక వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారని ప్రపంచఆరోగ్యసంస్థ (హూ) ఆందోళన వెలిబుచ్చింది.

బ్రిటన్‌లో అత్యధిక శాతం స్త్రీలు ఈ ధూమపానం కారణంగా ఊపిరి తిత్తుల క్యాన్సర్‌కు గురవుతున్నారని ఆ సంస్థ ఒక నివేదికలో తెలియజేసింది. 1960 - 80 ప్రాంతాలమధ్య ఈ క్యాన్సర్‌వల్ల మరణించినవారిలో ఎక్కువ మంది స్త్రీలేనట. అన్ని రంగాలలోను పురుషులతోపాటు సమానంగా స్త్రీకూడా ముందంజలో వుండాలన్న విషయంసమంజసమైనదైనా ఈ ధూమపానం విషయంలో మాత్రం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభానికిముందే స్త్రీలలో ప్రారంభమైన ఈ ధూమపానం ఇంగ్లండ్, వేల్స్‌దేశాలలో రొమ్ము క్యాన్సర్‌ద్వారా అనేక మందిని బలితీసుకుందట.

ప్రపంచవ్యాప్తంగా అనేకమంది స్త్రీలు ధూమపానానికి అలవాటుపడ్డారు. అంతేగాక 'హూ' 20 దేశాలలో జరిపిన సర్వేలో బాలురకంటేకూడా బాలికలే ఈ ధూమపానరంగంలో ముందంజవేస్తున్నారని తేలింది.

తమ గొప్పదనాన్ని చాటుకోవాలనో, లేక అదే తమ సంస్కృతి అని తెలియజేయాలనో పట్టణ ప్రాంతాల్లోని స్త్రీలు ధూమపానానికి అలవాటుపడిపోతున్నారని 'హూ' అధికారి ఒకరు వాపోయారు.

పారిశ్రామికదేశాలలో ఈ ధూమపాన జబ్బు మగవారిలో తగ్గిపోతుండగా ఆడవారిలో పెచ్చుపెరిగిపోతోందట.

40 దేశాలలో 'హూ' సర్వే జరుపగా పది దేశాలలోని స్త్రీలే ఎక్కువగా ధూమపానానికి అలవాటుపడ్డారని వెల్లడయింది.

భారతదేశంలో పొగాకు నమలటం అనే అలవాటు నోటి క్యాన్సర్‌కు కారణమవుతుండగా, పొగత్రాగేవారి ప్రక్కన ఆ పొగను పీల్చేవారికికూడా ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయని, ముఖ్యంగా ధూమపానం చేసే భర్తలవల్ల వారి భార్యలకు క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులురాగలవని 'హూ' పేర్కొంటోంది.

సిగరెట్ పెట్టెలమీద వుండే నినాదం - 'పొగ త్రాగుట ఆరోగ్యానికి హానికరం'- వ్యర్థంకాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా వుంది. మరి ఈ నినాదాన్ని గుర్తుచేస్తూ హెచ్చరించాల్సిన స్త్రీలే ధూమపానానికి అలవాటుపడి ప్రాణాలపైకి తెచ్చుకోవటం ఎంతవరకు సమంజసం? ●

కలిసి బతకాలనుకున్నా కొంత కాంప్రమైజ్ కాక తప్పదు. ఈమెని కాదని మరొకామె దగ్గరికి వెళ్ళినా, అక్కడా మరేదో సర్దుబాటు తప్పదు. ప్రభావతి చిన్న పిల్ల. చిన్నప్పటినుండి ప్రేమాభిమానాలు కరవైపోయి గొడ్డు చాకిరీ చేస్తూ వచ్చింది. ఆమెని ఆదరించి ప్రేమించాల్సిన బాధ్యత నీకుంది. ప్రేమతో జయించలేనిదేదీలేదు" నారాయణమూర్తిగారు. రఘు తలొంచుకుని నెమ్మదిగా అన్నాడు "నేనూ అదే ఆలోచిస్తున్నాను. మీరు నాకెంతో మెత్తగా స్పష్టంగా చెప్పారు. నేనూ జాగ్రత్తగా వుంటాను. ప్రభావతిని జాగ్రత్తగా చూసుకుంటాను" అన్నాడు. నారాయణమూర్తిగారు ఆనందపడిపోయారు.

* * * * * * * *

చూడమ్మా! ప్రభావతీ! నువ్వు చిన్న పిల్లవు. లోకం తెలీదు పెళ్ళి అనేది తెంచుకోవడం ఏమంత కష్టంకాదు. కానీ బంధం నిలుపుకోవడమే కష్టం. రఘు మంచి కుర్రాడు నీలాగే చిన్నప్పుడే తల్లి పోయి, ప్రేమాభిమానాలకు నోచుకోలేదు. హాయిగా తిని తిరిగే వయస్సులో తిండికి బాధపడ్డాడు. వదిన గయ్యాళి.అందువల్ల కొంచెం తొందరపడి నిన్నిబ్బంది పెట్టినా, నోటి రుచి కోసం అవీ యివీ అడిగినా నువ్వుసర్దుకోవాలి, అతన్ని ప్రేమించి అతనితో జీవించటం నీ ధర్మం. భర్తే దైవమనీ, వాడెంత దుర్మార్గుడైనా వాడి పాదసేవే చెయ్యాలనీ నేనెప్పుడూ అనను.

అది చాలా తప్పుడు భావన. కానీ స్త్రీ పురుషులు ఇద్దరూ ఒకరితో ఒకరు కలసి బతకాలనుకుంటె ఎంతో కొంత ఓర్పు, సహనం కావాలి. ఇద్దరికీను. అతన్నికాదని మరొకరి దగ్గరికి చేరినా, అక్కడకూడా ఏవో లోటుపాట్లు వుంటాయి. సర్దుకోక తప్పదు! సుశీలమ్మగారు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభావతి తలొంచుకుంది. నెమ్మదిగా అంది "పిన్నిగారూ! నిజమే మీరు చెప్పింది నేను అర్థం చేసుకున్నాను. ఆ సమయంలో చిరాకేసి అలా అన్నాను. రెండు రోజులుగా బాధగానే వుంది. మీ యింటికి పిలవడం వల్ల కాస్త మనశ్శాంతి లభించింది. నేను జాగ్రత్తగా సర్దుకుంటాను. మా అమ్మే మీ రూపంలో వచ్చి నాకు చెప్పిందనుకుంటాను" అంది.

సుశీలమ్మగారు మనసు ఆనందంతో పరవశించిపోయింది.

* * * * * * * *

మూడు రోజులు సుశీలమ్మగారు కమ్మగా వండి నూతన వధూవరులకిద్దరికీ వడ్డించింది. కారణాలు చిన్నవి. కలతలు చిన్నవి. దుడుకు వయసు పిల్లలకి మనసు విప్పుకునే అవకాశం వుండాలి. ఆదరణ వుండాలి. భార్య మీద భర్తకి భర్త మీద భార్యకీ కొండేలు చెప్పని సంస్కార వంతులైన వారి సాంగత్యం వుండాలి. అప్పుడు ఎన్నో కూలిపోయే సంసారాలు నిలబడతాయి.

ఆ రోజు కనుచీకటి పడేవేళ ప్రభావతి భర్తతో "ఎప్పుడెళ్దాం మనింటికి" అంది.

"నీ యిష్టం" అన్నాడు మెరిసేకళ్ళతో రఘు.

"రేపు వుదయం వెళ్దామా" అంది ప్రభావతి స్నేహంగా.

రఘూ ప్రభావతి తమ కాళ్ళకి మొక్కుతుంటే ఆ దొడ్డ మనసు పెద్దవాళ్ళు "దీర్ఘాయుష్మాన్ భవా!!" అన్నారు.

వారిద్దరు మాత్రం- దేశానికి నారాయణమూర్తిగారు సుశీలమ్మగారి లాంటి వారు ఏ యిద్దరున్నా చాలు అనుకున్నారు మనసులో. ●

యువతా! కవితా!!

నేను ఎవర్ని?

ఆడవారిపాలిట
శాపాన్ని
మగవారిపాలిట
వరాన్ని
ఇచ్చేవారికి
దుఃఖం
పుచ్చుకొనేవారికి ఆనందం!
అత్తలపాలిట ఆశాదీపాన్ని
కోడళ్ల జీవితాన్ని
మట్టుపెట్టే
మారణహోమాన్ని
ఇంతకీ నేను ఎవర్ని?
ఇంకెవరిని
వరకట్నాన్ని . !

— కె. సత్యవల్లి

నేను నా చదువు

చదవాలని కోరిక
చదువుకోవడానికి లేదు తీరిక
కూలి చేస్తే కూడు తింటా!
అచ్చరం నేరిస్తే పస్తుంటా!!
ఏది ముందు? ఏది వెనుక?
ఆలోచిస్తే అనంతం
రెండింటికీ ఆలస్యం!
నావంటి జన్మ ఎత్తకురా
సమస్యల సుడిగుండం ఈదకురా!
ఎత్తాను నీచపు జన్మ
అనుభవించాను ఖర్మ! ఖర్మ!!
ఇక చాలిస్తా నాతనువు
అర్పిస్తా ఈ అసువు!

— కె. బాలసుందరం

కలికి మనసు

అందాలుచిందే రూపాన్ని
బంధాలు మాయం చేయవచ్చు!
కన్నుల్లోని మిసమిసలు
కాలానికి మసకలు కమ్మవచ్చు!
కమ్మనైన కోకిల కంఠం
గ్రాస కషాయ కలుషితం కావచ్చు!
కలికిరో నీ మనసు
కలకాలము నిలుచు!

— కాళిదాసు సుబ్బలక్ష్మి

జీవితం

రాత్రి వచ్చింది నాకో కల
ఆ కలలో రాళ్ళు రప్పలతో నిండిన జీవనది
ఆ నదిపై సమాంతర రేఖల్లా రెండు రైలు పట్టాలు
పట్టాలపై జీవితమనే రైలుబండి—
ఆ పట్టాల అంచున పట్టుకొని చేరాలి ఆ దరి
చేరగలిగితే అది స్వర్గం
పట్టు తప్పి పడిపోతే అది నరకం!

— ఎ. వి. ఎస్. ఎస్. మూర్తి

మంచి కవి కావాలంటే ఏం కావాలి?

ఆధునిక కాలంలో పద్య కవిత్వానికి జవజీవాలు కల్పించిన సంప్రదాయ సాహితీమూర్తి శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి. ఆయన 'తమ పాండిత్య స్వభావాలచేత మామిడికొమ్మ నుంచిన పంచలోహ కలశంలా' వుంటారన్నమాట అక్షరాక్షర సత్యం. మధునాపంతులవారి "ఆంధ్ర పురాణం" రసరమ్య పదకోశంగా పేరొందింది. "ఆంధ్ర రచయితలు" పరిశోధకులకు కరదీపిక అయింది. ఆయన గళం విప్పి పద్యం పాడితే తెలుగుదనం ఉట్టిపడుతుంది. ఆ మేధానిధితో కాసేపు జరిపిన సంభాషణం యిది.

★ మీలో కవితా వ్యామోహం, సాహిత్యాభిలాష ఎలా ఏర్పడిందో చెప్పగలరా?

మా స్వగ్రామం కాకినాడ దగ్గర పల్లిపాలెం. అక్కడికి దగ్గర్లోవున్న ఇంజరం పాఠశాలలో చదువుకొంటూ వుండేవాడ్ని. తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారిది కూడా ఇంజరమే. విద్వత్కవులైన రామకృష్ణ కవుల్లో ఒకరైన ఓలేటి వెంకట్రామశాస్త్రిగారిదీ మావూరే. ఆయన మాకు బంధువు. పాఠశాలల్లో నా గురువులంతా హేమాహేమీలు. ఉద్దండ పండితులు. చిన్నప్పటినుంచే మా నాన్నగారు భారత భాగవతాలనుంచి పద్యాలు కంఠస్థం చేయించేవారు. అప్పట్లో ఆ ప్రాంతం - ఆ కాలం అంతా సాహిత్యమయం అనుకోండి. అటువంటి వాతావరణంలో ఉన్న నాకు కవిత్వంపట్ల, సాహిత్యంపట్ల మక్కువ ఏర్పడటంలో ఆశ్చర్యం ఏముంది?

★ అసలు మీరు పద్య రచన ఎప్పుడు ప్రారంభించారు? మీ తొలి కావ్యం ఏది?

పదో సంవత్సరంనుంచే వెర్రి మొర్రి పద్యాలు, అనుష్టుప్పులు రాస్తుండేవాడ్ని. అయితే తప్పులుండేవి. శతావధాని ఓలేటి వెంకట్రామశాస్త్రిగారే నాకు కవితా గురువులు. ఆయన నా పద్యాలు దిద్దేవారు. మేమిద్దరం "పద్య లేఖలు" రాసుకొనేవాళ్ళం. నా మొట్టమొదటి కావ్యం "తోరణం". ఇది 1938లో వెలువడింది. అంటే అప్పటికి నా వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు.

'ఆంధ్ర' అంటే ప్రాణం

★ మీ రచనలలో 'ఆంధ్ర పురాణం' విమర్శకుల, పండితుల ప్రశంస పొందిందికదా. ఆ రచనకి ప్రేరణ ఏమిటో వివరించండి?

నాకు కూడా "ఆంధ్ర పురాణం" అభిమాన పాత్రమైన కావ్యం. నా సర్వస్వాన్ని అర్పించి అది రచించానని నా నమ్మకం. చిన్నప్పటినుంచి నాకు 'ఆంధ్ర' శబ్దం మీద వల్లమాలిన అభిమానం. ఆంధ్రులు చరిత్రోజ్జ్వలులుగదా! ఆంధ్రుల సమగ్ర



చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని ఎందుకు రాయకూడదు? అనిపించింది. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు, శ్రీపాదవారు నన్ను

మధునాపంతులవారి కవితా సౌరభం!

ప్రోత్సహించారు. 1946లో ప్రారంభించిన "ఆంధ్ర పురాణం" 1964కి పూర్తయింది.

★ మీరు సంపాదకత్వం వహించిన సాహిత్య పత్రిక "ఆంధ్రి" గురించి తెలియజేస్తారా?

తప్పకుండా. నేను పంథొమ్మిదో సంవత్సరంలో వుండగా 1939 మార్చిలో 'ఆంధ్రి' పత్రికను నడిపాను. మొదట్లో శ్రీ రాజా కాకర్లపూడి బుచ్చి కృష్ణమరాజుగారు పత్రికకు పోషకులుగా ఉండేవారు. అప్పుడు రీము కాగితం ధర పది రూపాయలు! పత్రిక సంవత్సర చందా (మాస పత్రిక) రూపాయి వుండేది. పత్రికలో పడిన రచనల మంచి చెడుల గురించి క్లుప్తంగా "ఫుట్‌నోట్స్" రాసేవాడ్ని. ఆనాటి పెద్దల కవితలు, వ్యాసాలు ప్రచురింపబడేవి. అయితే అది మూడు సంవత్సరాలే నడిచింది.

కవిత్వం - పద్యం

★ ఈనాడు కూడా పద్య కవిత నిలబడుతుందనుకుంటున్నారా? అసలు పద్య కవిత అవసరం వుందా?

కవిత్వంయొక్క అవసరం అంటూ వుంటే పద్య కవిత్వంయొక్క అవసరమూ వుంటుంది. పద్యాన్ని చదివి, విని ఆనందించేవాళ్ళ సంఖ్య బాగావుంది. పద్య కవిత్వంపై మోజు తగ్గలేదు. పద్య కవుల్లో ప్రతిభావంతులున్నారు. అసలు ఏ రచన అయినా నిలవటం, నిలవకపోవటం అన్నది 'రచన'మీద ఆధారపడి వుంటుంది. రసంమీద ఆధారపడి వుంటుంది. రసవత్కవిత అయితే తప్పక నిలుస్తుంది. పద్య కవిత కానిదంతా మాత్రం నిలబడుతుందా?

★ ఆధునిక కవులమీద - నేటి కవిత్వంమీద మీ అభిప్రాయం?

ప్రాచీన నవీన భేదాలు లేవని నా అభిప్రాయం. ఏ కవిత్వానికైనా ప్రయోజనం "జగద్ధితమే", "విశ్వ శ్రేయస్సే". ఆధునిక కవిత్వం పట్ల, ఆధునిక కవులపట్ల నాకు వ్యతిరేకభావం లేదు. అయితే సంప్రదాయ సాహిత్యపు పునాది లేకపోతే ఆధునిక కవిత్వంలో కూడా రాణించలేరు. శ్రీశ్రీ, దాశరథి, ఆరుద్ర, శేషేంద్రశర్మ, నారాయణరెడ్డి– వీరంతా ప్రాచీన సాహిత్యాన్ని చదివి ఆకళింపుచేసుకొన్నవారు కాబట్టే మంచి కవులయ్యారు. నేను శ్రీశ్రీ మహాప్రస్థానం పూర్తిగా చదివి ఆనందించాను కూడా.

★ కవులకి విమర్శకులకి మీ రిచ్చే సలహా ఏమిటి?

సలహా కాదు - నా సూచనలు, ఛందోధిక్కారం మాత్రం చేయకూడదు. ఛందస్సు మీ కిష్టం లేకపోతే రాయకండి. రాసేవాడ్ని రాయనివ్వండి. సాహిత్య రంగంలో వున్న వాడికి వ్యుత్పత్తి, ప్రతిభ అవసరం. డిగ్రీల చదువువల్ల లాభం వుండదు. తెలుగు సాహిత్యం గురించి విమర్శించేవాళ్ళకి ఇంగ్లీషు, సంస్కృత భాషా సాహిత్యం, జ్ఞానం వుండాలి. నిరంతర అధ్యయనం వుండాలి. సంప్రదాయ సాహిత్య జ్ఞానం వున్నప్పుడే మంచి కవి లేదా మంచి విమర్శకుడు కాగలడని నా అభిప్రాయం.

"తెలుగు దల్లికి నూడిగమ్ముల నొనర్చి
యామె ఋణమును దీర్చికొమ్మయ్య! తల్లి
యప్పుదేర్పని పుత్త్రకుండ నెడు నింద
జెంద నేటికిఁ దమ్ముడా! సిగ్గు సిగ్గు"

అని చిన్ననాటనే పలికిన ఆ కళా ప్రపూర్ణునికి నమస్కరించి సెలవు తీసుకొన్నాను.

–ద్వా. నా. శాస్త్రి

సీరియల్

శత్రుసంహారం

లల్లాదేవి

(గతసంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ –15 : వైమానిక దళపైలట్ రాహుల్ తల్లి, భార్య కారు ప్రమాదంలో మరణిస్తారు. కుమార్తె సుషుమ్న దగ్గరవున్న ఎలక్ట్రానిక్ ఇండికేటర్ వంటి పరికరం వల్లనే సంపత్ మాస్టారి కుటుంబం విచ్ఛిన్నమైందని తెలుసుకున్న రాహుల్ తన కుటుంబ సభ్యుల మరణానికి సంబంధించిన వివరాలను సేకరిస్తుంటాడు. ఈలోగా కొరవెల్లి విమాన ప్రమాదానికి సంబంధించిన క్రూబాక్స్‌లోని ఇండికేటర్‌ను దొంగిలించిన దుండగుల కోసం దర్యాప్తు జరుపుతున్న ఎ. ఎస్. పి. కారంత్ హత్యకు గురవుతాడు. సుషుమ్నను కిడ్నాప్ చేసిన దుండగులు ఇండికేటర్ గురించి ఆరా తీసి విఫలమవుతారు. సుషుమ్న అలయన్స్ సంస్థ అధినేత దేవీప్రసాద్ దగ్గరకు చేరిందన్న విషయాన్ని రాహుల్ దుండగుల ముఠాలోని వ్యక్తి ద్వారా తెలుసుకుంటాడు.

ఆ గదిలో అగరు ధూపం పరుచుకుపోయి వుంది. భక్తులందరికి 'అవెస్తా' గ్రంథాన్ని చదివి అర్థాన్ని వివరిస్తున్నాడు దేవి ప్రసాద్!

వారంతా భక్తి తన్మయ భావంతో కూర్చున్నారు.

"పంచభూతాలలో అగ్ని చాల గొప్పది. కాబట్టి దాన్ని పూజించాలి. అగ్నిని పూజించే ఆర్యులు చాల గొప్పవారు. వారు జలాలను వ్యవసాయానికి ఉపయోగించుకుంటారు. పరిస్థితులను సాంకేతికమయిన పద్ధతులలో కావలసిన దారికి మళ్ళించుకుంటారు.

పృధివి పంటలను ఇస్తుంది. వాయువు జీవనాధారం ప్రాణు లకు. ఆకాశం నించి శబ్దం పుడుతుంది" ఈ విధంగా కొనసాగిన అవెస్తా ప్రవచనం ఆగిపోయింది.

"ఆకాశానికి కూడ ఉనికి ఉందా? అది కూడ ఒక పదార్థమేనా? దానికి ద్రవ్య రాహిత్యం వుందా?" అని సందేహాన్ని బయటపెట్టింది ఒకామె.

ఆమె వంకను తలత్రిప్పి చూచాడు దేవి ప్రసాద్!

అతని బోధనలు వినటానికి గొప్పవారే వస్తారు. ఆమె కలవారి కోడలు! ఇంకా పిల్లలు లేరు. చాల అందంగా వుంది.

ఆమెను దగ్గరగా పిలిచాడు. తలమీద చేయిపెట్టి ఆశీర్వదించాడు. "నీవు ఈ రాత్రికి ప్రొద్దుపోయినతరువాత నేను పూజ ముగించే సమయానికి నా దగ్గరకు రావాలి. అప్పుడు చెప్తా నీ ప్రశ్నకి సమాధానం" అన్నాడు దేవి ప్రసాద్. ఆమె అలాగే అని తల వూగించింది అమాయకంగా.

"ఒంటరిగానే రావాలి సుమా!" అన్నాడు దేవి ప్రసాద్.

"అదేమిటి స్వామీ, మావారిని తీసుకు వస్తాను"

"అలా తీసుకురాకూడదు చిట్టితల్లీ! ఒంటరిగా రావాలి"

"కాని చీకటిలో ఒంటరిగా...." భయాన్ని వెల్లడించింది.

"జ్ఞానం ఉన్నచోట వెలుగువుంటుంది. చీకటి అనేది లేనేలేదు"

"మీరు చెప్పే పవిత్ర వాక్యాలు మావారు వింటారు"

"పిచ్చిదానా! భర్త ఏమిటి? భార్య ఏమిటి? సద్గతులు వెతుక్కునే అన్వేషణ ప్రారంభమయినతరువాత ఎవరి దారి వారిదే! ఎవరి స్వర్గం వారిదే! నువ్వు ఒంటరిగా రా! ఆ నరుడు తన తాపత్రయంలో తానుంటాడు. అదే వాడికి మోక్షం"

"అలాగే స్వామీ! ఒంటరిగానే వస్తాను" అందా కొత్త కోడలు.

అంతటితో తన ప్రవచనం పూర్తి అయింది. ఎవరిదారిన వారు పోతున్నారు. అందరూ పోయాక కొందరు మిగిలారు. వారు అంతసేపూ భక్తజనంలో కలిసిపోయి కూర్చుని ఉన్నారు.

బయటివారంతా పోయాక తలుపులు బిగించారు. కాని భక్తులందరూ లోనికి వచ్చే సమయంలో వారితోపాటుగా వచ్చిన చెన్నుడు మాత్రం అలాగే మిగిలిపోయాడు.

వారంతా మిలిటెంట్స్! కర్ఫ్యూ సమయంలో నగరాన్ని గడగడలాడించిన ఘనులు! వార్తలు తీసుకు వచ్చారు.

"తారనాకలో పదిమందిని చంపి వందయిళ్ళు తగులబెట్టి మొత్తం అయిదులక్షలు దోచాం" అంటూ ఓ పెద్ద బ్యాగ్ అందించాడు ఒకడు.

దేవి ప్రసాద్ దాన్ని చేత్తో తాకాడు. వెంటనే అతని అనుచరులు దాన్ని లోపలకు తీసుకుపోయారు. అలాగే నగరం నాలుగుమూలల దోచిన సొమ్ము అతనికి అప్పగించారు దోపిడీదారులు.

"ఈ నగరం ఇలాగే మూడు కర్ఫ్యూలు, ఆరు 144లుగా వర్ధిల్లుగాక"అని ఆశీర్వదించి మరో గదిలోకి వెళ్ళాడు దేవిప్రసాద్!

మిగిలినవారు ఒక్కొక్కరే లేచి వెలుపలకు వస్తున్నారు. వారితోపాటు తనూ ఒకడుగా లేచివచ్చాడు చెన్నుడు. మిత్రుడుతో కలిశాడు. పరిస్థితి అంతా వివరించాడు. "ఈ దొంగ సొమ్ము అంతా పట్టించే మార్గం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"పాప విషయం తేలకుండా మనం ఏమీ చేయలేం" అన్నాడు రాహుల్. అవకాశం కోసం ఎదురుచూస్తూ వారు అక్కడే నిలిచిపోయారు.

మెదడు నరాలు తెగిపోయే టెన్షన్‌తో ఎదురుచూస్తున్నారు.

'ఓం తత్సత్!.. ఆ పాపను తీసుకువచ్చావా?" దేవి ప్రసాద్ అడిగాడు.

"తీసుకువచ్చాను. కాని వివరాలు చెప్పలేకపోతూంది "అంది పీయూష.

"ఆ శేత ప్రాణిని మా ఎదుటకు తీసుకురా!" పళ్ళు నూరాడు.

పీయూష వణికిపోయింది. అభం శుభం తెలియని ఆ పసిదాన్ని చంపేయటం అతనికి తేలిక పని! అందులోని పాప పుణ్యాల గురించి అరక్షణ మయినా ఆలోచించని మనిషి అతను.

అయినా ఆజ్ఞాపించాక తప్పదు కదా!

మరో గదిలో దిక్కు మొహం పెట్టి తన కోసం ఎదురుచూస్తున్న సుషుమ్నని చేతుల్లోకి తీసుకుంది. మిక్కి మౌస్‌ని గుండెలకు అదుముకుంది. నోరు తెరచి బావురుమని ఏడ్పు సాగించింది బేబి!

"బేబి! ఏడవకు. మరికాస్సేపటికి ప పా వస్తారు "అంది పీయూష!

"నువ్వు యిలాగే చెప్తావు. అన్నీ అబద్ధాలు! నేను నమ్మను పో! "


" ఈసారి నిఝంగా వస్తారు. ఏడవకమ్మా!" ఆ చిట్టితల్లి భవిష్యత్తు ఏమవుతుందో తెలియని పీయూష బాధగా అంది.

"నిజంగా.. నిఝంగా వస్తారా? "

"అవునమ్మా. వస్తారు. ఏడవకు మరి" ఆమెను చేతుల్లో పొదివి పట్టుకుంది. పాపాయి భవిష్యత్తుని నిర్ణయించే నరపిశాచం అయిన దేవి ప్రసాద్ ఎదుటకు తీసుకుపోయింది.

అతడు సైతానులా పాపాయివంక క్రూరంగా చూచాడు.

"నమస్తే గ్రాండ్ పా! " అంది సుషుమ్న చేతులు ముడిచి. అది ఆమెకు తల్లి బ్రతికివుండగానే నేర్పిన విద్య. పెద్దలను గౌరవించాలి. పెద్దవారు క్రొత్తవారయినాసరే కన్పిస్తే నమస్తే చెప్పాలి! ఆ తల్లి ఇచ్చిన సలహాలు ఇంకా ఆ పసి మనస్సులో చెరిగిపోలేదు.



బంధుత్వాలను కలుపుతోంది అమాయకంగా!

"ఊ...నమస్తే!" అని గర్జించాడు దేవి ప్రసాద్. పాప బెదిరిపోయింది. నోరు మూసేసి బితుకుబితుకుమని చూస్తోంది.

"ఇండికేటర్ ఎక్కడ పెట్టావు " గర్జించాడు దేవిప్రసాద్.

"నాకేమీ తెలియదు గ్రాండ్ పా! "

" విన్ను చంపేస్తాను"

" మమ్మీ గ్రానీ కూడ చనిపోయారు గ్రాండ్ పా!"

"ఇదేమిటి?" అంటూ పాప గుండెలకు హత్తుకున్న మిక్కీమౌస్‌ని అందుకున్నాడు.

"టిక్...టిక్...టిక్.... " అతని భవిష్యత్తును నిర్ణయించే క్షణాలు గడుస్తున్నాయి. అతని కోట్ల రూపాయల వ్యాపారాన్ని ఆ పాపాన్ని దివాలా తీయించే ఇండికేటర్ ఆ మిక్కీమౌస్ టాయ్‌లో వుందని వారెవరికీ తెలియదు.

పాపకు కూడ ఆ విషయం గుర్తులేదు. ఆ కొద్ది క్షణాలు వారిద్దరి భవిష్యత్తుల్ని నిర్ణయించే క్షణాలు. భారంగా గడిచాయి. అతని భవిష్యత్తు అతని చేతుల్లోనే వున్నా ఆ విషయం తెలియక దాన్ని విసిరికొట్టాడు. "చెప్పు. ఎక్కడ పెట్టావు? చెప్పకపోతే మీ మమ్మీ గ్రానీలాగే నువ్వూ చనిపోతావు" అన్నాడు కఠోరంగా.

పాప ఏడవటం మళ్ళీ ప్రారంభించింది. ఆమెను సముదాయించేందుకు క్రిందపడిన మిక్కీ మౌస్‌ని తీసి అందించింది పీయూష!

మళ్ళీ దాన్ని గుండెలకు హత్తుకొని పట్టుకుంది సుషుమ్న.

" ఈ పాపను చంపేసి ఆ శవంతో బేరం పెడతాను" చేతిలోఉన్న హేండ్ స్టిక్‌ను పాపాయి తలకు గురిపెట్టాడు దేవిప్రసాద్! మరుక్షణంలో పాపాయి లేత శిరస్సు రెండుగా చిలిపోయి వుండేది. కాని తన చేతులు అడ్డుగా పెట్టింది పీయూష! కాదని అతన్ని వారించింది.

"బాస్! ఈ పసిదాన్ని చంపినందువల్ల మన సమస్య తీరదు. చంపినతరువాత వెంటనే మనం దీన్ని పూడ్చెయ్యాలి కదా! బ్రతికివుంటుంది. మన దగ్గరే ఉంటుంది కదా! బేరం పెడదాం.

అలాచేస్తే పని జరిగేందుకు కొద్ది వారాలు పట్టినా మన చేతిలో ఆయుధంలా ఉంటుంది పాప! అందువల్ల దీన్ని చంపటం మనకే నష్టం" అంటూ తన పథకాన్ని వివరించింది పీయూష!

దేవి ప్రసాద్ క్షణం ఆలోచించాడు.

హెర్క్యులెస్ మిస్టర్ ఇండియా

మైక్ టైసన్ వంటి స్థూలకాయుడు లేకపోవచ్చునేమోగాని, అలాంటి వాడిని తీసుకొని విల్సన్-సేవక్ ఆనంద్‌లు 'హెర్క్యులెస్' చిత్రాన్ని నిర్మిస్తున్నారట.

'మిస్టర్ ఇండియా' టైటిల్ గెలుచుకున్న విజు పెంకార్ ప్రధానపాత్రను పోషిస్తున్నాడు. 'దేవా'ఫేమ్ ఎస్.ఆర్. ప్రతాప్ ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తున్నాడు.

ఎత్తిన కర్ర దింపేశాడు.

"సరే! అలాగే! కాని ఈ విషయం త్వరగా తేలిపోవాలి. ఎయిర్‌లైన్స్ సంస్థ మనకు నోటీసులు పంపింది. మన నిర్దోషిత్వాన్ని రుజువుచేసుకోవటానికి ఆ యిండికేటర్ సంపాదించటం ఒకటే దారి! అది చేయిదాటిపోయిందంటే నా సంస్థలన్నీ మూలపడతాయి. గతంలో కూలిపోయిన విమానాల కేసులన్నీ తిరగబడతాయి. నా ప్రాపర్టీస్ అన్నీ జప్తు అవుతాయి. నా చేతులకు బేడీలు పడతాయి. అలా జరిగితే నేను పిశాచంలా మారిపోతాను" అంటూ ఎక్సయిట్ అయిపోయి పెద్దగొంతు పెట్టుకుని అరిచాడు దేవిప్రసాద్!

"ఎట్టి పరిస్థితిలోనూ అలా జరగదు బాస్! ఈ పాప ప్రాణాలు అడ్డుపెట్టుకుని ఆ యిండికేటర్‌ని సంపాదిస్తాను"

"అయితే పాపని భద్రంగా ఉంచాలి. ఎక్కడ దాస్తారు?"

"జూబిలీ హిల్స్‌లో మనం నిర్మించిన క్రొత్త యింట్లో!"

"వొద్దు! అప్పుడే అది పోలీసుల దృష్టిలో పడిపోయింది"

"అయితే మరెక్కడ దాచివుంచమంటారు?"

"తారనాక గోరీల దొడ్డిలో వుంచండి"

"అలాగే బాస్" అంటూ బయటకు నడిచింది పీయూష! ఈసారికూడా పాపని రక్షించగలిగినందుకు లోలోపల సంతోషించింది. ఆమె పాపని ఎత్తుకుని బయటకు వస్తూఉండగా ఎదురు అయాడు మక్కన్‌గాడు. ఎదురొచ్చి దారి యివ్వకుండా అడ్డు నిలిచాడు.

"ఈ పాప ఎవరు?" అని అడిగాడు.

"చెత్త ప్రశ్నలు అడిగి విసిగించకు. దారి తొలుగు" అంది పీయూష.అతడు దారికి అడ్డు తొలగలేదు.

"నీతో పని ఉండి వచ్చాను"అన్నాడు ఆమె వంక ఆశగా చూస్తూ!

"అదేమిటో త్వరగా చెప్పు. నేను బాస్ చెప్పిన పనిమీద పోతున్నాను" అంది పీయూష. బాస్ పేరు వింటూనే బిగుసుకుపోయాడు మక్కన్.

"నీకోసం ఎవరో వచ్చారు. వరండాలో ఎదురు చూస్తున్నారు." అన్నాడు.

"మరి ఆ విషయం చెప్పేందుకు వచ్చినవాడివి ఈ వేషాలెందుకు? పాపాయిని అందుకో? నేను తిరిగి వచ్చేవరకూ యిక్కడే నిలబడి ఉండు" అంటూ బేబిని అందించింది. మక్కన్‌గాడు సుషుమ్నని ఎత్తుకున్నాడు.

ఆమె రాగం ప్రారంభించింది. కాని ఎవరూ లక్ష్యె పెట్టలేదు. బయటకు వెళ్లిపోయింది. పీయూష! వరండాలో కాలుపెట్టకుండానే తన కోసం ఎవరు వచ్చారనే విషయాన్ని పరిశీలించిందామె.

చెన్నాతో మాటాడుతూ కన్పించాడు రాహుల్! వారు పోలీసులకి యిన్ఫర్మేషన్ ఇచ్చి ఉంటారనే అనుమానం కూడ వచ్చిందామెకు.

క్షణంలో నిర్ణయాన్ని మార్చుకుంది. పరుగులాంటి నడకతో వెనుకకు తిరిగి వచ్చింది. మక్కన్‌గాడు బేబితో సతమతమవుతున్నాడు.

"మక్కన్! మనం ఈ చోటుని తక్షణం విడిచిపోవాలి."

"నా సాయం కావాలంటావా? ఎక్కడకు పోవాలి?"

"తారనాకలో గోరీలదొడ్డి ఉంది. అక్కడకు పోవాలి. కారు సిద్ధంగా ఉందా?"

"కైలాష్ భద్రాకారు పంపించారు. మనం వెళ్లిపోతే ఎలా ?"

"అదంతా తరువాత ముందు మనం వెళ్ళితీరాలి! డ్రయివింగ్‌లో నీకు ఎంత అనుభవం ఉందో అది నువ్విప్పుడు ఉపయోగించాలి."

"ఓ దానికేం? విమానంలా నడుపుతాను. పైలట్‌లు కూడా పట్టుకోలేరు."

"వచ్చిన వ్యక్తి నిజంగా పైలట్! రాహుల్" అని నోరు జారింది పీయూష.

ఆ పేరు వింటూనే ఆమె చేతుల్లోంచి క్రిందికి జారిపోవటం ప్రారంభించింది సుషుమ్న! ఏడుపు ప్రారంభించింది.

"కారు ఎక్కడ పార్కుచేశావు ?"

"వరండా ఎదురుగ్గానే !"

చంపేశావు. మనం బయటకు పోతే వాళ్లు చూస్తారు."

"బేఫికర్‌గా ఉండు మేడమ్! ముందు నేను వెళ్లి కారు యింజన్ స్టార్ట్ చేసి వెనుక తలుపు తెరిచి సిద్ధంగా ఉంచుతాను. గేరు మార్చి యాక్సిలేటర్‌మీద కాలుపెట్టి సిగ్నల్ యిస్తాను.

వెంటనే మెరుపులా వచ్చి కారులో కూర్చో! ఆ తరువాత విమానంలో వెంటాడినా చిక్కను. హైదరాబాద్ రోడ్లమీద చూపిస్తా నా తడాఖా!" అంటూ పథకం వివరించాడు.

"వారు కారులో వచ్చారా?" అని అడిగింది పీయూష !

"లేదు. నేను చూచాను. నడిచే వచ్చాడు."

"నగరంలో కొన్నిచోట్ల ఇంకా కర్ఫ్యూ ఉంది కదా!"

"లాపర్వా! అదంతా నేను చూచుకుంటా!"

"అయితే వెళ్లి" మక్కన్‌గాడు బయటకు వచ్చాడు. రాహుల్ అతని దగ్గరగా వచ్చాడు. పలకరించాడు.

"పీయూష లోపల ఉందా ? నేను వచ్చానని చెప్పావా?"

"ఫాయిదా లేదు భాయ్! ఆమె యిక్కడ లేదు."

"ఇందాక ఉందన్నావు?"

"అనుకున్నాను. మరికొద్దిసేపటిలో రావచ్చు. మీరు మెయిన్‌గేటు దగ్గర ఎదురు చూడటం మంచిది" అన్నాడు.

వారిద్దరూ ఆవైపుగా పోతుంటే నవ్వుకున్నాడు.

వెనుక డోరు తెరిచిపెట్టి కారు స్టార్ట్ చేశాడు. గేరు మార్చి యాక్సిలేటర్‌మీద సిద్ధంగా కాలు పెట్టాడు. సిగ్నల్ అందించాడు.

పీయూష మెరుపులా వచ్చి కారులో కూర్చుంది. వరండాలోంచి కారులోకి చేరటానికి అయిదు సెకన్లు పట్టింది.

ఆ కొద్ది సమయంలోనే తల దించుకుని వెళ్లిపోతున్న తండ్రిని గమనించింది సుష్మ! 'పాపా! పాపా!! సేవ్‌మీ!" అరిచింది.

పిడుగులు మీదపడినట్లుగా త్రుళ్లిపడి చూచాడు రాహుల్! సెకనులో పదోవంతు కాలంలో పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. పైలట్‌గా అది అతని అనుభవం. సెకన్‌ని కొన్ని భాగాలుగా విభజించగలగాలి. ఆ కొద్ది సమయంలో లక్ష్యాన్ని చూచి నిర్ణయం తీసుకోగలగాలి.

ఆ అనుభవంతోనే పీయూష పాపాయితో కారులో కూర్చోవటాన్ని గమనించాడు. బేబి యిచ్చిన ఆర్తిపూర్వకమయిన పిలుపుని అందుకున్నాడు. వెంటనే కారుమీదికి దాడిచేశాడు. అద్దాలు పగిలాయి.

కాని మక్కన్‌గాడు డ్రయివింగ్‌లో దిట్ట! అఖండుడు ! కారుని దూకించాడు. కారు డోరు మూసేందుకు వీలుకాకుండా హేండిల్‌ని దిగించి పట్టుకున్నాడు రాహుల్!

హేండిల్ వూడి అతని చేతికి వచ్చింది. కాని కారు వెళ్లిపోయింది. మక్కన్‌గాడి లాఘవానికి చాల సంతోషించింది పీయూష! బేబి వెనుదిరిగి అద్దంలోంచి చూస్తూ "ఏ పాపాదా" అని కేకలు పెడుతోంది. ఏడుస్తోంది.

ఆ అరుపులు రాహుల్‌కి విన్పించలేదు. ఆ దృశ్యం కూడ క్రమంగా కనుమరుగు అయిపోయింది. బొమ్మలా నిలిచిపోయాడు చెన్నుడు.

"భాయ్! మంచి అవకాశం చేజారిపోయింది. ఇప్పుడయినా పోలీసు రిపోర్టు యివ్వడం మంచిది అనుకుంటాను" అన్నాడు దిగులుగా!

రాహుల్ మనసులో విజయదుర్గ చెప్పిన మాటలే తిరుగుతున్నాయి.

అదే యధార్థమయితే వారిప్పుడు వెళ్ళే చోట్లు రెండున్నాయి. ఒకటి జూబిలీ హిల్స్, రెండు తారనాకలో గోరీల దొడ్డి. కారు వెళ్లిన దిక్కుని పరిశీలిస్తే అది గోరీలదొడ్డి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది.

టాక్సీలు లేవు. రిక్షాలు లేవు. సిటి బస్సులు లేవు. వారిని వెంబడించేందుకు ఎటువంటి వాహనాలు అందుబాటులో లేవు. స్పెషల్ బెటాలియన్లు, పారామిలటరీ వారు తిరుగుతున్న లారీలు కన్పించాయి.

"చెన్నూ! ఇది పోలీసులు తేల్చే సమస్యకాదు. మనమిప్పుడు తారనాకపోవాలి." అన్నాడు రాహుల్! రోడ్లు ఎడారిదారుల్లా కన్పిస్తున్నాయి.

ఎలా చేరుకోవాలి అనే సమస్య క్షణ క్షణం పెరిగి పెద్దది అవుతోంది.

అలా చెప్పు భాయ్! మనం తారనాక పోవాలి అంతే కదా!" అన్నాడు చెన్ను.

"ఎలాంటి వాహనం లేకుండా ఎలా ఫాలో అవటం?"

"అదంతా నాకొదిలెయ్యి. ఏం చేస్తానో చూడు! నిలిచిపోయాడు.

"ఏం చేస్తావు? ఒక్క వాహనం కూడ కన్పించందే!?"

"కన్పిస్తాయిలే! కంగారుపడకు భాయ్. తారనాక పోవాలి అంతేకదా!"

"ఈ పరిస్థితిలో అది అంత సులభం కాదు."

"చెయ్యదలుచుకుంటే చాల సులభం. ఉండుండు. ఏదో వాహనం వస్తోంది." అన్నాడు చెన్నడు. రాహుల్ ఆ వంకను చూచాడు.

ఓ మారుతి కారు అద్దాలన్నీ దింపుకుని వస్తోంది. లోపలి మనుషులు కన్పించటల్లేదు. చెన్ను రోడ్డు మధ్యకు పోయాడు.

రెండు చేతులు ఎత్తి రెక్కలు విప్పిన పక్షిలా ఊగించటం మొదలెట్టాడు. కారు నిలిచిపోయింది. ఓ యువకుడు అద్దం క్రిందికి దింపి తల బయటకు పెట్టాడు. ఏమిటి అన్నట్లుచూచాడు.

"అయ్యగారు ధమ్మంటున్నారు" అన్నాడు చెన్ను రాహుల్‌ని చూపుతూ.

ఆ యువకుడు క్రిందికి దిగి రాహుల్ వంక చూచాడు.

"అయ్యగారు అంటే ఎవరు?" అన్నాడు ఆ మనుషులు ఎవరో అర్థంకాక.

"ష మస్తీలో ఉన్నారు" అన్నాడు చెన్నుడు.

"ఎవరైతే మాకేమిటి? మాదగ్గర కర్ఫ్యూ పాస్‌లు ఉన్నాయి" వెనుక డోరు తెరుచుకుని మరో వ్యక్తి క్రిందికిదిగి వచ్చాడు.

"కారులో మీరిద్దరే ఉన్నారా ?"

"అవును. మా యిద్దరికీ పాస్‌లు ఉన్నాయి."

"ఉండే ఉంటాయి. చాల పెద్దమనుషుల్లా కన్పిస్తున్నారు. నాతో రండి" మరో వైపుగా వారిని కొంత దూరం తీసుకుపోయాడు. ఏమిటీ గొడవ అన్నట్లు అసహనంగా చూచారు. ఈలోగా కారు కదిలి దూసుకుపోయింది.

"ఏమిటది? ఎవరు నువ్వు ?" చెరో రెక్క పుచ్చుకున్నారు.

చెన్నుడు కళ్లు మిటకరించాడు. కాస్సేపయింతరువాత వొంటిమీద తెలివిలేని అతన్ని పోలీస్ స్టేషన్ వైపుగా మోసుకుపోయారు ఆ యిద్దరూ!

ఆ సమయానికి తారనాక చేరుకున్నాడు రాహుల్! గోరీలదొడ్డి ఇంకా అంత దూరం ఉందనగానే కారుని వొదిలేశాడు. చాల విశాలమయిన ఖాళీస్థలంలో కొన్ని వందల సమాధులున్నాయి.

కొన్ని ఖరీదయినవి. కొన్ని పేదరికం ఉట్టిపడేవి. చనిపోయిన తరువాత ఏమవుతుందో తెలియని పిచ్చి ప్రభావం ఖబర్‌స్థాన్ లోకూడ కన్పించింది. నవాబులు చలువరాతి గోరీలలో శాశ్వతనిద్ర పోతున్నారు. ఫకీరులు పలకరాళ్ళ క్రింద మట్టిగా మారిపోయారు. ప్రళయాంతమయిన తరువాత ఈ ఆత్మలన్నీ ఒకేసారి అల్లాముందు హాజరుపడతాయని వారి నమ్మకం. అతని ఆత్మప్రళయాంతంవరకూ వసించటానికే గోరీలు!

మెయిన్‌గేటు ప్రక్కనున్న నల్లరాయి మీద ఓ చిన్న బాలుడు పడుకుని ఉన్నాడు. చెట్టు సందులనుంచి సూర్యకిరణాలు అతని మీద పడుతున్నాయి.

చేతులు చెంపక్రింద పెట్టుకుని ముణగ దీసుకున్నాడు.

కారు గోరీలకు అవతల ఉంది. దానికి మరోవంక కొద్ది దూరంలో ఓ మసీదు కూడ ఉంది. దాని మినార్‌లకు లౌడ్‌స్పీకర్లు కట్టి ఉన్నాయి. నమాజు కోసం అందులోంచి పిలుపులు విన్పిస్తున్నాయి.

స్వచ్ఛమయిన ముస్లిం రోజులో అయిదుసార్లయినా నమాజు చేయాలి! ముల్లా అందరిని అల్లా దయకోసం ప్రార్థనలు జరపాలని ఆహ్వానిస్తున్నాడు.

"బాబూ! ఇటువైపుగా ఎవరయినా వచ్చారా?" అని అడిగాడు రాహుల్.

"చనిపోయినవారు మాత్రమే ఖబర్‌స్థాన్‌కి వస్తారు భాయిసాబ్."

"అదిసరే! ఎవరయినా ఇద్దరు వ్యక్తులు నడిచిరావటం చూచావా?"

"నేను కళ్లు మూసుకుని పడుకుని ఉన్నాను."

"మరి లోపలకు వెళ్లాలి. గేటు తెరుస్తావా?"

"చేతులు వేయండి తలుపులు అవే తెరుచుకుంటాయి."

"ఇక్కడ కాస్సేపు కూర్చోవాలంటే ఎవరిని అడగాలి."

"ఎవరి అనుమతి కావాలి ఖబర్‌స్థాన్‌లో కాలు పెట్టటానికి? ఎంత అమాయకులండీ మీరు. ఎవరి అనుమతి అక్కరలేదు. ధైర్యం ఉంటే లోపలకు వెళ్లికూర్చోవచ్చు." అయినా

మాజుకు వేళ అయింది కదా! మీరు ుసీదులోకి వెళ్ళరా?"

"వెళ్ళాలనే వచ్చాను" అంటూ లోప కు నడిచాడు రాహుల్! సమాధుల ుధ్య పల్లేరులు పాకుతున్నాయి. కొన్ని ాళ్ళు వొంగిపోయి పడిపోయేందుకు సిద్ధంగా న్నాయి.

చెట్టు నీడ పరుచున్న ఓ సమాధిరాయి ుద కూర్చున్నాడు రాహుల్. చాలమంది ుసీదులోకి ప్రార్థనలకోసం వెళ్లారు. కారు ుక్కడే ఉంది. కాని దిగిన యిద్దరూ ఎటు ోయారు?

బేబీకి ఏదయినా అపకారం తలపెట్టి ుక్కడకు తీసుకువొచ్చారా?

ఎవరయినా రావటానికి భయపడే ఆ ోటున కొద్ది నిముషాలు చాల భయంకరమ ుున నిశ్శబ్దంలో గడిపాడు రాహుల్.

వెనుకనించి ఎండుటాకులమీద అడుగుల చప్పుడు విన్పించింది. ఉలికిపడి చూచాడు. రెప్పవాల్చకుండా అతని వంక చూస్తోంది ీయూష!

"అయితే మీరు యిక్కడికి వచ్చారన్న మాట?" అప్రయత్నంగా ఆమె నోటినించి మాటలు వెలువడినాయి.

రాహుల్ ఆమె చుట్టూ పరిశీలించాడు. ఎవరూ కన్పించలేదు.

"పాపను ఎక్కడ ఉంచారు? వెంటనే ఆమెను అప్పగించండి" అన్నాడు రాహుల్.

ఆమె నోటినించి నెగెటివ్‌గా ఏదైనా సమాధానం వెలువడితే మరుక్షణం దాడిచే యటానికి సిద్ధంగా ఉన్నాడు.

తను ఒంటరిగా యిలాంటి పరిస్థితులు ఎన్నింటినో చూచింది పీయూష.

"డోంట్ బి ఎక్సయిటెడ్! పాప క్షేమంగా ఉంది" అని బదులు చెప్పింది.

"తక్షణమే పాపని నాకు అప్పగించాలి" అన్నాడు దూకుడుగా.

"అప్పగించకపోతే ఏం చేయగలనని మీరు అనుకుంటున్నారు."

"నిన్ను ఇక్కడే సమాధి చేస్తాను" మీదికి ఉరికాడు.

"అదే సమయానికి మరోచోట పాప సమాధి అవుతుంది" ఆ మాటలు విని చెలి యలికట్ట దాటి రానున్న సముద్రంలాంటి ఆవేశ తరంగం అతని అంతరంగాలలోనే అణ గారిపోయింది.

"మీరు ఎందుకు యిలా చేస్తున్నారు? మీకేం కావాలి! నా పాపకేదయినా అప కారం జరిగితే మీ ముఠా అంతం చూస్తాను" అన్నాడు.

ఆమె పెదవులు విరక్తిగా వొంపు తిరి గాయి.

"ఇలాంటి సమయంలో మీకు ఆవేశం రావటంలో ఆశ్చర్యమేమీ లేదు రాహుల్! కాని ఇది పాముల పుంత! ఈ దారిలో జాగ్ర త్తగా నడవాలి. పొరపాటుపడితే ప్రాణాలు పోతాయి."

"ఆ యిండికేటర్ మా దగ్గర లేదు. పాప ఎక్కడో జారవిడిచింది."

"అది యధార్థమేకావచ్చు. కాని ఈ పిశాచాలు మీ మాటలు నమ్మరు. ముందు మీరు ఆవేశం తగ్గించుకుంటారా?"

"కాని పాపకేదయినా జరిగితే...?"

"అలా జరగదని నేను హామీ యిస్తు న్నాను. ఆమె నా దగ్గరే ఉంది."

"ఆ మాట విన్నందువల్ల నాకేమిటి ప్రయోజనం. పాపని అప్పగించు."

"అలా చేయటానికి వీలుండదు. మీరు ఆ యిండికేటర్ ఎలాగైనా సరే యిచ్చితీ రాలి! అప్పుడే పాప! ఇది బాస్ ఆర్డర్."

"మీ బాస్‌ని మట్టికరిపిస్తాను" ఆమె మళ్లీ నవ్వింది.

"చూడు రాహుల్! ఒకప్పుడు నేనూ నీలాగే అనుకున్నాను. రెండు సంవత్సరాలుగా ఈ సైతానులతో కలిసి పనిచేస్తున్నాను. కాని ఈ విషవలయానికి అది ఎక్కడో అంతమెక్కడో నాకు తెలియలేదు."

ఆకాశంనించి క్రొత్తగా భూమిమీదికి దిగి నవాడివి ముందు ఈ వ్యవస్థని అర్థం చేసుకో!

సమాజంలోని ఏ బలహీనతలు ఆధారంగా వీరు ఇంతకాలం సురక్షితంగా ఉండగలుగుతున్నారో తెలుసుకోవటానికి ప్రయత్నించు. మీ పాప క్షేమంగా ఉంటుంది.

సమయం వచ్చినప్పుడు నేనే అప్పగిస్తాను. కాని తొందరపడి ఇలాంటి సాహసాలు చేశా వంటే పాపని నా చేతులతోనే చంపేస్తాను.

రాహుల్ ఆమె వంక విచిత్రంగా చూచాడు.

"అసలు నువ్వేవరు? ఈ ముఠాలో ఎందుకు పనిచేస్తున్నావు?" అన్నాడు.

"ఈ ప్రశ్నకి సమాధానం ఎప్పుడో ఒక ప్పుడు చెప్పాల్సివస్తుందని తెలుసునాకు. ఇది మంచి సమయమే! కాని పూర్తిగా చెప్పను.

రాహుల్! నేను సంపత్ మాష్టారి అమ్మాయిని. నా అన్న రోహిత్‌ని ఈ సైతానులే చంపేశాయి. మిగిలిన విషయ మంతా నువ్వే ఆలోచించి తెలుసుకో!" తల దించుకుని వడివడిగా అక్కడనించి వెళ్లిపో యిందామె.

(ఇంకా ఉంది)



విశ్వామిత్రలో అమ్జాద్, దీపిక

ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు నటించి, దర్శకత్వం వహిస్తున్న 'బ్రహ్మర్షి విశ్వామిత్ర'లో హిందీ నటుడు అమ్జాద్‌ఖాన్, టి. వి. రామాయణ్‌లోని సీత పాత్రధారిణి దీపిక కూడా నటిస్తున్నారని అంటున్నారు.

చురుకుగా నిర్మాణం జరుపుకుంటున్న 'విశ్వామిత్ర' చిత్రంలో వీరబాహుడి పాత్రను అమ్జాద్‌ఖాన్ పోషిస్తున్నాడు. పర్సనాలిటీ చూసి శ్రీ రామారావు అమ్జాద్‌ను ఎంపిక చేశాడేమో!

టి. వి. సీతగా పేరుబడిన దీపిక చంద్రమతి పాత్రను పోషిస్తున్నదట. ఆ యా పాత్రలకు తగినట్లుగా శ్రీ రామారావు నటీ నటులను ఎంపిక చేయటం బాగానే వుంది కాని... వారు ఆ పాత్రలకు ఏ మేరకు న్యాయం చేకూర్చగలరన్నది ఎవ్వరూ చెప్పలేరుగా! వేచి చూద్దాం!

ఘోరాతిఘోరాలు

ఎయిడ్స్ వ్యాధికి 'మూత్రం'

ఎయిడ్స్ వ్యాధిని మొట్టమొదటి సారిగా 1981 లో గుర్తించారట. అమెరికాలో మొన్న జులై నెలాఖరుకు 1,02,621 కేసులు గుర్తించారట. వీరిలో యీ రోగం వల్ల 59,391 మంది (అనగా 58 శాతం) చనిపోయారట. ఈ భయంకర వ్యాధికి ఇంకా వైద్య విజ్ఞానం మందే కనిపెట్టలేదుట. బొంబాయికి చెందిన డాక్టర్ ధాకర్ మూత్రం మూత్రం త్రాగడం వల్ల యీ భయంకర వ్యాధి నయమవుతుందని ఢంకా బజాయించి చెప్పడమే గాక, నయంచేసి చూపారట. 35 ఏళ్ళ పల్లాడనో అనే అతను ఎయిడ్స్ వ్యాధితో చావు బ్రతుకుల్లో వుండగా అతని మూత్రం డోసులవారిగా అతని చేత త్రాగించి, "శివాంబు కల్ప" అనే వైద్యం చేసి, అతనికి ప్రాణదానం చేశాడట. ఆ వైద్యంలో సుమారు రోజుకు ఎనిమిది ఔన్సులు త్రాగించటం ద్వారా అతని ఎయిడ్స్ రోగం తగ్గడమే గాక, శరీరం వజ్రతుల్య మయిందట కూడాను... హా! యంగ్ వెర్ యూరిన్ ఫర్ దైర్ హెల్త్! య్యా!

అక్రమ సంబంధం : పిల్లల హత్య

మద్రాసు బి. అండ్ సి. మిల్లులో పని చేస్తున్న భాస్కరరావు అనే అతని భార్య 25 ఏళ్ళ రత్నాబాయి భాస్కరరావు తమ్ముడు లక్ష్మీనారాయణ్‌తో అక్రమ సంబంధం పెట్టుకొన్నదట. ఒకసారి అనుకోకుండా స్కూలునుంచి తిరిగి వచ్చిన ఆమె పిల్లలు 8 ఏళ్ళ రామ్‌ప్రసాద్, 4 ఏళ్ళ రాజేష్ తమ తల్లి, పిన తండ్రి మంచం మీద పొర్లడం చూసి, ఆ రాత్రి 8 ఏళ్ళ రామ్‌ప్రసాద్ యీ విషయం తండ్రితో చెప్పబోయాడట. ఆ రాత్రి ఆమె ఏలాగో మాట మార్చి నందట. అనక తన రంకు బయట పడకూడదని, తనిద్దరి పిల్లల్నీ చంపేసిందటామె. ఈ విషయం పోలీసుల అనుమానంతో బయట పడ్డదట.

చచ్చి బ్రతికిన వ్యక్తిని చూసి యిద్దరి మృతి

సౌదీ అరేబియాకు చెందిన అస్సార్ అనే గ్రామంలో మటావో దపర్ అనే ఒకతను రోగం ముదిరి, కోమాలో పడిపోతే డాక్టరు అతను చచ్చిపోయినట్లు నిర్ధారణ చేశాడట. దాంతో అయిన వాళ్ళంతా ఏడుపులు పెట్టి, ఆనకాతన్ని సశాస్త్రీయంగా భూమిలో పూడ్చి పెట్టేశారట. ఇది జరిగిన 2 గంటలకు ఆ మటావో దపర్‌కు కోమా పోయి, తానున్న స్థితి ఏమిటో తెలీక గావుకేకలు వేస్తూ ఆ గోరీని కాళ్ళు చేతులా తన్నేసరికి ఆ దారిన పోయే గొర్రెల కాపరులు గోరీ పీకి అతన్ని బయటకు తీసి, వారు భయపడి పారిపోయారట. అతను శవం మీద కప్పిన గుడ్డ చుట్ట బెట్టుకుని ఇంటికి వెళ్ళేసరికి భోరు భోరున ఏడుస్తున్న అతని తల్లీ, చెల్లీ హఠాత్తుగా అతన్ని చూసి, కొయ్యబారి తా అని చనిపోయారట.

ఆస్తి కోసం హత్య!

కదిరికి చెందిన కానముద్రం అనే గ్రామంలో 80 ఏళ్ళ రంగారెడ్డి అనే ఆయన్ని ఆయన ఆస్తి కోసం దాయాదులు చంపేసి, సశాస్త్రీయంగా పాతిపెట్టేశారట. రంగారెడ్డి అవివాహితుడట ఆయనకు సంతానమే లేని కారణాన దూరపు బంధువులయిన కేశవరెడ్డి, అశ్వర్థ రెడ్డి, మరో యిద్దరూ కలిసి, ఆయన్ని చంపి, భూస్థాపితం చేశారట. వరిని పోలీసులు అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నారట

కట్నం కోసం వేధింపు : భర్త అరెస్టు

ధర్మపురి ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ విజయకుమార్ కట్నం మరింత తే అని తన భార్య గీతారాణిని వేధించడమే గాక, 30 వేలు నగదు 25 కాసుల బంగారంతో నే నా యింటికి రా అని ఆమెను పుట్టింటికి పంపేశాడట. దాంతో వొళ్ళు మండిన గీతారాణి యీ విషయం రిపోర్టు చేసే సరికి పోలీసు లాయన్ని అరెస్టు చేశారట.

వి. ఎస్. దేవి, కోట(పశ్చిమగోదావరి జిల్లా).

ప్రశ్న: మా మామగారికి ఒక అబ్బాయి, అమ్మాయి. ఆ అమ్మాయికి కొంత డబ్బు, భూమి యిచ్చి పెళ్ళిచేశారు. ఇప్పుడు మా ఆయన, మామగారు చెరిసగము పిత్రార్జితమైన స్థిరాస్తిని స్టాంపు కాగితాలమీద రాసుకున్నారు. పన్ను మాత్రం మా మామగారి పేరే ఇద్దరం కడుతున్నాం మా అడపడుచు వలన ఏదయినా ప్రమాదమా? ఆస్తులు రిజిస్ట్రేషన్ కానందువలన మా మామగారు తీసుకున్న ఆస్తి కూడా ఆయన ఎవరికి ఇష్టమయితే వారికి రాసుకునే వీలుందా?

జవాబు: 1986 హిందూ వారసత్వపు (ఆంధ్రప్రదేశ్ సవరణ) చట్టము, 1985 సెప్టెంబరు 5 నుంచి అమలులోనికి వచ్చినది. ఈ చట్టములోని సెక్షన్ 29-ఎ ప్రకారం,

(1) మితాక్షర లా ప్రకారం అవిభక్త హిందూ కుటుంబములోని కుమార్తె, కుమారునితో సమానంగా వారసత్వపు ఆస్తిపై హక్కులు కలిగియున్నది.

(2) (ఎ) అవిభక్త హిందూ కుటుంబము విభాగము అయినప్పుడు వారసత్వపు ఆస్తి కుమారునితో సమానంగా కుమార్తెకు పంచవలెను.

సెక్షన్ 29 (4) ప్రకారం వివాహముకాని కుమార్తె వారసత్వపు ఆస్తిలో సమాన భాగము పార్టిషన్ కోరవచ్చునని 1987లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పుల్లారెడ్డి కేసులో తీర్పు చెప్పింది. అయితే 1985 సెప్టెంబర్ 5 తేదీ లోపల జరిగిన పార్టిషన్‌లలో భాగము అడుగుటకు వివాహము అయిన కుమార్తెలకు హక్కులేదు అని హైకోర్టు తీర్పు చెప్పింది. పార్టిషన్ రిజిస్ట్రేషన్ కాలేదు అంటున్నారు కాబట్టి హైకోర్టు తీర్పు ప్రకారం కుమార్తెకు సమాన భాగం ఇవ్వాలి.

ఇంజరాపు రామారావు, (శ్రీకాకుళం)

ప్రశ్న : ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వారు ఇచ్చిన తీర్పును సంబంధిత అధికారులు అమలుపరచకపోయినట్లయిన సదరు తీర్పును అమలు పరచునట్లు ఆదేశించుటకు ఏ కోర్టులో ఏ రకమైన పిటిషన్ వేయవలెనో తెలియజేయగోరుచున్నాను.



ప్రశ్నలు జవాబులు



అడ్వొకేట్

బి. భాస్కరరావు

ఎం. ఎ., ఎల్. ఎల్. బి.

జవాబు : ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వారు ఇచ్చిన తీర్పును సంబంధిత అధికారులు అమలుపరచకపోయినట్లయితే కోర్టు ధిక్కార నేరము క్రింద చర్య తీసుకొనవలెను. కాని కంటెంప్ట్ ఆఫ్ కోర్టు క్రింద చర్య తీసుకొనవడానికి ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు అధికారం లేదని నాగేశ్వరరావు కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ 1987లో తీర్పు చెప్పింది. ప్రభుత్వోద్యోగులు కోర్టులో దావా వెయ్యవచ్చునని కూడా తీర్పు చెప్పింది. ఈ కేసులో వివరాలు "ప్రభుత్వోద్యోగులు దావా వెయ్యవచ్చును" అను హెడ్‌లైన్‌తో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించారు. పాత సంచికలు చూడండి. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వారి తీర్పును అమలు పరచినట్లయితే కంటెంప్ట్ ఆఫ్ కోర్టు క్రింద హైకోర్టులో పిటిషన్ పెట్టవచ్చును. లేదా కోర్టులో దావా వెయ్యవచ్చును.

శ్రీ కొండ నవీన్, (గూడూరు)

ప్రశ్న : భారతదేశం ప్రపంచ దేశాలలో ప్రజాస్వామ్య దేశాలలో పెద్దది. దుర్మార్గులను శిక్షించమని ఇంగ్లీషు చట్టాలు చెబుతాయి. కాని సజ్జనులను ఎక్కువగా సన్మానించమని చైనీస్ చట్టాలు పేర్కొంటాయి. 99 మంది పెద్దవారికి శిక్ష పడకున్నా ఒక మంచి వానికి పడకూడదని సూచించుతాయి. పైఏరెండు దేశాల చట్టాలు ఈ ప్రజాస్వామ్య చట్టాలలో చోటు చేసుకోవా?

జవాబు : చైనాలోని చట్టాల గురించి నాకు తెలియదు. కాని ఈ మధ్య విద్యార్థులు, యువతీయువకులు ప్రజాస్వామ్యం కోసం తిరుగుబాటు జరిపినందుకు విచారణ లేకుండా రెండు నెలల్లో రెండు లక్షల మందిని ఉరి తీసినట్లు పత్రికలలో వార్తలు వచ్చాయి. కాని మన భారతదేశంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీని హత్య చేసినందుకు 1984 నుండి సుదీర్ఘముగాకోర్టులలో విచారణ జరిపి 1989 జనవరిలో ఇద్దరిని ఉరి తీసినందుకు ఎంత ఆందోళన చేశారు? ఇక మన భారతదేశంలో మనము ఆమోదించిన చట్టముల ప్రకారం కోర్టులు తీర్పులు చెప్తున్నవి. భారతీయ సాక్ష్య చట్టము ప్రకారము సాక్ష్యాధారములు పరిశీలించి కోర్టులు శిక్షలు విధిస్తున్నవి. సాక్ష్యాధారముల ననుసరించి నిరపరాధికి శిక్ష పడవచ్చును. అపరాధి తప్పించుకొనవచ్చును. మన ప్రముఖ న్యాయవాదుల ప్రతిభవలన ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హంతకులలో ఒకరు అయిన బల్‌బీర్‌సింగ్‌ను సుప్రీంకోర్టు నిర్దోషి అని విడిచిపెట్టలేదా? కాని మిగిలిన ఇద్దరు హంతకులు సత్వంత్ సింగ్, కేహార్‌సింగ్‌ను మాత్రం ఉరి తియ్యవలెనని సుప్రీంకోర్టు 1988లోతీర్పుచెప్పింది. ●

కూపన్
ఆంధ్రసచిత్రవారపత్రిక
ప్రశ్న పంపినవారి పేరు..
పూర్తి చిరునామా..
.... పిన్‌కోడ్ ....

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ –19 : పాంచాల దేశాధీశుడు ద్రుపదుని కుమార్తె ద్రౌపదిని పంచపాండవులు పెళ్ళాడతారు. ధర్మరాజ పట్టాభిషేకానంతరం ఖాండవ ప్రస్థం చేరిన పాండవులు నారదుని సలహాపై రాజసూయయాగం నిర్విఘ్నంగా కొనసాగిస్తారు. మయ సభలో తనకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా దుర్యోధనుడు పాండవుల సంపదను, ద్రౌపదిని, పాండవులను జూదంలో గెలుచుకొని నిండు సభలో ద్రౌపదిని పరాభవిస్తాడు. ధృతరాష్ట్రుడు వీరికి దాస్య విముక్తి కల్పిస్తాడు. తిరిగి అనుద్యూతంలో ఓడిపోయిన ధర్మరాజు సోదరులతో కూడి అడవుల పాలవుతాడు. వేదవ్యాసుడు అనుగ్రహించిన ప్రతిస్మృతి విద్యతో అర్జునుడు దేవేంద్రుని అనుగ్రహం సంపాదిస్తాడు. ఆయన ఆదేశంతో శివుని సాక్షాత్కరించుకొని పాశుపతాస్త్రాన్ని పొందుతాడు. ధర్మరాజు ద్రౌపదిని, మిగిలిన సోదరులను తీసుకొని తీర్థయాత్రలకు బయలు దేరుతాడు.

ప్రొద్దున్నే ప్రయాణం.

దోవకడ్డంగా వున్న చిన్న చిన్న గుట్టల్ని ఎక్కి దిగుతూ, వాగులూ, కాలవలూ దాటుతూ సాయంత్రానికి అరిష్టషేణు ని ఆశ్రమం చేరారు.

ఆ ఆశ్రమం ముందు విశాలమైన ఆవ రణ వుంది. ముందువేపునే బృందావనం కూడా వుంది.

ఎవరో వచ్చారని ఆశ్రమంలో నుండి బయటకు వచ్చిన ముని, పాండవులకు అతిథి మర్యాదలు చేసి గౌరవించాడు. వచ్చిన వాళ్ళు పాండురాజు కుమారులూ, కోడలూ అని తెలిసి మరింత సంతోషించాడాయన. శిష్యుల్ని పిలిచి ద్రౌపదిని లోపలికి తీసుకువెళ్ళమని సూచించాడు. ఆ రాత్రికి అరిష్టషేణు ని శిష్యులు అన్నం, పప్పు, కూరలతో రుచికరమైన భోజనం వండి పెట్టారు.

ద్రౌపదిని 'అమ్మా' అని పిలుస్తూ శిష్యులంతా ఆమె వెంటే తిరిగారు. ముని, పాండవుల దుస్థితికి సానుభూతి తెలియ చేశాడు. ఇంద్రప్రస్థం వదిలాక ఇంతలా ఆప్యాయతని చవి చూడడం పాండవుల కిదే మొదటిసారి. ముని మాటలూ, ఆయన శిష్యుల పలకరింపులూ వాళ్ళని సేదతీర్చాయి.

కొంతకాలం అక్కడే వుండిపోయారు.

అక్కడ వున్నప్పుడే, అర్జునుడు దేవ లోకం నుంచి దివ్యాస్త్రాలతో తిరిగి వచ్చాడు. విజయుడు రావడంతో ద్రౌపది శరీరానికి ఏదో కొత్త బలం వచ్చి, ఇన్నాళ్ళుగా తను అనుభవిస్తూన్న బాధ, నిరాశ, నిస్పృహ..... అన్నీ ఒక్కమారుగా చిత్రంగా మాయమైపోయినయి.

పరమశివుని వద్దనుంచి పాశుపతాస్త్రం గ్రహించిన తరువాత అమరావతి లో వున్న ఈ అయిదేళ్ళలో జరిగిన విశేషాలను అర్జునుడు చెబుతుంటే ధర్మరాజూ, ద్రౌపదీ, భీమ, నకుల సహదేవులు సాంద్రమైన, ఉత్కృష్టమైన ఆనందం అనుభవించారు.

అర్జునుడు దివ్యాస్త్రాల ప్రయోగ ఉపసంహార ప్రదర్శనం కూడా చేసి చూపాడు.

ఆశ్చర్యాంబుదిలో మునిగిపోయారంతా అరిష్ట షేణు డు అర్జునుణ్ణి ఆశీర్వదించాడు.

* * * * * * *

అరణ్యవాసం పూర్తి కావస్తున్న సమయంలో నారాయణాశ్రమం విడిచి గంధ మాదనానికి, హిమాలయానికీ నమస్కరించి నెమ్మదిగా తీర్థయాత్రలు చేసు కుంటూ మళ్ళీ కామ్యక వనానికి చేరుకున్నారు పాండవులు.

పర్ణకుటీరంలో ఆలోచిస్తూ కూర్చున్న ధర్మరాజుకి ఉన్నట్టుండి గుర్రపుడెక్కల చప్పుడు వినిపించింది. బయటకు వచ్చి విన్నాడు. సందేహంలేదు. కాని ఇంత మిట్టమధ్యాహ్నం వేళ ఈ వనాంతర్భాగం లోనికి ఎవరొస్తున్నారబ్బా!

ధృతరాష్ట్ర కుమారులు కాదు కదా.... అయినా ఇంక తన దగ్గరేముందని దోచుకునేందుకు వస్తారు? రథచక్రాల చప్పుడు కూడా ఇప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది. రథం ముందుకు వస్తుంటే గుర్రాల కాలి గిట్టలు లేపిన దుమ్ము పైకి లేస్తోంది.

నిలుచున్న చోటునుంచి కదలకుండా 'అర్జునా, దూరంగా గుర్రపుడెక్కల చప్పుడు వినిపిస్తోంది. ఎవరో చూసిరా' అన్నాడు ధర్మరాజు.

భీమ, నకుల సహదేవులు కూడా అర్జునుడితోపాటు వెళ్ళారు. అర్జునుడు ఓ పెద్ద బండ ఎక్కి నిలబడ్డాడు.

అల్లంత దూరంలో రథం కనిపించింది.

తెల్లటి గుర్రాలతో, బంగారు గజ్జెలతో అలంకృతమయిన రథమది. ఆ రథ ధ్వని మేఘధ్వనిలా గంభీరంగా వుంది.

'వస్తోంది వసుదేవసుతుడిలా' వున్నా డన్నయ్యా అన్నాడు అర్జునుడు.

అందరూ పరుగెత్తుతూ ముందుకు వెళ్ళారు.

భీమార్జునులయితే బావను కౌగిలించుకుని కాని వదిలి పెట్టలేదు. కృష్ణుని ప్రక్కనే వున్న సత్యభామ వాళ్ళను చూసి బుగ్గలు సొట్టలు పడేలా సుతారంగా నవ్వింది. ధర్మరాజు ద్రౌపదీ సమేతంగా సత్యాకృష్ణులకు ఎదురువెళ్లి స్వాగతం చెప్పాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు పాదాలకు నమస్కరించాడు.

'కర్మ ధర్మ చక్రవర్తి! విజయోస్తు! దిగ్విజయోస్తు' అని దీవించిన ధర్మరాజు 'ఎన్నిరోజులయిందయ్యా నిన్ను చూసి. క్షేమమేనా?' అని పలకరించాడు.

కృష్ణుడు తల పంకించాడు.

పర్ణ కుటీరంలో కృష్ణాజినం మీద కూర్చోబెట్టారు కృష్ణుణ్ణి. ఎదురుగా దర్భ చాపలమీద ధర్మరాజాదులు కూర్చున్నారు. అరణ్యవాసం గురించీ, అడవి మృగాల మధ్య జీవనం గురించీ వాళ్ళు కృష్ణుడితో చెప్పుకున్నారు.

'ఆ దుర్యోధనుడి అసూయవల్ల కదూ మీకీ గతి పట్టింది' అని కళ్ళెర్ర చేశాడు కృష్ణుడు.

'ప్రయాణంలో బాగా అలసిపోయినట్టున్నావు బావా,' కాసేపు విశ్రమించు, వెళ్ళు భీమా, వంట ఎంత వరకొచ్చిందో చూడు, అని ధర్మరాజు అక్కడనుంచి లేచాడు.

ఆశ్రమ భోజనంలో విశేషమేముంటుంది? ఉత్త అన్నం, ఉడికించిన దుంపలు, మిగలపండిన అరటిపళ్ళు....

'ఎంత బాగున్నాయి' అంటూ అవే తిన్నారు సత్యాకృష్ణులు.



క్రీడారంగం క్విజ్

(1) స్త్రీల సింగిల్స్‌లోను డబుల్స్‌లోను గ్రాండ్‌స్లామ్ సాధించిన ఏకైక వనిత ఎవరు?
(2) 'ది హౌజ్ హౌ ఆఫ్ క్రికెటర్స్' అనే పుస్తకం వ్రాసిన ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత ఎవరు?
(3) స్త్రీల చదరంగంలో సంచలనం సృష్టిస్తున్న 'హంగరీ'కి చెందిన 'పోల్గర్ సిస్టర్' పేర్లేమిటి?
(4) 'డ్రో బీ', 'టగ్గా' అనే ముద్దు పేర్లు ఎవరికి ఉన్నాయి?
(5) 1981 లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో "అండర్ ఆ రమ్ బౌలింగ్" చేసిన బౌలర్ ఎవరు?
(6) 'సునీల్ గవాస్కర్'ని మొట్ట మొదటి సారి టెస్ట్ మ్యాచ్‌లో అవుట్ చేసిన బౌలర్ ఎవరు?
(7) వింబుల్డన్‌లో టైబ్రేకర్‌ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
(8) భారతదేశంలో మొట్ట మొదటి శీతాకాలపు క్రీడల పోటీలు ఎప్పుడు, ఎక్కడ జరిగాయి?
(9) 'హాకీ మాంత్రికుడు' 'ధ్యాన్‌చంద్' తమ్ముడు పేరేమిటి? (ఇతను కూడా ప్రముఖ హాకీ ఆటగాడు.)
(10) 1951 మరియు 1962 ఆసియా క్రీడల్లో భారతదేశానికి ఫుట్‌బాల్‌లో స్వర్ణపతకం లభించింది. అప్పుడు కెప్టెన్ ఎవరు?

–వీర జైకిరణ్

(జవాబులు ఈ సంచికలోనే)

ఆ సాయంత్రం-

వనం చూద్దామని బయలు దేరారందరూ.

ఆత్మ సంరక్షణార్ధం అర్జునుడూ, భీముడూ ఆయుధాలు కూడా వెంట తీసుకువెళ్ళారు. కొంత దూరం వెళ్ళేసరికి ఎత్తయిన గుట్టలు ఎదురయ్యాయి. ఆ గుట్టల మధ్య నుంచి నీటి పాయ ఒకటి ప్రవహిస్తోంది.

'మీరిక్కడే వుండండి' అని భీముడు నీళ్ళలోకి దిగాడు. లోతేం లేదు. కృష్ణుడు, సత్యభామ చెయ్యిపట్టుకుని నీళ్ళలోంచి నడచి వెళ్ళాడు. అది చూసి అర్జునుడు కళ్ళతోనే ద్రౌపదిని దగ్గరకు పిలిచాడు. ఆవిడా అతని చిటికెనవేలు పట్టుకుని నడిచింది.

'అక్కడ చూడు కృష్ణా'

కృష్ణుడు తలెత్తి చూశాడు.

మామిడి చెట్టును మధుమాలతీ లత తన చివురు చేతులతో చక్కిలిగిలిపెడుతూ పెనవేసుకుంటూ ఆలింగనం చేసుకుంటోంది.

'ప్రణయశీల అయిన యువతి చేతులు సాచి ఉన్నతుడయిన తన ప్రియుణ్ణి కౌగలించుకుంటున్నట్టు లేదూ!' అని కృష్ణుణ్ణి చుట్టుకోబోయింది సత్యభామ.

'ష్...' అని మెల్లగా చెవిలో ఏదో చెప్పాడు కృష్ణుడు. సత్యభామ సంబాళించుకుని పైట చెరగు రెండవ భుజం మీదగా ముందుకు తీసి సర్దుకుంది.

కొంచెం దూరం వెళ్ళేసరికి నీటి పడియల చుట్టూ మొగలి పొదలు కనిపించాయి.

ద్రౌపదీ, సత్యా ఆగిపోయారక్కడ.

ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

........ఏమమ్మా వదినా! నీ భర్తలకు నువ్వు తప్ప వేరే లోకం లేదు. ఒకరి తర్వాత ఒకరు నిన్ను చుట్టుకునే వుంటారు. జన్మ జన్మాల పుణ్యానికి ఫలితంగా నువ్వు లభించినట్టు నిన్ను వాళ్ళు నెత్తిన పెట్టుకుంటారు. ఏ వ్రతం చేస్తే, ఏ విధమైన రాసక్రీడ నేరిస్తే, ఏ మాత్రం ఉపాసిస్తే, ఏ విధంగా మూతి ముడిస్తే మొగుడు దోవకొస్తాడో కాస్త చెబుదూ అంది సత్య.

ద్రౌపది పెదవుల మీద పలచని నవ్వు పరచుకుంది.

ఏమీ అనలేక 'యేం పెంకెవు!' అంది.

నాకు పెంకెతనమూ, గడుసు దనమే వుంటే మీ అన్నయ్యకు పదహారు వేల మంది భామలూ, అష్టమహిషులూ వుండ

డా. యస్వీ భుజంగరాయశర్మ ...ది దీప మాలికలో ద్రౌపది గురించి వారు రాసిన వ్యాసాల నుంచి కొన్ని వాక్యాలను యథాతథంగా ఈ భాగంలో వాడుకుంటున్నాను. శర్మగారికి కృతజ్ఞతలు!

-రచయిత

కపోదురు' అంది సత్య నవ్వుతూ.

'ఎంత మంది వున్నా అహోరాత్రాలూ గుండెల మీద వాల్చుకుని, ప్రేమ సముద్రంలో ముంచి నువ్వు పెట్టిన నియమం అతిక్రమించకుండా, నువ్వు గీచిన గిరి దాటకుండా కృష్ణుణ్ణి నీ దాసుణ్ణి చేసుకున్నావుగా' అంది ద్రౌపది. ఆ మాటలకు సత్యనిలువెల్లా పులకించింది.

ఇద్దరూ నడుస్తూ ఒక చెట్టు క్రిందికి వచ్చారు.

'భామా మణీ! మందులూ, మాకులూ పెట్టాల్సింది మనం కాదు. ప్రేమ ఇవ్వడం, పుచ్చుకోవడం చేతగాని అడతనం లేని వాళ్ళు చెయ్యాల్సిన పనులవి, బెదిరించి, బుజ్జగించి, లాలించి, చుట్టుకుని, అలరించి కరిగించి తనివి తీరని సుఖాలలో ఊపిరి సలపనివ్వని లావణ్యరాశివి నువ్వు. నీ భర్త నిన్ను విడిచి క్షణం బ్రతకలేడు. నీకు దూరంగా నువ్వు అతన్ని క్షణం బ్రతక నివ్వవు. ఇక నా సంగతంటావా-నువ్వు ఎన్నయినా చెప్పు నీ అంత అదృష్టవంతురాల్ని మాత్రం కాదు.........'

ద్రౌపది కళ్ళల్లోంచి రెండు చుక్కలు చెక్కిళ్ళ మీదగా జారాయి.

సత్యభామ చూడలేదది.

'......ఒక్కరి విషయంలో మాత్రమే సాధ్యమయే ప్రేమను అయిదుగురి విషయంలోనూ ఎలా సాధిస్తున్నానని కదూ అడిగావు' అని ద్రౌపది, సత్యభామ ముఖంలోకి చూసింది.

సత్య విలాసంగా నవ్వింది.

'సత్యా! మగవాడి వలపు నిలుపుకోవడమే ఆడదాని విద్య' అంది ద్రౌపది.

సత్యకళ్ళు పెద్దవి చేసి వోరగా చూసింది ద్రౌపది కేసి.

'అర్ధం కాలేదా'

సత్య మాట్లాడలేదు.

'అస్తమానమూ మా అన్నయ్యను అంటిపెట్టుకుని తిరక్కు, కాసేపు కనిపించకుండా వుండు. ఆ మాత్రం బిగువు బెట్టు లేకపోతే యెలా?'

సత్య సిగ్గుతో తలవంచుకుంది.

'.........అబ్బబ్బ పరిహాసాలు చాలు కాని నువ్వు ప్రయోగించే ఆయుధాలేమిటో చెబుదూ' అంది.

'నిజం చెప్పనా వదినా! నేనెప్పుడూ అహంకారం, దురభిమానం దరిచేర నివ్వను.

పరుషంగా మాట్లాడను. ఎక్కడబడితే అక్కడ నిలబడాలనీ, అందరితోనూ వెకిలిగా మాట్లాడాలనీ నాకనిపించదు.

నా భర్తల తోటిదే నాలోకం. వాళ్ళకు రాజ్యం, భాగ్యం వున్నప్పుడు ఏ విధంగా వున్నానో ఇప్పుడూ ఈ అడవుల్లో అలాగే వుంటున్నాను.........

పరిహాస ప్రసంగ సమయంలో తప్ప నాభర్తల ముందు కూడా నేనెప్పుడూ నవ్వుతూ నిలబడను. గొప్పింటి దాన్నని, అందమైనదాన్ననీ అతిశయం లేదునాకు. ఆడదాని అందం అతిశయించేది మొగుడి కౌగిట్లోనే సత్యా! భర్త చేతుల్లో అనుక్షణం ఉక్కిరి బిక్కిరయ్యే ఆడదాని కన్నా అదృష్టవంతులెవరుంటారు చెప్పు?

ఇంకోమాట చెప్పనా! మగవాడి వలపు వూటబావిలాంటిది. యెప్పటికప్పుడు చేదుకుంటేనే వూట నిలిచేది. అలా అని కొంగున కట్టేసుకోవాలనుకోవడం కూడా తప్పే. ఎంత కోపమొచ్చినా, యేడుపొచ్చినా పైకి కనబడనీయను, నాకసలు అసంతృప్తే వుండదు. నా భర్తలు లేకుండా నేనెక్కడికీ వెళ్ళను. వాళ్ళు దేశాంతరం వెడితే నాకు అలంకారాలతో పనే వుండదు. వాళ్ళు నట్టింట తిరుగుతుంటే అపరిశుభ్రంగా అలంకార శూన్యంగా ఎప్పుడూ వుండను. నా భర్తల అవసరాలను దాసీలకు పురమాయించను.

నా అత్తింటి తరపు బంధువులు ఎవరొచ్చినా ప్రేమగా పలకరిస్తాను. నా భర్తలకూ నాకూ మధ్య దాపరికాలుండవు. వాళ్ళు నాకు ఏది చెప్పినా నేను పరమ రహస్యంగా వుంచుతాను.......' అని ద్రౌపది ఇంకా ఏదో చెప్పబోతుండగా

'మొత్తానికి నువ్వూ గడుసుదానివే' అంది సత్య.

'అవును, పాపం! నువ్వే వెర్రిబాగుల్దానివి' అంది ద్రౌపది నువ్వుతూ.

సత్యకూడా ముసిముసి నవ్వులు నవ్వింది.

అజ్ఞాత వాసం

అరణ్యవాసం పూర్తయింది.

ఇకమిగిలిందల్లా అజ్ఞాతవాసం.

పాండవులు విరాట నగరం వైపు నడుస్తున్నారు.

యమునా నది దక్షిణ తీరం వెంట సాగి సాగి దీశార్హ దేశానికి ఉత్తరంగా, పాంచాల దేశానికి దక్షిణంగా వెడుతున్నారు. అన్నదమ్ములైదుగురూ చూసేందుకు పిచ్చివాళ్ళలా వున్నారు. మీసాలూ, గడ్డాలూ పెరిగాయి. ఒంటేనిండా దుమ్ము కొట్టుకుని వుంది. బట్టలు పాతవైపోయాయి. చిరుగులు పడ్డాయి. రొప్పుతున్నారు. అయినా చేతనైనంత దృఢంగా అడుగులు వేస్తూ ముందుకు నడుస్తున్నారు.

ద్రౌపది పరిస్థితి మరీ దయనీయంగా వుంది. నడిచి నడిచి ఆమె పాదాలు నెత్తురోడుతున్నాయి. నేల మీది రాళ్ళూ ముళ్ళూ గుచ్చుకున్నప్పుడు బాధతో విల విల లాడుతోంది ఆ కోమలాంగి.

చెమటకారుతున్న ముఖం చందన లేపనం లేని శరీరం, ఆభరణాలు లేని అందాల మెడ అలంకారాలు లేని

శరీరం.......

పుత్తడి బొమ్మకు బూజుపట్టినట్టుంది. పాంచాల రాకుమారికి కలిగిన దురవస్థను చూసి అర్జునుడు కంట తడిపెట్టాడు.

"ద్రౌపదిని తమకిచ్చి పెళ్ళి చెయ్య కుండా గంగపాలు చేసినా బాగుండేది ద్రుప దుడు-"

మత్స్యదేశం సమీపిస్తుండగా అలస టతో కాళ్లు బరువెక్కి 'నేనింక నడవ లేను' అంది ద్రౌపది. ఆవిడ ఆ మాట అనంగానే అర్జునుడు ఆమెను భుజాలమీద ఎక్కించుకున్నాడు.

అందరూ నడుస్తున్నారు.

కాసేపటికి ఊరేదో దగ్గరవుతున్నట్టని పించింది.

ఆ త్రోవన అక్కడక్కడా మనుషులు కనిపించారు.

ద్రౌపది కిందకు దిగింది.

అన్నదమ్ము లయిదుగురు చెట్టునీడన చేరారు.

- ఇక విరాటరాజు దగ్గరకు వెళ్లాలి. అక్కడ ఆ రాజు ఎలా ఉంటాడో? ఆయన కొలువులో అజ్ఞాతవాసం ఎలా గడుస్తుందో?

అది తల్చుకునేసరికి ద్రౌపది హృదయం వణికింది.

రాబోయే ఏడుపును అపుకుంది.

ధర్మరాజు మౌనంగా అన్నివైపులా పరి కించి చూస్తున్నాడు.

మద్ది, పొగడ, చింతచెట్లు కనిపిం చాయి.

ఆ చెట్లమధ్య నడిచాడు.

ఆ చెట్లు దాటగానే పెద్ద జమ్మిచె ట్టొకటి కనిపించింది. దాని మొదలులో నిలబడి పైకి చూశాడు. చెట్టు కొమ్మలూ, ఆకులూ దట్టంగా వున్నాయి. ఏమనుకు న్నాడో ఏమో అర్జునుడ్ని పిలిచి 'మనం ఆయుధాలతో ఊళ్లోకి వెళ్తే ప్రజలు భయప డతారు: మనల్ని అనుమానించి మన మీద నిఘా వేస్తారు: అదీగాక విశ్వవిఖ్యాతమైన నీ గాండీవం చూడగానే నువ్వెవరో వాళ్లకి తెలిసిపోతుంది. ఇప్పటి నుంచి ఏడాది పాటు మన ఉనికెవరికీ తెలియకూడదు. అందుకని మన ఆయుధాలను ఈ జమ్మి చెట్టు మీద దాచి పెడ్దాం' అన్నాడు.

అర్జునుడు సరేనని ఆయుధాలన్నిటినీ కట్టగా కట్టి నకులుడికిచ్చాడు. అతను చర చర చెట్టెక్కి ఆయుధాల మూటను చిటా రుకొమ్మన బంధించి వచ్చాడు.

తరువాత అన్నదమ్ములందరూ గంగా నదిలో స్నానాలు చేసి ఎవరూ గుర్తుప ట్టేందుకు వీలులేకుండా వేషాలు మార్చు కున్నారు.

నదీ తీరంలో వున్న ఓ బండవెనక్కి వెళ్లి స్నానం చేసింది ద్రౌపది. కట్టు కున్న చీరను ఉతికి అక్కడే ఇసుకమీద ఆరేసుకుంది. అది ఆరాక దానినే మళ్లీ వొంటికి చుట్టుకుంది.

పాండవులు అక్కడే ఊరి చివరన కాపురం పెట్టారు.

ధర్మరాజు కంకుభట్టు వేషంలో విర టుడి అస్థానంలో ఆశ్రయం సంపాదించేం దుకు వెళ్లాడు.

రాజాధిరాజూ, రాజసూయయాగంచేసి రాజన్యులందరినీ గెలిచి ఖ్యాతిగొన్న మహ నీయుడూ మరొకరివద్ద ఊడిగం చేసేం దుకు వెళ్లాడు. వెళ్తుంటే ద్రౌపది భోరున ఏడ్చింది.

విరాటుని కొలువు

మత్స్య దేశాధిపతి విరాటరాజు కొలువు తీరి వున్నాడు. ముదిమి వయస్సు లోవున్నా మహా బలశాలిలా వున్నాడు. సువ ర్ణమయమయిన కేయూరాలనూ, కుండలా లనూ, బంగారు తీగతో చుట్టిన రత్నహా రాలనూ ధరించిన రాజు సభామధ్యంలో ఎత్తయిన సింహాసనంమీద కూర్చున్నాడు.

సభా వాకిటనే నిలబడ్డాడు కంకు భట్టు.

మహారాజు అయనను తదేకంగా చూసి 'ఎవరు మీరు?' అని ప్రశ్నించాడు.

'ప్రభూ! సర్వ సంపదలూ కోల్పో యిన విధివంచితుడ్ని. మీ సేవకోసం వచ్చాను' అన్నాడు కంకుభట్టు.

'మీ పేరు...?'

'మహారాజా! నన్ను కంకుభట్టని పిలుస్తారు. విప్రుడ్ని. ద్యూత విద్యలో నేర్పరిని, పాచికలాడడంతో పాటు జ్యోతిషం, పక్షి శకునం, వేద వేదాం గాలు, నీతిశాస్త్రం కూడా తెలుసు నాకు. పూర్వం ధర్మరాజు కొలువులో వుండే వాడ్ని.' అన్నాడు.

విరటుడు సరేనని కంకుభట్టుకు తన అస్థానంలో రాజోద్యోగిగా పని కల్పించాడు.



ప్రయాగ రామకృష్ణ సీరియల్

1. జూద మందిరంలో ద్రౌపది'కి జరిగిన అవమానానికి ముఖ్య కారకులు ఎవరు?- ఎందుచేత?
2. ద్రౌపది- కుంతి- ఈ సీరియల్ చదివి యీ "ఇద్దర్ని" పోల్చి వ్రాయండి!

నిబంధనలు!

* మీరు వ్రాసే వ్యాసం [illegible] మించకూడదు. [illegible] అక్షరాలు విడి విడిగా వుండాలి-
* ఈ ప్రశ్నలు కూపన్‌తో సహా మీవద్ద వుంచుకోండి! త్వర లోనే మరో రెండు ప్రశ్నలు మరో కూపన్ ప్రకటి స్తాము-
* ఆ కూపన్ (2)తో పాటు మరి రెండు ప్రశ్నలు కూడా వుంటాయి. మొత్తం నాలుగు ప్రశ్నలతో [illegible] కూపన్‌లు రెండూ పెట్టడం మరిచిపోకండి!
* వ్యాసాలలో ఉత్తమమయిన వాటికి [illegible]
1) [illegible], 2) [illegible] 3) [illegible] 4) [illegible]

కంకుభట్టు చేరిన కొన్నాళ్ళకే భీముడు వలలుడనే పేరుతో వంటల వాడిగా రాజు గారి దగ్గరకొచ్చి 'నరాధిపా! నేను మీ రాజ మందిరంలో వంటపని అడగాలని వచ్చాను, నేను వంటలు బాగా చేస్తానని అందరూ మెచ్చుకుంటారు. ఇదివరకెన్నడూ మీరు చవిచూడని కమ్మని పదార్థాలు వండిపెడ తాను. పాకశాల పనులన్నీ నేనే చూసు కోగలను. అడవుల నుండి కట్టెలు కొట్టి తెస్తాను. మీ కొలువు చూడడానికి వచ్చే మల్లయుద్ధ ప్రవీణు లతో కుస్తీపట్లు పట్టి వాళ్లను ఓడించి మీకు సంతోషం కలగచే స్తాను. నాకు ఆశ్రయ మివ్వండి' అని ప్రాధేయపడ్డాడు.

విరటుడు కాదన్లేకపోయాడు.

ఆ తర్వాత అర్జునుడు, విరాటరాజు అంతఃపుర స్త్రీలకు సేవచేసే నపుంసకు డిగా మారిపోయి బృహన్నల అనే పేరుతో రాణివాసం చేరాడు. అర్జునుడు ఆడ,మగా కాకుండా పేడి మొహంవాడు అయిపోవా లని పూర్వం ఊర్వశి అతనికో శాపం ఇచ్చింది. దివ్యాస్త్రాలకోసం అర్జునుడు ఇంద్రలోకానికి వెళ్లినప్పుడు ఊర్వశి అతన్ని మోహించింది. అతని పొందుకోరింది. 'నువ్వు నా తల్లి వంటిదానివి. నీతో నాకు పొందేమిటి?' అని అర్జునుడు తిర స్కరించాడు. అప్పుడు ఆమె కోపించి 'నీకు పురుషత్వం పోవుగాక' అని శపించింది. ఇంద్రుడి కిది తెలిసి 'ఈ శాపం ఎప్పుడు నీకు అవసరమైతే అప్పుడు ఒక ఏడాది పాటు అనుభవించు' అని అర్జునుడ్ని అను గ్రహించాడు. ఆ శాపం ఇప్పుడు పాండవ మధ్యముడికి వరమైంది. తెల్లశంఖంతో చేసిన గాజులు తొడుక్కున్నాడు. జడ వేసు కున్నాడు. రవిక తొడుక్కున్నాడు. ఆట ఆడుతూ, పాట పాడుతూ అంతఃపుర కాంతలను నవ్విస్తున్నాడు. లోకానికంతటికీ పరాక్రమంలో వాసుదేవుడికి సాటియని కీర్తి కెక్కిన వీరుడూ, భరత వంశ కులదీప కుడూ, మేరు సమానధీరుడూ అయిన అర్జునుడు తనకు తానై విరాటరాజు కొలు వుకుపోయి 'నేను నపుంసకుడ్ని, నన్ను మీ అంతఃపురంలో నాట్యాచార్యుడిగా నియమిం చుకోండి' అని కోరడం... అరచేతుల్లో ముఖాన్ని దాచుకొని ఏడ్చింది ద్రౌపది.

ఏడ్చి ఏడ్చి ప్రాణాలు కడబట్టాయి. ఇక ఏడ్చేందుకు కూడా ఆవిడకూ శక్తి లేదు.

.... నకులుడు దామగ్రంథి అనే పేరుతో విరాటరాజు అశ్వశాలలో పనికి కుదిరాడు. సహదేవుడు తంత్రిపాలుడుగా పేరుమార్చుకుని రాజుగారి పశువులశాలలో ఆవులూ, ఎడ్లూ మేపుతున్నాడు. ద్రౌపది విరటుడి అంతఃపురంలో మహారాణి దగ్గర పనిచేసేందుకు పరిచారికగా కుదిరింది. రాజకాంతలకు సపర్యలు చేస్తూ వాళ్లకు తలలు దువ్వుతూ, జడలు వేస్తూ, రాజ పత్ని సుదేష్ణకు అంతరంగిక సేవకురాలిగా వ్యవహరిస్తూ సైరంధ్రిగా కాలం గడుపు తోంది.

పాంచాల రాకుమారీ, పాండవ పట్ట మహిషీ చివరికి దాసిగా మారింది.

(ఇంకా వుంది)

'శకుని'



దేశవ్యాప్తంగా ప్రసారం అవుతూ అందరి మన్ననలు అందుకుంటున్న మహాభారత్ టి. వి. సీరియల్‌లో శకుని పాత్రధారి గుఫీ పైంతాల్ పాత్ర ఎందరి ప్రశంసలో అందుకుంటున్న విషయం పాఠకులకు తెలిసినదే.

ఈ సీరియల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్న గుఫీ తన క్యారెక్టర్ (శకుని)ను తనే వ్రాసుకున్నాడట. కానీ నటీనటుల ఎంపికలో గుఫీ పైంతాల్ కిరికిరి చేస్తుంటాడట. శ్రీ చోప్రాకి ఈ విషయం తెలిస్తే గొడవవుతుందేమో అని వాళ్ళు వదిన కంగారు పడిపోతోందట. అన్నట్టోను శకుని వేషాలే నన్నమాట... ష్...!

"ద్రౌపది" – వ్యాసరచన పోటీ (1)

కొన్ని చిన్న బహుమతులు వుంటాయి!

* పోటీ వివరాలు కూడా మీకు "సీరియల్" పేజీల్లోనే త్వరలో దొరుకుతాయి!

ఈలోగా మీరు కూపన్ (1) కత్తిరించి దాచుకొని ప్రశ్నలు కూడా తీసుకొని సీరియల్ చదువుతూ సంసిద్ధులు కండి!

* బహుమతుల పోటీ! కూపన్ 2 వచ్చే దాకా మీ వ్యాసాలు పంపకండి! కూపన్! కత్తిరించి దాచండి!

బహుమతుల సమర్పణ: వాగేశ్వరి పబ్లికేషన్స్, విజయవాడ-2, కూపన్ 2కై ఎదురుచూడండి.

-ఎడిటర్




ద్రౌపది కూపన్ నెం. 1

మీ పేరు . . . .

చిరునామా . . . .

. . . .

కథల వర్క్‌షాప్ 4



హనీమూన్ ఛలో!

ఒరేయ్ సుబ్బారావ్!

మేము క్షేమము. ముఖ్యముగా మేము ఈనెల 16వ తారీఖున హైదరాబాద్ వస్తున్నాము మా ఫ్రెండ్ కూతురి పెళ్ళి నిమిత్తము. ఎలాగో మీరు బయలుదేరారు కదా. మేము ఎప్పుడూ హైదరాబాద్ చూడలేదు. కనుక మీతో కూడా మేమూ వస్తాము అంటున్నారు మీ అత్తయ్య, మా పిల్ల సైన్యమూను. కాబట్టి మీ ఆఫీసర్ యిస్తాడో యివ్వడో సెలవు అని ముందుగా ఈ ఉత్తరం వ్రాస్తున్నా. ఓ పది రోజులు సెలవ్ పడేసి, మాకు హైద్రాబాద్ చూపించు.

ఇట్లు ప్రేమతో
నీ పెద్దాపురం పెదమామయ్య.

ఒరేయ్ సుబ్బులూ!

నేను క్షేమము. ముఖ్యముగా నా ఆరోగ్యం ఏమీ బాగోడం లేదు. అందుకే ఓ పదిరోజులు నీదగ్గర వుందామని ఈనెల 16వ తారీఖున నీదగ్గరకు వస్తున్నాను.

ఇట్లు
నీ లక్ష్మీపురం అత్తయ్య

ఒరేయ్ సుబ్బిగా!

పెళ్ళి చెప్పాపెట్టకుండా చేసుకుని హైద్రాబాద్ చెక్కేసావ్! సరేలే. మొన్న మీనాన్న గారు కన్పిస్తే నీ అడ్రస్ అడిగి తీసుకున్నా. ఈనెల 16వ తారీఖున నీ దగ్గరకు వస్తున్నా. మన "వెంకీగాడితో" సహా-ఓ పదిరోజుల సెలవ్ పడేయ్ ఈ ఫ్రెండ్ గాళ్ళకోసం.

ఇట్లు
నీ కామిగాడు

ఒరే అన్నాయ్!

నేను, అమ్మ, నాన్న, మన ప్రక్కింట్లో అద్దెకుంటున్న భాస్కరం అంకుల్, ప్రీతి ఆంటీ, బబ్లూగాడు ఈనెల 16వ తారీఖున నీ దగ్గరకు వస్తున్నాము. కాబట్టి నీవు ఓ పదిరోజులు సెలవ్ పడేయ్. అన్నట్టు 16వ తారీఖు ఉదయం 10 గంటలకు స్టేషన్‌కి రావడం మర్చిపోకు.

ఇట్లు నీ తమ్ముడు
సతీష్

అప్పుడే పోస్టులో తన పేర్న వచ్చిన ఆనాలుగు ఉత్తరాలు చదివి నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు సుబ్బారావ్.

తన పేర్న వచ్చిన ఉత్తరాన్ని నవ్వు ముఖంతో చదివేసుకుంటున్న భార్యనడిగాడు సుబ్బారావ్ "నీ ఫ్రెండ్ ఏం వ్రాసింది" అని.

తన ఫ్రెండ్ ఈనెల 16వ తారీఖున తనను చూడడానికి వస్తున్నట్టు ఆనందంగా చెప్పింది అతని భార్య లలిత. భార్యను దగ్గరకు పిలిచి తన పేర్న వచ్చిన నాలుగు ఉత్తరాలను కూడా చదివించాడు. ఉత్తరాలు చదివి లలిత కూడా నీరసంగా మరో కుర్చీలో కూలబడిపోయింది.

అవును మరి, ఆ అయిదు ఉత్తరాల్లోని సారాంశం ఒకటే.

క్రొత్తగా పెళ్ళయిన సుబ్బారావు దంపతులు ఎలాగో చిన్న చిన్న ఉద్యోగాలతో రాజధానిలో బ్రతికేస్తుంటే పులి మీది పుట్రలా ఒక్కసారిగా వచ్చిన ఈ ఉత్తరాలను చూడగా చూడగా వారికో బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది. వస్తామని వ్రాసిన చుట్టాలు వస్తారు.. డబ్బు ఖర్చవకమానదు. వళ్ళు గుల్లవక మానదు వారికి చేసి పెట్టేక. తమకెలాగూ క్రొత్తగా పెళ్ళయింది. హనీమూన్ సరదా తీరలేదు కాబట్టి...చుట్టాలు రాకముందే "హనీమూన్ ఛలో" అనుకుని జామ్మంటూ హనీమూన్ వెళ్ళిపోయారు, సుబ్బారావు లలితలు.

-దగాని సుధ

బాబోయ్!... దెయ్యాల కథల పోటీ!

ఆంధ్రసచిత్రవారపత్రిక

రూ. 3000 బహుమతులు!

ఈసారి దీపావళికి-కొత్తరకం కథల పోటీ పెడుతున్నాం!

మూడే కథలు మూడేబహుమతులు !

మొదటి బహుమతి రు. 1300లు. అక్షరాల పదమూడు వందల రూపాయలు

రెండవ బహుమతి రు. 1000 లు. వెయ్యి రూపాయలు అక్షరాలా

మూడవ బహుమతి రు. 700లు. అక్షరాల ఆరున్నొక్క వందల రూపాయలు.

సూచనలు నిబంధనలు గట్రా :

తేట తెనుగులో తెనుగుదేశ వాతావరణంలో

1) ఉత్కంఠ భరితంగా 2) చమత్కారయుతంగా 3) కొసవిరుపో తుదిమెరుపో ఉండేలాగా

ఆరు అరఠావులకి తగ్గకుండా పన్నెండు అరఠావులకి దాటకుండా " కథ" అల్లాలి!

* మూఢనమ్మకాలు గాఢనమ్మకాలు అనే తర్కవితర్కమేల? కథ లక్షణాలున్న చదువుతున్నంతసేపు వెనక్కు తిరక్కుండా చదివించగల కథలు రాయండి!

* ఈ కొత్తరకం కథల పోటీ మీ ఉపజ్ఞకి ఊహకి అనుభవానికి కూడా ఒక సవాల్‌గా భావించండి తప్ప దెయ్యాలున్నాయా? లేవా? అన్న ' రీసెర్చి' అనవసరంగా మొదలెట్టకండి!

* మీరంతా టాలెంటున్న రచయితలు అటా? యిటా? అన్న సమస్య లేకుండా ఒకే 'యిటు' ఆంధ్రసచిత్ర వారపత్రికకి పంపగల కథలు మీచేత రాయించాలనే మా యీ ప్రయత్నం! విజయీభవ అంటూ బయలుదేరండి! కవరు మీద 'దెయ్యాల కథల పోటీ కోసం' అని వ్రాయండి !

షరాలన్నీ మామూలే: కథ కాపీ కారాదు. ప్రచారం ప్రసారం ప్రచురణ అయినది కారాదు. పూర్తి చిరునామా తప్పక యిచ్చునది, హామీ పత్రం పెట్టునది అయివుండాలి. మరువకండి.

-ఎడిటర్
ఆంధ్రసచిత్రవారపత్రిక

కథలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగర్, విజయవాడ-520 003.

ముగింపు తేదీ : 7 అక్టోబరు 1989

చేసిన నేరం యేమీ లేదు

కాళూరి వెంకటరామారావు

"అమ్మడూ! నాన్నగారొచ్చారేమో, ఒక్క మారిల్లా రమ్మనూ"

"ఇంకా రాలేదు. ఈ వేళ ఆలస్యంగా వస్తారు కాబోలు" అని ఒక పదిహేను సంవత్సరాల బాలిక చక్కని తాటాకుల కుటీరం ముందున్న మాలతీ పందిట్లో నిలబడి తల్లికి జవాబు చెప్పింది.

అస్తమిస్తూ వున్న సూర్యకిరణాలు ఆ అమ్మాయి సుకుమార మూర్తి మీద ప్రసరిస్తున్నాయి. కుటీరం చుట్టూ వున్న పూల మొక్కలూ, పైగా కనుచూపు మేర వ్యాపించివున్న శాద్వల స్థలాలూ సూర్యకిరణ ప్రవాహంలో మునిగి మనోహరంగా వున్నాయి. గాలి చేత పూలమొక్కలన్నీ తలలూపుతున్నాయి. రంగురంగుల సీతాకోకచిలకలు తోటలో అన్ని వేపులా యెగురుతూ పాఠశాలలో నుండి విడిచిపెట్టబడిన బాలికలలాగు కళ్ళ పండువుగా వున్నాయి.

కుటీరానికి ముందుగా ఒక ఫర్లాంగు దూరంలో గోదావరినది నిర్మల జలంతో ప్రవహిస్తున్నది. నదికి తూర్పుగా నున్న పర్వతాలు సంధ్యాకాంతిలో యెర్రగా కనపడుతున్నాయి. పడమటి గట్టున వున్న కొండల నీడలు క్రమంగా పొడుగులై తూర్పు వేపు కొండల మీద పాకుతున్నాయి. ఆ అమ్మాయి ఆవరణ గేటులో కూచుని గోదావరి యిసక తిన్నెల వేపు చూస్తోంది.

సాంధ్యరాగం పోయి సన్నని చీకట్లు వస్తున్నాయి. అప్పుడిద్దరు పురుషులు చురుగ్గా నడుస్తూ యిసక తిన్నెలను దాటి కుటీరం దగ్గరకి వచ్చేరు. బాలిక " నాన్నగారూ" అని పవిత్ర్యంగా పలికింది.

"ఏమమ్మా!" అని ముందుగా నడుస్తూ వున్న యాతడు కూతురుకి బదులు పలికిన తర్వాత వారందరూ లోపలికి వెళ్లారు.


"రంగాచార్లూ! ఇలా కూర్చోవోయ్ ఈ కుర్చీమీద," అని గృహ యజమాని తనతో వచ్చిన యువకుడితో చెప్పి హాలులో వున్న కుర్చీ చూపెట్టి తనూ ఒక కుర్చీ మీద కూచున్నాడు.

ఆ హాలు కొంచెం విశాలమైందే. అందులో నాలుగేదు పడక కుర్చీలూ, రెండు పేము కుర్చీలూ వున్నాయి. మధ్యగా ఆరు పలకల మేజాబల్ల (హెగ్జాగోనల్ 'టేబుల్) ఒకటి వుంది. దాని మీద రంగు రంగుల పువ్వులు కుట్టిన గుడ్డ ఒకటి పరచి వుంది. ఆ బల్ల మధ్య ఒక చక్కని పింగాణీ కూజాలో రకరకాల పువ్వులు ఆకుల మధ్య అందంగా అమర్చబడి వున్నాయి. ఇంటినడికప్పుకి వేలాడుతూ ఒక ఇనుపగొలుసుకి తగిలించబడి ఒక "హ్యాంగింగ్ లైట్" మంచి కాంతితో హాలుని పూర్తిగా నింపేస్తూంది.

వాళ్లిద్దరూ అల్లా కూచుని యిష్టాగోష్టి మాట్లాడుకుంటూ వుండగా లోపలి నుంచి ముప్పైయైదు సంవత్సరాలు వయస్సు గల స్త్రీ వచ్చి "వంట అయింది మడి కట్టుకోవచ్చు" అని చెప్పింది.

ఆవిడ అట్టే పొడుగు పొట్టీ కాకుండా సమానమైన యెత్తు గలిగివుంది. శరీరం

కథల కాణాచి





పండుతమలపాకులాగ కాంతివంతమైంది. కొద్ది గా స్థూలకాయం. చుట్టూ జరీపుడకంచు యెర్రపట్టుచీర కట్టుకుంది. చేతులు పొట్టిగా కత్తిరించిన దక్షిణాది రవిక తొడుక్కుంది. ముఖం తెలివితేటలనీ, ప్రసన్నతనీ, సూచిస్తున్నది. మెడలో రెండు వరసల గడియారపు గొలుసు ఒకటి తప్ప వేరే నగలు లేవు. నాగరికతా పరిచయం కలిగి ఆమె ఒక పెద్ద ఉద్యోగస్థుడి భార్యలాగుంది.

ఆవిణ్ణి చూసి గృహయజమాని "ఇదిగో చూసావా? ఇతను మన రామానుజాచార్లు గారి కొడుకు. రాజమండ్రీలో రెండేళ్ళ క్రితం 'ఇంటర్' చదువుతూ వుండేవాడు మొన్ననే కాలేజీకి సెలవు లిచ్చారు కదూ! ఈ ఉదయం లాంచిమీద 'శ్రీరామగిరి' వచ్చాడు" అన్నాడు.

ఆవిడ యిదంతా విని, "అలాగా? ఈ యేడు బి.ఎ. పరీక్షకి వెళ్ళాట్టగదూ యితనూ?" అంది.

"అవునవును. అన్నట్టుగా మరిచిపోయాను. రంగాచారీ! పేపర్లన్నీ బాగా రాశావా?"

"అ బాగానే రాశానండీ. కాని యీ యేడు కెమిస్ట్రి పేపరు కొంచెం టఫ్‌గా వుంది లెండి.' '

"ఊహూ, యిప్పుడు లోకనాథయ్యరేనా ప్రిన్సిపాలు? సోమనాథరావు గారేనా హాస్టల్ వార్డెను? విశ్వేశ్వరయ్యరు అనంతపురం నుంచి మళ్లా వచ్చాడా? పాపం, మంచి వాడు సుమా! అరవల్లో పుట్టదగ్గవాడుకాడు"

పై విధంగా ప్రశ్నలడుగుతూ, రంగాచారి చెప్పే సమాధానాలు వింటూ కొంత సేపు మాట్లాడుకున్న తరువాత, ఆయన "ఏమోయ్ ఈ పూటిక్కడ వుండిపో, పొద్దు పోయింది! ఇట్ ఈజ్ టూ లేట్ టు గో హోమ్ నవ్" అన్నాడు.

రంగాచారి "పరవాలేదులెండి. ఎంత సేపూ? ఎంతో దూరం గనుకనా?" అని కళ్లజోడు తీసి తుడిచి, మళ్ళా పెట్టుకుని "ఇట్ ఈజ్ ఓన్లీ ఎ మేటర్ ఆఫ్ హాఫ్ ఎ మైల్" అన్నాడు. మరి అయిదు నిమిషాలలో రంగాచారి గృహోన్ముఖుడైనాడు.

* * * * * * *

నారాయణమూర్తి చిరకాలం రాజమహేంద్రవరంలో ప్రభుత్వ కళాశాల ప్రొఫెసరుగా పనిచేసి విద్యాధికుడని పేరు పొందిన వాడు. ఉద్యోగం నుంచి విశ్రాంతి తీసుకుని రెండేళ్లు మాత్రమే అయింది. అతను బాగా ఆరడుగుల పొడుగు మనిషి. బక్కపల్చగా వుంటాడు. శరీరం పచ్చని నిమ్మపండు రంగు. తల చాలా భాగం నెరిసిపోయింది. నేత్రాల్లోని కాంతులు కళ్లజోడు అద్దాలు దాటి పైకి ప్రకాశిస్తూ వుంటాయి.

"చేసిన నేరం యేమీలేదు"

విశ్రాంతి తీసుకున్న తర్వాత జన సమూహాలతో క్రిక్కిరిసి ఉండే పట్నాలంటే అతనికి తలనొప్పిగా తోచింది. ప్రకృతి సౌందర్యం నిండివుండే నిర్జన స్థలం ఏదైనా చూసుకొని అక్కడ పరమేశ్వర ధ్యానంలో, శాంతంగా తన జీవిత శేషాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు. తినడానికి కావలసినంత ధనముందీ అది వెచ్చించుకుంటూ భార్యతోనూ, యేక పుత్రికతోను ప్రశాంతమైన జీవనం గడపాలని అతని అభిప్రాయం.

గౌతమినది దక్కను పీఠభూమి దాటి, తూర్పు కనుమలను చీల్చుకుని సముద్రంలో కలుస్తోంది. మెలికలు మెలికలుగా తిరుగుతూ కొండల్లో రమారమి యెనిమిది మైళ్ల పొడుగుంది ఆ మహానది. తూర్పుకనుమల మధ్య గోదావరి తీరాన్ని "శ్రీరామగిరి" అని ఒక చిన్న పల్లె ఉంది. ఇక్కడ కొండమీద ఒక పురాతన దేవాలయం ఉంది. శ్రీరామచంద్ర మూర్తి దక్షిణానికి వెళ్లేటప్పుడు ఈ పర్వతమ్మీద కొంతకాలం నివసించేడని యిక్కడ ప్రజలు భక్తితో చెపుతూ ఉంటారు.

'శ్రీరామగిరి' లెక్క పది కోయ కొంపలు గల కుగ్రామం. ఊరు దాటితే తూర్పున ఉన్నతాలైన పర్వతాలూ, మహారణ్యమూ వుంటాయి. పడమట చెప్పలేనంత లోతులో గోదావరి గంభీరంగా ప్రవహిస్తూ వుంటుంది. పర్వతమ్మీద స్వామివారి ఆలయం వుంది. ఆలయం చిన్నదైనా అందమైంది. ప్రకృతి శోభలో తెప్పతేల్తూ వున్న స్థలంలో కట్టబడ్డంచేత దాని అందం ద్విగుణీకృతమైంది. గౌతమీనది తన శీతల శీకరాచ్ఛాదనం చేతనే నిత్యమూ తన్ను సేవిస్తూవుండగా, నదిలో పడవలమీద ప్రయాణం చేస్తూ నమస్కారాలు చేసే భక్తుల ప్రార్థనలు వింటూ వుంటాడు స్వామి పర్వతం మీద నుంచి. ఎక్కడ దేవాలయాలు కట్టినా దూరదృష్టిగల పూర్వులు సృష్టిశోభ అపరిమితంగా ఉండే స్థలాలే యేరి కట్టారు. ఆ నెపాన్నైనా మానవుడు ఒక్కసారి సర్వేశ్వర స్వరూపమైన ప్రకృతిని సందర్శిస్తాడుగదా అని మన పెద్దల ఆశ. గ్రామంలో నుంచి పర్వతమ్మీదకి చక్కని మెట్ల వరుస వుంది. అక్కడా అక్కడా కొన్ని సోపానాలు మాత్రం శిథిలావస్థలో వున్నాయి. ఒక్కసారి స్వామి ఆలయం వరకూ ఎక్కి ఆ మహోన్నత పర్వతాలవేపు అగాధమై మందగమనాన్ని వేంచేస్తూవున్న గౌతమీ తల్లి వేపు ఒక్కసారి చూస్తేచాలు, జన్మ ధన్యమైపోతుంది. ఆ దృశ్యం మళ్లీ వెయ్యిజన్మలకైనా మరుపునకు రాదు? చూపుమేర నదీ సైకతాలేకదా! ఈ వేపు తిరిగితే అన్నీ పర్వతాలూ, అరణ్యాలేకదా! మహాశక్తి స్వరూపమైన ప్రకృతి తప్ప కలుష దుర్బలుడైన మానవుడు మనకక్కడ కనబడడు.

స్వామి అర్చకుడు రామనుజాచార్లు ఒక్కడిదే ఆ ఊళ్లో బ్రాహ్మణ గడప.

నారాయణమూర్తి శ్రీరామగిరికి ఒక అరమైలు దూరంలో నదీతీరాన్న తన కుటీరం కట్టుకున్నాడు. ఉదయాన్నే లేచి స్నానంచేసి పర్వతమ్మీద దర్శనం చేసుకొని, యేడు గంటలయ్యేసరికి కుటీరం చేరుతూ వుంటాడు. అతని కిందులో పుణ్యమే కాకుండా మార్నింగ్ వాక్ కూడా కలిసివస్తుందట. తరవాత కాఫీ; గంటసేపు అమ్మాయికి చదువూ; భోంచేసి సంస్కృత గ్రంథ కాలక్షేపమూ; సాయంత్రం యిసక తిప్పల పైకి షికారూ. అప్పుడప్పుడూ అమ్మాయిని కూడా షికారుకి తీసుకుపోతూ వుంటాడాయన. ఆయన భార్య సుందరమ్మ ఎప్పుడో కాని వెళ్లేది కాదు.

పర్వదినాల్లో నారాయణమూర్తి కుటుంబ సహితంగా స్వామి దర్శనంచేసి, కొండ మీద నుంచి విశాలసైకత స్థలాలూ, ఆకాశాన్నంటుతూ వున్న తూర్పు కనుమలూ మొదలైన ప్రకృతి వైభవాలు భార్యకీ, అమ్మాయికీ చూపించి తాను సంతోషిస్తూ వుంటాడు.

మధ్యాహ్నం పనులు చక్కబెట్టుకొని, సుందరమ్మ కూతురికి వీణవాయిద్యం నేర్పి, భాగవతం చదివించుకొని వింటూ వుంటుంది. ప్రవాహపు రోజుల్లో కుటీరపు గవాక్షాల్లోనించి ఆ చిన్ని కుటుంబం నదీ శోభను తిలకిస్తూ వుంటుంది.

**** *** *** ** ***

దేవాలయానికి సాలీనా మూడువేల రూపాయిల రాబడి వుంది. అందులో రెండు వేలు వచ్చేభూమి అర్చకుడిది. మిగిలినది నిత్యభోగానికయ్యే ఖర్చుకీ, స్వామి నౌకర్లకీ వినియోగపడాలని రాగిపట్టాలున్నాయి.

రామానుజాచార్లకు ఒక కొడుకూ, ఒక కూతురూనూ. కొడుకు పేరు రంగాచార్లు, కూతురు పేరు నాంచారు. చుట్టు పక్కల కోయవాళ్లకి రామానుజాచార్లు చెప్పిందే వేదవాక్యం. రెండు వేల రూపాయల రాబడి వున్నప్పటికీ రూపాయేనా మార్చవలసిన అవసరం లేకుండా అతనికి అన్ని వస్తువులూ వాళ్ల వల్ల సప్లయి అవుతాయి. చెయ్యి చూసి ఏదో మాత్ర యివ్వడం వరకు అతనికి వైద్యం తెలుసును. కోయ కొంపల్లో జ్వరం వస్తే చాలు, నామాల సంచీ, అతనూ ప్రత్యక్ష్యం, అతని మంచి మనస్సే అతని మాత్రలకి శక్తి యిస్తోందని యెరిగిన వాళ్లు అంటారు.

దగ్గిర భద్రాచలంలో కొడుకుని స్కూలు ఫైనలు పాస్ చేయించి రాజమండ్రి కాలేజీలో ప్రవేశపెట్టాడు రామానుజాచార్లు. రంగాచారి యిప్పుడు బి.ఏ. చదువుతున్నాడు. నారాయణమూర్తి కాలేజీలో ప్రొఫెసరుగా వున్నప్పుడు యఫ్.ఏ.చదువుతూ వుండేవాడు.

రామానుజాచార్లు భార్య కుమార్తెతో కలిసి అప్పుడప్పుడు ప్రొఫెసరు గారింటికి వొస్తూపోతూ వుంటుంది. సుందరమ్మ కూడా నాలుగైదురోజులకో మాటు ఆచార్లు గారింటికి వెళ్లి ఆయన భార్యతో ముచ్చటించి వస్తూ వుంటుంది.

దగ్గిర బ్రాహ్మణ సహవాసం వేరే లేకపోవడం వల్ల ఆ రెండు కుటుంబాలూ చాలా అన్యోన్యంగా వుండేవి.

మన 'ఆధునిక కథ' లేదా కథానిక యుగం ఎప్పుడు మొదలైంది అంటూ వెనక్కి వెళ్ళడం ప్రారంభిస్తే– మరో దశాబ్దం వెనుకకి ఓ దశాబ్దానికి– అట్లా... యీ శతాబ్దారంభం దాకా వెళ్తూనే వుంటాం!– కాని సంస్కరణ ఉద్యమాలు; స్వాతంత్ర్య సమరం ఒక పెద్ద మలుపు తిరిగిన తరువాత– అంటే ఉజ్జాయింపుగా ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం– యివాళ్టి మన 'కథానిక'కి బంగారు పునాదులు పడ్డాయి. నాటి 'కథ' లను పాత సంచికల పుటలను యథాలాపంగా తిరగేస్తే చాలు మనకి యిలా అనిపిస్తుంది. 1930 నాటి యీ కథ చదవండి! భాష, భావం, శైలి, శిల్పం– యివన్నీ నాటికే ఎంతటి 'పరిణతి' చెందివున్నాయో తెలుస్తుంది. కథల 'పర్స్పెక్టివ్' అభిమానులకి కథ మరీ ప్రత్యేకం. మన కాణాచి నుంచి యింకెవరివ్వగలరు? యిలాంటి కథలని ఆంధ్ర (సచిత్ర వార) పత్రిక తప్ప!

–ఎడిటర్



'ప్రేమ్'కి తబు గుడ్‌బై!

బోనీ, శేఖర్‌కపూర్‌లు తీస్తున్న "ప్రేమ్" చిత్రానికి తబు గుడ్‌బై చెప్పేసిందట. ఎంతకీ ఈ చిత్రం పూర్తి చేయకపోవటంతో విసిగి పోయిన తబు చిత్రం పూర్తి కాకుండానే బయటకొచ్చేసింది. ఈ తబు ఎవరో కాదు స్వయానా "ఫరా" చెల్లెలేనట. చిత్రం తీయటంలో జాప్యం చేస్తూ తన చెల్లెలు భవిష్యత్తును నాశనం చేస్తున్నారని కపూర్ సోదరులపై విరుచుకు పడుతున్నదట ఫరా. తబు వీళ్ళకి గుడ్‌బై కొట్టి మరో పార్టీని వెతుక్కుంటోంది. మరి ఆ పార్టీ వాళ్ళు ఎన్నాళ్ళు తీస్తారో చిత్రాన్ని!

వైష్ణవ సమారాధనలకీ, తిరునక్షత్రాలకీ "మేష్టారి" కుటుంబాన్ని ఆచార్లు ఆహ్వానం చేసేవాడు. సంస్కృత గ్రంథాల్లో సందేహాలోస్తే ఆచార్లే నారాయణమూర్తికి బోధపరుస్తూ వుండేవాడు.

నారాయణమూర్తి అక్కడికి వచ్చి ఆరు నెలలయింది. నాంచారు తోచినప్పుడెల్లా కుటీరానికి వెళ్ళి "రాజ్యలక్ష్మితో" ఆడుకుంటూ వుంటుంది. సుందరమ్మ నాంచారుని ఒక్కొక్కప్పుడు నాలుగేసి రోజులు కుటీరంలోనే వుంచేసేది. ఒక యీడు పిల్లలు గనుక వాళ్ళిద్దరికీ బాగా స్నేహం. "శ్రీరామగిరి"కీ కుటీరానికి మధ్య ఒక గెడ్డ గోదావరిలో కలుస్తూంది. అందులో యిసుక మీద వారిద్దరూ తరచు ఆడుకుంటూ వుంటారు. "కుటీరానికి వచ్చిం తర్వాత అమ్మాయికి కంపెనీ లేదు సుమా" అని నారాయణమూర్తి భార్యతో అనేవాడు. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకోవడం చూసి అతను సంతోషించేవాడు.

తండ్రి తనకి చెప్పిన కథల్ని రాజ్యం నాంచారుకి చెబుతూ వుంటుంది. నాంచారు "శౌనక మహర్షి"లాగ ఎంత విన్నా తృప్తి పొందకుండా లక్ష ప్రశ్నలు వేస్తు వుంటుంది. నారాయణమూర్తి అమ్మాయికి పాఠం చెపుతూ వుంటే నాంచారు పక్కని కూర్చుని వింతగా చూస్తూ వుంటుంది. ఆమె యేదైనా పుస్తకాన్ని సునాయాసంగా చదవగలదు. కాని భూగోళము, దేశ చరిత్రయులాంటివి ఆమెకి కొత్త. మంచి కథలపుస్తకాలు కూడా విశేషంగా చదువలేదు.

అందుచేత రాజ్యం చెప్పే కథలన్నా, ఆమె తండ్రి చెప్పే పాఠాలన్నా నాంచారుకి వింతా, కొత్తానూ, రాజ్యలక్ష్మి నాంచారుకు గురువుగారై అప్పుడప్పుడు కథలు చెపుతూ వుంటుంది. అలాంటి సమయాల్లో తను చిన్నప్పుడు చదువుకున్న జార్జిగరల్స్ స్కూలు హెడ్‌మిస్ట్రెస్ లాగా తానున్నానేమోనని అనుమానం.

రాజ్యలక్ష్మి పట్నవాసపు పిల్ల, నాంచారు పల్లెటూరు పిల్ల. నాంచారు కొండల్లో పుట్టి, కొండల్లో పెరిగిందనడం చేత పరిపూర్ణమైన అంగసౌష్టవం గలిగి బలంగా వుంది. రాజ్యలక్ష్మి కొంచెం బక్కపల్చగా నాజూగ్గా వుంటుంది. కానీ కుటీరానికి వచ్చినప్పటి నుంచి ఆమెకు క్రమంగా బలం కలుగుతూంది. ఇసకలో పరుగెత్తడానికి రోజూ నాంచారుతో పందెం వేస్తూవుంటుంది. కానీ రోజూ ఓడిపోతూనే వుంటుంది.

ఇంతలో వేసవికాలం రావడంతోటే రంగాచారి రాజమండ్రీ నుంచి శ్రీ రామగిరి వచ్చాడు. వెంటనే గురువుగారింటికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకున్నాడు. గురు శిష్యులిద్దరూ చాలాసేపు వివిధ విషయాలను గురించి ముచ్చటించుకున్నారు. రంగాచారి తరచూ కుటీరానికి వచ్చి గురువుగారితో ముచ్చటిస్తూ వుండేవాడు. తమకు కలిగినంతవరకూ పాలూ, పెరుగూ మొదలైన వాటిని కోవెల నౌకరుని పెట్టి గురువు గారికి పంపుతూ ఉండేవాడు.

అతనికి తెలుగులో మొదటి నుంచి అభిరుచి ఎక్కువ. చిన్నప్పుడే అతనికి కవిత్వం చెప్పడం, వ్యాస రచనా అలవాటైనాయి. "గౌతమీ లైబ్రరీ"లో అతను తిరగెయ్యని పుస్తకం లేదు. దానికి తోడు పరిపూర్ణమైన ఆంగ్ల వాఙ్మయం తోటి పరిచయం ఒకపక్కా, బాల్యం నుంచీ ప్రకృతి వైభవ సమృద్ధములైన పర్వత సీమల్లోనూ, గౌతమీ తీరాన్ని నివాసం వేరొకపక్కా అతని భావనా శక్తిని బాగా విజృంభింపజేశాయి. పరమేశ్వర స్వరూపమైన ప్రకృతిని పద్య రూపాన్ని అర్చించటం అతనికి పరమానందం.

కాలేజీలో వార్షికోత్సవాలు, మొదలైన వాటిల్లో రంగాచారి పద్యాలకే ప్రాముఖ్యము యెక్కువ. భారతి, శారద, ప్రబుద్ధాంధ్ర మొదలైన పత్రికలు అతని పద్యాలనీ, కథలనీ ప్రకటిస్తూ వుంటాయి. "ఆంధ్ర కవిమండలి"లో అతనొక మెంబరు. యువ కవుల్లో అతనికి మంచి స్థానం వుందని పెద్దలు ఒప్పుకున్నారు.

* * * *

ఎండాకాలం. సాయంత్రం నాలుగు గంటలౌతూంది. తూర్పు కనుమల ఉన్నత శిఖరాలు సూర్యకాంతిలో బంగారు పోత పోసుకున్నాయి. వేడి గాడుపులు కొద్దిగా తగ్గాయి. దూరాన్ని కొండ పోళ్లలో నుంచి పొగలూ, మంటలూ కనబడుతున్నాయి. ఒక లేళ్ల గుంపు బెదురుతూ, బెదురుతూ కొండ లోయలోనుంచి దిగి గోదావరి జలాన్ని అతి ఆప్యాయంగా తాగి, మళ్లీ తుర్రున పారిపోయింది. జనసంచారం ఎక్కడా లేదు. కొండ శిఖరాన్ని ఒక పెద్ద బండరాతిమీద ఒక 'అడవి పిల్లి' కూచుని గోదావరి వంక చూస్తుంది.

రంగాచారి ఒక్కడూ గోదావరి ఒడ్డున యిసుకలో కూచుని ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. ఒక పావుగంటలో నారాయణమూర్తి కూడా అక్కడి కొచ్చాడు. యధోచిత మర్యాదలైనతర్వాత నారాయణమూర్తి "రంగాచారీ! ఈ మధ్య కొత్త పద్యాలేమైనా రసేవా" అన్నాడు.

రం : (చిరునవ్వుతో) "కొద్దిగా రాసేనండి. ఈ మధ్య పరీక్షల తొందర నించి తీరుబాటు లేదు కదా? ఇక్కడ కొచ్చింత ర్వాత మాత్రం కొద్దిగా రాశాను"

"ఏదీ నీ పద్యాలు విని చాలా రోజు లైంది. రెండు పద్యాలు చదువ్వూ. నువ్వు కళాశాల వార్షికోత్సవంలో రాసిన పద్యాలు మాత్రం స్ప్లెన్ డిడ్ (బాగు)గా వున్నాయి సుమా".

రంగాచారి కంఠం సవరించుకుని చక్కగా రాగంతో పద్యాలు చదవటం ప్రారంభిం చాడు. అతడు మంచి పాటకుడు కూడాను. అతని చక్కని పద్యాలకి అతని సంగీతం వన్నె తెచ్చింది. కాలేజీ విద్యార్థులు సాయంకాలం రంగాచారిని "ఎంకి పాటలు నువ్వు పాడితే వినాలోయ్" లంటూ వేపుకు తింటారు. నారాయణమూర్తి ఆ పదాల్లోనూ, ఆ మనో హర కంఠస్వరంలోనూ తన్ను తాను మరి చిపోయి "భేష్, ఎక్సలెంట్, స్ప్లెండిడ్" అంటూ తన ఆనందాన్ని తెలియచేశాడు.

ఆ సాయంత్రం వాళ్లిద్దరూ ఇళ్లకి పోయే టప్పుడు నారాయణమూర్తి 'ఏమోయ్ ! ఓమారు సుందరానికి కూడా నీవు ఈ పద్యాలు వినిపించాలి. చక్కని పద్యాలూ, మంచి పాటా అంటే సుందరం చెవి కోసు కుంటుంది.' అన్నాడు.

అలాగే వస్తానండి. దానికభ్యంతరమేమి? అయి థింక్. మై సెల్ఫ్ హైయిలీ ఒబ్లైజ్‌డు" అన్నాడు.

** ** ** ** **

తను అప్పటివరకూ రాసిన పద్యా లన్నీ రంగాచారి గురువుగారికి చూపెట్టే వాడు. నారాయణమూర్తీ, సుందరమ్మ అతని వ్రాతలు వినీ, చదివీ సంతోషించారు. తరచు సాయంత్రం వేళ కుటీరం ముందర పచ్చిక బయలు మీద కూర్చుని అతనిచేత పద్యాలు చదివించుకుని వాళ్లు ఆనందిస్తూ వుండే వారు.

మంచి రాగాలతో, హాయినింపు కంఠ స్వరంతో తను రచించిన ప్రకృతి వర్ణనలు రంగాచారి తల్లితండ్రుల ముందు చదివేట ప్పుడు రాజ్యలక్ష్మి కూడా అక్కడే కూచుని వింటూ వుండేది. భావపూరితాలైన, రసం చిప్పిల్లుతూఉండే అతని పద్యాలు ఆ అమ్మా యికి సంతోషం కలిగించాయి.


కొత్తగా వాఙ్మయ రంగంలోకి దిగిన "యెంకిపాటలు" నారాయణమూర్తికి చాలా సరదా. ఎన్నిసార్లు విన్నాగాని అతనికి తనివి తీరేదికాదు. రంగాచారిచేత ఒక్కొక్క పాట చదివించి భార్యకి వాటిలో వుండే భావానీ అందాన్నీ బాగా బోధపరుస్తూ వుండేవాడు.

ఇవేకాక దేశంలో నూతనంగా రేకెత్తు తూవున్న భావకవిత్వ లక్షణాలు చెపుతూ, పేరు పొందిన కవుల రచనలు వినిపిస్తూ, వాటిలో వుండే సౌందర్యాన్ని విమర్శనా పూర్వకంగా గురువుగారితో తరచూ రంగా చారి ముచ్చటిస్తూ వుండేవాడు. తండ్రి దగ్గరే కూర్చుని రాజ్యంకూడా అవన్నీ వింటూ బోధపరుచుకుంటూ వుండేది. "నాన్నా ! యీ సాయంత్రం మరొకసారి యెంకి పాటలు పాడించునాన్నా !" అంటూ వుండేది.

"సాహితీ సమితి" వారి నూతన పద్ధ తులూ, ఉన్నతాశయాలు, రచనా సౌంద ర్యాలూ, వారి సంభాషణల్లో దొర్లిపోతూ వుండేవి. "సాహితీ సమితి"ని చూసి లెక్కలే నన్ని యితర సంఘాలు బయలుదేరడం మొద లైన సంగతులు వారు ముచ్చటగా చెప్పుకునే వారు.

రాజ్యలక్ష్మి శ్రీ రామగిరికి పోయి ఒక్కొ క్కనాడు పొద్దుపోయిందంటే అక్కడే వుండి పోతూ వుంటుంది. అలాంటి రోజుల్లో నాంచారు సోదరుని ఆంధ్రగ్రంథాలన్నిటినీ స్నేహితురాలికి చూపిస్తూవుంటుంది.

రంగాచారి పత్రికల్లో అప్పుడప్పుడు రాసిన కథలన్నిటినీ "ఆంధ్ర భాషా విలాసినీ గ్రంధ



మండలి"కి ఇచ్చివేశాడు. వారా కథలనొక పుస్తకంగా అచ్చువేసుకున్నారు. దాని కతడు "కథాలహరి" అని పేరు పెట్టాడు.

అతని పుస్తకాల్లో కొన్నింటిని రాజ్యం తాను చదువుకోడానికని యేరుకుంది. వాటిలో "కథాలహరి" కూడా వుంది. అవన్నీ చదవ డంచేతా, కవిత్వతత్వాన్ని గురించి తండ్రికీ, రంగాచారికీ జరిగే సంభాషణలు వింటూ వుండటంచేతా ఆమెకి కవిత్వంలో ఒక విధ మైన అభిరుచి కలిగింది.

నారాయణమూర్తితో తాను వివిధ విష యాల్ని గురించి ముచ్చటిస్తూ వుండేటప్పుడు శ్రద్ధతో వింటూవుండే రాజ్యలక్ష్మి కుతూహ లన్ని, రంగాచారి కనిపెడుతూ వుండేవాడు. ఆధుని కాంధ్ర కవిత్వము నెడల ఆమెకి గల ప్రేమ చూసి అతడు మనసులో చాలా శ్లాఘించినాడు.

ఒకనాడు రంగాచారి మామూలుగా చదు వుకునే గదిలో కూర్చున్నాడు. నాంచారు రాజ్యంతో ఆ పక్క గదిలో సంభాషిస్తూంది. మధ్యనున్న ద్వారంలో నించి వారి సంభాషణ వింటూ అతను వారి చర్యలు కనిపెడుతు న్నాడు. "నువ్వీమధ్య మా ఇంటికి రావడం మానేశావు. నేను మాత్రం మీ యింటికి రావాలి కాబోలు?" అంది నాంచారు.

"అబ్బా అంత పట్టుదలేమిటి? యీ పుస్తకాలు చదువుతూ వుండబట్టిరాలేదు. ఇది వరకల్లా వస్తూ వుండేదాన్ని కానూ?"

"నేను మాత్రం ఇదివరకు రాలేదూ? నీకు కోపం వచ్చింది కాబోలు?"

"నాకు కోపం వస్తే నీకేం నష్టం?"

"పోనీ గాని, మంచి కథ చెపుతాను, కోపం పోతుందా"

"ఏం కథ? చెప్పు చూద్దాము"- నాంచారు నవ్వుతూ అంది. రాజ్యం "కథాల హరి"లోది ఓ కథ చెప్పడం మొదలు పెట్టింది. నాంచారు మధ్య మధ్య ప్రశ్నలు వేస్తూ వింటూ కథలు చెప్పడంలో రాజ్యానికున్న నేర్పుకి రంగాచారి ఆశ్చర్య-పడ్డాడు. కథల న్నిటిలో మంచి కథ ఏరడంలో ఆమెకు వున్న సామర్థ్యం మెచ్చుకున్నాడు. అనేక కథలు, పుస్తకాలు ఆమె పట్టుకెళ్లింది. కాని తన పుస్తకంలో కథనే యేరి చెప్పడం వల్ల రంగా చారి మనస్సులో గర్విస్తూ ఆమె చెప్పేదంతా శ్రద్ధగా వింటున్నాడు."

కథ చెప్పడమయింది. రాజ్యం నవ్వుతూ "ఏం? మంచి కథ చెప్పానా? నీ కోపం పోయిందా? అంది"

"నాకోపానికేంగాని కథ మాత్రం చాలా బాగుంది సుమా! నువ్వు చదివిన పుస్తకాల్లో ఎందులోది ఈ కథ?"

"అయ్యో! ఆ మాత్రం తెలీదూ? మీ అన్నయ్య రాసింది ఈ కథ. మీ అన్నయ్య నీకెప్పుడు కథలు చెప్పలేదూ?"

"ఏవో చెప్పాడు కాని యీ కథ మాత్రం చెప్పలేదు. నేను ఆ పుస్తకం చదవాలి."


రాజ్యం కథాలహరి చూపిస్తూ "ఇదిగో పుస్తకం మీ అన్నయ్యకి అప్పచెప్పి మరీ చదు వుకో" అంది.

నాంచారు పుస్తకం పట్టుకెళ్లి "అన్నయ్యా! యిదిగో, రాజ్యం తిరిగి యిచ్చేసింది ఈ పుస్తకాన్ని" అంది.

"యిచ్చేయ నక్కరలేదు. మన యింట్లో యీ పుస్తకాలు యింకా చాలా వున్నాయి. ఈ పుస్తకం వుంచుకోమని చెప్పు"

రాజ్యం నిజంగా తండ్రితో ఆ పుస్త కాన్ని కొనుక్కోవాలనుకుంది. ఆ పుస్తకాన్ని వుంచుకోమని చెప్పినందుకు అతని సౌజన్య తకి చాలా కృతజ్ఞురాలైంది. పుస్తకం అందు కుంటూ కొంచెం సిగ్గుతో, మందహాసంతో- కృతార్థుడైనట్లు తలచుకుంటూ వున్న గ్రంథ కర్తగారి వంక చూసింది. ఇదంతా చూస్తూ వున్న రంగాచారి దృష్టులామె దృష్టిలో కలి శాయి. తక్షణం ఆమె తన చూపులు మరల్చుకుంది. ఆ చూపులో సంతోషమూ, కృతజ్ఞతా సువ్యక్తమవుతున్నాయి. అంతేకాక, వేరొక అనిర్వచనీయమైన లలిత భావం ఆ చిరునవ్వులో అతనికి గోచరించింది. ఆ దర హాసమూ-ఆ చూపులు-అతని హృదయంలో వుండిపోయాయి. అతని భావాలు యెక్క డెక్కడికో ఎగిరాయి. ఆలోచనలు కొంచెం తొందరపడ్డాయి. అతడు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. కొంతసేపటికి ఒక నిట్టూర్పు విడిచి, "ఏమో! ఎవరికి తెలుసూ?" అను కున్నాడు.

(మిగతాది పై వారం)



కొండపల్లిలో వంటగ్యాస్ బాట్లింగ్ ప్లాంట్!

విజయవాడకు సమీపంలోని కొండపల్లి గ్రామంలో హిందూస్తాన్ పెట్రోలియం సంస్థ నిర్మించిన వంటగ్యాస్ బాట్లింగ్ ప్లాంట్‌కు 1989, సెప్టెంబర్ 9వ ప్రారం భోత్సవం జరిగింది.

రాష్ట్రంలో హెచ్.పి.సి. వారి నాలు గవ బాట్లింగ్ ప్లాంట్ అయిన ఈ కొండ పల్లి ప్లాంట్ 22 వేల టన్నుల ఎల్.పి.జి.ని నింపడానికి వీలైన స్థోమత గలదు.

కొండపల్లి ప్లాంట్ ప్రారంభంతో రాష్ట్రంలో హెచ్.పి.సి. వారి బాట్లింగ్ స్థోమత ఏడాదికి 156000 టకు పెరుగు తుంది. అంటే నెలకు 9 లక్షల సిలిండర్లు నింపడానికి వీలవుతుంది.

ఐ.ఓ.సి.కి భారత్ పెట్రోలియం సంస్థల అవసరాలను కూడా ఈ ప్లాంట్ కొంతవరకు తీరుస్తుంది.

రాష్ట్రంలోని 1222647 పారిశ్రా మిక ఖాతాదారులలో హెచ్.పి.సి. వారి సంఖ్య 635 759. రాష్ట్రంలో పెరు గుతున్న వంటగ్యాస్ గిరాకీని కొండపల్లి ప్లాంట్ తీర్చగలుగుతుందని ఆశిద్దాం!

విద్యాసాగరుడు 'ఈశ్వరచంద్ర'

19వ శతాబ్దంలో భారతజాతిని జాగృతం చేసేందుకోసం జన్మించిన మహాపురుషుల్లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఒకరు. భారతీయ ప్రథమ సంఘ సంస్కర్త "రాజా" రామ్మోహనరాయ్" తరువాత, భారత మహిళా లోకానికి అంతటి ప్రియమిత్రుడు ఈశ్వరచంద్రుడే. సతీసహగమన దురాచారాన్ని నిర్మూలించినవాడు రామ్మోహనరాయ్ కాగా, ముక్కుపచ్చలారని బాలికలపై రుద్దుతున్న యావజ్జీవ వైధవ్యాల్ని తొలగించి, వితంతు పునర్వివాహాల్ని చట్టబద్ధం చేయించిన త్యాగశీలి ఈశ్వరచంద్ర విద్యాసాగర్. ఈశ్వర చంద్రుడు అనేది ఆయన పేరు కాగా, 'విద్యాసాగర్' అనేది "హిందూ న్యాయపరీక్ష కమిటీ" ఆయనకు ప్రసాదించిన బిరుదు.

1820 సెప్టెంబరు 26వ తేదీన బెంగాలులోని వీరసింఘ అనే గ్రామంలో భగవతీదేవి– ఠాకూర్‌దాస్ దంపతులకు ఈయన జన్మించాడు. కళాశాల విద్యానంతరం 1841లో ఫోర్టు విలియం కళాశాలలో బెంగాలీ ప్రధాన పండితుడుగా పదవిలో చేరాడు. కొంతకాలం అక్కడ పనిచేసి 1851 జనవరిలో కలకత్తాలోని సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పదవిలో ఉండగానే ఈశ్వరచంద్రుడు అప్పటి అస్తవ్యస్థ విద్యారంగాన్ని సంస్కరించేందుకు కార్యోన్ముఖు డయ్యాడు. ఆయన చేసిన మొట్టమొదటి విద్యా సంస్కరణ కులప్రాతిపదికపై కళాశాలల్లో ప్రవేశాన్ని నిషేధించటం.

మాతృభాష ద్వారా ప్రాథమిక విద్యాబోధన జరగాలనే సూత్రాన్ని సమర్థించిన ఈశ్వరచంద్రుడు ఎన్నో ప్రత్యేక పాఠశాలలు స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేశాడు.

విద్యారంగానికి ఈశ్వరచంద్రుడు చేసిన సేవలను పురస్కరించుకొని 1864లో ఆయనకు 'లండన్ రాయల్ ఏషియాటిక్ సొసైటీ' వారు తమ గౌరవ సభ్యత్వం ఇచ్చారు. 1883లో ఆయన్ను పంజాబ్ విశ్వవిద్యాలయం గౌరవ సభ్యునిగా స్వీకరించారు.

బెంగాల్‌లో స్త్రీ విద్యకు పునాది వేసిన బెధూన్‌ను ఆదర్శంగా తీసుకున్న ఈశ్వరచంద్రుడు పురుషుల వలెనే స్త్రీలకూ విద్య అవసరమనే వాస్తవాన్ని నొక్కి చెప్పాడు.

ఈశ్వరచంద్రుడు సాధించిన కార్యాలన్నిటిలోకి వితంతు పునర్వివాహ చట్టాన్ని తీసుకురావటాన్ని ప్రముఖంగా చెప్పుకోవాల్సి వుంది. ముక్కుపచ్చలారని బాలికలకు యావజ్జీవ బ్రహ్మచర్యాన్ని అంటగట్టటం అమానుషం అని ఆయన ఎలుగెత్తి చాటాడు. వితంతు వివాహాల ప్రాధాన్యత్యను వివరిస్తూ రెండు గ్రంథాలను రచించాడు.

తన కార్య సాధన కృషిలో ఈశ్వరచంద్రుడు ఎందరో సనాతనుల దూషణలకు, దుశ్చర్యలకు పాత్రుడయి కూడా 1856లో వితంతు పునర్వివాహ చట్టాన్ని సాధించాడు. ఫలితంగా మొట్టమొదటి వితంతు పునర్వివాహం 1856 డిశంబరులో ఈశ్వరచంద్రుని ఆధ్వర్యంలోనే కలకత్తాలో జరిగింది. వితంతువులకు వివాహాలు జరిపించటమే కాకుండా ఆ తరువాత వారి కవసరమైన ఆర్థిక సహాయాన్నందిస్తూ, వారి సంక్షేమాన్ని విచారించేవాడు.

తను చేపట్టిన సంఘ సంస్కరణోద్యమానికి అనుబంధంగా అనేక రచనలు చేసాడు విద్యాసాగర్. బేతాళ్ పంచవింశతి, శకుంతల, సీతార్ వనవాస్ మొదలైనవి ఆయన వ్రాసిన గ్రంథాలలో కొన్ని.

అర్థ శతాబ్దంపాటు జరిపిన సుదీర్ఘ పోరాటంలో ఎన్నో సవాళ్ళను, విమర్శలను ఎదుర్కొన్న ఈశ్వరచంద్రుడు మానసికంగా అలసిపోయినాశారీరకంగా బలహీనపడ్డాడు. అయినా తన అనారోగ్యాన్ని కూడా ఆయన లెక్క చెయ్యలేదు.

భారత సాంఘిక సంస్కరణ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొన్న ఈ మహనీయుడు 1891 జూలై 29వ తేదీన కన్నుమూశాడు.

— వి. ఆర్. ప్రసాద్

విద్యార్థులలో అశాంతి ఎందుకు?

విద్యార్థులలో అసంతృప్తి మన సంఘమును కలచివేస్తున్న సమస్యలలో అతి ప్రధానమైనది. కావున మనము ఈ సమస్యను ఈ క్రింది అంశములుగా విభజించి ఆలోచించవలసి యున్నది.

(1) ప్రతిభకు ప్రాధాన్యముగాక కుల ఆధారముగా కోర్సులలో సీట్లు కేటాయింపు.

(2) విద్య–ఉద్యోగావకాశములు.

(3) అభిరుచి ఆధారముగా చదువుకొను అవకాశము లేకుండుట.

విద్యార్థులలో అసంతృప్తికి కారణాలు

మన దేశము పారిశ్రామికముగా అభివృద్ధిలో ముందడుగు వేస్తున్న తరుణములో ఎప్పుడో రూపొందించిన అనగా ఆంగ్లేయుల కాలములో రూపొందించిన విద్యా విధానము వలన, సాధారణ విద్యకు, ఉద్యోగావకాశములకు ఎట్టి పొంతన లేదు. స్వయం ఉపాధికి కూడ తోడ్పాటునిచ్చేది అంతకంటేకాదు. కావున ఈ విధానములో నిర్మాణాత్మక, మౌలిక మార్పులు చాలా అవసరము.

రిజర్వేషన్ (కులాల ఆధారముగా), ప్రతిభ అను రెండు మన ప్రస్తుత విధానము వలన ఈ రెండు తూర్పు, పడమరగా మారి ప్రధానముగా అసంతృప్తికి దారి తీయుచున్నది. రిజర్వేషన్ వలన తక్కువ ప్రతిభ కలవాడు అన్ని కోర్సులలో స్థానము పొంద కలుగుచున్నాడు. ప్రతిభావంతులలో అసంతృప్తి జ్వాలరేగుటకు అవకాశము నిచ్చునదిగా నున్నది. దీనివలన ప్రతిభావంతులను కోల్పోవుట అంతేకాక భావినిర్మాణము కుంటుపడుట సహజము.

ప్రవేశ పరీక్షలు, అనుకొన్న కోర్సు చదువు అవకాశమునకు ప్రతిబంధకము. ఉదాహరణకు ఒక విద్యార్థి ఇంటర్ పరీక్షయందు అత్యధిక మార్కులు తెచ్చుకొని, అదే స్థాయి యం. సెట్ పరీక్షయందు ర్యాంకు సంపాదించలేక పోవుచున్నాడు. దీనివలన విద్యార్థికి పరీక్షా విధానములో నమ్మకమును కోల్పోవుచున్నాడు. దీనివలన చాలమంది అసంతృప్తి చెందుచున్నారు.

మనము పై అసంతృప్తి కారకములను గూర్చి సమగ్రముగా ఆలోచించి, మారుతున్న వ్యవస్థకు అనుగుణముగా నుండెడి మరియు స్వయం పోషకమైనదిగా నుండు విద్యా విధానమును రూపొందించ వలసియున్నది. ఆర్థికముగా వెనుకబడిన వారికి ఆర్థికపుష్టి చదువుకొను సదుపాయములు కలిపించి అందరికి ఒకే విధముగు ప్రతిభ ఆధారముగా కోర్సులలో ప్రవేశము ఇచ్చు విధానము అవలంబించిన ప్రతిభావంతులను కోల్పోవు అవకాశము తగ్గి దేశ భవిష్యత్తు బంగారుబాటలో నడిచే అవకాశము కలుగును. ఈ విధానములను అవలంబించినచో దేశమును చాల వరకు అసంతృప్తి జ్వాలనుండి, అసమానత నుండి కాపాడిన వారమగుదుము.

–శ్రీమతి ఆర్. శేషుమాంబ



(ఎడమ నుంచి) శ్రీమతి విజయశ్రీ గుప్తా, శ్రీమతి కె. సులోచన, డా. జ్యోత్స్న, సభాధ్యక్షులు శ్రీ వీరాజీ, 'ఇస్కో-9' అధినేత శ్రీ బి.ఎ. రావు, గాంధీటెక్సు కాటన్ శారీస్ సంస్థ అధిపతి శ్రీ వినయ్‌గాంధీ.

గాంధీటెక్స్ వారి బంగారు బహుమతుల బంపర్ డ్రా ఫలితాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గాంధీ టెక్సు కాటన్ చీరల సంస్థ వారు కొను [illegible] గోలు దారులకు కూపన్ [illegible] లాటరీ తీసి అందజేయనున్న [illegible] బహు[illegible] తుల డ్రా విజయవాడలో [illegible] తేది ఉదయం అనుపమ హో[illegible] జరి గింది. ఆనందో[illegible] ఈ "డ్రా" స[illegible] క్షత వహిస్తూ నూలు [illegible] ప్రత్యే[illegible]ను వివరించారు. బొంబాయి [illegible] ఈ సభల కోసం ప్రత్యేకం[illegible] సం[illegible] మేనేజింగ్ డైరెక్టర్ [illegible] "ఇస్కో-9" అడ్వర్‌టైజ్‌మెంట్సు [illegible] అధిపతి శ్రీ బి.ఏ.రావులు గాంధీ [illegible] కాటన్ చీరల అమ్మకాలను ఇతోధికంగా ఆదరించిన తెలుగువారికి తెలుగు వ్యాపారవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ "డ్రా" తీయడానికి ప్రత్యేకంగా వచ్చిన మహిళామణులు శ్రీమతి విజయశ్రీ గుప్తా (ఇన్నర్ [illegible] జిల్లా కార్యదర్శి), డా. జ్యో[illegible] ([illegible] రొటేరియన్), శ్రీమతి [illegible] సులోచన (ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు) [illegible] (2 బహుమతులు) తృతీయ [illegible] తీయగా సభలోని ప్రము[illegible] వాణిజ్యవేత్తల సతీమణులు, ప్రముఖ [illegible] 21 బహుమతులను తీశారు. [illegible]

[illegible] బహుమతి నెం. 163736, రెండవ బహుమతి నెం. 148150, మూడవ బహుమతులు నెం. 245318, 140840.

–నందా

మీసాల మీమాంస

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

యోధులు మీసం పెంచుతారనీ, మేధావులకి తప్పకుండా పిల్లి గెడ్డమో బారు గెడ్డమో ఉండి తీరుతుందనీ, యోధులైన మేధావులకీ లేదా మేధావులైన యోధులకీ, తత్సంబంధితమైన ముఖ చిహ్నాలు రెండూ ఉంటాయనీ, నాకు ఎందుకో చిన్నప్పటి నుంచీ ఒక గట్టి నమ్మకం ఏర్పడిపోయింది. వయస్సుతో బాటు ఆ నమ్మకం కూడా ఎదుగుతూ వచ్చింది. టాగూర్, బెర్నార్డ్‌షా,మార్క్స్, ఛత్రపతి శివాజీ,అబ్రహాంలింకన్ వంటి మహామహుల ఫోటోలు చూడ్డంతోనూ, అప్పుడప్పుడు పేపర్లలోనూ టీ. వీ. లలోనూ..... ప్రత్యక్షమయ్యే అణు శాస్త్రజ్ఞుల బొమ్మలూ, నోబెల్ బహుమతి గ్రహీతలైన సైంటిస్టుల బొమ్మలూ పరిశీలించడంతోనూ, సదరు నమ్మకం, ఇనుమూ సిమెంటూ కలిసి పోసిన పునాదిలాగ, గట్టిగా అచంచలంగా పాతుకుపోయింది మనస్సులో.

మీసాలకీ గెడ్డాలకీ సంబంధించిన ఈ నమ్మకం స్థిరీకరం చెందడానికి మరో కారణం కూడా ఉంటే ఉండవచ్చు. అదేమిటంటే, నేను పిరికివాణ్ణనే సంగతి ఒకరు చెప్పక్కర్లేకుండానే నాకు తెలుసు. తెలివైనవాణ్ణి కాదన్న సంగతి పెళ్ళయిన తర్వాత తెలిసి వచ్చింది. ఇవాళ్టికి కూడా రోజుకొక్కసారైనా నా తెలివి తక్కువతనం ఎంతటిదో గుర్తు చేస్తూ ఉంటుంది మా ఆవిడ. అందువల్ల వెరసి, నేను యోధుణ్ణీ కాదు మేధావినీ కాదు అని, బట్టల సబ్బుతో ఉతికి ఎండేసిన జేబు రుమాలు లాగ, తెల్లగా తేలిపోయింది. ఈ ప్రముఖ సత్యానికి ప్రబల తార్కాణమేమో అన్నట్టు, నాకు మొదటి నుంచీ మీసాలూ గెడ్డాలూ లేవు. తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా రాలేదు. గీసి చూశాను. గియ్యకుండా కొన్ని నెలలు వదిలేశాను. కేశ సంవర్ధకాది ఎరువులెన్నో వాడాను. ఉహూ!.... ఏం చేసినా ఏం ఫలితం కనిపించక, కళాయి చేసిన అద్దంలా నున్నగా ఉండిపోయింది నా ముఖం. ఓహో! మనం యోధుడూ మేధావీ ఏమీ కాదు కదా. ఏ ఒక్క గుణం ఉన్నా, మనకి ఏ ఒక్కటో ప్రాప్తించి ఉండేది. అందువల్ల ధైర్యం తెలివీ ఉంటే, తప్పకుండా మీసం గెడ్డం ఉంటుంది. ఏవీ లేని వాళ్ళకి మనలాగే ఉంటుంది ముఖం. ఆడముఖంలాగ.

అవునూ?- మా ఆవిడ నాకంటే ధైర్యం, తెలివీ ఎక్కువ ఉన్నదే కదా- అలాగే చాలామంది ఆడవాళ్ళలో ధైర్యస్థులూ ఉన్నారు కదా- మరి వాళ్ళకి....?

ఈ అనుమానమే ఒకసారి మా ఆవిడ దగ్గర వ్యక్తపరిస్తే, "చాల్లెండి. మీ తెలివి తెల్లవారినట్టే ఉంది. నా దగ్గర అంటే అన్నారు. ఎవరి దగ్గరా అనకండి. మీ అనుమానానికి సంబంధించిన ఈ వార్త ఆ నోటా ఆ నోటా ప్రాకి ఏ స్త్రీ విమోచన సంఘం వారికేనా తెలిస్తే కొంపలంటుకుంటాయి" అంటూ ఓ అరగంట తలంటేసింది.

దాంతో మీసాలూ- గెడ్డాలూ వీటికి సంబంధించిన అనుబంధపు ఆలోచనలకన్నింటికీ స్వస్తి చెప్పి, తల్లి వేరులాంటి ఆ ఒక్క ఆలోచననే పట్టుకుని కూర్చున్నాను; అదేవిటంటే-

"మీసాలూ, గెడ్డాలూ దిట్టంగా ఉన్నవాళ్ళంతా యోధులూ, మేధావులూ- అందుకు సందేహం లేదు".



ఇలా మర్రి ఊడలాంటి ఆలోచనని పట్టుకుని, నేను ఉయ్యాలలూగుతూ ఊరేగుతూండగా, మా ప్రక్కింట్లో ఓ వాటాలోకి, నలభైయేళ్ల నడి వయస్కుడొకాయన అద్దెకి వచ్చాడు. ఆయన కుటుంబ సభ్యులెవరో, వాళ్ళెంతమందో నేను గమనించలేదు కాని, ఈయన్ని మాత్రం ప్రత్యక్షంగా ఓ ఉదయం చూశాను.

ఓరి నాయనోయ్! అవేం గడ్డాలు! అవేం మీసాలు! ముక్కూ, కళ్ళూ, నుదురూ అనబడే ఆ మూడు సంరక్షిత ప్రదేశాలు తప్ప, తక్కిన ముఖాన్నంతా విదేశీ సైన్యంలా ఆక్రమించేశాయి గెడ్డాలూ మీసాలూ. ప్రొద్దుటి లేత ఎండ పడి మీసాలు రెండూ అటూ ఇటూ చురకత్తుల్లా మెరిసి పోతూంటే, గెడ్డం మాత్రం తళ తళలాడుతూ గుండెల దాకా ప్రవహిస్తున్న సెలయేరులా ఉంది. ఆయన ముఖానికి అవి, పెట్టని ఆభరణాలులాగా, ప్రత్యేకం ఆయన కోసం అని దేవుడు అందించిన అలంకారాలు లాగా ఉన్నాయి.

నల్లగా అవి ఎంత అందంగా ఉన్నాయో, అంత భయంకరంగా కూడా ఉన్నాయి. గెడ్డాన్ని ఒక పెద్ద పుట్టగా మనం భావిస్తే, ఆ పుట్టలోంచి లేచిన రెండు నల్ల త్రాచుల్లా ఉన్నాయి ఆ మీసాలు...

ఓయ్ బాబోయ్ అని మొదట భయపడ్డా. కాస్సేపయ్యాక ఆయన గెడ్డాల్నీ మీసాల్నీ మనస్సా అభినందించకుండా ఉండలేకపోయాను.

అసలు గెడ్డాలూ మీసాలూ అంటే అవీ-

అసలు సిసలయిన మేధావీ యోధుడూ అంటే ఈయన! వెంటనే ఆయన పట్ల పట్టలేనంత గౌరవప్రపత్తులు ఏర్పడిపోయాయి. ప్రొద్దుటే లేచి ఎవరి మొహం చూశానో కాని ఒక మహామహుణ్ణి దర్శించగలిగాను. నా ఆనందాన్ని పంచుకుంటుంది కదా అని మా ఆవిణ్ణి పిలిచి అవతలివారి పెరట్లోకి చూడమన్నాను. ఇల్లాలు కనుకా, పైగా భర్తనైన నేను సాక్షాత్తూ ప్రక్కనే ఉన్నాను కనుకా, మరీ అంత బాహాటంగా చూస్తే బాగుండదని, కిటికీ తలుపు సందుల్లోంచి, రహస్యంగా చూసింది- చూసి తల పంకించింది.

"ఫరవాలేదు- మీకూ కాస్త కరెక్టుగా ఆలోచించడం, ఎవరు ఎంతటి గొప్పవారో తెలుసుకోగలగడం వస్తున్నాయి" అంటూ జీవితంలో మొదటిసారిగా నన్ను అభినందించింది.



/ఆ అభినందనతో కోటి ఏనుగుల బలం వచ్చి. ఇంక అక్కడి నుంచి తదుపరి కార్యక్రమం ప్రారంభించాను.

ముందా మీసాల వీరుణ్ని చిరునవ్వుతో పలకరించాను.... తర్వాత ఉత్తి పుణ్యాన ఓ గుడ్‌మార్నింగ్ కొట్టాను. రెండు రోజులు పోయాక "మీరు మా పక్క వాటాలోకి వచ్చారా?.... బాగుంది" అంటూ నా సంతోషాన్ని వ్యక్తపరిచాను... ఆయన కూరలకనో, పచారీ సామానుకనో బయలుదేరుతూంటే, పనిలేక పోయినా ఆయనతో బాటు ఆయా షాపులదాకానూ అంగళ్ళ దాకానూ వెళ్ళి తిరిగి రాసాగాను. ఒకటి రెండు మార్లు మా ఇంటికి కాఫీకి ఆహ్వానించాను. ఆయనతో పరిచయం బాగా పెంచుకొని తరచు ఆయన పక్క ఫక్కనే తిరుగుతూ, పదిమందికీ వీళ్ళిద్దరూ మంచి స్నేహితులు అనే అభిప్రాయాన్ని తీసుకు వచ్చాను.

అలా తీసుకు రావడంలో ఉద్దేశం ఒకటి ఉంది.

అలాంటి యోధుడు మన స్నేహితుడంటే మన జోలికి ఎవరూ రారు. మనం అంటే అందరికీ కొంచెం పక్క బెదురుంటుంది. అదో లాభం- రెండోది- అలాంటి మేధావి మిత్రుడు అనేసరికి సంఘంలో మన హోదా బాగా పెరుగుతుంది. మనకీ ఒక స్టేటస్ అంటూ వస్తుంది. పైగా, నాకు లేని మేధాసంపత్తీ, ధైర్యస్థైర్యాలూ ఆయనకి ఉన్నాయి. కలిసిమెలిసి తిరిగితే కాస్త మనకీ అవి వంటబట్టొచ్చు- ఇన్ని ఆలోచనలు పెట్టుకొని ఆయన్ని అభిమాన గౌరవాలతోటీ, ఆత్మీయతా మర్యాదలతోటీ చూడసాగాను.

ఓ రోజున మా యింట్లో టీ త్రాగి, కబుర్లు చెప్పుకుంటూన్న సమయంలో, "మీరెంతో నా పట్ల గౌరవంగానూ, ప్రేమగానూ ఉంటారు... మీలాంటి సజ్జనుల పరిచయం కలగడం నా అదృష్టం" అన్నారాయన.

"అదృష్టం మాది" అంది గడప అవతల నిలబడ్డ మా శ్రీమతి-

"నేనొక్కణ్ణే ఏవిటండీ! మీలాంటి యోధుల్నీ, మేధావుల్నీ ఎవరేనా గౌరవిస్తారు" అన్నాను.

అతను నవ్వుతూ "నేను ధైర్యస్థుణ్ణా? మేధావినా?, ఎవరన్నారు?" అన్నాడు.

"ఎవరా?... మీ మీసాలూ గెడ్డాలే!" అన్నాను నేను అంతకంటే నవ్వుతూ.

"ఇవా?.... వీటికి బోలెడు కథ వుంది. అసలు ఇలా వీటిని అరణ్యంలా పెంచడం నాకూ మా ఆవిడకీ ఇష్టంలేదు."

"వదినగారికి కూడా ఇష్టం లేదా?" మా ఆవిడ ఆశ్చర్యంగా చూసింది.

"అవునమ్మా- నాకు చదువూ లేదు, ఉద్యోగంలేదు. మా చెల్లితో నన్నూ, మా ఆవిడనూ పోషిస్తోంది. దానికి బోలెడు ఆస్తి ఉంది. వాళ్ళ మావగారు రెండేళ్ళ క్రితం పోయారు. ఏడాది వెధవ, మా మేనల్లుడు ఆయన కోసం బెంగెట్టుకుంటే, మా చెల్లెలు అంది "అన్నయ్యా నువ్వు గెడ్డాలూ మీసాలూ పెంచాలి. నిన్ను చూసి వాడు వాళ్ళ తాతయ్య అనుకొని బెంగ మరిచిపోతాడు" అని. వాడి కోసం నేను గెడ్డం పెంచడం ఏమిటి అన్నాను- టాట్ వీల్లేదంది మా చెల్లి. మరి దాని రక్షణలో ఉన్నాం కదా. తప్పలేదు– ఇదమ్మా గెడ్డం మీసం కథ. వస్తాను. ఎక్కడికి వెళ్ళావని అరుస్తున్నారు అదిగో మా ఆవిడా చెల్లాయీ అంటూ భయం భయంగా "వస్తున్నా వస్తున్నా" అంటూపరిగెట్టాడు- ఊడిపోతూన్న పంచె, గోచీ సర్దుకుంటూ. పరిగెడుతూన్న ఆ యోధుణ్నీ మేధావినీ చూస్తూ స్థాణువుల్లా నిలబడిపోయాం నేనూ, మా ఆవిడాను. ●

వారఫలం

29-9-1989 శుక్రవారం మొదలు
5-10-1989 గురువారం వరకు

మేషం : మీ రాజకీయ జీవితం మూడు పూలు ఆరు కాయలతో విస్తరిస్తుంది. అభిమానులున్నారు. ధనాభివృద్ధి యున్నది. శుభ ప్రస్తావనలుంటాయి. నూతన వస్తు సేకరణకు, విక్రయానికి లాభ సంపాదనకు అనుకూల సమయం. స్త్రీలకు : శుభ సమయం

వృషభం : శుభదాయక సమయం. బంధు మిత్ర సమాగమం వృత్తియందు అధిక లాభం. ఇంట శుభం జరుగుటకు ఆస్కారం. తక్కువ ధరకు లభ్యమయినవి విశేష లాభదాయకం కావటం గమనించాలి. సభా మర్యాద యున్నది. సాంఘిక రంగాన పేరు ప్రతిష్ఠలు రాగలవు. అపూర్వ వస్తు సేకరణకు ఆస్కారం. స్త్రీలకు : బంధు మిత్ర సమాగమం. ధనలబ్ధి.

మిథునం : రెండు మూడు దినాలుగా దినచర్య వెనుకా ముందు కావటం గమనించి ఉంటారు. బహు శుభదాయక దినాలు. మీ ఆదాయ మందు చెప్పదగిన అభివృద్ధి కనిపిస్తుంది. చిత్ర రంగాన శ్రమించువారికి లాభదాయక దినాలు. స్త్రీలకు : అధిక విద్యకో లేక వ్యాపార నిమిత్తమో చాలా దూర తీరాలకు వెళ్ళనున్నారు కొందరు.

కర్కాటకం : వాహన వసతి ఏర్పడనున్నది. తగిన ధన వసతి యున్నది. బహు దూరాన్నుండి, లేక విదేశాన్నుండి బంధుమిత్రులు రాగలరు. ఆదాయమందు ఎట్టి లోపం రాదు. శుభ ప్రస్తావనలు లాభిస్తాయి. విద్యావేత్తల సహాయ మున్నది. స్త్రీలకు : రాజకీయ రంగాన ప్రసిద్ధి. వ్యాపారానసర్వానుకూలతకు ఆస్కారం. గ్రహించాలి.

సింహం : రాజకీయంగా మేలైన సమయం గాదు. ఏ ప్రయత్నమూ కొనసాగిరాదు. పరులకు యిచ్చిన అప్పులు వసూలగుటకు బాగా శ్రమించాలి. కొరగాని విషయమందు జోక్యం అనవసరమని మీరే గ్రహిస్తారు. బంధు శతృత్వం రావచ్చు. కోప తాపాలకు స్వస్తి చెప్పండి. స్త్రీలకు : ఉద్యోగ వృత్తులందు మేలు.

కన్య : 'శని' క్రమంగా మీకు మేలు చేయనున్నాడు. చుట్టుప్రక్కలవారి మనస్తత్వాన్ని బట్టి మెలగుటకు అలవాటు పడాలి. ఆదాయ లోపం లేదు. వ్యాపారంలో కొంత శ్రద్ధ వహించటం శ్రేయస్కరం. స్త్రీలకు : వృత్తి యందు అనుకూలం. బంధు మిత్ర సమాగమం, ఆరోగ్యవృద్ధి.

తుల : శ్రమించి, శ్రమించి విశ్రమించాలనుకొన్నా, తీరిక లేని పని వెంటాడుతుంది. రాజకీయ వాతావరణం మీకు లాభదాయకమే. ఉత్తమ మిత్రులు చేరుతారు. ఆరోగ్యరీత్యా పెంపుగల సమయం, గ్రహించాలి. స్త్రీలకు : సభా గౌరవం, సుప్రసిద్ధులతో మిత్రత్వం, ధనలాభం. ప్రయాణానుకూలత, గ్రహించాలి.

వృశ్చికం : ఆశించిన విధంగా డబ్బు అందుట గమనింపదగిన అంశం. ఒకానొక వ్యవహారం, సులభ సుందరంగా నెరవేరుతుంది. ఇంటా బయటా మీ చాకచక్యం ప్రశంసనీయమవుతుంది. సభారంగాన ప్రసిద్ధి. స్త్రీలకు : వృత్తియందు పెంపు, కొందరకు రాజకీయ రంగాన గుర్తింపు, ఆదాయమందు పెంపు.

ధనుస్సు : బహు దూరం వెళ్లాలని యోచన. ఈ వారం కలసిరాదు, శ్రేయోదాయకంగాదు. అప్రయత్నంగా ధనం అందనున్నది. బహు జాగ్రత్తగా సంచరించాలి. విద్యావేత్తల సహాయమున్నది. స్త్రీలకు : శుభదాయకం, యత్న కార్యసిద్ధి, ఉద్యోగించే వారికి 'ప్రమోషన్' రావచ్చు. అది చాలా కాలంగా తనఖా పడినదేగా!

మకరం : వృత్తియందు పెంపు కనిపించే సమయం. దూరభారాల నుండి పరిచితులు రాగల సమయం, వారికై శ్రమించవలసిన సమయం. కృషి లోపం లేకపోతే అన్ని విధాలా మేలే. ఉద్యోగమందు అభివృద్ధి చెప్పదగిన సమయం. స్త్రీలకు : దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యం, సాగిస్తే లాభదాయకమే.

కుంభం : 'శని' గురులు మీకు అధిక లాభదాయకులు. వృత్తి వికాసం, వ్యాపారాభివృద్ధి, కృషి యందు గుర్తింపు, రాణింపు. రాజకీయ రంగాన ప్రవేశింప ఉబలాటకు ఆస్కారం. పై పై మెరుగులు చూచి మోసపోయి అందరితో చేరకండి, యిబ్బందులపాలు కాకండి. స్త్రీలకు : అప్రయత్న ధనలబ్ధి. గ్రహించాలి.

మీనం : భారీ వ్యాపారం చేయ దలపెట్టినారా? ఈ వారం ఆలోచించి ముందుకు సాగండి. 'జాయింటు' వ్యాపారం చేయదలచినా అనుకూల సమయమే. అభివృద్ధికరమైన మార్పులు రానున్నవి. అయినవారి సంబంధం నిశ్చయం అగుటకు ఆస్కారం. స్త్రీలకు : బంధుమిత్ర సమాగమం. వృత్తియందు అను కూలత, గ్రహించాలి.

– విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



ఇటీవల హైదరాబాద్‌లోని బద్రికా గార్డెన్స్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ టి. సుబ్బరామిరెడ్డి గారి కుమారుడు చిరంజీవి సందీప్ వివాహం– శ్రీ బ్రిజ్‌మోహన్‌రెడ్డి కుమార్తె సౌభాగ్యవతి సరితతో అత్యంత వైభవంగా జరిగింది.

దేశం నలుమూలల నుంచి అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల [illegible], గవర్నర్లు, చీఫ్ జస్టిస్‌లు, హిందీ, తెలుగు చిత్ర రంగానికి చెందిన ప్రముఖ [illegible], పత్రికాధిపతులు, జర్నలిస్టులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఈ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఫిజియో థెరపీ అంటే ఏమిటి?

ఫిజియో తెరపీ అంటే భౌతిక చికిత్స. పోలియో, పక్షవాతం, సెరబ్రల్ పల్సీ, కీళ్ల నొప్పులు మొదలైన జబ్బులకు వ్యాయామం మరియు విద్యుత్ పరికరాలతో చికిత్సచేసి, రోగిని ఎంత వీలయితే అంత శారీరకంగాను, మానసికంగాను పునరావాసం కల్పించుటయే ఫిజియో తెరపీ వుద్దేశ్యం.

వ్యాయామం చేయడానికి అనారోగ్యులు పనికిరారా?

"ఎక్సర్ సైజులు" చేయడానికి పనికిరారు అని చెప్పలేమండి. ఎందుకంటే ఫిజియో తెరపీలో అనారోగ్యంతో బాధపడే వారితోనే వారికున్న వ్యాధిని బట్టి ఏ ఎక్సర్ సైజు అవుసరమో, ఆ ఎక్సర్ సైజుతోనే చికిత్స చేస్తాము.

మూతి వంకరపోవుట కన్ను మూత పడక పోవటం పక్షవాతమా? దానిని వ్యాయామంతో నివారించ వచ్చా?

మూతి వంకరపోవుట, కన్ను మూత పడక పోవటం పక్షవాతం కాదు. దానిని 'బెల్స్‌పల్సీ' అంటారు. సాధారణంగా మందులతో తగ్గుతుంది. మందులతో వారంలోపల తగ్గకపోతే "పిజియో తెరపీ" తప్ప వేరే మార్గం లేదు. అంటే "ఎలక్ట్రిక్ స్టిమ్యులేషన్" వ్యాయామంద్వారా పూర్తిగా సరి చేయవచ్చు.

"ఎలక్ట్రిక్ స్టిమ్యులేషన్" వలన ఏదయినా హాని జరుగుతుందా?

ఫిజియో తెరపీలో విద్యుత్ పరికరాలతో ఇచ్చే కరెంటు వలన ఏ హాని వుండదు. ఇతర రోగాలకు ఇచ్చే కరెంటు ట్రీట్‌మెంట్‌కీ, ఫిజియో తెరపీలో వాడే కరెంట్ ట్రీట్‌మెంట్‌లోని విధానంలో తేడా తెలియనందు వలన ప్రజలలో ఈ అనుమానం కలుగుతోంది.

పక్షవాతంలో కాలు చేయి పడిపోతే 'ఫిజియో తెరపీ' ద్వారా బాగుచేయవచ్చా?

బాగుచేయవచ్చు. కానీ ఫలితాలు రోగి యొక్క వయస్సు, శారీరకంగా మానసికంగా ఎంత దెబ్బ తిన్నాడు, మనోబలం మొదలైన వాటిమీద ఆధారపడి

వుంటాయి.

పోలియో జబ్బు పూర్తిగా నయమవుతుందా? ఆ జబ్బుకు ఫిజియో తెరపీ ఉపయోగపడుతుందా?

పోలియోజబ్బు పూర్తిగా మాత్రం నయమవదు. ఎంతో కొంత అవిటితనం మిగిలిపోతుంది. ఈ జబ్బుకు 'ఫిజియో తెరపీ' చాలా బాగా ఉపయోగపడుతుంది. జబ్బు వచ్చిన ఆరు వారాల తరువాతే వ్యాయామం అది మొదలు పెట్టాలి. ఈ జబ్బుకు సరియైన వైద్యం చేయించకపోతే అవయవాలు వంకర్లు తిరిగిపోవటం జరుగుతుంది. అప్పుడు శస్త్రచికిత్స చేయించి, తరువాత 'ఫిజియో తెరపీ' చేయించాలి. అప్పుడే శస్త్రచికిత్స ఉపయోగం బాగా కనపడుతుంది. అవసరమైతే "స్ప్లింట్స్", "కాలిపెర్స్" లాంటి విక్కడ ఉపయోగించవలసి వస్తుంది.

పొట్టను వ్యాయామం ద్వారా తగ్గించు కోవచ్చా?

ఒక్క వ్యాయామం ద్వారా తగ్గించుకోవాలంటే కష్టం. వ్యాయామంతో పాటు ఆహార నియమాలు కూడా పాటిస్తే పొట్ట తగ్గించుకోవచ్చు.



ఫిజియో థెరపీలో డిప్లొమా తీసుకున్న శ్రీ శేషగిరిరావు '75 దాకా మిలటరీ ఆసుపత్రులలో పనిచేశారు. తరువాత విజయవాడలో ప్రాక్టీసు.

మెడ కండరాలు అప్పుడప్పుడు బిగుసుకుంటుంటాయి. అట్లాగే నడుము పట్టివేసిందంటారు. వీటికి ఏమైనా ఎక్సర్ సైజులు ఉన్నాయా?

మెడకండరాలు బిగుసుకోవడానికి, నడుము నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. 'సెర్వికల్ స్పాండిలోసిస్' వచ్చిన వాళ్లు మెడకు 'కాలర్'వాడుతుంటారు. దీనితో పాటు పండుకున్నప్పుడు దిండు వాడటం మానివేయటం, మెడను ముందుకు వంచటం చేయకపోవటం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాన్నిస్తుంది. అట్లాగే నడుము నెప్పి (లోబేక్ ఏక్) వున్న వాళ్లు బల్లమీద పండుకోటం, ముందుకు వంగకుండా వుండటం 'స్పైనల్ ఎక్స్‌టెన్షన్' వ్యాయామాలు చేస్తే మంచి ఫలితాలు కనపడుతాయి.

"ఫిజియో తెరపీ" ఇంకా ఎలాంటి వాటిల్లో మంచి ఫలితాల్నిస్తుంది?

ఎముక విరిగి అతుక్కున్నాక కట్టు తీస్తాము. కట్టు తీసిన తరువాత 'జాయింట్ మొబిలైజేషన్'కి వ్యాయామం చాలా అవసరం. ఇంకా కీళ్లనొప్పుల్లో కూడా మందులతో పాటు దెబ్బతిన్న జాయింట్‌కి వ్యాయామం చాలా అవసరం. 'ఫిజియో తెరపీ' వలన కండరాలు బలహీనపడకుండా కాపాడుతూ, రేంజ్ ఆఫ్ మూమెంటును మెయింటెయిన్ చేయగలిగితే రోగికి చాలా ఉపశమనం కలుగుతుంది.

కూర్చోవటంలో గాని, పడుకోవటంలో గాని ఏమైనా జాగ్రత్తలు అవసరమా? ఏమైనా 'పొజిషన్స్' ఉంటాయా?

కూర్చోవటానికి గాని, పండుకోవటానికి గాని కొన్ని పొజిషన్స్ ఉంటాయి. కాని మనకు మొదట్నుంచీ కొన్ని అలవాట్లు అయి, వాటిని అనుసరిస్తూ వుంటాము. కూర్చునప్పుడు మనము కూర్చున్న కుర్చీ కంటే ఎత్తయిన బల్లమీద కాళ్లు పెట్టి కూర్చోవటం, నడుము ముందుకుగాని, ప్రక్కకుకాని ఎక్కువగా వంచి కూర్చోవటం మంచిది కాదు.

వెల్లకిలగా పండుకొన్నప్పుడు, మోకాళ్లక్రింద దిండు పెట్టుకోవటం, ప్రక్కలకు తిరిగి పండుకొనేటప్పుడు మోకాళ్ల మధ్యన దిండు పెట్టి పండుకోవటం మంచిది.

ఇంటర్వ్యూ:
హిప్నాటిస్ట్ టి.ఎస్.రావు

సీరియల్ పంచశూలమ్

విశ్వప్రసాద్

91

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ –23 : పంచశూలమ్ పంపిన యువకుడు ఇన్‌స్పెక్టర్ 'షా' గా చెలామణీ అవుతూ జోషీ కేసు దర్యాప్తు చేస్తుంటాడు. గురూజీ కూతురు మీనాక్షి, జయరాజ్ కొడుకు మోహన్‌లు మరణిస్తారు. ఎం. ఎల్. ఎ. దీపాదేవిని – ఊర్వశి కాల్చి చంపుతుంది. జయరాజ్ భార్య పరిమళను మదన్ కాల్చిచంపి ఆమె శవాన్ని యింటి గుమ్మం ముందు వ్రేలాడదీస్తాడు. కన్నతల్లి విశాలాక్షిని సుభాష్ క్రూరంగా చంపి పంచశూలమ్‌ని హతమార్చానని టైగర్ వేషంలో జయరాజ్–గురూజీలను నమ్మించి విశాలాక్షి శవపేటికను అందజేస్తాడు. పంచశూలమ్ సన్మాన సభలో బాంబు ప్రేలి జయరాజ్ తల పగిలి మరణిస్తాడు. ఊర్వశి అబ్దుల్లాను చిత్రవధకు గురి చేస్తుంది.

చీకటి. ఎటు చూసినా చీకటే!

ఆ చీకటిని చీల్చుకుంటూ, –మృత్యువు తరుముకొస్తున్నట్టు – ప్రాణాలు చేతో పట్టుకుని, కారులో పారి పోతున్నాడు – గురూజీ.

డాష్ బోర్డులోంచి విస్కీ బాటిల్ తీశాడు. గడ–గడా రెండు గుక్కలు తాగాడు. విస్కీ గొంతులోంచి దిగే సరికి శరీరంలో వేడి పుట్టింది గుండెల్లో మొండి ధైర్యం బుసలు కొట్టింది. మరో రెండు గుక్కలు తాగాడు. బాటిల్ డాష్ బోర్డులో పెట్టాడు. ఏక్సలేటర్ని మరి కొంచెం నొక్కాడు గురూజీ

కాంటసా మహా వేగంగా పరుగెత్తుతోంది. అయినా ఎవరో యమపాశం వేసి, కారును వెనక్కి లాగుతున్నట్లనిపించింది గురూజీకి. ఏక్సిలేటర్ని అడుగంటా తొక్కాడు.

రోడ్డు మీద చక్రాలు నిలబడటం లేదు గాలితో పందెం వేసినట్లు ఎగిరి పోతోంది కారు

చచ్చేంత వరకు, లేదా మరొకడు చంపేంత వరకు ప్రాణాల మీద తీపి పోదు మానవుడికి

తన వాళ్ళంతా పోయారు. డబ్బు పోయింది. పరువు పోయింది. అన్నీ పోయాయి.

తన కళ్ళముందే మైక్‌లోంచి బాంబ్ పేలింది. జయరాజ్ ముఖం తునా తునకలై పోయింది. నామ రూపాలు లేకుండా చనిపోయాడు.

ఇహ తనకు ఎవరూ మిగల లేదు. ఏమీ మిగల లేదు....

– అయినా ఆశమాత్రం చావలేదు. బతికి యింకా ఏదో సాధించాలనే ఉంది. ఏమిటి సాధించాలో, ఎలా జీవించాలో, ఎక్కడ తల దాచుకోవాలో అతనికి తెలీదు.

అంతా చీకటి.

జీవితమే చీకటి.

అయినా. ఎక్కడో మినుకు మినుకు మంటూ ఓ నక్షత్రంలా కనిపిస్తున్నాడు అబ్దుల్లా. ఏర్ పోర్ట్‌లో కలుస్తానన్నాడు. దొంగ పాస్ పోర్ట్‌తో పాకిస్తాన్ తీసుకెళ్ళి పోతానన్నాడు.

అదే ఆశతో – చీకటిని చీల్చుకుంటూ ముందుకు వెళుతూనే ఉన్నాడు గుర్రూజీ.

కాని, సరాసరి మృత్యువు నోట్లోకే వెళుతున్నాడని అతనికి తెలీదు.

ఎదురుగా పెద్ద బ్రిడ్జి ఉంది.

వేగాన్ని తగ్గించాడు. బ్రిడ్జిని సమీపించాడు. కొంత దూరం పైకెక్కాడు గురూజీ.

ఇంతలో –

వెనక నుండి రెండు మోటర్ సైకిళ్ళు వచ్చాయి. కుడి వైపు నుండి, ఎడమ వైపు నుండి – ముందు కెళుతూ, కారును ఓవర్ టేక్ చేశాయి. బ్రిడ్జి మీద కెళ్ళి అటూ – యిటూ ఆగాయి.

కారు హెడ్ లైట్సు కాంతి మోటర్ సైకిళ్ళ మీద కూర్చున్న వ్యక్తుల మీద పడింది. కాని, వాళ్ళ వీపులు మాత్రమే కనిపిస్తున్నాయి. డ్రస్సునుబట్టి, సివిలియన్స్ లాగే ఉన్నారు.

కారును బ్రిడ్జి మీదకు ఎక్కించాడు గురూజీ. డ్రైవింగ్ సీటు కింద ఉన్న రహస్యపు అరలోంచి రివాల్వర్ తీశాడు.

'ధన్ ... ధన్....'

అతను రివాల్వర్ సవరించుకునే లోపునే – బ్రిడ్జికి రెండు వైపుల నుండి రివాల్వర్స్ పేలాయి.

కారు ముందు టైర్లు బరస్టయ్యాయి. కీచుమని శబ్దం చేస్తూ అటూయిటూ వూగింది కాంటసా.

అయినా కారు ఆపలేదు గురూజీ.

మరో, రెండు మూడు కిలోమీటర్లు వెళితే ఏరోడ్రోమ్ వస్తుంది. అక్కడ – నక్షత్రం లాంటి, అబ్దుల్లా ఉంటాడు. అతని దగ్గర కెళితే, తన బాధ్యత అంతా అతనే తీసుకుంటాడు. అదే ఉద్దేశంతో ఏదో విధంగా అక్కడికి చేరుకోవాలను కున్నాడు గురూజీ.

'ధన్.... ధన్....'

మళ్ళీ రివాల్వర్లు గర్జించాయి.

వెనక టైర్లు బరస్టయ్యాయి. రిమ్ముల మీద నడుస్తోంది కారు. జిగ్– జాగ్‌గా బ్రిడ్జి దిగుతోంది. ఏ క్షణంలో నైనా రిమ్ములు వంగి పోవచ్చు. కారు ఆగి పోవచ్చు.

కాని, అతను ఆగదలచుకో లేదు.

బ్రిడ్జి దిగి కొంత దూరం ముందు కెళ్ళింది కాంటసా. కుంటి వాడిలా నడుస్తూ ఓ మలుపు తిరిగింది.

కళ్ళ ముందు కనిపిస్తున్న దృశ్యాన్ని చూసేసరికి గుండెలు పగిలిపోయేటట్లు అదిరి పోయాడు గురూజీ!

ఎదురుగా–

రోడ్డుకు అడ్డంగా స్పోర్ట్స్ కారుంది! కారుపక్క – పర్వతంలా నిలుచున్నాడు పంచశూలమ్ అలియాస్ జోషీ!! అతని పెదవుల మధ్య ఉన్న రెడ్ పైప్ అగ్ని పర్వతంలా మండుతోంది!!!

ఆ కారును తప్పించుకు వెళ్ళడానికి ఎటూ దారి లేక షడన్ బ్రేక్ వేశాడు గురూజీ. తనకారు ఆగితే, తిరిగి కదలదని అతనికి తెలుసు. అయినా తప్పదు.

కీచుమని శబ్దం చేస్తూ ఆగిపోయింది కాంటసా.

ధైర్యాన్ని కూడగట్టు కున్నాడు గురూజీ. రివాల్వర్ సవరించు కున్నాడు. జోషీకి గురి చూసి కాల్చాడు.

బుల్లెట్ కంటే వేగంగా ఎగిరాడు జోషీ! స్పోర్ట్స్ కారు బోనెట్ పైకెళ్ళి నిలుచున్నాడు!! ప్రళయ రుద్రునిలా రూపం దాల్చాడు!!!

మళ్ళీ రివాల్వర్ పేల్చాడు గురూజీ. బోనెట్ మీద నుండి కిందకు జంప్‌చేశాడు, జోషీ! కాంటసా కారుకు ఎదురుగా నిలబడ్డాడు!!

గేరు మార్చాడు గురూజీ. ఫస్టు గేర్ వేశాడు. ఏక్సిలేటర్ని అడుగంటా నొక్కాడు. క్లచ్ రిలీజ్ చేశాడు. కాంటసాను ముందుకు దుమికించాడు. జోషీకి డేష్ కొట్టి, అతన్ని పచ్చడి చెయ్యాలనుకున్నాడు.


కాని, మెరుపులా పక్కకు తప్పుకున్నాడు జోషీ.

రిమ్ముల మీద నడుస్తున్న కాంటసాను కంట్రోల్ చెయ్యలేకపోయాడు గురూజీ. బ్రేక్ వేసినా ఆగలేదు. రోడ్డు పక్క కెళ్ళి చెట్టుకు గుద్దుకుంది కారు.

అదే సమయంలో డోరు తెరుచుకుని కిందకు దుమికాడు అతను. కాని రివాల్వర్ మాత్రం విడిచి పెట్టలేదు. భూమ్మీద పడగానే జోషీ కోసం చూశాడు. అతను తన వైపుకే వస్తుండటం గమనించాడు. అతనికి గురి చూసి మూడో సారి రివాల్వర్ పేల్చాడు గురూజీ.

అతని కంటే హుషారుగా ఉన్నాడు జోషీ. అతని చర్యలు గమనించాడు. చటుక్కున గాలిలో కెగిరాడు.

రివాల్వర్ లోంచి వచ్చిన బుల్లెట్ ఓ చెట్టుకు



తగిలింది.

మూడు గుళ్ళు వృథా అయిపోయాయి.

రెచ్చిపోయాడు గురూజీ. ఏదో విధంగా జోషీని చంపేయడానికే నిశ్చయించుకున్నాడు. రివాల్వర్ అతనికి గురి పెట్టాడు. విడవకుండా మూడు సార్లు కాల్చాడు.

మూడు గుళ్ళూ జోషీ గుండెలకు తగిలాయి!

చిన్నగా అరుస్తూ, గుండెల మీద చెయ్యి పెట్టుకున్నాడు!!

మొదలు నరికిన చెట్టులా వెల్లికిలా పడిపోయాడు!!!

ఆ దృశ్యాన్ని చూసే సరికి సంతోషంతో పొంగిపోయాడు. పక- పకా నవ్వుతూ వికటాట్టహాసం చేశాడు. బాణంలా జోషీ దగ్గరకు వచ్చాడు. కొద్దిగా వంగి అతని మీసాలు పట్టుకోబోయాడు– గురూజీ.

'ఫట్...'

జోషీ రెండు కాళ్ళూ గురూజీ గుండెల మీద తగిలాయి.

ఎగిరి మూడు మీటర్లు వెనక్కి పడ్డాడు గురూజీ.

మెరుపులా పైకి లేచాడు జోషీ. అంత వరకు తొడుక్కున్న– వేస్ట్ కోటు లాంటి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ తీశాడు. "అరేయ్ గుర్నాథం, నా చావు నీ చేతిలో లేదు. కాని, నీ చావు నా చేతిలో ఉంది" అంటూ ముందుకు అడుగు వేశాడు.

అతన్ని చూసే సరికి యముడే మీదకు వస్తున్నట్టనిపించింది. చలిజ్వరం వచ్చినట్టు ఆపాదమస్తకం ఒణికి పోనారంభించాడు. "జోషీ సార్! క్షమించండి" అన్నాడు రుద్ధ కంఠంతో గురూజీ.

"ఆ శబ్దానికి అర్థం మరచిపోయాను, గుర్నాథం!"

జోషీ కాళ్ళు పట్టుకున్నాడు గురూజీ.

"నో... నీలాంటి దుర్మార్గుణ్ని ఎవరూ క్షమించలేరు. ఏ చట్టం క్షమించమని చెప్పదు. ఏ న్యాయస్థానం అంగీకరించదు" అంటూ, చేతిలోని జాకెట్‌తో అతని ముఖం మీద కొట్టాడు జోషీ.

కరెంట్ షాక్ తగిలినట్టయింది గురూజీకి. పదులు తిరిగి పోయాడు.

అదే సమయంలో –

సుభాష్, మదన్‌లు మోటార్ సైకిళ్ళ మీద అక్కడికి వచ్చారు.

వాళ్ళను చూసేసరికి విపరీతంగా ఒణికిపోయాడు గురూజీ.

మొలకు చుట్టుకున్న తాడు తీశాడు మదన్. శూలమ్ సాబ్! మల్లికను పెళ్ళి చేసుకోబోయే పత్రోడికి– అహల్య భిక్షగత్తె అని, ఊర్వశి వ్యభిచారి అని చెప్పి, పెళ్ళి చెడగొట్టాడు. మల్లిక, అహల్యలు ఉరేసుకుని ఆత్మహత్యలు చేసుకోడానికి కారకుడయ్యాడు. వీణ్ని ఈ చెట్టుకు వేలాడదీసి ఉరేసేస్తాను" అన్నాడు.

భూమిలోని అవశేషాలను కనుగొనే పరికరం

చాలా సంవత్సరాలుగా బల్కాన్, పెనిన్సులాలో పురాతన వస్తువుల కోసం అన్వేషణ జరుపుతున్న పురావస్తు శాస్త్రవేత్తలకు రొమేనియాలోని క్లజ్-నపోకా విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు బహుముఖ సేవలందిస్తున్నారట.

గామా కిరణాలు సోకే విధంగా వున్న ఒక పరికరాన్ని ఈ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ పరికరం భూమిలో పల 2 మీటర్ల లోతులో వున్న వస్తువులను యిట్టే పసిగట్టేస్తుందట. ఈ పరికరం ద్వారా శాస్త్రవేత్తలు అనేక రకాల విషయాలను కనుగొన్నారు. శిథిలమై పోయిన రోమన్ కాలం నాటి దుర్గాలు, ప్రాచీన ఆలయాల కట్టడాలను శాస్త్రవేత్తలు కనుగొనగలిగారట.

పురాతన నాణాలలో వున్న రసాయన పదార్థాలను కనుగొనే పరీక్షలో కూడా ఈ శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు చేసిన కృషి ఫలవంతమైందట.

"నీ ఆర్గ్యుమెంట్ కరక్టే. కాని, యితను యింకా చాలా ఘోరాలు చేశాడు. భారత్ బ్యాంక్ గూర్ఖాను పొడిచి చంపాడు" అన్నాడు జోషీ.

"అయితే, యితన్ని ఉరేసి వేలాడదీద్దాం. కత్తితో పొడిచి ఒంటి నిండా కన్నాలు పెడదాం."

"నో మై సన్స్! అంతకంటే క్రూరంగా చంపుతాను నేను.."

"జోషీ సార్! నన్ను చంపొద్దు- చంపొద్దు" భయంతో కంపిస్తూ, ఏడుస్తూ ప్రాధేయ పడ్డాడు గురూజీ.

"లేదు, గుర్నాథం నిన్నంత త్వరగా, సునాయాసంగా చంపను. నువ్వు మరి కాసేపు బతకాలి. కుళ్ళి కుళ్ళి ఏడవాలి. చిత్రహింసలు భరించలేక గుండె పగిలి చావాలి."

"ఇతన్ని ఉపేక్షించ కూడదు, శూలమ్ సాబ్!" అన్నాడు మదన్.

"మరణం ఎదురు చూస్తోంది. అతను కూడా చనిపోడానికి సిద్ధంగా ఉన్నాడు. అతనికి నరకం చూపించాలి. అది చూసి చనిపోతే, మరో జన్మలో అయినా- ద్రోహాలు, పాపాలు చెయ్యకూడదని గుర్తు పెట్టుకుంటాడు. కాళ్ళూ, చేతులు కట్టేసి నా కారులో వెయ్యండి."

"ఎక్కడికి తీసుకెళదాం" ప్రశ్నించాడు సుభాష్.

"ఏరోడ్రోమ్‌కి- మూడో కిలో మీటర్ రాతి పక్క నుండి ఎడమ వైపుకు చిన్న రోడ్డు వుంది. ఆ రోడ్డు మీద నుండి మూడు కిలో మీటర్లు ముందుకెళితే నాలుగు కొండల మధ్య చిన్న మైదానం వుంది. అక్కడ- అబ్దుల్లాతో సహా ఊర్వశి, సోఫియాలు మన కోసం ఎదురు చూస్తుంటారు". అని స్పోర్ట్స్ కారు వైపుకు బయలుదేరాడు పంచశూలమ్.

వెంటనే కాళ్ళు, చేతులు కట్టి గురూజీని కారులో వేశారు- సుభాష్, మదన్‌లు.

92

అర్ధరాత్రి.

ఐ. జి. ఆఫీసులోని- సీక్రెట్ రూమ్‌లో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి.

హోం మినిస్టర్ హరిశంకర్, సి. బి. ఐ. డైరెక్టర్ ఆదిత్య, ఐ. జి. మహేంద్ర మాత్రం ఉన్నారు. అంతవరకు జోషీ గురించి తర్జనభర్జనలు చేసి ముగ్గురూ అలసిపోయారు.

"వెరీ టిపికల్ కేసు. తను నిరపరాధినని నిరూపించుకోడానికి 25 సంవత్సరాలు నిరీక్షించాడు జోషీ... వెరీ వెరీ స్ట్రాంగ్ మాన్" అన్నాడు హరిశంకర్.

"అప్పుడే మన డిపార్టుమెంటుకు తెలిపితే, తగిన చర్య తీసుకునే వాళ్ళం" అన్నాడు మహేంద్ర.

"జోషీది సెన్సిటివ్ బ్రెయిన్. తనకు ద్రోహం చేసిన ఐదుగురిలో తన ప్రియురాళ్ళు యిద్దరున్నారు. కొన్నాళ్ళ పాటు వాళ్ళను అనుభవించినందు వల్ల వాళ్ళను రచ్చ కెక్కించడం అతనికి యిష్టం లేదు. అందుకే అప్పట్లో మౌనం వహించాడు. తర్వాత- వాళ్ళు కూడా తనను మోసం చేశారని తెలుసుకునేసరికి అతనిలో ప్రతీకార జ్వాలలు చెలరేగాయి" అన్నాడు ఆదిత్య.

"అప్పుడయినా మనకు రిపోర్ట్ చేసి ఉండొచ్చు" తన పాయింట్ మళ్ళీ చెప్పాడు మహేంద్ర.

"అప్పట్లో పోలీసుల మీద నమ్మకం లేదు జోషీకి. లాకప్‌లో ఉన్న కేషియర్, అకౌంటెంటు చచ్చిపోయారు. 'కోటి రూపాయలు ఎక్కడ దాచావ్?' అని అప్పుడప్పుడు పోలీసులు పీడిస్తూనే ఉంటారు. వారి పోరుపడలేక శిక్ష పడిన మర్నాడే జైల్లోంచి పారిపోయాడు. తనే స్వయంగా కక్ష తీర్చుకోవాలనుకున్నాడు. అందుకే పోలీసు వారిని సహాయం కోరలేదు" తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు హరిశంకర్.

"కాని, చట్టాల్ని తన చేతిలోకి తీసుకోకూడదు సార్!"

"అది తప్పే కాని, ప్రతీకారం అన్నది అగ్నిపర్వతం

లాంటిది. చట్టాలకు, న్యాయస్థానాలకు అతీతమైనది. అనుక్షణం రగులుతూనే ఉంటుంది. ఎప్పుడో బద్దలవుతుంది. శత్రువుల్ని నామరూపాలు లేకుండా చేస్తుంది."

"ఇంతకాలం ఓపిక పట్టిన జోషీ సహనాన్ని అభినందించాలి."

"మానవత్వపు విలువల ప్రకారం అతన్ని అభినందించాలి. నిజమే. కాని, చట్టాలు అంగీకరించవు. ఎనీహవ్... ఈ కేసు విషయంలో మీరు కొంచెం అశ్రద్ధ చేశారు" అన్నాడు హరిశంకర్.

"నో, సార్! నాలుగు నెలలక్రితం అతను తనకు జరిగిన అన్యాయాన్ని తెలియజేశాడు. పాత ఫైల్సు తీసి, మూడు నెలలు పరిశీలించాము. నెల క్రిందట ఆలీషాను అప్పాయింట్ చేశాము. మా పనులన్నీ స్పీడుగానే జరిపించాము. కాని, జోషీ మా కంటే స్పీడుగా పరుగెత్తాడు. మాకు ఈ కేసు విషయం తెలియజేయడానికి ముందే అతను అన్ని విధాల జాగ్రత్త పడ్డాడు. జయరాజ్, గురూజీల యిళ్ళల్లో యిద్దరు, ముగ్గురు నౌకర్లను, మన డిపార్టు మెంటులోని కొందరు వ్యక్తులను, గూండాలను, రౌడీలను ముందుగానే ఆకట్టుకున్నాడు. వాళ్ళ ద్వారా ఎప్పటికప్పుడు అన్ని విషయాలు తెలుసుకుంటూ తెలివిగా ప్లాన్ చేశాడు" అన్నాడు ఆదిత్య.

"అందుకే అతన్ని అనుమానించడానికి వీల్లేకపోయింది. పైగా, ఎప్పుడు చూసినా నిండుగా, నిర్మలంగా, ప్రశాంతంగా కనిపించేవాడు" చెప్పాడు మహేంద్ర.

"అఫ్‌కోర్స్_ హి బిహేవ్డ్ యాజ్ ఎ గ్రేట్ జంటిల్‌మాన్" అన్నాడు ఆదిత్య.

"అదే జోషీలోని స్పెషాలిటీ. తనలో రగులుతున్న పగను ఏనాడూ బైటకు కనపడనివ్వలేదు. తనలో తానే అణుచుకుంటూ పాతికేళ్ళు అజ్ఞాతవాసం చేశాడు. ముక్కు, కళ్ళు మార్చుకున్నాడు. పంచశూలమ్ అని చేతిమీద పచ్చబొట్టు పొడిపించుకున్నాడు. పంచామృతం హోటల్లో పార్ట్‌నర్‌గా చేరాడు. రిటైర్డ్ మిలటరీ ఆఫీసరునని నమ్మించాడు. పరువుగా బతుకుతున్నాడు. ఐదు కోట్ల రూపాయలు తీసుకువచ్చి పోలీసు డిపార్టుమెంటుకు అప్పగించాడు. అలాంటి వ్యక్తిని అనుమానించడం సాధ్యం కాదు. పైగా, ఢిల్లీ నుండి బయలు దేరిన ఆలీషా మధ్యలో అంతర్ధానమై - అతని స్థానంలో జోషీ మనిషే యిక్కడికి రావడంవల్ల కేసు మరుగున పడిపోయింది" అన్నాడు మహేంద్ర.

"ఆలీషాగా, హైద్రాబాదు వచ్చిన వ్యక్తి ఎవరు?" ప్రశ్నించాడు హరిశంకర్.

"సుభాష్... అబ్దుల్లా అనుమానించినట్టు ఆలీషాకు, సుభాష్‌కి చాలా దగ్గర పోలికలున్నాయి. జోషియే తన కొడుకును ప్రోత్సహించి ఉంటాడు" ఆదిత్య చెప్పాడు.

"కొడుకెవరు?" అడిగాడు హరిశంకర్.

"సుభాష్ జోషీ కొడుకే. అంతేకాదు - అతనికి మరో కొడుకున్నాడు.

"ఎవరతను?"

"మదన్"

"మైగాడ్! జోషీ కొడుకా. ఆ గూండా మదన్!?

"ఎంత గొప్ప వ్యక్తికి పుట్టినా పెంపకంవల్ల, పరిసర ప్రదేశాలవల్ల, వాతావరణంవల్ల, పిల్లల ప్రవర్తన, మనోభావాలు మారిపోతాయి. మదన్ ఓ భిక్షగత్తె దగ్గర పెరిగాడు. రౌడీ, గూండా, దొంగల దగ్గర తరిఫీదు పొందాడు. ఈనాడు తండ్రిని కలుసుకున్నా, అతని గొప్పతనాన్ని తెలుసుకున్నా, చిన్నప్పటినుండి అలవాటైన బుద్ధుల్ని మరచి పోలేదు" చెప్పాడు ఆదిత్య.

"అపరాధులంతా మీకు తెలిసినా, యింతవరకు వాళ్ళను ఎందుకు అరెస్ట్ చెయ్యలేదు?" ప్రశ్నించాడు హరిశంకర్.

"జోషీని సన్మానించిన తర్వాతే, ఈ నిర్ణయాలకు రాగలిగాను నేను. తండ్రీ కొడుకులు కలసి మారణహోమం ప్రారంభించారు. నలుగుర్ని చంపేశారు. ఐదో వ్యక్తి కోసం వేటాడుతున్నారు"

అన్నాడు ఆదిత్య.

"ఎవరతను?"

"గురూజీ!"

"మైగాడ్"

అతన్ని అంతం చేసేంతవరకు తండ్రీ కొడుకులు శాంతించరు. నిద్రపోరు."

ఆదిత్య యింకా ఏదో చెప్పబోతుండగా టెలిఫోన్ మోగింది.

రిసీవరు అందుకున్నాడు మహేంద్ర. "యస్... రిపోర్ట్..." అన్నాడు.

"సార్, హైద్రాబాదు, సికింద్రాబాదుల్లోని - అన్ని పోలీస్ స్టేషన్లనుండి, వేనుల్లోను, జీపుల్లోను, మోటార్ సైకిళ్ళపైన దాఢాపు వంద వాహనాల్లో, వెయ్యి మంది పోలీసులు, జోషీని వెదకడానికి బయలు దేరారు. కొంతవరకు వచ్చిన వైర్‌లెస్ వార్తల్లో, అతనుగాని, అతని స్పోర్ట్సుకారుగాని కనిపించలేదు. కాని, సార్, ఇప్పుడే ఏరోడ్రోమ్‌నుండి మరో మెసేజ్ వచ్చింది."

రిపోర్ట్" ఆజ్ఞాపించాడు మహేంద్ర.

"ఏర్‌పోర్ట్‌కి మూడు కిలోమీటర్ల దూరంలో ఎడమ వైపు చిన్న రోడ్డు ఉంది. స్పోర్ట్స్ కారు అటు వెళ్ళడం ఓ కానిస్టేబుల్ చూశానంటున్నాడు."

"ఏరోడ్రోమ్ వైపు వెళ్ళిన మన యిన్‌స్పెక్టర్లు ఏం చేస్తున్నారు?"

"ఏరోడ్రోమ్ బైట రెడీగా ఉన్నారు. మీ ఆర్డరు కోసం ఎదురు చూస్తున్నారు."

"ఎన్ని వాహనా లున్నాయి?"

"నాలుగు వేన్‌లు, రెండు జీపులు, ఆరు మోటర్ సైకిళ్ళు- వంద మందికొపైన కానిస్టేబుల్స్..."

"వాళ్ళను అక్కడే ఉండమను. నేను వస్తున్నాను."

"ఆర్డర్ సార్!"

రిసీవర్ పెట్టేశాడు మహేంద్ర. "ఏరోడ్రోమ్‌కు మరి కొంత దూరంలో ఉన్నాడు జోషీ" అన్నాడు.

ఒక్కక్షణం ఆలోచించాడు ఆదిత్య. చటుక్కున కుర్చీలోంచి లేచాడు. "పదండి వెళదాం. బతికుంటె గురూజీని రక్షిద్దాం" అన్నాడు.

ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాడు హరిశంకర్.

"నో డౌట్. గురూజీని వేటాడుతూ అటు వైపుకు వెళ్ళి ఉంటాడు జోషీ. మీరు రెస్ట్ తీసుకోండి. మేము వెళ్ళి చూసి వస్తాం" అన్నాడు ఆదిత్య.

"విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు హరిశంకర్.

రిసీవర్ అందుకున్నాడు మహేంద్ర. బజర్ నొక్కాడు.

అవతలి నుండి "హలో సార్!" అని వినిపించింది.

"హర్రీ అప్... వేనుల్లోను, జీపుల్లోను తిరుగుతున్న పోలీసు బృందాలన్నిటికీ వైర్‌లెస్‌లో చెప్పు. అందర్నీ ఏరోడ్రోమ్ వైపుకు రమ్మను.... క్విక్.... జోషీ, మదన్, సుభాష్, అబ్దుల్లా, గురూజీ- ఎవరు ఎక్కడ కనిపించినా అరెస్ట్ చెయ్యమను." అని,రిసీవర్ పెట్టేసి హడావిడిగా బయలుదేరాడు మహేంద్ర.

93

అర్ధరాత్రి దాటిపోయింది.

అప్పుడే తెల్లవారింది మదన్‌కి. అర్ధరాత్రి గడిచిన తర్వాతనే అతని మెదడు బాగా పని చేస్తుంది. కాల భైరవునిలా తయారయ్యాడు.

అతనికంటే రౌద్ర రూపాన్ని దాల్చి, పరశురాముడిలా నిలుచున్నాడు సుభాష్.

అబ్దుల్లా శరీరాన్ని టోరర్ కారులోంచి కిందకు తోశారు- ఊర్వశి, సోఫియాలు.

అతని చేతిని పట్టుకుని, బరబరా లాగాడు. మధ్యలో నున్న ఓ రాతి మీద పడేశాడు మదన్.

స్పోర్ట్స్ కారు, టోరర్ కారు, మోటార్ సైకిళ్ళు- దూరం దూరంగా నాలుగు వైపుల ఉన్నాయి. వాటి హెడ్‌లైట్లు వెలుగుతోన్నాయి. ఆ కాంతితో పట్ట పగల్లా ఉంది ఆ ప్రదేశమంతా.

అబ్దుల్లాని చూడగానే మదన్‌లో ఉద్రేకం ఎక్కువై పోయింది. "భాయ్! వీణ్ణి ఫుట్‌బాల్ని తన్నినట్లు అటూ- యిటూ తన్ని ప్రాణాలు తీద్దాం." అన్నాడు.

"మోటర్ సైకిల్‌తో ఢీకొట్టి ఒక్కొక్క కీలు విరిచేద్దాం."

"కాళ్ళ దగ్గర నుండి అంగుళం అంగుళం నరికేద్దాం."

"అవన్నీ ఓల్డ్ స్టైయిల్. కొత్త పద్ధతి ఆలోచించండి. చిత్రవధ చెయ్యండి. అతను గిల గిల తన్నుకుంటే చూసి ఆనందించాలని ఉంది" అంది ఊర్వశి.

అప్పుడే పైప్‌లో కొత్త పొగాకు వేసి, అగ్గిపుల్ల గీశాడు జోషీ. గుప్‌గుప్‌న పొగ విడిచి పెట్టాడు. పైప్ చేతో పట్టుకున్నాడు. "ఒక్క క్షణం ఆగండి! అతను ఏ స్థితిలో ఉన్నాడో చూడనివ్వండి." అంటూ ముందుకు వచ్చాడు. అబ్దుల్లా చెయ్యి పట్టుకున్నాడు. చల్లగా ఉంది. నాడి ఆడటం లేదు. ముక్కు దగ్గర వేలు పెట్టాడు. గుండెల మీద చెయ్యి వేశాడు. శ్వాస కదలడం లేదు. "అబ్దుల్లా చనిపోయాడు" అన్నాడు.

"ఛూ!" అంటూ- రాతిమీదున్న అబ్దుల్లా శరీరాన్ని కాలితో తన్నాడు మదన్.

ఫుట్‌బాల్‌లా దూరంగా వెళ్ళిపడింది అబ్దుల్లా శవం.

"గుర్నాథాన్ని తీసుకు రండి" అన్నాడు జోషీ.

మదన్, సుభాష్‌లు - స్పోర్ట్స్ కారులోంచి గురూజీని తీసుకొచ్చి రాతిమీద వేశారు. అతని కట్లు విప్పారు.

ఆ రాతికి పక్కనే ఓ గొయ్యి ఉంది.

వెల్లికిలాపడి చలి జ్వరం వచ్చినట్లు ఒణికి పోతున్నాడు గురూజీ. "జోషి సార్! మరోసారి క్షమార్పణలు వేడుకుంటున్నాను. మన్నించండి, సార్!" అన్నాడు.

మాట్లాడలేదు జోషీ. పైప్ పీలుస్తూ నిలుచున్నాడు.

"నిలాంటి దుర్మార్గుణ్ని- కన్న తల్లి దండ్రులు కూడా క్షమించరు" పళ్ళు పటపట కొరికాడు మదన్.

"నీకు పుట్టిన బిడ్డలు కూడా నిన్ను క్షమించరు' అంటూ రాతిని తన్నాడు సుభాష్.

"భాయ్! ఏం చెద్దాం యితన్ని?"

"ఆ గోతిలో వేసి జీవ సమాధి చేద్దాం."

"నో... ఆ చెట్టుకు తల్లకిందులుగా వేలాడగట్టి, కింద మంటలాపెడదాం... సజీవ దహనం చేద్దాం."

క్రీడారంగం క్విజ్ జవాబులు

(1) మార్టినా నవ్రతిలోవా (ఒకే సంవత్సరం కాకపోయినా వరుసగా 4 గ్రాండ్ శ్లామ్ టైటిల్స్ గెలిచినందుకుగాను సింగిల్స్‌లో 'గ్రాండ్ శ్లామ్' లభించగా, పామ్ ష్రివర్‌తో కలిసి,84 లో డబుల్స్ గ్రాండ్‌శ్లామ్ సాధించింది.

(2) బి. బి. సి. వ్యాఖ్యాత, ఇంగ్లాండ్‌లో క్రికెట్ నిర్వాహకుడు అయిన "క్రిస్టఫర్ మార్టిన్ జంకిన్స్"

(3) జుడిత్ పొల్గర్, సుజేన పొల్గర్, సోఫియా పొల్గర్‌లు

(4) స్టీఫెన్‌బర్గ్

(5) ప్రపంచ వాలీబాల్, బ్యాడ్మింటన్ న్యూజిలాండ్‌కి చెందిన "బ్రియాన్ మెకంజీ".

(6) వెండీస్‌కి చెందిన "నొరీగా"

(7) 1971 లో.

(8) 1986 జనవరి గుజ్జార్, సిమ్లాలతో

(9) రూప్‌సింగ్

(10) 1951 – హైదరాబాదు, 62 – చునిగోస్వామి.

పర్మార్‌కి ఉరి తప్పలేదు!

నాడు.... ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీని తూటాలకు బలి చేసిన సత్వంత్, కేహార్‌సింగ్‌లు నాలుగేళ్ల విచారణ అనంతరం ఉరి తీయబడి చరిత్ర పుటల్లో కెక్కగా, నేడు.... ముగ్గురి హత్యకు కారకుడైన పర్‌మార్ తొమ్మిదేళ్ల విచారణ అనంతరం ఉరి తీయబడి చరిత్ర పుటల్లో కెక్కాడు.



"ఉరి" నిల్పివేతకు యితని తరఫున అనేక పిటీషన్లు దాఖలై ఆరుసార్లు ఉరి శిక్ష అమలు కాకుండా నిలిచిపోవటమే కాకుండా రాష్ట్రపతి క్షమాభిక్ష కోసం పెట్టుకున్న దరఖాస్తు కూడా నిరాకరింప బడటంతో ఆఖరికి పర్‌మార్ ఉరిశిక్ష ఖాయమై సెప్టెంబరు 7న అమలు జరిగింది.

1980లో తన న్యాయవాది కుటుంబంలోని ముగ్గుర్ని హతమార్చాడన్న నేరంపై అతనికీ ఉరిశిక్ష పడిందట.

హత్యలు చేయటానికి గల బలమైన కారణం ఏమిటా అని ఆరాతీస్తే.... రాజ్‌కోట్ సమీపంలో వున్న ఒక చేపల పెంపకం కేంద్రంలో బాయిలర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఈ శశికాంత్ కేశవ్‌లాల్ పర్‌మార్ తన సహోద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు 1977లో ఉద్యమించి ఉద్యోగం పోగొట్టు కున్నాడట. లేబర్ కోర్టుకు వెళ్ళిన పర్‌మార్‌కు కోర్టు 79లో యిచ్చిన ఆదేశాలు నచ్చక ఆ కోర్టు ముందే ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నాడట. రాజ్‌కోట్ బార్ అధ్యక్షుడి చొరవతో దీక్ష విరమించినప్పటికీ ఆయన తనను వెన్నుపోటు పొడిచాడని భావించి పగ తీర్చుకోవాలన్న కక్షతో యింటికి వెళ్లగా న్యాయవాది కనిపించక పోవటంతో యింట్లో కనిపించిన ఆయన కుటుంబ సభ్యులు ముగ్గుర్ని హతమార్చి ఆవేశం చల్లార్చుకున్నాడట. కాని ఒరిగిందేమిటి.... తొమ్మిదేళ్ళు జైలు గోడల మధ్య దుర్భర జీవితం అనుభవించటం, ఆరుసార్లు ఉరిశిక్ష అమలు కాకుండా తప్పించుకోవటం.... కాని ఆఖరికి ఉరికంబమే శరణ్యమైంది.

తన సహోద్యోగుల కోసం పోరాడుతూ ఆమరణ నిరాహార దీక్షలో కన్నుమూసినా త్యాగశీలిగా కొనియాడబడే వాడేమో.... అలాకాక హంతకుడిగా మారి తన చావును తానే కోరితెచ్చుకున్న వాడయ్యాడు పర్‌మార్. మరి విధి విలాసాన్ని ఎవరాప గలరు?

– తిలక్

"ముందు కళ్ళు పొడుద్దాం."

"నాలుక కోసేద్దాం" అన్నాడు మదన్.

వాళ్ళు అలా చేస్తే, ఎలాంటి బాధకు గురి కావాలో వూహించుకున్నాడు గురూజీ. "నన్ను హింసించవద్దు. ఒక్కసారిగా చంపేయండి" అన్నాడు భయంతో ఒణికిపోతూ.

ఇంతలో -

టోరర్ కారులోంచి ఓ పాముల బుట్ట తీసుకువచ్చింది సోఫియా. మూత తెరిచింది.

బుస్సున తల పైకెత్తింది బుట్టలోని పాము. పడగ విప్పి నాలుక తెరిచింది.

"ఈ పాముచేత 'కిస్' చేయిద్దాం" అంది సోఫియా.

"పడగను అతని నోట్లోకి తోసేద్దాం" అంది ఊర్వశి.

అంతవరకు రెడ్‌పైపు పీలుస్తూ, మౌనంగా నిలుచున్న జోషీ "నో, నేబీ! అవన్నీ పాత పద్ధతులే" అన్నాడు.

మూత మూసింది సోఫియా. బుట్టను గురూజీ గుండెలమీద పెట్టింది. "ఆల్‌రైట్ అంకుల్! ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి" అంది.

మృత్యువు తన గుండెల మీద కూర్చున్నట్లనిపించింది. విపరీతంగా ఒణకనారంభించాడు గురూజీ.

"చెప్పండి, అంకుల్!" అంది ఊర్వశి.

"ఇతని ప్రాణాలు తీసే ఛాన్స్ నా కివ్వండి" అన్నాడు మదన్ మొల్లోంచి కత్తి తీసి.

"ఆ ఫైనల్ ఛాన్స్ నాకు కావాలి. వాడిని నేనే చంపాలి" అన్నాడు సుభాష్-రివాల్వర్ చేత్తో పట్టుకుని.

"మై గుడ్ సన్స్! ఒక్క క్షణం ఆగండి" అని రెండడుగులు ముందుకు వచ్చాడు జోషీ. గురూజీకి ఎదురుగా నిలుచున్నాడు. గుర్నాథం! నీకు జీవితంమీద ఆశ ఉందా? ప్రశ్నించాడు

"లేదు. పంచశూలాల్లా మీ అయిదుగురు నన్ను పొడిచి చంపేయాలని చూస్తున్నారు. మీ బారినుండి తప్పించుకోలేను. ప్రాణంతో బతకలేను" ఏడుస్తూ అన్నాడు గురూజీ.

"ఇంకా బతకాలని ఉందా? ఉంటే చెప్పు. నిన్ను ప్రాణాలతో విడిచిపెడతాం"

"ఉంది. మీరు క్షమించి విడిచిపెడితే, ఈ దేశం వదిలిపెట్టి వెళ్ళిపోతాను."

"కాని, ఓ షరతు."

"ఏ షరతుకైనా అంగీకరిస్తాను."

"అయితే, పాతికేళ్ళక్రితం - మద్రాసులో, భారత బ్యాంక్ దోపిడీ ఎలా జరిగిందో, ఎవరెవరు చేశారో వివరంగా చెప్పు."

"ఆ గొడవ ఎందు కిప్పుడు?"

"అదే కావాలి. జరిగింది జరిగినట్టు చెప్పు"

"అబద్ధం చెప్పావో, నీ నాలుక కోసేస్తాను" అన్నాడు మదన్.

"ఒక్కమాట తప్పు చెప్పినా, నీ ప్రాణాలు తీస్తాను" గద్దించాడు సుభాష్.

రాతిమీద వెల్లికిలా పడి ఉన్న గురూజీ ఓమారు కళ్ళను అటూ యిటూ తిప్పాడు.

పైప్ పీలుస్తూ, పరశురాముడిలా నిలుచున్నాడు జోషీ!

నాగుపాములా బుసలు కొడుతోంది సోఫియా!!

రివాల్వర్ పట్టుకుని యముడిలా అగుపించాడు సుభాష్!!

మహా కాళిలా రౌద్రరూపాన్ని దాల్చి, నిలబడింది ఊర్వశి!!

ప్రచండ భైరవుడిలా ఊగిపోతున్నాడు మదన్!!

ఆ ఐదుగురూ భూతాల్లా కనిపించారు గురూజీకి. ఒక్కొక్కరు ఒక్కో ప్రాణం తీసేస్తున్నట్టనిపించింది. "జరిగింది జరిగినట్టు చెబుతాను, నన్ను విడిచిపెట్టేస్తారా?" దీనంగా ప్రశ్నించాడు.

"ఈ రాతిబండమీద నుండి ప్రాణాలతో విడిచి పెడతాం. నేను మాటంటే మాటే - కోటి రూపాయ లిచ్చినా మాట తప్పను" అన్నాడు మదన్.

"గుండెలమీద పెట్టిన పాము బుట్ట తియ్యండి" భయపడుతూ అన్నాడు గురూజీ.

"దాన్ని తియ్యడానికి వీల్లేదు. నువ్వు చెప్పబోయే దానికి అది అడ్డు రాదు" అన్నాడు బూటు కాలితో రాతిని తన్నుతూ సుభాష్.

ఆ ఒత్తిడికి బుట్టలోని పాము 'బుస్' అంది.

గురూజీ మెదడు మొద్దుబారిపోయింది. ఆలోచనా శక్తిని కోల్పోయాడు. ఇహ, చెప్పక తప్పదనుకున్నాడు. "ప్రాణాలమీది తీపితో చెబుతున్నాను. నన్ను చంపకుండా విడిచి పెట్టేయాలి" అన్నాడు.

"అలాగే... చెప్పదలచుకున్నది త్వరగా చెప్పరా బద్మాష్!" అంటూ కత్తితో అతని చేతిమీద గీశాడు మదన్.

ఆ గీతమీద మిరియాలపొడి వేసింది ఊర్వశి.

"బాబోయ్ - చెబుతాను - నిజం చెబుతాను నన్నేం చెయ్యకండి" చిన్నగా అరిచాడు గురూజీ.

"చెప్పు - త్వరగా చెప్పు" అన్నాడు సుభాష్.

(ఇంకా ఉంది)

ప్రశ్నావళి

-కె.రామలక్ష్మి

పసుపులేటి శ్రీనివాసులు,అనంతపురం

గురువును మించిన శిష్యుడంటే?

* గురువునే మించిపోయిన వాడని కాబోలు (ఏ విధంగా దేన్లో అని అడక్కండి.)

మీరు కమర్షియల్ నవలలు ఎందుకు రాయరూ?

* చేతకాక! (ఇష్టంలేదన్నా-మీరనేమాట యిదేకదా!)

వంటేరువిజయప్రసూనాంబ, బ్రాహ్మణక్రాక

ఎక్కడివారో, ఎలాంటివారో తెలియకుండా పరిచయం అయిన ప్రతి ఆమెను అక్కా అని సంబోధించడం ఇప్పుడందరికీ అలవాటుగా మారిపోయింది. కాని నాకిష్టంగా వుండదు. ఈ సభ్య సమాజంలో అనాగరికురాలిగా చూస్తుందా?

* మరేం ఫర్వాలేదు. చుట్టరికం కలుపకపోతే ఆత్మీయత లేదనుకోరెవరూ, అలవాటు లేదనుకుంటారు... మరీ అంకుళ్లు, ఆంటీలు మాటకి మూడేసి చంపేకంటే బుడుగులాగ పక్కింటి పిన్నిగారె నయంకదా.. సభ్యసమాజంలో నాగరికత పిలుపులో లేదు- నడతలో ఉంది.

శ్రీ కొండ నవీన, నెల్లూరు.

మిత్రులను కలిసినప్పుడు ఆప్యాయత, అనురాగం, ప్రేమ, దుఃఖం అన్నీ కన్పిస్తాయి. బంధువులను కలిసినప్పుడు నీవెవరన్నట్టు కన్పిస్తుంది. కారణం తెలియడంలేదు.

* సింపుల్. చుట్టరికంలో స్నేహానికి స్థానం తక్కువ.

జి. అశోక్ వెంకటి, మెట్‌పల్లి.

'మూడుతరాలు' నవలపై మీ అభిప్రాయం?

* దోమలమీద యుద్ధం చేస్తుంటే- ఏనుగులు తప్పించుకుపోతున్నాయనడం దీన్నే. మనది కాని సంస్కృతిలో, మనదిగాని సమాజానికి చెందిన- ఓ అనువాద నవల- మనపై ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందన్న ప్రశ్న ఎవరూ వేసుకున్నట్టు లేదు. ఇహ ఈ దారితప్పిన విమర్శలని పట్టుకు- ప్రతి విమర్శలు చేస్తున్నారు. కాలహరణం చేస్తారో- మన సమాజానికి సంబంధించిన నైతిక విలువల అంచనాలు పరిధులు చూస్తారో-వేచి చూద్దాం. మన సమాజంలో ఈ నవలలోకంటే దారుణ సంఘటనలు జరిగాయి. జరుగుతున్నాయి. వాటినెవరూ గట్టిగా పట్టించుకోలేదు. ఎవరూ ధైర్యంచేసి రచనలూ చేయలేదు. చేసినవి ఒకటే అరో వున్నా వాటినింతగా 'భూతద్దపు' పరిశీలనకి ఎవరూ పూనుకోలేదు. నూటికో కోటికో జరిగే విషయం వెయ్యి రెట్లు ఊహించుకొని రోజూ జరిగేదానిలా బాధపడిపోడం కూడా అసహజమే.

న్యాయపతి రమేష్‌బాబు, హైదరాబాద్

చాలామంది ఆడవాళ్లకు పొగరు, గర్వం ఎక్కువ. అందంగా వుంటారనా? జీవితాంతం అందచందాలు వుంటాయనుకుంటారు- పాపం అందమైన ఆడవాళ్లు.

* అని తెలిసే మగవాళ్లు అందమైన అమ్మాయిల వెంట పడతారెందుకు? తెలియకనా?

చదువుకోని అమ్మాయిలు అబ్బాయిలవల్ల మోసపోతున్నారంటే బాధపడాలి. మరి చదువుకుంటున్న అమ్మాయిలు కూడా మోసపోవడం ఆశ్చర్యంగా లేదు!

* దానికి కారణం ఒక్కటే- స్నేహం-- ఆడది-నమ్మకంతో ప్రారంభిస్తుంది.

చలపాక ప్రకాష్- విజయవాడ

11-8-89 సంచికలో తెలుగు భాష గురించి అడిగితే అగౌరవ ప్రశ్న అన్నారు. మీ శీర్షిక అగౌరవ శీర్షిక అంటే మీకెలా వుంటుంది? దీనికి మీ సంజాయిషీ కావాలి (మీరు దీనికి జవాబివ్వరని తెలుసు సిస్టర్)

*సారీ యంగ్‌మాన్. రాసినది పూర్తిగా చదివి కోపం తెచ్చుకోకూడదూ? నేను అగౌరవం ప్రశ్న దేనికి! అన్నాను గాని అగౌరవ ప్రశ్న అనలేదే!! భాషని అగౌరవపరచడానికి నేనెవర్ని? మిమ్మల్ని అగౌరవపరచడానికి మీరెవరు?! వచ్చిన భాష మాట్లాడడంలో సౌలభ్యం వుంది. అలవాటు ప్రకారం ఏ భాష వస్తే అది మాట్లాడేవాళ్ళు తెలుగుభాషని అగౌరవపరుస్తున్నారనుకోడం ఏమిటి? సిల్లీ.

ఈ స్పీడు యుగంలో మీలాంటి స్లో రచనలు పాఠకులు ఆదరిస్తారా?

*చెప్పలేను. అంత స్పీడు ఆదరణ కూడా నాకక్కరలేదు.

చలపాక నాగరాజేశ్వరి-విజయవాడ

పాఠకుల ప్రశ్నలకి సరైన జవాబులివ్వకుండా అగౌరవ ప్రశ్న అని మా బ్రదర్‌ని అన్నారు. పేరుగల ఉత్తరాల రచయితని ఇలా అనడం సమంజసమా?

* చిట్టి తల్లీ- 'ఎవరి యుద్ధాలు వారు చేసుకోవాలి' అన్నది నా నుడి. మీ అన్నగారి యుద్ధం ఆయన్నే సాగించనిద్దాం వకాల్తా దేనికి?! ఉత్తరాల రచయితలుగా ప్రఖ్యాతి గాంచాలంటే ప్రముఖ సీరియల్ రచయితల కొలువులో చేరాలి.

మహమ్మద్ రఫీ- కాశీబుగ్గ.

కట్నం తీసుకోకుండా కులాంతర వివాహం చేసుకోవాలని వుంది. నా ఆశయం మీకు నచ్చిందా కె.రా. గారూ?

* నాకు నచ్చేం ప్రయోజనం భాయీ, మీ అమ్మనాన్నలకి నచ్చచెప్ప కల్గాలి!!

వరకట్నం ఒక పిశాచి కాదా?


*పిశాచిని నేను చూడలేదు. కాని వరకట్నం పుచ్చుకున్న నిస్సిగ్గు రాయళ్లని చాలా మందిని చూస్తున్నాను. పిశాచే బెటరేమో మరి?

ఎన్.టి.ఆర్. ప్రసంగం అంటే జనం విరగబడతారు దానికి కారణం?

*వారి ఉపన్యాసపు నాటకీయతేమో!

మీరెంతవరకు చదువుకున్నారు?

*చదువుకో లేదు! చదువుకుంటున్నానింకా!





"చిన్నప్పుడు కవలపిల్లలం, ఇప్పుడు కవలపెద్దలమేంచ్!"

అమెరికా వోపెన్ టెన్నిస్‌లో బెకర్, గ్రాఫ్‌ల ఘనవిజయం

1989 సంవత్సరం యు. ఎస్ ఓపెన్ టెన్నిస్ సింగిల్స్ టైటిల్స్‌ని రెండు విభాగాలలోను ఈ సంవత్సరం వింబుల్డన్ విజేతలే చేజిక్కించుకొన్నారు. ఇదే పోటీలో ఒక "లెజెండ్" "గ్రాండ్‌శ్లామ్" కెరీర్ కూడా ముగిసింది.

ఈసారి పోటీల్లో ప్రారంభ దశలోనే కొన్ని సంచలన పరిణామాలు జరిగాయి. నిరుటి ఛాంపియన్ మాటీ నంబర్ వన్ 'మాట్స్‌విలాండర్', 'సాంప్రస్' చేతిలో రెండో రౌండ్‌లోనే ఓడిపోయాడు. డిఫెండింగ్ ఛాంపియన్ యింత త్వరగా ఓడిపోవడం 1973వ సం. తర్వాత యిదే మొదటిసారి. ఇంతకన్నా సంచలనకరమైన విషయం మెకెన్రో ఓటమి. నాలుగుసార్లు ఈ టైటిల్ గెలుచుకున్న మెకెన్రోని 'నెదర్లాండ్స్'కి చెందిన క్వాలిఫైయర్ "పాల్‌హార్‌హ్యూస్" రెండో రౌండ్‌లో చిత్తు చేశాడు. జిమ్మీ కానర్స్ నాల్గవ రౌండ్‌లో 'ఎడ్బర్గ్'ను ఓడించిన తర్వాత క్వార్టర్స్‌లో వీరోచితంగా ఆడి "ఆంద్రీ అగస్సీ" చేతిలో ఓడిపోయాడు. "ఇవాన్‌లెండల్" సెమీస్‌లో అగస్సీని ఓడించి వరుసగా ఎనిమిదవసారి ఫైనల్స్ చేరి "బిల్‌టిల్డెన్" రికార్డునందుకొన్నాడు





"బోరిస్ 'బూమ్ బూమ్‌బెకర్''కి రెండవ రౌండ్‌లో ఇంచుమించు ఓటమినే ఎదుర్కొన్నాడు. తరువాత నుంచి బాగా ఆడుతూ మొట్టమొదటిసారిగా అమెరికన్ ఓపెన్ ఫైనల్స్ చేరుకున్నాడు. ఫైనల్స్‌లో బోరిస్ బెకర్ మొదటి సెట్‌ని టై బ్రేకర్‌లో గెలుచుకున్న తర్వాత 1-6 స్కోరుతో రెండవ సెట్ ఓడిపోయాడు. మూడవ సెట్ 6-3 తేడాతో గెలిచిన తర్వాత బెకర్ నాల్గవ సెట్ టైబ్రేకర్‌లో గెలిచి యు. ఎస్. ఓపెన్ గెలిచిన మొట్టమొదటి పశ్చిమజర్మనీ ఆటగాడయ్యాడు. లెండల్‌కు మాత్రం తరగని నిరాశే మిగిలింది!

స్టెఫీకే పట్టం

స్త్రీల విభాగంతో ఈసారి అందరి దృష్టి 'క్రిస్ ఎవర్ట్' మీదనే ఉంది. క్రిస్ ఎవర్ట్ మూడవ రౌండ్‌లో గెలిచి యు. ఎస్. ఓపెన్‌లో తన గెలుపుల 'సెంచురీ' పూర్తి చేసింది. నాల్గవ రౌండ్‌లో సంచలన యువతార మోనికా సెలెష్‌ని 6-0, 6-2 స్కోరుతో ఓడించింది. కానీ క్వార్టర్ ఫైనల్స్‌లో 'జినాగారిసన్' చేతిలో ఓడిపోయి గ్రాండ్‌శ్లామ్ టెన్నిస్‌కి గుడ్‌బై చెప్పేసింది. క్రిస్ 1971 లో ఈ టోర్నమెంట్‌లో ఆడటం ప్రారంభించిన దగ్గర నుండి మొత్తం

గ్రాండ్‌స్లామ్స్‌కి క్రిస్ గుడ్‌బై


ఆరుసార్లు టైటిల్ గెలుచుకుంది. కేవలం ఒకేసారి 'సెమీస్' చేరుకోలేకపోయింది.

ఆల్ టైమ్ గ్రేట్స్‌లో ఒకరైన "మార్టినా నవ్రతిలోవా" ఫైనల్స్‌కి సునాయాసంగా చేరుకుంది. వరల్డ్ నంబర్ వన్ స్టెఫీగ్రాఫ్ మాత్రం తన డబుల్స్ పార్ట్‌నర్ 'సబటినీ' నుండి గట్టి పోటీని ఎదుర్కొన్న తరువాత ఫైనల్స్‌కు చేరుకొంది.

ఫైనల్స్‌లో మార్టినా మొదటి సెట్‌ను 6-3 స్కోరుతో గెలుచుకుంది. రెండవ సెట్‌లో 4-2 ఆధిక్యత సంపాదించిన తర్వాత ఒకే గేమ్‌లో రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేయడంతో ఆటపై పట్టు కోల్పోయింది. తరువాత గ్రాఫ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించి 7-5 తో రెండో సెట్‌ని 6-1 స్కోరుతో ఓడించి తన రెండవ అమెరికన్ ఓపెన్ టైటిల్ 8వ గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలుచుకుంది.

ఈ పోటీలో గెలిచినందుకుగాను స్టెఫీగ్రాఫ్‌కు 3 లక్షల డాలర్లు, బెకర్‌కి మూడు లక్షల డాలర్లు లభించాయి.

పురుషుల డబుల్స్ జాన్‌మెకన్రో, వుడ్‌ఫోర్డ్ గెలవగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో రాబిన్‌వైట్,



షెల్బీకానన్‌లు గెల్చుకున్నారు. స్త్రీల డబుల్స్ మార్టినానవ్రతిలోవా, హనామాండ్లికోవా గెల్చుకున్నారు.

-పి. వీరభైకిరణ్

"వెల అమూల్యం"

ఆకెళ్ళ శివప్రసాద్

వెంకటరత్నం గారింట్లో కూడా ఇరవైయ్ తారీఖునే పెళ్ళిట. వెళ్ళకతప్పదు. ఈ పెళ్ళిళ్ళ సీజన్‌లో వచ్చే చిక్కేయిది.

ఒకేముహూర్తానికి నాలుగైదు పెళ్ళిళ్ళుంటాయి.

మొన్న ఆదివారం మధ్యాహ్నం మా ఆవిడ తర పున బంధువులొకరు వాళ్ళమ్మాయి పెళ్ళికి పిలవడాన్కి వచ్చారు. యింటి పనుల్లో సహాయంగా వుంటుందని మా ఆవిడని రెండు రోజుల ముందుగానే రమ్మన్నారు. అదే రోజు మా యింటాయన తన కొడుకు పెళ్ళని ఆహ్వానించారు. మా కొలీగ్ పెళ్ళి కూడా. ఈ రెండు పెళ్ళిళ్ళు జరిగే రోజునే, ఇరవైయ్ తారీఖునే–!

ఈ హడావిడిలో హడావిడిగా ఈ రోజు ఆఫీసు కొచ్చిన వెంటనే తెలిసిన విషయ మేమిటంటే–

వెంకటరత్నం గారింట్లో కూడా ఇరవైయ్ తారీఖునేపెళ్ళి. అయన మా సెక్షన్ ఆఫీసర్–!

ప్రపంచంలో ఏళ్ళ తరబడిగా సుస్థిరంగా సాగి పోతున్న 'వ్యాపార సంబంధాల్లో' ఆఫీసరూ – గుమాస్తా సంబంధ మొకటి. ఆఫీసర్ ప్రాపకం కోసం గుమాస్తా తహతహలాడడం సహజం. అందులోనూ ముఖ్యంగా వెంకటరత్నం గారి లాంటి 'పలుకుబడి' (కేవలం మా డిపార్ట్ మెంట్ లోనే కాదు. ఇతర డిపార్ట్ మెంటుల్లో కూడా ఆయనకి పేరుంది. ఓ మంత్రిగారి కాయన దూరపు బంధువు కూడా) వున్న వ్యక్తుల కరుణా కటాక్ష వీక్షణాల కై నిరీక్షించడం మరీ సహజం.

కనుక ఏ పెళ్ళికి వెళ్ళినా, వెళ్ళక పోయిన వెంకటరత్నం గారింట్లోని పెళ్ళికి తప్పక వెళ్ళాలని నిర్ణయించు కొన్నాను శుభలేఖ అందుకున్న వెంటనే–

శుభలేఖ కూడా 'మొదటి తరగతి బ్రాండ్'ని ప్రతిబింబిస్తోంది. చాలా క్లాస్‌గా, ఇంగ్లీషులో, గోల్డెన్ లెటర్స్‌లో వుంది.

మధ్యాహ్నం క్యాంటీన్ నుండి వస్తుంటే, మా సెక్షన్ ప్యూన్ రంగయ్య ఎదురుబడ్డాడు. ఈ మధ్య లీవ్ తీసుకున్నాడు. నన్ను చూసి, నమస్కరించి– చేతిసంచీలోంచి ఓ శుభలేఖ తీసి నా చేతికిచ్చి–

"తమరు తప్ప కుండా రావాలి సార్ పెళ్ళికి...." అన్నాడు.

యధాలాపంగా శుభలేఖ చదివాను. ఆశ్చర్యం., ఆర్థికంగా హెచ్చు తగ్గుల మాట అటుంచితే, ముహూర్తాల విషయంలో 'భేదం' లేదని పించింది.

రంగయ్య యింట్లో పెళ్ళి కూడా ఇరవైయ్ తారీఖే!

రంగయ్య పదేపదే రమ్మనమని చెప్పి, వెళ్ళిపోయాడు. వెంకటరత్నం గారి శుభ లేఖ అందుకున్నప్పుడు 'వెళ్ళాలని' ఎంత తొందరగా నిర్ణయం తీసుకున్నానో, అంత కంటే తక్కువ సమయంలోనే రంగయ్య యింట్లో పెళ్ళికి వెళ్ళే ప్రసక్తే లేదను కున్నాను.

డ్రాయర్ సొరుగులో రంగయ్య యిచ్చిన శుభలేఖ పడేస్తూ, మరో సారి వెంకటరత్నం గారి 'శుభలేఖ' కళ్ళారా చూసుకున్నాను–

ఆ క్షణమే నాకో విషయం స్పష్టంగా అర్థమయ్యింది–

సమాజంలో థర్డ్ క్లాస్ మనిషికి 'ఫస్ట్ క్లాస్' మనిషికి తేడా 'శుభలేఖ' తో నే చెప్ప వచ్చుని.

* * * * *

మా ఆవిడ బంధువులు కోరినట్టుగా వాళ్ళింటికి దాన్ని రెండు రోజుల ముందుగానే పంపి, వీలైతే నేనూ పెళ్ళికి వస్తానని చెప్పాను.

ఇరవైయ్ తారీఖు తెల్లవారు ఝామునే మా యింటి వాళ్ళబ్బాయి పెళ్ళి. మూడు గంటలకే లేచి, తెమిలి, నాలుగు అక్షింతలు వేసి, మా కొలీగ్ మ్యారేజ్ జరుగుతున్న చోటుకెళ్ళి, అటెండెన్స్ వేయించుకొని, వెంకటరత్నం గారింటికి బయలు దేరే సరికి పదకొండు గంటలయ్యింది.

నిజం చెప్పొద్దు, మొదట్నుంచి నాకు వెంకటరత్నం గారింట్లో జరిగే పెళ్ళి మీదే దృష్టంతా వుంది. ఏదో ఫార్మల్‌గా 'అటెండ్' అవ్వాలి కనుక వెళ్ళాను రెండు పెళ్ళిళ్ళకి–

అసలే మరో రెండు నెలలలో ప్రమోషన్ లిస్ట్ రాబోతోంది. సర్వీసులో రిమార్కు లేకుండా, ప్రమోషన్ లిస్ట్‌లో చోటు చేసుకోవాలంటే వెంకటరత్నం గారి లాంటి వారిని ఆశ్రయించక తప్పదు.

నేను వెళ్ళే సరికి వాతావరణం హడావిడిగా వుంది. మా ఆఫీసు వాళ్ళెవరైనా కన్పిస్తారేమో నని చూశాను. ఎవరు వచ్చినట్టు లేదు.

అంతా కొత్తగా వుండడం చేత అయోమయంగా అటూ ఇటూ తిరిగాను.

మొదటి తరగతి జీవితానికి సంబంధించిన పెళ్ళి వల్ల అంతా ఖరీదుగా వుంది.

ఆడవాళ్ళు రంగురంగుల చీరల్లో, మెడలకి కిలోల కొలది బంగారు నగలు 'వేలాడ' దీసుకొని, అపర అప్సరసల్లా మేకప్‌లు 'కొట్టుకొని', దట్టంగా రాసుకున్న లిప్‌స్టిక్ పెదాలని విచిత్ర విన్యాసాలకి గురి చేస్తూ, బిగ్గరగా నవ్వుతూ, అరుస్తూ, నవ నాగరీక మణుల మనిపించు కుంటున్నారు–

ఇక మొగాళ్ళ వైపుకి వొస్తే–

నాలుగైదు గుంపులుగా చీలి–

రకరకాల విషయాలు చర్చించుకుంటున్నారు.

అందరూ ఆంధ్ర దేశపు రాజధానిలో జీవితాలు వెలగబెడుతున్నా, 'ఆంధ్ర మాతలకే జన్మించినా, పోత పాల ప్రభావం వల్ల కాబోలు, ఆంగ్లేయుల్లా 'తెలుగు మాట్లాడ్డానికి సిగ్గుపడుతూ–

ఇంగ్లీషులో హాలీవుడ్ తారల తొడల గురించి రంజుగా, హిందీలో ముచ్చటగా మూడోసారి మొగుడ్ని మార్చి... 'హ్యాట్రిక్' చేసిన హీరోయిన్ గురించి చర్చించుకుంటున్నారు.

నేను టైం చూశాను.

పదకొండున్నర.

యింకా కళ్యాణ మండపం దగ్గరికి బ్రహ్మణుడు వచ్చిన ఛాయలు లేవు. బ్యాండ్ మేళం వాళ్ళు ఏదో హిందీ చిత్రంలో బూతు పాటని ఘోరంగా మ్రోగిస్తున్నారు.

"ఏవండీ.... ముహూర్తం పదిన్నరకే కదా...." అని ప్రశ్నించాను.

అతను నా కేసి విసుగ్గా చూసి, నన్ను అమాయకుడిలా జమకట్టి – అనవసరపు నవ్వొకటి వెకిలిగా నవ్వి–

"మీకు తెలీదా?... ముహూర్తం మారింది..... ఒకటిన్నరకి ముహూర్తం...." అని నా కేసి చిత్రంగా చూసి, వేగంగా, హాలీవుడ్ తారల తొడల గుంపువైపు సాగిపోయాడు.

నాకు వుసూరు మన్పించింది. ఇంకా దాదాపు రెండు గంటల కాలం గడపాలి.

... కాలం భారంగా గడిచింది. తెల్లవారు ఝామునే మాయింటాయన కొడుకు పెళ్ళి వల్ల రాత్రి సరిగ్గా నిద్ర పోలేదు. ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూడడంలో మహా అయితే ఓగంట పడుకొని వుంటాను. కళ్ళు మంటలు. తల బరువు. వచ్చి గంటయినా వెంకటరత్నం గారు కన్పించలేదు.

... కళ్యాణ మండపం దగ్గర ఏదో అలికిడి విన్పించి ఉలిక్కి పడ్డాను. నాకే తెలీకుండా కునుకు పట్టేసింది.

దగ్గర్లోనే వున్న కొళాయి దగ్గరకెళ్ళి మొహం కడుక్కొని, తెలుసున్న మొహం ఏదైనా కన్పిస్తుందేమోనని వెతికాను. చాలా మంది జనం వచ్చారు. వీధిలోకి వెళ్ళి చూస్తే – వీధంతా కార్లమయం. పది నిముషాలు అటూ ఇటూ తిరిగి, ఎవరూ కనిపించక, అక్కడే వున్న కుర్చీలో కూలబడ్డాను.


మంత్రాలు విన్పిస్తున్నాయి.

ప్రొద్దుటి నుండి కడుపులో 'ఫుడ్' సరిగ్గా పడక, ఆత్మారాముడు ఆకలని గోలచేయడం

ప్రారంభించాడు.

సాధారణంగా ఏ పెళ్ళికి వెళ్ళినా, మనిషిని చూసినా వెంటనే కాఫీ, టిఫిన్ యిస్తారు. ఈ పెళ్ళిలో అలాంటి వేమీ లేనట్టున్నాయి.

నీరసంగా వున్న నాకు వెంకటరత్నం గారిని చూసేసరికి కొండంత శక్తి కలిగింది. ఆయన దూరం నుండే పలకరింపుగా చేయి వూపారు.



ఆ 'చేయి' ఎంతమందిని వుద్దేశించి వూపారో నాకు తెలీదు కానీ, 'అందులో' నా క్కూడా భాగముందని సంతోషపడ్డాను. సుముహూర్తమయ్యింది.

'చదివింపుల' సమయం. చాలా మంది పెద్ద పెద్ద ప్యాకెట్లతో బహుమతు లిస్తున్నారు. నేను బొత్తిగా పాతిక రూపాయలంటే బాగోదని అర్ధనూట పదహార్లు చదివించాను.

అన్ని కార్య క్రమాలు అయ్యాకా, 'ఫుడ్. టైం' వచ్చేసరికి మూడున్నరయ్యింది–

వెంకటరత్నం గారింట్లో మేడ మీద ఏర్పాట్లు చేశారు.

బఫే సిస్టమ్.

పెద్దగా చేసిన ఐటమ్స్ లేవుకానీ, అన్నీ కాస్ట్లీ అయిటమ్స్–

బాదుషా, బిర్యానీ వగైరా–

బిర్యానీ ఓ గరిటెడు ప్లేటులో వేసుకొని తింటున్నాను. వెంకటరత్నం గారు అటువైపు వచ్చి, నన్ను చూసి పలకరింపుగా నవ్వి, నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మెల్లగా–

"…. చూడవోయ్ ప్రసాద్… అనుకున్న వారి కన్నా ఎక్కువమంది వచ్చారు…. అర్జెంటుగా వక్కపొడి తేవాలి…. డ్రైవరూ వాళ్ళు ఏవో పనుల్లో వున్నారు…. ఏమీ అనుకోక పోతే…. నువ్వెళ్ళి ఓ ఐదు వందల గ్రాముల వక్కపొడి తీసుకురా…." అన్నారు ఆజ్ఞాపిస్తున్నట్టు–

డబ్బులిస్తారేమో నని చూశాను.

"వెంటనే తీసుకురావయ్యా…." అని వేగంగా అక్కడ నుండి కదిలారు.

ఏమంటే ఏమౌతుందో?

ప్రమోషన్ లిస్ట్ జ్ఞాపక మొచ్చింది. వ్యాపార సంబంధం. తప్పదు.

గరిటెడు బిర్యానీ తోనే ఆత్మారాముడ్ని తృప్తి పరిచి, రోడ్డు మీద పడ్డాను.

కొత్త ప్రదేశం.

షాపు లెక్కడున్నాయో తెలీదు.

మండుటెండ.

చెమటలు కక్కుకుంటూ, కాళ్ళు అరిగేలా, అరగంట దాటి తిరగ్గా, ఓ షాపు కన్పించింది.


వంద గ్రాముల పొట్లాలు ఐదు తీసుకొని, డబ్బు లిచ్చేటప్పుడు చూసుకున్నాను. చిల్లర పోగా మిగిలింది రెండు రూపాయలు. కరెక్టుగా బస్సు ఛార్జీలున్నాయి.

షాపు నుండి వెంకటరత్నం గారింటికి చేరుకొనే సరికి మరో పావుగంట గడిచింది.

వెంకటరత్నం గారు నా కోసం ఎదురు చూస్తున్నారు కాబోలు, నన్ను చూసి, నా దగ్గర కొచ్చి, చేతిలోని పొట్లాలు అందుకొని, 'థాంక్స్' అనేనా చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయారు. డబ్బు లిద్దామనే వుద్దేశ్యం ఆయనలో కనబడలేదు.

'బఫే' ఏర్పాటు చేసిన వైపు కదిలాను, కనీసం కడుపేనా నింపుకుందామని–

నేను వెళ్ళేసరికి–



వెల అమూల్యం

పనివాళ్ళు బల్లలు సర్దుతున్నారు!

వెనుదిరిగాను. వెంకటరత్నంగారు ఎటు వైపు నుండి వచ్చారో గమనించలేదు, అయన నా దగ్గరకొచ్చి–

"... చూడవోయ్ ప్రసాద్... నాకింకో నాలుగు రోజుల వరుకు ఆఫీసుకి రావడాన్కి కుదర్దు.... నువ్వు రేపు ఆఫీసు నుండి 'విజయ అండ్‌కో'... వాళ్ళ ఫైలు తీసుకురా... అదేనోయ్... కొత్త ప్రాడెక్ట్ లైసెన్సు కోసం అప్లయ్ చేశారూ... వాళ్ళది" అని – క్షణం ఆగి–

"., వచ్చినందుకు సంతోషం..." అని 'ఇంక దయ చేస్తావా?' అన్నట్టు చూశారు.

ఆత్మారాముడి అలాపనతోనే బైట కడుగు వేశాను. కొత్త ప్రదేశం వల్ల బస్టాండు ఎక్కడుందో తెలీక రోడ్లు తెగ తిరిగేస్తున్నాను.

అలా ఏకధాటిగా రోడ్లు తిరిగేస్తున్నప్పుడు– వెనక నుండో పిలుపు విన్పించింది–

విసుగ్గా వెనక్కి చూశాను.

"... నమస్తే సార్.." ఆఫీస్ ప్యూను రంగయ్య. అతని చేతిలో సంచీలో ఏవో సరుకులు.

".. మా యింటి కోసమే తిరుగుతున్నారా? సార్" మొహం యింత చేసుకొని అడిగాడు.

యాంత్రికంగా తలూపాను.

"..అయ్యయ్యో... ఎంత కష్టపడ్డారో... యిదిగో... ఈ వీధిలోనే యిక్కడే సార్...!!" అంటూ దారి తీశాడు. నేను అతన్ని అనుసరించాను. 'బస్టాండ్' ఎక్కడో అడిగి, బస్సు ఎక్కేద్దామనుకున్నానో క్షణం.

'ఎలాగు యింత దూరం వచ్చాను కదా' అనే వుద్దేశంతో అతన్ని అనుసరించాను.

చాలా చిన్న వీధది. లక్కపిడతల్లా యిళ్ళు. ఆర్థికంగా వెనకబడ్డ వారి యిళ్ళలా వున్నాయి.

రంగయ్య యింటి ముందే చిన్న టెంట్ వేశారు. నన్ను పందిరికి దగ్గరగా వున్న కుర్చీలో కూర్చో పెట్టాడు. నేను కూర్చున్నాను.

"మా సార్ వచ్చారు" అన్నాడు హడావిడి పడిపోతూ– రెండు నిముషాల తరువాత–

"..సార్... సల్లంగా ఈ డ్రింకు తాగండి... ఎండలో బడి వచ్చారు." అని చేతికి ఓ గ్లాసుతో డ్రింకు తీసుకొచ్చాడు. చాలా తియ్యగా చల్లగా వుందా ద్రవం.

ఎడారిలో దాహంతో పిడచగట్టిన గొంతుతో సతమవుతున్న మనిషికి ఒయాసిస్సు లభించినట్టుగా వుంది. అమృతంలా ఒక్క చుక్క కూడా విడవకుండా తాగేశాను. కడుపు చల్లబడింది. అక్కడే వున్న ఒకతన్ని పిలిచి–

"సార్ కేమైనా అవసరమొస్తే చూడు..." అని–

"కొంచెం పనుంది సార్... లోపల..." అంటూ లోపలికెళ్ళాడు. చాలా సాదాగా వుందా పెళ్ళి పందిరి.

డోలూ, సన్నాయి పందిరిలో మూరు మ్రోగుతున్నాయి. మరో పావుగంటకి–

చేతో ఉప్మా ప్లేటుతో వచ్చాడు రంగయ్య.

నేనట్టే మొహ మాట పడకుండా తినేశాను.

"సార్... చాలా మంచివాడు... ఎక్కడ కొచ్చినా అందరిలో కలిసి పోతాడు....' అని సంబరపడ్డాడు రంగయ్య. పెళ్ళయ్యింది.

ప్రత్యేకంగా పీట వేసి భోజనానికి ఆహ్వానించారు నేనెందుకో గిల్టీ ఫీలయ్యాను. ఒకప్పుడు రాకూడదనుకున్న పెళ్ళి. అసలు ఈ పెళ్ళికి వస్తానని కలలో కూడా వూహించలేదు.

"...ఫర్వాలేదు రంగయ్యా... పెళ్ళి చూద్దామని వచ్చాను... వస్తాను" అని కదలబోతుంటే–

"... అట్లా అంటే కుదరదు సార్... మీరు భోం చేసి వెళ్ళాలి..." అన్నాడు బ్రతిమాలుతున్నట్టు రంగయ్య.

"... అది కాదు రంగయ్యా..." అని ఏదో చెప్పబోతుంటే–

"...మీరు భోం చేయక తప్పదు.." అని భోజనానికి లేవదీశాడు. టెంట్‌లోనే విస్తళ్ళు వేశారు.

కొసరి కొసరి వడ్డనలు చేస్తున్నారు.

ప్రతి వంటకాన్ని ముందు నన్నడిగి, తరువాతే మిగిలిన వారికి చూపెడుతున్నారు'–

ఏదో గర్వం ఆవహించిందా క్షణం నాలో–

కానీ–

మరుక్షణం ఆ 'గర్వమే' వికృతంగా అన్పించింది నాకు. వెంకటరత్నం గారింట్లోని నా స్థితి గుర్తు కొచ్చి–

ముద్ద గొంతు కడ్డం పడట్టన్పించింది. ఎంత విచిత్రమైన వాడు మనిషి–

తనకి విలువ లేకపోయినా తన పైవాళ్ళని ఆశ్రయిద్దామనుకుంటాడు... తనకి విలువ నిచ్చే వారి కేసి కన్నెత్తైనా చూడడు. వెంకరత్నంగారు మా ఆఫీసర్. ఆయనతో నాకు ముందు ముందు చాలా అవసరాలు రావొచ్చు.

రంగయ్య రెండు మూడు ఏళ్ళలో రిటైరు అవుతాడు. నిజం చెప్పాలంటే రంగయ్యకి నా అవసరం లేదు. కానీ నన్ను చాలా 'గౌరవంగా' చూస్తున్నాడు–

ఆ క్షణమే అన్పించింది.

ఈ వ్యాపార సంబంధాల కన్నా అతీతమైన బంధం ఒకటుందని! మనిషిని డబ్బు, హోదా రీత్యానే 'అంచనా' వేయలేమని!

"... సార్‌కి... మరో రెండు బూరెలెయ్యరా..." అన్న రంగయ్య కేకకి నా ఆలోచన చెదిరింది–

"వద్దు.. వద్దు..." అంటూ చేతులడ్డుపెట్టాను. బూరెలు విస్తట్లో పడ్డాయప్పటికే–

... కళ్ళలోచిమ్మిన నీరు ఎవరైనా చూస్తారేమోనని తల అటు వైపు తిప్పుకున్నాను!

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము

(గతసంచిక తరువాయి)




నండూరి రామమోహనరావు
బొమ్మలు.. బాపు
ఆ చిన్నదాక కేలు
చాచి, సకియను జూపి,
ఈ రీతిగా పలికె
నా రక్కసుని జూపి
చాల నాళ్ళుగ నీ వి
కాల సమయము నందు
ఈ దాన వుండి చటి
కేతెంచు నేమందు!
అది విన్న వెంటనే
అదరి పడి దనుజుండు
ఇది యేమి చిత్రమ్ము!
ఎవడీ వికాలుండు?
వాని వేళకే నేను
వచ్చుటెట్టులు జరిగె!
అయిన జూచెదనంచు
అశ్వశాలకు నరిగె.
అతడు తన మాయచే
అశ్వరూపము దాల్చి
గుర్రాల సాలలో
గుట్టుగా మెయివాల్చి
ఉండగా హయచోరు
డక్కడటు కయిదెంచె
వాడె వికాలుడని
వీడు మదిలో నెంచె
(ఇంకా ఉంది)
36

మనసున్న మనిషి

అంతకు ముందువరకూ కళ కళలాడే ఆ యింటి ముంగిలి ఒక్క మారు మరు భూమిలా మారిపోయి కళాహీనమైపోయింది. పెంకులూడి రాలిపోతూ సగటు మధ్య తరగతి కుటుంబానికి ప్రతీకగా నిల్చిన ఆ యింటివాకిట్లో తులసమ్మ అచేతనంగా ఉంది-

తులసమ్మ చచ్చిపోయింది!

సహనంలో భూదేవిలాంటి ఆ యింటి ఇల్లాలు ఆఖరి శ్వాస పీల్చి అప్పటికి అరు గంటలైంది- జీవితంలో ఎదురైన అన్ని కష్టాలూ, సమస్యలూ తీరిపోయినట్టు ప్రశాంతంగా వుందామె వదనం

ఆమెకి కాస్త దూరంలో నిల్చున్న ఐదేళ్ల వాసు, మూడేళ్ల జానకి జరిగిందేమిటో అర్థంకాక తల్లిముఖంలోకి భయం భయంగా చూస్తున్నారు-

పిల్లల వంక ఒక్కసారి చూశాడు సాంబశివం- "తనలాగే వీళ్లూ పసితనంలోనే తల్లి ప్రేమను పోగొట్టుకున్న దౌర్భాగ్యులు" అనుకున్నాడు- తల్లి లేక పోయినా వీళ్లకి తనున్నాడు- అయినా ఏం లాభం? ఈ బీద తండ్రి వాళ్లకేమివ్వగలడు? పిల్లల భవిష్యత్తును తల్చుకుంటే అతని కళ్ళలో నీళ్లు తిరిగాయి-

నందివర్థనం చెట్టుక్రింద అరుగుమీద కూర్చున్న సుబ్బాయమ్మగారు తమ్ముడి ముఖంలోని బాధను గుర్తించింది- ఆమె కాక్షణంలో సాంబశివం మీద జాలికలిగింది- జీవితమంతా ఆర్థికపరమైన యిబ్బందుల మధ్యా, తెగని చిక్కు సమస్యల మధ్యా బ్రతికిన సాం బశివం ఏం సుఖపడ్డాడనీ?

పాతికేళ్ల వయసులో సాంబశివానికి అనసూయతో పెళ్లి జరిగింది- అయితే ఆమెతో అట్టేకాలం కాపరం చేసే గీత సాంబశివానికి లేకపోయింది- తన వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు గన్న అనసూయ తన భర్త ఓ సామాన్య వ్యవసాయదారుడు కావటం భరించలేక పోయింది- కోర్కెలు ఆమె జీవితాన్ని పెడదార్న పట్టించాయి. సాంబశివాన్ని వంటర్ని చేశాయి- మళ్లీ పదిహేను సంవత్సరాలకి తను పట్టుబట్టి యీ సంబంధం చేసింది- పేదింటి పిల్లే అయినా తులసి లక్షణమైన పిల్ల- ఇద్దరు పిల్లల్ని కని, మూడో పిల్లని అతి కష్టంమీద లోకంమీదికి తెచ్చి తను లోకం వదిలింది తులసమ్మ- మళ్లీ సాంబశివం తోడులేని పక్షి అయ్యేడు-

సుబ్బాయమ్మగారి కళ్లలోనూ, నీటి పొర జేరింది-

పిల్లలిద్దరూ ఆమెకు యిరువైపులా చేరి చెరో చేతినీ పట్టుకుని కూర్చున్నారు-

తదుపరి కార్యక్రమాలకోసం సాంబశివం బయటకు నడిచేడు. ఇరుగుపొరుగు వారూ, తెల్సినవారూ, బంధువులూ ఒకరూ ఒకరూ చేరుతున్నారు-

అక్కడ దుఃఖం నిశ్శబ్దంగా ఘనీభవించి వుంది- ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ లోపల్నుంచి పసిబిడ్డ ఏడ్పు వినిపించింది. సుబ్బాయమ్మగారు లేచి లోపలకు నడిచారు- ఆమె వెనుకే పిల్లలిద్దరూ-

"ముగ్గురు బిడ్డల్నీ తల్లిలేని వాళ్లని చేసి వెళ్లిపోయింది తులసమ్మ- ఎంత ఘోరం-" అన్నారెవరో-

"బతికుండి మాత్రం ఆ తల్లి ఏం సుఖపడిందనీ-"

"పాపం! ఆ పిల్లల్ని చూస్తే జాలేస్తోంది- కూచుంటే లేవలేక, లేస్తే కూర్చోలేని స్థితి ఆ ముసలమ్మ గారిది- ఆయన మాత్రం పసికందుల్ని ఎలా పెంచుతాడూ? కష్టమే."

నలుగురూ నాలుగు రకాలుగా సానుభూతిని ప్రకటిస్తున్నారు.

ఆదూరి వెంకట సీతారామమూర్తి

సుబ్బాయమ్మగారు వచ్చి మళ్ళీ అరుగుమీద కూలబడింది. డెబ్భయ్ యేళ్ళుంటాయామెకు- ముప్ఫయ్ ఏళ్ళ వయసులోనే తల చెడి అత్తవారి తరఫున నా అన్న వారెవరూ లేని స్థితిలో తమ్ముడి పంచకు చేరింది- ఆమెకు కొద్దిపాటి భూమి ఉంది. అది ఆమె జీవనోపాధికి మాత్రం సరిపోతుంది-

బ్రాహ్మడిని తీసుకొచ్చేడు సాంబశివం- వెదురు బొంగులూ, తాళ్ళూ తదితర సామగ్రీ వచ్చేయి-

పట్నం నించి తులసమ్మ తమ్ముడు ప్రకాశం; నలభై మైళ్ళ దూరంలోని పల్లె నుంచి తులసమ్మ అన్న సూర్నారాయణ వచ్చేరు- ఇంకా దగ్గర, దూరం బంధువులెవరెవరో వచ్చారు-

ఆవరణంతా జనంతో నిండిపోయింది- చాలా మందిలో దుఃఖం సానుభూతి మనసుల్లోనే ఉండిపోయాయి- కొందరవి బహిర్గతం చేస్తున్నారు-

"నాకీ సంబంధం యిష్టమే అంటూ చేసుకుని యిలా సుఖపడి పోయావా తల్లీ-" అంటూ రాగాలుతీస్తోంది తులసమ్మ వదినగారు- ఎందుకో వాళ్ళ దుఃఖంలో ఏడ్పుల్లో కృత్రిమత్వమే కన్పించింది సాంబశివానికి-

ఎంత అవసర మొచ్చినా ఒక్కనాడు పుట్టింటి గడప తొక్కలేదు తులసమ్మ- వీళ్ళ ప్రేమాభిమానాలు ఆమెకు తెలియనివి కావు- అటువంటి వీళ్ళేనా యిలా ఏడుస్తున్నది? ఆ వంచన, ఆ ఏడ్పులూ ఎందుకో అర్థం కాలేదు సాంబశివానికి-


మరదళ్ని చివరిసారిగా చూసి వెనుదిరిగేరు సుబ్బాయమ్మగారు-అంతవరకూ నిబ్బరంగానే వున్నారావిడ-ఆ తర్వాత చాతకాలేదు-కళ్ళలోంచి నీరు ధారాపాతంగా కారిపోయింది.

"చిన్నపిల్ల, ముచ్చటైన సంసారం- పసికందులు-ఇన్నేళ్ళొచ్చేయి-నేనెవరికి ఉపయోగం- నన్ను తీసుకుపోరాదూ ఆ భగవంతుడు-" అనుకుందావిడ-కళ్ళుతుడుచుకుంటూన్న సుబ్బాయమ్మగారికి దూరంగా బీరపాదు ప్రక్కన కదిలిన ఆకారం కన్పిం

చింది-ఆ అకారం పేరు సరస!

ఒక్కక్షణం ఆశ్చర్యపోయేరు సుబ్బా యమ్మగారు-అవును-ఎన్నేళ్ళకు? ఏడేళ్ళ క్రితం తనే అజ్ఞాపించింది సరసను యీ యింటి ఛాయలకు రావద్దని-అప్పటికి ప్పుడు- ముందుకు రాలేక, పూర్తిగా రావడం మానుకోలేక వచ్చి చాటుగా తమ కష్టాల్లో పాలుపంచుకుంటోంది.

అప్రయత్నంగా తమ్ముడివంక చూశా



శావిడ-సాంబశివం కూడా సరిగ్గా అదే సమ యంలో సరసను చూసి అక్కగారి వంక చూశాడు. అతని కళ్ళు ఏ భావాన్నీ పలి కించలేని నిస్సహాయతలో వున్నాయి-

గుమ్మందాటి సవారీ శ్మశానం వైపు నడిచింది-

ఆ సాయంకాలానికే వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు-

* * * * *

వార్త తెలిసిన బంధువులంతా పదో రోజుకి కుటుంబాలతో వచ్చారు-ఆ పదిరో జులూ పది యుగాలుగా గడిచాయి సుబ్బా యమ్మగారికి, సాంబశివానికీ-

"అమ్మ ఎక్కడకెళ్ళిందత్తయ్యా-నేనూ అక్కడికే వెళ్తాను" అని వాసు ఒకటే ఏడుపు -తల్లి కన్పించకపోయే సర్కి మూడో రోజుకే జానకి బెంగతో జ్వరం తెచ్చుకుంది-

వీళ్ళిద్దరికీ తోడు తల్లిపాలరుచి ఎరు గని పురిటికందు!

పొరుగువాళ్ళ సాయం చేయకపోతే సుబ్బాయమ్మగారు ఏమైపోయేవారో!

సాంబశివానికి యిటు భార్యాపో యిన విచారంకంటే పదోరోజున జరిపించే తంతుకు కావల్సిన డబ్బు ఎలావస్తుందా అన్న విచారమే ఎక్కువైపోయింది-

మనిషి బ్రతికున్నంతవరకే ఏదైనా- అనుభవం, ప్రేమ, ఆకలి, దయ, సాను భూతి.... అన్నీ కట్టె సజీవంగా వున్నంత వరకే-ఆ తర్వాత ఎవరికెవరు? అర్థం లేని యీ తతంగమంతా ఎవరికోసం?

ఇలా ఎన్నో అలోచనలొచ్చేవి సాంబ శివానికి-

ఒక్కోకప్పుడు యివన్నీ తనకు డబ్బు లేకపోవడం వల్లనే కలుగుతున్నాయా అన్పిం చేది-

మనసుకు నచ్చకపోయినా లోకంకోసం కొన్నిటికి లోబడి ప్రవర్తించక తప్పదు-

మనసున్న మనిషి

పదోనాటి కార్యక్రమం యధావిధిగానే ముగిసింది-ఆ సాయంకాలం వచ్చిన బంధువులంతా వాకిట్లో తలోచోటా కూర్చుని కష్టాల్ని మర్చిపోయే కబుర్లేవో చెప్పుకుంటున్నారు- కాసేపు నిద్రపోయిలేచి వంటరిగా ఎటో వెళ్ళేడు సాంబశివం-లోకమెరుగని పసిపాప గదిలో నిద్రపోతోంది-

వడలిపోయిన పువ్వుల్లావున్న పిల్లల్ని తీసుకుని వాకిట్లోకొచ్చి అరుగుమీద కూర్చున్నారు సుబ్బాయమ్మగారు-ఇక్కడున్న బంధువుల్ని చూసేసర్కి యీ పదిరోజులుగా చెప్పాలని మనసులో మధనపడుతున్న విషయం బయట పెట్టడానికదే అనువైన సమయంగా తోచిందామెకు-

అయితే మామూలుగా చెప్పటానికది సామాన్యమైన విషయం కాదు-

ఎలాగైతేనేం ఒకటికి నాలుగు సార్లు మనసులోనే అనుకున్నాక అందరినీ దగ్గరకు పిలిచి విషయాన్ని వాళ్ళ ముందుంచారావిడ-'మీలో ఎవరైనా ఫర వాలేదు-అందరూ కావల్సినవాళ్ళే-ఎవరో ఒకరు పుణ్యం కట్టుకోండి' అని అర్ధించారు-

ఆమె నోటినుండి ఆమాట అంత సూటిగా వస్తుందని ఎవరూ అనుకోలేదు-అది విన్నాక ఎవరికివారికే అది సమస్యగా తోచింది-

తల్లిలేని ఆ పసిగుడ్డును ఎవరో ఒకరు కొన్నాళ్ళు సాకాలి-వీలైతే పెంచుకోవాలి-అలా చేస్తే తులసమ్మ ఆత్మ సంతోషిస్తుంది-దేవుడూ సంతోషిస్తాడు-

వెంటనే ఎవరూ ఏం మాట్లాడలేదు-ముఖాలు చూచుకున్నారు-

"ఉన్న కరిణీకం కూడా వూడిపోయింది-పసిదాన్ని సాకాలంటే మాటలా?" అనుకుంది తులసమ్మ వదినగారు-

"చేతిలో గవ్వలు ఆడినంతకాలం జల్సా చేశాడు-ఏదో కుదుటపడతాడని పిల్లనిచ్చేం- ఇప్పుడీ జంజాటన ఎవరు పడతారు" అనుకున్నారు తులసమ్మ అన్నగారు-

"ఎటూ పిల్లల్లేరని తెల్సి పెంచుకోకూడదా అని సూటిగా చెప్పలేక ముసలావిడ యీవిధంగా చెబుతోంది-కానీ పెంచుకుంటూ పెంచుకుంటూ ఆడపిల్లనా పెంచుకోవడం! అయినా తమకింకా వయసేం మించిపోయిందనీ" అనుకుంది తులసమ్మ మరదలు-

"అక్క ఆత్మశాంతికిది సరియైన పద్ధతేకావొచ్చు-కానీ కొన్నాళ్ళు పెంచి యిచ్చేయటం కుదరని పని - దత్తత చేసుకోవాలంటే సావిత్రి ఏమంటుందో" అనుకున్నాడు తులసమ్మ తమ్ముడు.

"బంధుత్వముంది కనుక ఏదో కష్టానికీ సుఖానికి వచ్చి చూడ్డం తప్ప యీ రోజుల్లో కూడ యిలా బాధ్యతల్ని నెత్తినేసుకోడం ఎవరితరం ? అన్నీ మధ్యతరగతి కుటుంబాలే ! ఎవరి సంసారం గురించి ఎవరి పిల్లల భవిష్యత్తు గురించి వాళ్ళే ఆలోచించుకోవాల్సిందే" అనుకున్నారు మిగతా బంధుజనం -

ఎవరికివారు మనసుల్లోనే యీ విధంగా అనుకుని వూరుకున్నారు.

"సాంబశివం నామాట తీసెయ్యడు-పెద్దపిల్లలెటూ వాడికి చేరువయ్యేరు కాబట్టి తప్పదు- వెళ్ళేలోగా ఎవరు ముందుకొచ్చినా సంతోషమే" అన్నారు సుబ్బాయమ్మగారే చివరి మాటగా-

రచయితలకి సూచనలు

ఆంధ్ర సచిత్రవారపత్రికకి పరిశీలనార్థం తమ రచనలని పంపే వారు ఈ కింది సూచనలని గమనించ కోరుతున్నాము.

రచనలు కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్‌పెన్‌తో రాయాలి. కాగితానికి రెండు వైపులా రాసి ఉన్న రచనలని పరిశీలించటం జరగదు

పరిశీలనకి పంపే రచనలు కథలైతే 10 అరఠావు పేజీలకి మించకుండా ఉంటే మంచిది. వ్యాసాలు 3 అరఠావు పేజీలు మించరాదు. వ్యాసాలు పంపేవారు వాటికి సంబంధించిన బొమ్మలు లేదా ఫొటోలు జతపరిచి పంపటం అవసరం.

రచనలు స్వంత రచనలై ఉండాలి. అనువాదాలు, అనుసరణలు, కాపీ రచనలు పంపరాదు. ఆ మేరకి రచయిత(త్రి) హామీ పత్రం రాసి సంతకం చేసి రచనతో పాటే పంపాలి.

రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే రాసి ఉండాలి. వ్రాత ప్రతి మీద రచయిత(త్రి) పూర్తి చిరునామా స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయాలి.

కథల పరిశీలనకి 1-2 నెలలు, నవలల పరిశీలనకి కనీసం 6 నెలలు పట్టవచ్చును. పరిశీలన అయిన తర్వాత ఏ విషయం అయ్యా రచయిత(త్రు)లకి తెలియచేయటం జరుగుతుంది. ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపకోరేవారు తమ రచనతో పాటే స్వంత చిరునామా కల, తగినన్ని తపాలా బిళ్ళలు అతికించిన కవరు జత పరచి పంపాలి. లేకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు. రచనలు తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్త తీసుకోటం జరుగుతుంది కానీ పోస్టులో పోయే వాటి విషయంలో మేము బాధ్యతని స్వీకరించలేము. వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ అవకాశం లేదు.

రచనలు పంపిన వారు తమ చిరునామా మారిన సందర్భంలో, వెంటనే ఆ విషయాన్ని మా కార్యాలయానికి తెలియ చేస్తూ ఒక కార్డు రాయటం అవసరం.

ఉత్తరాలు, తదితర పాఠకుల శీర్షికలకి రాసే వారు కూడా తమ పేరు, పూర్తి చిరునామా ఇవ్వాలి. రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి. లేకపోతే వాటిని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలని "సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003" అనే చిరునామాకి పంపాలి. కవరు పైభాగంలో శీర్షిక పేరు రాయటం మంచిది.

– సంపాదకుడు

అయితే ఆ రాత్రి ఎవరూ సరిగా నిద్రపోలేదు - ఆ మర్నాడంతా సుబ్బాయమ్మగార్ని తప్పించుకునే తిరిగారు - వెళ్ళేరోజు ఆమె ఎదుట పడకుండానే ఒకరూ ఒకరూ వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయారని నిర్ధారించుకున్నాక బరువైన నిట్టూర్పు విడిచి వీధి గుమ్మంలోకొచ్చారు సుబ్బాయమ్మగారు.

అవును - ఎవరి పిల్లలను గురించి వాళ్ళు ఆలోచించుకోవాల్సిందే- అనురాగాలూ అభిమానాలూ వున్నా మనిషి మనుగడకు కావల్సింది డబ్బేకదా -

అలికిడైతే తలెత్తి చూసేరావిడ.

గుమ్మంలో సరస !

అసలే బంగారుఛాయ - వీసమెత్తు కూడ వన్నె తగ్గలేదు - మనిషి బలంగా ఆరోగ్యంగా వుంది.

"నువ్వా సరసా - అలా కూర్చో"

గుమ్మంలో ఒక మెట్టు దిగువన కూర్చుంది సరస - ఓ క్షణం సంశయించేక నోరు పెగుల్చుకుంది.

"బాబుగారికి పెద్ద ఆపదే ఒచ్చిందమ్మా - ఆ లోటు వూడ్చలేనిది - మా లక్ష్మిలాంటి తల్లి... ముత్యాల్లాంటి పిల్లలు - విషపురుగుకు కూడా అన్యాయం చెయ్యని బాబుగారికి ఎంత అన్యాయం చేశాడా పరమాత్ముడు ?"

సుబ్బాయమ్మగారేం మాట్లాడలేదు - పదిరోజుల్నించీ వింటున్న సానుభూతి మాటలే అవి - సానుభూతి మాటలు జీవితాల్ని చక్కదిద్దలేవు - దుఃఖాన్ని, లోటునీ దూరం చేయనూలేవు-

ఆవిడ ఆలోచనలన్నీ పరిపరివిధాల పోతున్నాయి.

"నాదో చిన్న మాటమ్మగోరూ - బాబుగారితో చెప్పడానికి నోరాదు- తమరు దయతలిస్తే..."

ఏమిటన్నట్లుగా సరసవంక చూశారు సుబ్బాయమ్మగారు-


"మరేం లేదమ్మా ఒకప్పటి నా పరిస్థితి గుర్తుకొస్తోంది- రెండు చేతులా సంపాదించే యజమాని అర్ధాంతరంగా కాలం చేస్తే పసిబిడ్డడితో దిక్కులేనిదాన్నయిపోయేను - ఆ స్థితిలో ఆస్తులకంటే అప్పులే ఎక్కువనిపించి ఆ తగువులుపడే తెలివీ, ఓపికా లేక ఆస్తుల్ని అయినకాడికి అమ్మేద్దామనుకున్న సమయంలో బాబుగారు దేముడిలా వచ్చి నన్నూ నా బిడ్డనీ ఆదుకున్నారు - తగువులు తీర్చి ఆస్తి పోగొట్టుకోకుండా అప్పులు తీర్చే సులువులు చెప్పేరు - ఆనాడు బాబుగారే ఆదుకోకపోతే యీనాడీ సరసమీ ఎదుట వుండేదే కాదమ్మగారూ - అటువంటి బాబుగారికీ రోజు కష్టం కలిగితే ఆదుకోలేకపోవడం న్యాయం కాదమ్మగారూ- పాపని నాకిప్పించడమ్మా - నేను పెంచుకుంటాను - మా యింటికి లక్ష్మిందేవే వచ్చిందనుకుంటాను."

ఆశ్చర్యంగా సరసవంక చూశారు సుబ్బాయమ్మగారు - సరస కళ్ళలో కృతజ్ఞతాభావం వుట్టిపడుతోంది.

"మీ దయవల్ల అవ్వూ, గేదే వున్నాయి - పాప పాలకి లోటుండదు. సుచీ సుబ్రంకూడ అలవడ్డాయి - అయినా అమ్మా నేను తక్కువ కులందాన్ననేగా మీ సందేహం ? అవునమ్మా అవును - నామూలంగా బాబుగారికీ, మీ కుటుంబానికీ మాటొచ్చింది - అది అప్పటి నా వయసువల్లే వచ్చిందో, బాబుగారి పరిస్థితివల్లే వచ్చిందోగాని, అది తప్పుడు మాటమ్మా - మామధ్య ఏ సంబంధమూలేదు. అది మీకు తెల్సు - ఆ భగవంతుడికీ తెల్సు - అయినా మీరు పెద్దోరు - మీ మాటను గౌరవించి యిన్నేళ్ళూ మీ ఎదటపళ్లేదు - కానీ నట్టింట దీపం పెట్టి బాబుగారి పేరు తల్చుకోని రోజు లేదంటే నమ్మండమ్మా - బాబుగారి కష్టం తీర్చలేనిది - పాపని తీసుకెళ్ళి పెంచుకోడం నా అదృష్టంగా భావిస్తాను- కళ్ళలో పెట్టుకొని పెంచుకుంటాను. దేవుడి బిడ్డలా చూసుకుంటాను. మీరెప్పుడు కోరితే అప్పుడు..."

సరస మాటలిక వినిపించడం మానేశాయి సుబ్బాయమ్మగారికి - మూర్తీభవించిన మానవత్వం ఎదుట నిలిచినట్లనిపించింది. మనుషుల్ని విడదీసే కులంకన్నా మనసులకి దగ్గరయ్యే గుణమే గొప్పదనిపించిందామెకా క్షణాన ! ●





సంసార తాపత్రయం

శ్రీదేవితో వ్యవహారం బెడిసికొట్టినప్పటి నుంచి మిథున్ చక్రవర్తి తనేమిటో... తన సంసార మేమిటో అన్నట్టు వుంటున్నాడుట.

తన భార్యా పిల్లల్ని తీసుకుని సరదాగా ఈమధ్య కలకత్తాలో ఫుట్‌బాల్ ఆట చూసేందుకు వెళ్లాడట. ఆట చూసేవాడు చూడకుండా ఆ పోటీలో ఉత్తమ క్రీడాకారు లిద్దరికి పదివేల రూపాయలు బహుమతి ప్రకటించాడట. తన పరపతిని ఫుట్‌బాల్ స్టేడియం వరకే పరిమితం చేయకుండా కలకత్తా ఆస్పత్రిలో నెలకొల్పబోతున్న మూత్రపిండాల మార్పిడి విభాగానికి 30 లక్షల రూపాయలు విరాళంగా యిస్తానని వాగ్దానం చేశాడట. రక్తి మార్గం అయిపోయి, ముక్తి మార్గంలో పడ్డట్టున్నాడు అంటున్నారు చాలామంది. మరి అనరూ?

నాయనమ్మ "దెయ్యంకథ"

"బాబోయ్ దయ్యాలు" అనే శీర్షికతో తాము కథల పోటీ ఏర్పాటు చేశారు. ఈ శీర్షిక కథల కొరకు తాము ఎంపిక చేయటం, నాకుమాత్రం బాగ అనిపించలేదు. ఈ నవీన విజ్ఞాన యుగంలో దయ్యాల మీద కథలపోటీ నిర్వహించటము, పురోగామి మార్గముగాక, తిరోగామి మార్గమున పత్రిక నిర్వహింపబడు చున్నట్లు తోచినది.

తాము ఈ కథల పోటీ ముందు మాటలో దయ్యము అంటే దేవుడు అనుపదమునకు వికృతి అని తెలిపినారు.

ఈ మాట కొంత అపోహను పోజేసినప్పటికి వాడుకలోని దయ్యము అర్థము వేరు. ఇవి పీడించే క్షుద్ర శక్తిగా చెప్పుకోబడుచున్న విషయము తమకు తెలియనదికాదు.

ఇది ఇటుంచి మీరు ఏర్పాటు చేసిన శీర్షిక చూడగానే మా నాయనమ్మగారు చెప్పిన ఒక కథనము నాక్కు జ్ఞాపకము వచ్చినది. దానిని కూడ మీ పరిశీలనార్థము క్రింద పొందుపరుచు చున్నాను.

మా నాయనమ్మగారు ఒక కుగ్రామంలో ఉండేవారు. వారికి ఇంట్లో పని నిమిత్తము ఒక పనిఅవ్వ అవసరము ఏర్పడడముతో ఊరిలో పనిచేసే ప్రతి ఒక్కరిని అడగటం మొదలు పెట్టింది. కాని ఆమె అనుకొన్నట్లు యెవ్వరు పని చేసేటందుకు కుదరలేదు. ఒక రోజు ఒక ఆమెవచ్చి మా నాయనమ్మగారితో పనికి కుదురుతానని, తనకు ఎవ్వరు దిక్కులేరని చెప్పింది. మా నాయనమ్మగారికి దయకలిగి పనిమనిషిగా ఏర్పాటు చేసుకొన్నది. అదే సందర్భమున తన పేరు పేకి అని చెప్పుకొన్నది.

పేకి పనికి కుదిరిన నాటినుండి మా నాయనమ్మగారికి ఇంటిలో అన్ని పనుల సమస్య తీరిపోయింది. కాని ఒకరోజు రాత్రి మా నాయనమ్మకు సాయంగా పడుకొన్న పేకీని కొద్దిగా దీపమును తగ్గించమని అడిగిన వెంటనే అది అంటే పేకి తన నాలుకతో దాన్ని చిన్నదిగా చేసింది. అది చూచిన నాయనమ్మకు టారెత్తింది.

మరుసటి రోజు ఒక మాంత్రికుని కొరకు కబురు పంపగా వాడు హంగామాతో మా నాయనమ్మగారి దగ్గరకు వచ్చి ఇంట్లో పనిమనిషిని బయటకు పిలవమని అడిగినాడట. అంతే పేకి చెప్పక చెయ్యక ఇంటి వెనుక నుండి మటుమాయమైందట. అంటె దయ్యాలు కూడ మనుషులతో ఉండి సహాయ పడుతవని ఆమె చెప్పిన సారాంశము.

పై కథ కూడ చదివి మన పెద్దలు నమ్మేట్లు చెప్పేవి ఎంత భయము కలిగిస్తాయో ఆలోచించాలి.

-- జనార్ధనాచారి (సికింద్రాబాదు)


ఈవారం సలహ్

బెజవాడ రోడ్ల మీద గోతులు ఘోరం- అకారణంగా సిటీ బస్సుల్లో నిలబడ్డప్పుడు మీ జేబులో పర్సు దొంగ జేబులో త్రుళ్లి ఎగిరిపడే ప్రమాదం వుంది- జాగ్రత్త! జాగ్రత్త!

వీక్లీ పోస్టు

నచ్చింది

నటి భాగ్య ముఖచిత్రంతో వెలువడిన 18-8-89 ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులను ఉత్కంఠ భరితులను చేసి రచనలతో "ఓ వజ్ర సంకల్పంతో" వెలువడింది.



శేషలేఖ, బలి, కథలు నాకు నచ్చిన నేను మెచ్చిన కథలు. హాస్యనవలిక "భలేపెళ్ళి" ఫెంటాస్టిక్. రియల్లీ ఎ బ్యూటీనెస్ వీక్లీ ఆఫ్ తెలుగు వీక్లీ వరల్డ్. 82వ పుట్టినరోజు జరుపుకున్న మా ఆంధ్ర సచిత్ర వారపత్రికకు మా హృదయపూర్వక అభినందనలు.

– టి. యన్. కృష్ణమోహన్, అనకాపల్లి

పెరుగుదల

'ఆంధ్రపత్రిక' గూర్చి అందరూ అనుకుంటున్న మాటలు ఎంతవరకు నిజమో తెలుసుకోవాలనే ఉబలాటంతో ఆరాటంగా బుక్‌స్టాల్ వైపు వెళ్లి 'ఆంధ్రపత్రిక' గూర్చి ఆరాతీయగా తెలిసిందేంటంటే ముప్పైఏడు పర్మనెంటని, పది ఎక్స్‌ట్రా అని- అంతే ఆశ్చర్యపోయాను!! ఎందుకో తెలుసా- సరిగ్గా ఆరు వారాల క్రితం ఇదే విషయమై ఆరా తీయగా... ఆ రోజు తెలుసుకుంది- కేవలం ఎనిమిది మాత్రమే పర్మనెంట్, ఐదు ఎక్స్‌ట్రా- అదీ సంగతి! (ఇదంతా పొట్టి డబ్బా అనుకుంటున్నారో ఏటి ఐతే పప్పులో కాలేసినట్టే)- కేవలం ఆరే ఆరు వారాల్లో అంత క్రేజ్ సంపాదించగల్గిన ఆంధ్రపత్రికంటే ఆశ్చర్యానందాలు కలగక మానలేదు! ఆలస్యం చేయకుండా ఆంధ్రపత్రిక కొని, పేజీలు త్రిప్పుతుంటే నేను పడ్డ శ్రమ, వెచ్చించిన 'రొక్కం' వృథా కాలేదన్పించింది! టిట్ ఫర్ టాట్, ఫొటో కామెంట్, కవితా- యువతా, సరియల్స్- అబ్బ ఒకటేమిటి అన్నీ అనుక్షణం తలపింప జేశాయి! పత్రిక ఆసాంతం 'ఏ టు జెడ్' సర్వాంగ సుందరంగా రూపొందిస్తున్న మీకు థాంక్స్ తెలుపుకోబోయే ముందు- పై వారం నుంచి నేనూ పత్రిక ఖాతాదారుణ్ని అని తెల్పడానికి హర్షిస్తున్నాను!!!-

విరజశ్రీ, అయిజ (మం)

భలే పొరపాటు?

'పత్రిక'లోని లోపాన్ని ఎలాగైనా పట్టాలని 'పత్రిక' ముందేసుకొని ప్రతి అక్షరాన్ని చదువుతూ ఉన్నాను. ఇంతలో కొత్త ఫీచర్ "మాటకారుల పేజీ" కనపడింది. దానిలో కొన్ని పొరపాట్లు కనబడినయ్. "పోస్ట్", "ఒయ్" అనే పదాలు రెండక్షరాల పదాలు కావు. అవి ఒకే ఒక అక్షరమున్న పదాలు. తెలుగు కొద్దో గొప్పో తెలిసిన ప్రతి పాఠకుడు ఇవి గ్రహించ గలరు. ఈ చిన్నపొరపాటు ఇకముందు ఎప్పుడూ జరగకుండా చూస్తారని ఆశిస్తున్నాను.

– నెల్లూరు మనోహరరెడ్డి
(చిల్లకూరు)

చిన్న మనవి

నేను "ఆంధ్రపత్రిక" పావలా ఖరీదు నుంచి పాఠకురాలిని. కాని సంవత్సరం నుంచి పత్రికని మిస్ అవుతున్నాను. ఇక్కడ పత్రిక దొరకదు. మా వారు కలకత్తా వెడుతూ వుంటారు. వీలైతే అక్కడ నుంచి పత్రిక తెమ్మని చెప్పాను.

నా అదృష్టం ఏమిటంటే?... వాళ్ళు పాత ఆంధ్రపత్రికలు కూడా అమ్ముతారట. కొన్ని మిస్ అయినా, 2 నెలలకి ఒకసారి అన్ని తెచ్చుకుంటాము. "సంపాదకీయం" హైలైట్. శీర్షికలు మామూలే. ఫరవాలేదు.

'వెల' పెరిగినా 'వన్నె' తరగలేదని 'గట్టిగా' చెప్పగలను.

పోతే "చిన్న మనవి" పాతకాలం నాటి కథలు అప్పుడప్పుడు ప్రచురిస్తే చాల ఆనందిస్తాము.

– ఆర్. లక్ష్మి(పాట్నా)

(మీరు చందా కడితే పోస్టులో ఏ వారానికి ఆ వారమే మీకు పత్రిక అందుతుంది కదా! – ఎడిటర్)

Editorial Adviser: *S. RADHAKRISHNA*, Editor: *VEERAJI*,
Printed and Published by *S. NAGESWARARAO* for Nageswara Rao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003.
Phones: Editorial: 75667, Business: 61247, 61248.

సాహితీ పజిల్

గెల్చుకోండి రు.200/-

గళ్ళ నుడి కట్టు - 19

ఆధారాలు

నిలువు

2. కాశ్మీరు వీటికి ప్రసిద్ధి
3 స్త్రీలకు ప్రాణము కన్న ఇదే ఎక్కువ
4 ధరను కొంచెం మార్చినా భూమే
5. గడ మీదయితే ఎంతో రుచి
7. ధనాన్ని ఇలాకూడ అంటారు
9. ఈ రాక్షసుడి శత్రువు ఇంద్రుడు
10. ఒక వాక్యం అయినాసరే ఇది వుంటే కావ్యం
13 పూతనను సవరిస్తే ఇది వున్న గ్రంథకర్త
14 ఇది ఉంటేగాని దీపారాధన కుదరదు
16 మూడు కండ్ల దేవుడు
17. మృడుని భార్య
18 చంద్రుని ప్రేయసి


అడ్డం

1. రతికి కాంతి చేర్చండి సరస్వతి
3 మగధకు సంబంధించిన ప్రాకృతభాష
6. ధ్వజాన్ని తెలుగులో ఇలా అంటారు
8 మూడు చేతులు కలది
10. తగాదాకాదు ఒక రకమయిన పద్యం
11 భరింప బడేది
12 అతివాగుడు ఉంటే చిన్నప్పుడు ఇది ఎక్కువపోసినట్లు
13 పోరాడే వీరుడు
15 ఎటుచూచినా అదే స్వాతికార్తెలో తయారవుతుంది
17. కృత్తిక లాంటి మట్టి
19. భూ భర్తను ఇలా అంటారు
20 --- తనంత తావలచి వచ్చిన చుల్కనగాదె యేరికిన్

ఆధారాలున్నాయి. నుడికట్టు గళ్ళు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి! ఆల్ కరెక్ట్ సొల్యూషన్ పంపినవారికి రు. 200/- లు బహుమతి లభిస్తుంది- ఒకరికన్నా ఎక్కువమంది కరెక్టు ఆన్సర్‌లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే!

- ఎడిటర్

ముగింపు తేది 16-10-1989



కూర్పు : పింగళి వి. కృష్ణారావు

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు : ....

పూర్తి చిరునామా : ....

.... పిన్‌కోడ్ ....

శారదా కళాసమితి దశమ వార్షికోత్సవ సందర్భంగా సినీనటి రాజ్యలక్ష్మికి ఘన సన్మానం

విజయవాడలో అగ్రశ్రేణి కళా సంస్థగా పేరెన్నికగన్న శారదా కళాసమితి దశమ వార్షికోత్సవం అగస్టు 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో అతివైభవంగా జరిగింది.

ముందుగా సమితి ఉపాధ్యక్షులు శ్రీ కూరపాటి కృష్ణమూర్తి సభాధ్యక్షుల వారిని, ముఖ్య అతిథులను, వక్తలను, సన్మాన గ్రహీత సినీనటి రాజ్యలక్ష్మిని వేదిక పైకి ఆహ్వానించారు.

సర్దార్ బయన వీర రాఘవరావుగారు జ్యోతి వెలిగించగా విజయవాడ నగర కార్పొరేటర్ శ్రీమతి దోగిపర్తి ఝాన్సీ బాయి శారదా పూజతో శ్రీ మానేపల్లి రాజాగారు కీ.శే. కాజ ఆంజనేయులుగారి కళా ప్రాంగణాన్ని ప్రారంభించటంతో సభాకార్యక్రమం ప్రారంభమైంది.

శారదా కళాసమితి అధ్యక్షులు శ్రీ దోగిపర్తి శంకరరావుగారు సభాధ్యక్షత వహించిన యీ సభకు ఉడా వైస్‌చైర్మన్ శ్రీ చక్రధరరావుగారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మానవ ధర్మ శిక్షణా సంస్థకు చెందిన డా. మోపిదేవి కృష్ణస్వామి తమ సందేశాన్ని అందచేసినారు. యీ సందర్భముగా శారదా కళాసమితి పదేళ్ళ సంగ్రహ చరిత్రను వివరిస్తూ వెలువడిన 'జనమిత్ర' ప్రత్యేక సంచికను శ్రీ ముమ్మినేని సుబ్బారావుగారు (సిద్ధార్థ అకాడమీ కోశాధికారి) ఆవిష్కరించారు.




శారదా కళాసమితి దశమ వార్షికోత్సవ సందర్భంగా సినీనటి రాజ్యలక్ష్మిని సన్మానించి, సన్మాన పత్రాన్ని బహూకరిస్తున్న సమితి ఉపాధ్యక్షులు శ్రీ కూరపాటి కృష్ణమూర్తి, అధ్యక్షులు శ్రీ దోగిపర్తి శంకరరావు, కార్యదర్శి కోట సుబ్బారావు (కుడినుండి ఎడమకు)

అవీ-ఇవీ-అన్నీ

శ్రీ దోగిపర్తి శంకరరావుగారు తమ అధ్యక్షోపన్యాసంలో శారదా కళాసమితి కార్యక్రమాల గురించి వివరిస్తూ యీ సమితి నాటక ప్రదర్శనలు నిర్వహించటంలోనే సంతృప్తి చెందటంలేదని పేద కళాకారుల సంక్షేమానికి పాటుపడటం కూడా ధ్యేయంగా పెట్టుకొన్నది. అందుకే నటీ, నట నాట్య వృత్తి కళాకారుల సంక్షేమానికి సంఘం స్థాపించి కళాకారులకు నివేశనస్థలాలనుప్రభుత్వం ద్వారా మంజూరు చేయించటానికి అహర్నిశలు కృషి చేస్తోందని అలాగే ఎంతో మంది పేద కళాకారుల కుటుంబాలకు ఉడతాభక్తి ఆర్థిక సహాయాన్ని కూడా అందించటం జరిగిందని, అలాగే ఇటీవల సంభవించిన తుఫాను వరద భాధిత కళాకారులకు కూడా ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపినారు.

సంస్థ కార్యదర్శి కోటసుబ్బారావుగారు కార్యదర్శి నివేదికలో ఎప్పుడు వాణిజ్యరంగంలో నిర్విరామంగా సతమతమయ్యే వాణిజ్య వర్గాలవారికి కళారూపాల ద్వారా వినోదం మానసికాహ్లాదం కల్గించాలన్న భావనతో 1979లో శారదా కళాసమితి ఆవిర్భవించిందని, మొదట్లో కొద్దిమంది సభ్యులతో ప్రారంభమైన యీ సంస్థ నిర్వహిస్తున్న నెలసరి కార్యక్రమాలు వాణిజ్య వర్గాలవారిని విశేషంగా ఆకర్షించటంతో అతి త్వరితంగా సభ్యుల సంఖ్య 1400 వరకు ఉన్నదంటూ గత పదేళ్ళలో ఎంత ప్రగతిని సాధించిందో అర్థమౌతుందని, సభ్యుల నిర్వాహకుల కృషి ఫలితంగా రెండు లక్షల మూలధనాన్ని సమకూర్చుకొందని ఆ మొత్తాన్ని కదపకుండా ఆ మూలధనం నుండీ వచ్చే వడ్డీతోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపినారు. శ్రీ ప్రయాగ రామకృష్ణ (ఆకాశవాణి) తన గంభీర ఉపన్యాసంలో సినీరంగం, నాటక రంగంలోని లోపాలను ఎత్తి చూపుతూ మన సంస్కృతి గురించి విపులంగా మాట్లాడారు.

యీ దశమ వార్షికోత్సవ వేదికపై సినీనటి రాజ్యలక్ష్మిని ఘనంగా సన్మానించటం జరిగింది. మంగళ వాయిద్యాల మధ్య వేద పండిత మంత్రోచ్చారణల నడుమ రాజ్యలక్ష్మికి నూతన వస్త్రాలు సమర్పించారు. శ్రీ తాటికొండ నాగేశ్వరరావు గారు రాజ్యలక్ష్మికి మెమెంటోను బహూకరించారు. శ్రీ అన్నా ఈశ్వరయ్య గారు రాజ్యలక్ష్మికి సన్మానపత్రాన్ని సమర్పించారు. శ్రీ సామా అప్పారావు దంపతులు రాజ్యలక్ష్మికి పుష్పాభిషేకం చేశారు. యీ సభాకార్యక్రమాన్ని శ్రీ ధారా సత్యనారాయణ శర్మ నిర్వహించారు. శ్రీ వై.శాయి ప్రసాద్ వందన సమర్పణతో ముగిసినది. సభానంతరం సుమధుర కళానికేతన్ విజయవాడ వారి "ప్రేమించు ప్రేమకై", "చెవిలో పువ్వు" అనే రెండు హాస్యనాటికలు ప్రదర్శించబడి ప్రేక్షకుల ప్రశంసలనందుకున్నాయి. *



దాతలకు అభ్యర్థన!

'బ్లడ్ క్యాన్సర్'తో బాధపడుతున్న తన ఏడేళ్ల కుమారుడు విష్ణు శస్త్రచికిత్స కోసం ఆర్థిక సహాయం అందించవలసిందిగా ఆ పిల్లవాడి తండ్రి శ్రీ వి. శరణ్‌కుమార్ ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులను అభ్యర్థిస్తున్నారు.

'బోన్ మారో' (ఎముకల మధ్యనున్న గుజురు) మార్పిడి కంటే ప్రత్యామ్నాయం లేదని, ఇటలీలోని డాక్టరు ప్రొఫెసర్ గిడో లుకారెల్లి ఒక్కరే ఆ శస్త్రచికిత్స చేయగలరని, ఈ పిల్లవాడిని అక్కడకు తీసుకువెళ్ళమని మద్రాసు వైద్యులు సలహాయిచ్చారు. ఆ శస్త్రచికిత్స కవసరమైన అధిక ధనం సమకూర్చుకునేందుకు దాతలు ధన సహాయం అందించి తన బిడ్డకు కొత్త జీవితం ప్రసాదించమని అయన కోరుతున్నారు. సహాయం అందించదలచుకున్న వారు వి. ఎస్. కె. విష్ణుపేర (చెక్కులు, డ్రాఫ్టులు) వి. శరణ్‌కుమార్, ఎం- 17ఎ, కృపా కాలనీ, ఫస్ట్ ఎవెన్యూ, అశోక్‌నగర్, మద్రాసు-82 అన్న చిరునామాకు పంపవలసిందిగా అయన తెలియజేశారు.



''టూ టౌన్ రౌడీ''లో వెంకటేశ్, రాధ

సినిమా... సినిమా.....

–జి.వి.జి.

కృష్ణ, మహేష్‌బాబుల 'కొడుకు దిద్దిన కాపురం' సెప్టెంబర్ విడుదల

మహేష్‌బాబు ద్విపాత్రాభినయం, బ్రేక్‌డాన్స్ ఈ చిత్రంలో హైలైట్స్," అన్నారు కృష్ణ. ఈయన ప్రధాన పాత్ర నిర్వహిస్తూ, స్క్రీన్‌ప్లే, కూర్పు, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన పద్మాలయా స్టూడియోస్ ప్రతిష్టాత్మక చిత్రం "కొడుకు దిద్దిన కాపురం"లో విజయశాంతి, అశ్విని, మోహన్‌బాబు, ప్రభాకరరెడ్డి, గొల్లపూడి మారుతీరావు, గిరిబాబు, సారధి, త్యాగరాజు, ప్రదీప్‌శక్తి, కృష్ణారావు, రవీంద్రరెడ్డి, సాగరిక, జయమాలిని ఇతర పాత్రధారులు. భీశెట్టి కథకు పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు వేటూరి గీతాలు, రాజ్‌కోటి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, భాస్కరరాజు శిల్పం, శ్రీను నృత్యాలు, త్యాగరాజన్ సాహసాలు, ఒ. ఎస్. ఆర్ ఆంజనేయులు – ఆదుర్తి సాయినాథ్ సంయుక్త దర్శకత్వం, ఎం. రమణారావు సహకార దర్శకత్వంతో జి సత్యనారాయణరాజు ప్రొడక్షన్ కంట్రోలర్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ ఎస్. రాంబాబు. నిర్వహణ జి హనుమంతరావు, జి. ఆదిశేషగిరిరావు.

తెలుగువారి హిందీ చిత్రం

"ప్రతి నెలా పది రోజులు షెడ్యూల్స్‌తో జనవరిలో షూటింగ్ పూర్తవుతుంది." అన్నారు - ఎ కోదండరామిరెడ్డి ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ అధినేత టి త్రివిక్రమరావు 'అత్తకు యముడు – అమ్మాయికి మొగుడు" చిత్రాన్ని హిందీలో నిర్మిస్తున్నారు తారాగణం : హేమమాలిని, అనిల్ కపూర్, మాధురీ దీక్షిత్, అనుపమ్‌ఖేర్, సతీష్ కౌశిక్, శక్తికపూర్, అన్నూ కపూర్, ఆనంద్‌బలరామ్ మాటలు, జావేద్ పాటలు, లక్ష్మీకాంత్ – ప్యారేలాల్ సంగీతం, ఎ ఎస్ ఆర్ స్వామి ఛాయ నిర్వహిస్తున్నారు


"జడ్జ్‌మెంట్"

'ఉషాకిరణ్ మూవీస్ 24వ చిత్రం 'కైలాసవైభవం' త్వరలో విడుదలవుతుంది 25వ చిత్రం 'జడ్జ్‌మెంట్' సెప్టెంబర్ నుంచి వైజాగ్‌లో రెండు షెడ్యూల్స్‌లో పూర్తవుతుంది, అన్నారు అట్లూరి రామారావు ఈయన ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా రామోజీరావు నిర్మించే 'జడ్జ్‌మెంట్' చిత్రంలో శివకృష్ణ, సుధాకర్, వినోద్‌కుమార్, కల్పన, యమున, రాజ్యలక్ష్మి, మూడు జంటలు బాలయ్య, రాళ్ళపల్లి, అన్నపూర్ణ ఇతర పాత్రధారులు పరుచూరి సోదరుల రచన, వేటూరి గీతాలు, రాజ్‌కోటి సంగీతం. డి ప్రసాద్‌బాబు ఛాయ, భాస్కరరాజు శిల్పం, గౌతంరాజు కూర్పుతో ఎ మోహనగాంది దర్శకుడు.

పి. ఎ. పి.లో నాగార్జున, మోహనగాంధి

"సెంటిమెంట్, డ్రామా, యాక్షన్ కలగలుపుతో రూపొందే చిత్రం జనవరి నుంచి షూటింగ్, అన్నారు ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ అధినేత అనుమోలు వెంకట సుబ్బారావు ఈయన చిత్రంలో నాగార్జున హీరో మోహనగాంధి దర్శకుడు

తెలుగు సినిమా ప్రపంచంలో శక పురుషుడు గూడవల్లి రామబ్రహ్మం గారు



బెంగాల్‌లో న్యూ థియేటర్సులాంటి ఒక విప్లవ సంస్థ ఆంధ్రదేశంలో కూడ వెలిసింది. ఆ సంస్థ పేరు సారథీ ఫిలిమ్స్. దీని సృష్టికర్త విప్లవ వీరుడు శ్రీ గూడవల్లి రామబ్రహ్మం.

భారత జాతీయోద్యమ విజృంభణకు వార్తాపత్రిక, వేదిక, నాటక, సినిమా బలాలను పూర్తిగా గ్రహించినవారవడంచేతనే శ్రీ రామబ్రహ్మం వీటన్నిటితోటి సన్నిహిత సంబంధం ఏర్పాటు చేసుకున్నారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు రూపులు తీర్చిదిద్దినవారిలో శ్రీ రామబ్రహ్మంకు అగ్ర తాంబూలం నిరభ్యంతరంగా ముట్టచెప్పవచ్చు.

బందరులోని నోబెల్ కళాశాలలో చదువుకునే రోజులనుంచి జాతీయవాది అవడంచేత శ్రీ రామబ్రహ్మం వేదికలమీదనుంచి ఉపన్యాసాలివ్వడమేగాక శక్తివంతమైన ఒక వార పత్రికకు ప్రాణప్రతిష్ఠ సలిపాడు. ఆ పత్రిక పేరు 'ప్రజామిత్ర'. నాడు తెలుగులో ఉన్న చాలామంది రచయితలు తమ తొలి వ్యాసాలను 'ప్రజామిత్ర'లో చూచి - తమ భావి జీవిత సౌధానికి సోపానాలు నిర్మించుకున్నారనడంలో ఉత్ప్రేక్షకు తావు లేదు.

ప్రచార సాధనాలలో సినిమాకు గొప్ప శక్తి ఉందని బెంగాలీ విప్లవకారులు ప్రత్యక్షంగా రుజువు పరచడం చూచిన శ్రీ రామబ్రహ్మం సినిమా రంగంలోకి ఉరకక తప్పిందికాదు. న్యూ థియేటర్స్‌నుంచి వెలువడ్డ సాంఘిక చిత్రాలు, ప్రభాత్ కంపెనీనుంచి వచ్చిన సాంఘిక చిత్రాలు ఆయనకు ఉత్తేజాన్ని, భావావేశాన్ని కలిగించాయి.

సినిమా సాంకేతిక శాస్త్ర విధానం తెలుసుకుంటే తప్ప ఆ రంగంలోకి ఉరికి తన ఆశయాలను కార్యరూపంలోకి అనువదించడానికి వీలుండదని గ్రహించిన శ్రీ రామబ్రహ్మం వ్యాపారస్తుడయిన ఒక మిత్రుని సినిమా రంగంలోకి దింపారు. ఆ మిత్రుని పేరు స్వర్గీయ శ్రీ పొరేపల్లి వెంకట శేషయ్య. వ్యాపారస్తుడయిన శ్రీ శేషయ్య విప్లవాత్మకమయిన సాంఘిక చిత్రాలను తీయడానికి ఒప్పుకోకపోవడంచేత శ్రీ రామబ్రహ్మం ఆయనతో కలసి సరస్వతీ టాకీస్ పతాకంమీద "ద్రౌపదీ వస్త్రాపహరణం" అన్న ఒక పౌరాణిక చిత్రానికి పని చేయవలసి వచ్చింది. ఈ చిత్రం కొల్హాపూర్‌లో నిర్మింపబడుతున్న రోజుల్లో కావలి గుప్త దీనికి పోటీగా బొంబాయిలో 'ద్రౌపది మాన సంరక్షణ' అన్న ఒక చిత్రాన్ని రూపొందించారు. ఈ పోటీలో శ్రీ రామబ్రహ్మం వ్యక్తిత్వ ముద్ర పడ్డ 'ద్రౌపదీ వస్త్రాపహరణం' బాక్సాఫీసుని బద్దలు కొట్టిందని వేరే చెప్పక్కర్లేదు.

తరువాత ఆ సంస్థ చేతనే తీయబడ్డ మరో చిత్రం 'కనక తార'కు కూడ పనిచేసి ఆయన సినిమా సాంకేతిక శాస్త్ర మర్మాలను, వ్యాపార కిటుకులను క్షుణ్ణంగా గ్రహింప గలిగారు.

తమిళ సినిమా రంగంలో అభ్యుదయపథంలో పయనిస్తున్న శ్రీ కె. సుబ్రహ్మణ్యంతో శ్రీ రామబ్రహ్మంకు పరిచయం కలిగింది. విప్లవాత్మకమయిన అడుగు వేసేముందు ఒక ఫిల్మ్ స్టూడియోను కూడా చేతిలో అట్టిపెట్టుకుంటే బాగుంటుందని తెలుసుకొని శ్రీ రామబ్రహ్మం 'మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ కంబైన్' అన్న సంస్థకు జీవం పోశారు. ఆ రోజుల్లో దీనినే ఎం. పి. పి. సి. అనేవాళ్ళు. శ్రీ సుబ్రహ్మణ్యంతో కలిసి శ్రీ రామబ్రహ్మం 'బాల యోగిని' అన్న ఒక సాంఘిక చిత్రాన్ని ఆ స్టూడియోలో తీశారు.

ఒక ఆశయంతోటి, ఒక నిర్దిష్ట కార్యక్రమంతోటి సినిమా రంగంలోకి ప్రవేశించిన శ్రీ రామబ్రహ్మం తన చతురంగ బలాలను సమీకరణం చేసుకుని; సారథి ఫిలిమ్స్‌కు ప్రాణ ప్రతిష్ఠ సలిపారు. అభ్యుదయవాది అయిన చల్లపల్లి రాజా కూడా తనకు సహకారం యివ్వడంచేత శ్రీ రామబ్రహ్మం విప్లవ శంఖాన్ని పూరించారు. దాని ఫలితమే చిత్రసీమలో నూతన శకారంభానికి వైతాళిక గీతాన్ని ఆలపించిన 'మాలపిల్ల' చిత్రావతరణ.


(మాలపిల్ల, రైతు బిడ్డ సంచలనాత్మక చిత్రాలు నిర్మించి యాభై సంవత్సరాలు అయిన సందర్భంగా, విజయవాడలో 12-8-'89న పద్మభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు గౌరవాధ్యక్షులుగా, . శ్రీ ముమ్మనేని సుబ్బారావు[బ్రహ్మయ్య అండ్ కో] అధ్యక్షులుగా, యీడ్పుగంటి లక్ష్మణరావు ప్రధాన కార్యదర్శిగా గూడవల్లి రామబ్రహ్మం సినీ కళాసాగర్ సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేయడమైనది.

ఆక్టోబర్ 1న వారి వర్ధంతి.

ఈ వ్యాసం తెనాలి గూడవల్లి సంస్మరణ సంఘం వారి సావనీరులోని శ్రీ యింటూరి వారి వ్యాసానికి సంక్షిప్త రూపం).



ఇంటూరి



బూజుపట్టిన పాత సాంప్రదాయాలను పట్టుకుని పాకులాడే సనాతనులమీద యీ చిత్రం కత్తి ఝళిపించి - అభ్యుదయవాదులకు, ఆశాజ్యోతిని చూపెట్టింది దీనిలో గోవిందరాజుల సుబ్బారావు, గాలి వెంకటేశ్వరరావు, కాంచనమాల, సుందరమ్మ, సూరిబాబు మొదలయిన వారంతా వివిధ పాత్రలను దాల్చారు తాపీ దర్మారావు, గుడిపాటి వెంకటాచలం దీని రచయితలు శ్రీ బీమవరపు నరసింహారావు (బి ఎన్ ఆర్), దీనిలో కమ్మని గానాన్ని ఒసగారు బసవరాజు అప్పారావు గీతాలు, 'కొల్లాయి కట్టితేనేమి', 'నల్లవాడే గొల్లపిల్లవాడే' యీ చిత్రంలో వాడబడి ఆంధ్ర సినిమా ప్రేక్షకులకు అమందానందాన్ని ఒసగాయి

ఆంధ్ర దేశంలోని సనాతన వాదుల ఆగ్రహానికి గురయిన 'మాలపిల్ల' గల్లాపెట్టె వద్ద మహా గొప్పగా పోయిందని వేరే చెప్పక్కరలేదు సినిమా ఒక మహత్తరమైన ప్రచారక సాదనమన్న సత్యాన్ని 'మాలపిల్ల' అన్ని విదాలా ఋజువు పరిచింది శిల్పరీత్యానే కాక వ్యాపారరీత్యా కూడా యీ చిత్రం గొప్ప విజయాన్ని సాదించింది

సాంఘిక విప్లవానికి రణదుందుభిని మోగించిన 'మాలపిల్ల' తరువాత శ్రీ రామబ్రహ్మం ఆర్థిక విప్లవానికి ఢంకా బజాయించే 'రైతు బిడ్డ' చిత్రాన్ని తీశారు మహారాజులు, రాజులు ఈ చిత్రంలో [illegible] యీ ద్వబడ్డారు బళ్ళారి రాఘవాచారి, కొమ్మూరి పద్మావతీదేవి, గిడుగు వెంకటసీతాపతి [illegible] రామయ్య చౌదరి మొదలయిన వారు యీ చిత్రంలోని వివిధ భూమికలను దరించారు [illegible] సుబ్బన్న పాత్రలో శ్రీ బీమవరపు నరసింహారావు ఎన్నటికీ మరువు రాని నటనను అగపరిచారు విప్లవాత్మక మయిన కథా వస్తువుతో కూడిన ఈ చిత్రం తెలుగు దేశంలోని కొన్ని జమీందారీ

ప్రాంతాలలో ప్రభుత్వ నిషేదాజ్ఞకు గురయింది మాలపిల్ల మీద వచ్చిన లాభాలు 'రైతు బిడ్డ'తో హరించుకు పోయాయి దాంతో రామబ్రహ్మం ఆశాసౌదం అమాంతం కూలిపోయింది కొంత కాలం

రామబ్రహ్మంగారు

ఆయన అజ్ఞాతవాసం సలుపక తప్పలేదు.

సారథి పతాకం కింద చిత్రాలు తీయడానికి కావలసిన అనుకూల వాతావరణం లేనందువల్ల శ్రీ రామబ్రహ్మం ఇందిరా వారి 'ఇల్లాలు'కు 'అపవాదు'కు జీతపు డబ్బులు మీద దర్శకత్వం వహించవలసి వచ్చింది. వ్యాపార [illegible] విజయవంతం కాకపోయినా వీటిల్లో శ్రీ రామబ్రహ్మం ప్రతిభ మనకు గోచరించకపోదు.

తరువాత శ్రీ రామబ్రహ్మం తమిళ 'శిలప్పాధికారం' అండగా చేసుకొని రూపొందించిన గొప్ప చారిత్రక చిత్రం 'పత్ని' [illegible] ఆయన చారిత్రక దృష్టి ప్రతి చిన్న [illegible] మనకు అగపడుతుంది. విమ్మట [illegible] తీసిన '[illegible]' అవినీతి పరులయిన [illegible]లక సంఘ [illegible]క్తులను బజారుకు లాక్కొచ్చింది. దీనిలో శ్రీ ముదిగొండ లింగమూర్తిది ఒక 'టిపికల్' పాత్ర.

ప్రత్యేకతను, [illegible]వాలను చూపెట్టే సాంఘిక చిత్రాలను తీ[illegible] పేరొస్తున్నదే కాని శ్రీ రామబ్రహ్మంకు పైసా ముట్ట[illegible] లేదు. పుష్కలంగా పైసా వుంటే తప్ప ప్రచారక చిత్రాలను నిర్మించడానికి వీలుండదని తెలుసుకొని శ్రీ రామబ్రహ్మం "మాయలోకం" లేక "కాంభోజ రాజుకథ" అన్న ఒక జానపద చిత్రాన్ని తీశారు. ఇది [illegible] లాభించడంతో ఆయన గొప్ప చారి[illegible]నాటి యుద్ధం" నిర్మించడానికి [illegible] [illegible]డువెలుగులో ఉ[illegible]నేని నాగేశ్వరరావు [illegible]పద్మ ద్వితీయ చి[illegible]యలోకం".

[illegible]రత దేశానికి స్వరాజ్యం వచ్చే సూచనలు [illegible]కీయ దిబ్బండలంలో అగపడడం చేత ఆయన '[illegible] ఇండియా' అన్న ఒక రాజకీయ చిత్ర నిర్మాణానికి సన్నాహాలు చేశారు. 'పల్నాటి యుద్ధం' సగంలో ఉండగానే ఈ విప్లవ వీరుడు శాశ్వతంగా కన్ను మూశాడు.

తెలుగు సినిమా రంగంలో పుట్టుకొచ్చిన ప్రతి అభ్యుదయ ఉద్యమానికి ఆయన అండదండలు లభిస్తుండేవి తెలుగులో వెలువడ్డ ప్రదమ ఫిల్మ్ మాసపత్రిక చిత్ర కళను ఆయన వెనకాల ఉండడం చేతనే – నేను కొంత కాలం నిర్వహించ గలిగాను మాలపిల్ల రైతుబిడ్డ చిత్రాలకు పరోక్షంగాను "మాయలోకం", పంతులమ్మ పల్నాటి యుద్ధం మొదలయిన చిత్రాలకు ప్రత్యక్షంగాను ఆయనతో పనిచేసే భాగ్యం యీ వ్యాసరచయితకి కలిగింది కొన్ని ఉద్యమాలలో ఆయనతో చేయీ చేయీ పట్టుకుని ముందుకు నడిచే అదృష్టం కూడా యీ రచయితకు లభ్యమయింది

శ్రీ రామబ్రహ్మం వీక్షణా శక్తి శిల్పదృష్టి, వ్యవహార దక్షత ఆదర్శప్రాయాలని చెప్పక తప్పదు ఆయన శిబిరంలో కవులకు, పండితులకు రచయితలకు గాయకులకు ప్రత్యేక స్థానాలుండేవి వాళ్ళందరికీ ఆయన చేసిన గుప్త దానాలు అన్నీ ఇన్నీ కావు

ఆయన గుడారం ఒక దర్మ సత్రం ఆయన తీసిన చిత్రాలలో వేషాలు వేసినా వేయక పోయినా, నటీనటులని పిలువబడే వాళ్ళందరు ఎప్పుడైనా వచ్చి, ఆ దర్మ సత్రంలో విందారగించి పోవచ్చు

దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య సంఘం రూపురేఖ తీర్చి దిద్దిన మహామహులలో శ్రీ గూడవల్లి[illegible] [illegible]గతాంబూలం నిరభ్యంతరంగా ముట్ట[illegible] [illegible]యింది. తాను దానికి అధ్యక్షుడుగా ఉన్నప్పుడే 'ఎ ప్లాన్ ఫర్ ద ఫిల్మ్ ఇండస్ట్రీ' అన్న ఒక కరపత్రాన్ని ఆయన ప్రకటించారు. ఫిల్మ్ పరిశ్రమను ప్రభుత్వం ఎలా తీర్చి దిద్దాలీ అన్న విషయం మీద యీ కరపత్రం ఒక ప్రామాణికమైన గ్రంథం.

చిన్నప్పటి నుంచి జాతీయ వాది అవడం చేత ఆయన నిరంతరం ఖద్దరు కడుతుండేవారు. వింత రంగులతో విలసిల్లే సినిమా లోకంలో శుద్ధ ఖద్దరు ధరించిన ఆ [illegible]మూర్తికి ప్రత్యేక స్థానం లభ్యమవుతుండేది.

శ్రీ రామబ్రహ్మం నిసలైన సోషలిస్టు. తన[illegible] రాత్రింబవళ్ళు శ్రమించి పనిచేసే వాళ్ళ సౌఖ్య ప్రమాణాలను పైకి [illegible]నికి ఆయన ఎప్పుడూ [illegible]తపడేవారు.

[illegible] చిత్రంలో [illegible]కొందరు సాంకేతిక [illegible]లకు '[illegible]పత్రాలు' యిస్తూ 'మీ జీతాలు [illegible]యించుకోండి'– మీరు ఎంత వేస[illegible]ంత యిస్తాను' అన్నారు ఆయన [illegible] బట్టి శ్రీ రామబ్రహ్మం హృదయ వైశాల్యం, సోషలిష్టు దృక్పథం మీరు ఊహించుకోవచ్చు.

తెలుగు సినిమా రంగంలో ఒక విధంగా ఆయన శకపురుషుడు. ప్రయోజనాత్మక, విప్లవ భావ పూరిత చిత్రాల నిర్మాణానికి అంకురార్పణం ఆయన చేతుల మీదుగానే జరిగింది. ఆయన శిలావిగ్రహం ఆంధ్రా హాలివుడ్‌లో మీకు ఎక్కడా అగపడదు. కాని మీరు అలా మద్రాసు లోని మౌంట్ రోడ్‌కు వెళ్లి దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య సంఘ కార్యాలయంలోకి అడుగు పెట్టి ముఖద్వారం వైపుకి చూస్తే ఆయన విగ్రహం కనపడుతుంది.